వాడ్రేవు చినవీరభద్రుడు

కొత్తయుగం రచయిత్రి

మరికొన్ని సాహిత్యవ్యాసాలు

వాడ్రేవు చినవీరభద్రుడు

కొత్తయుగం రచయిత్రి

మరికొన్ని సాహిత్యవ్యాసాలు

KOTTA YUGAM RACHAYITRI
(Occassional writings on Novel and Short Story)
VADREVU CHINAVEERABHADRUDU

October, 2025

Cover painting in softpastels on toned paper
Vadrevu Ch Veerabhadrudu

Back cover photography
Amrutha Purna Vadrevu

e-book released by

VADREVU CH VEERABHADRUDU
First floor, House No. 56,
Navodaya colony,
Mehdipatnam, Hyderabad-500 028
chinaveera@gmail.com
9490957129

for more resources please visit
www.chinaveerabhadrudu.in

మార్కొండ సోమశేఖరరావుకు

వరసగా

జోర్జి లూయీ బోర్హెసు	7
పాట్రిక్ మోడియానో	12
తేనెటీగల కొలను	17
దాదీ బూఢా	20
చైనాను చూపించే కథలు	24
టాల్‌స్టాయి చివరి కథలు	28
అమృతసంతానం	33
బోర్హెసు సంభాషణలు	37
కథల పుట్టిల్లు	40
కథ కాదు, ఒక సంస్కారం	45
దక్షిణమారుతం తాకినట్లుగా	53
సత్యాన్ని దర్శించిన ధైర్యం	56
సరిహద్దులు దాటిన సాంగత్యం	61
విలువైన కథ	65
చారిత్రిక అనివార్యతకి అద్దం	68
ఎవరు రాయబోతున్నారు ఆ కథ?	71

సూక్ష్మ చిత్రణ	74
రెండు నిస్సహాయత్వాల గురించిన వర్ణన	78
సంపూర్ణంగా సఫలమయినట్టు లేదు	83
తెగిన బంధనాలు	86
తీవ్రమానవానుభవానికి అక్షరరూపం	91
భీముడి ఆత్మకథ	96
కోసక్కులు	104
జోర్బా ద గ్రీక్	109
భగవంతుడి భిక్షువు	117
కొత్త యుగం రచయిత్రి-1	127
కొత్త యుగం రచయిత్రి-2	136
పుస్తక ప్రేమికుల కథ	142
స్త్రీ దుఃఖమూ శిశుదుఃఖమూ	147
విషవృక్షం	154
మసిబారిన బుద్ధుడు	162

జోర్జి లూయీ బోర్హెసు

10 **టివి** ప్రేక్షకులకోసం ఈ ఆదివారానికి జోర్జి లూయీ బోర్హెసు Selected Non-Fictions (పెంగ్విను, 2000) పరిచయం చేసాను.

జోర్జి లూయీ బోర్హెసు (1899-1986) అర్జెంటీనాకు చెందిన కవి, కథకుడు, ఆలోచనాపరుడు, విమర్శకుడు. మాజికల్ రియలిజంగా ప్రసిద్ధి చెందిన విశిష్ట కథన ప్రక్రియకి ఆద్యుడు. 20 వ శతాబ్ది పూర్వార్థంలో ఇలియటు, జాయిసు, పౌండు, కాఫ్కా, మార్సెల్ ప్రూ వంటి రచయితలు ప్రపంచసాహిత్యాన్ని గాఢంగా ప్రభావితం చేసారు. అయితే ఇరవయ్యవ శతాబ్ది ఉత్తరార్థంలో ఆ అవకాశం లాటిను అమెరికా రచయితలకు దక్కింది. బోర్హెసు, మార్క్వెజు, పాబ్లో నెరూడా, సెజారో వల్లేజో, జూలియో కార్టజారు వంటి కథకులూ, కవులూ అన్ని ఖండాల సాహిత్యాల్నీ తీవ్రంగా ప్రభావితం చేసారు. కాని వాళ్ళల్లో మార్క్వెజు, నెరూడాల పేర్లు తెలిసినంతగా తక్కినవాళ్ళ పేర్లు ప్రపంచానికి ఎక్కువగా తెలియదు. మాజికల్ రియలిజం ప్రక్రియ పట్ల గొప్ప క్రేజు కనపరచే తెలుగు సాహిత్యంలో కూడా బోర్హెసు పేరు విన్నవారూ, ఆయన రచనల్ని సాకల్యంగా చదివినవారూ ఏమంత ఎక్కువలేరు.

కాని మాజికల్ రియలిజం అంటే బోర్హెసు చూపించిన ధోరణికీ, తక్కినరచయితలు చూపించిన ధోరణికీ చాలా తేడా ఉంది. బయటసంఘటనల్లోనో, సంఘటనల్ని మనం ఇంద్రియగోచరం చేసుకునే తీరులోనో ఉన్న పరిమితుల్ని గుర్తించి వాటిని ఎత్తిచూపడం కోసం తక్కిన రచయితలు ఆ ధోరణిని వాడుకున్నారు. కాని దాన్ని వ్యంగ్యంగానో, నిర్లిప్తంగానో, విషాదభరితంగానో ఎత్తిచూపడం కోసం అసలు ప్రపంచం గురించి మనం భావించే తీరులోనే ఒక అసంగతత్వం ఉందని గుర్తించి బోర్హెసు రచనలు చేసాడు. ఒక విధంగా అతణ్ణి మనం తాత్త్వికుడన్నా తప్పులేదు. బెర్కిలీలాగా, హ్యూములాగా meta-

physician అన్నమాట. సత్యమేమిటో తెలుసుకోవాలని తపించి, దాన్ని అసత్యంద్వారా నిరూపించాలని ప్రయత్నించిన కాఫ్కాతరహా కళాకారుడు.

బోర్హెసు రాసిన కథలు చదవడం గొప్ప అనుభవం. కథ అనే ప్రక్రియకి కాలక్రమంలో ఏర్పడ్డ పరిమితులన్నిటినీ అతడు తుంచేసాడు. వ్యాసం, విజ్ఞాన సర్వస్వంలో ఆరోపం, పుస్తకసమీక్ష, లేని పుస్తకానికి లేని విమర్శకుడి పేరుమీద రాసిన సమీక్ష, ఫుట్ నోటులతో కూడిన విశ్లేషణ, రేఖామాత్రజీవితచిత్రణ ఇలా ఎన్నో రకాల ప్రక్రియల్ని ఆయన మనతో కథలుగా ఒప్పిస్తాడు. కథని కథగా చూడటం 1950 కి పూర్వపు కథ. ఇప్పుడు కథని నెరేటివుగా అర్థం చేసుకుంటున్నాం. భౌతిక సంఘటనల్ని చెప్పడం ద్వారానే కథ ఏర్పడుతుందనే పాతకాలపు భావన స్థానంలో ఆదిమధ్యాంతాలుండే ప్రతి ఒక్క వాక్యంలోనూ ఒక మలుపు, ఒక పరివర్తన సంభవిస్తే అది నెరేటివుగా మారిపోతుందని నేడు మనం గ్రహించగలుగుతున్నాం. ప్రపంచం ఆ అవగాహనకి చేరుకోవడానికి బోర్హెసు కథలు కూడా చాలావరకూ కారణం.

Fiction కీ Nonfiction కీ మధ్య హద్దులు చెరిపేసిన బోర్హెసు కథలు చదవడం ఎంత ఆసక్తికరంగా ఉంటుందో అతడి నాన్-ఫిక్షను చదవడం కూడా అంతే ఆసక్తికరంగా ఉంటుంది. యథార్థానికి రెండింటి మూలమూ ఒకటే. అది బోర్హెసు పఠనానుభవం. బహుశా ప్రపంచరచయితల్లోనే అంత విస్తృతపఠనానుభవం కలిగిన రచయిత మరొక-రుండరేమో. బ్యునోసుఎయిర్సులో అర్జెంటినా జాతీయగ్రంథాలయానికి డైరక్టరుగా పనిచేసిన బోర్హెసు ఆ గ్రంథాలయంలో ఉన్న ప్రతి ఒక్కపుస్తకం చదివేసాడంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా విజ్ఞానసర్వస్వాలు. మనం మామూలుగా విజ్ఞానసర్వస్వాల్ని రిఫరెన్సు కోసం వాడుకుంటాం. కాని ఆయన విజ్ఞానసర్వస్వాల్లో 'అ' నుంచి 'క్ష' దాకా ప్రతి ఒక్క ఎంట్రీ కూడా చదివేసాడు. చరిత్ర, తత్త్వశాస్త్రం, గణితం, భూగోళశాస్త్రం, భౌతిక రాసాయనిక శాస్త్రాలు, సాహిత్యం-ఇట్లా ప్రతి ఒక్క రంగానికి సంబంధించి ఎంత చదవగలడో అంతా చదివేడు. ఎంత చదివేడంటే ఆ అక్షరాగ్నికి అతడి కళ్ళు ఆ పఠనాగ్నికి ఆహుతైపోయాయి. యాభైయేళ్ళు వచ్చేటప్పటికే అంధుడైపోయాడు. జీవితంలో చివరి ముప్ఫై నలభయ్యేళ్ళు అంధత్వాన్ని మోస్తూనే రచనలు చేసాడు, ప్రసంగాలు చేసాడు, ప్రపంచమంతా పర్యటించేడు.

అతడి బాహుబంధం చాలా విశాలం. అందులో మనకి హోమరు, డాంటే, షేక్స్పియరు, గొథే, బాల్జా, కాఫ్కాలతో పాటు డేవిడ్ హ్యూము, 1001 అరేబియా రాత్రుల కథలు, ఎడ్గార్ ఎలన్ పో, మురాసకి సతి రాసిన గెంజిగాథ, స్కాండినేవియను పురాణగాథలు, టాగోరు, బౌద్ధ నికాయాలు, హిందూ ఇతిహాసాలు ఒకటేమిటి ప్రపంచసాహిత్యమంతా

గోచరిస్తుంది. ఒక మనిషి తన జీవితకాలంలో ఇంత చదవగలడా అనిపిస్తుంది. చదవడం ఒక ఎత్తు, చదివినదాన్ని జీర్ణించుకుని మానవుడి స్థితిగురించి ధ్యానించి కథలుగా చెప్పడం మరొక ఎత్తు.

బోర్హెసు రాసిన వ్యాసాలు చదువుతుంటే సంభ్రమం కలుగుతుంది. ఈర్ష్య జనిస్తుంది. కొంతసేపటికి అది ఆరాధనగా మారుతుంది. మనలో నిద్రాణంగా ఉన్న జిజ్ఞాసని మేల్కొల్పి మనం చూస్తూండగానే తృష్ణగా మార్చేస్తుంది. తన పాఠకుల్లో తాను ఇటువంటి జ్ఞానతృష్ణ మేల్కొల్పుతున్నానని బోర్హెసుకి తెలుసు. అందుకని అతడు తన చివరిరోజుల్లో The Library of Babel (1978-86), A Personal Library (1985-86) అనే రెండు ప్రాజెక్టులు చేపట్టాడు. ఆ ప్రణాళిక ప్రకారం ప్రపంచసాహిత్యంలో తాను చదివిన సర్వోత్కృష్ట రచనల్ని అర్జెంటీనా పాఠకులకి పరిచయం చేయడానికి ప్రయత్నించాడు. అలా పరిచయం చేసిన ఆ రచనల పేర్లు చూస్తేనే అతడి ప్రపంచం ఎంత విస్తృతమో మనకి తెలుస్తుంది: జాక్ లండను, హెన్రీ జేమ్సు, వోల్టేరు, హథార్ను, చెస్టర్‌టను, రాబర్ట్ లూయీ స్టీవెన్సను, డాస్టవస్కీ, పో, కాఫ్కా, మెల్విల్లీ, అరివర నో నరిహర, గిబ్బను, వైల్డు, మార్కో పోలో, ఫ్లాబే, డి క్విన్సీ, జీన్ కాక్టో, భగవద్గీత, కీర్క్‌గార్డు, మాటర్లింకు, వర్జిలు, ఈజిప్షియను బుక్ ఆఫ్ డెడ్. ..

A Personal Library కి రాసుకున్న ముందుమాటలో ఇలా రాసాడు:

> అందరూ తాము రాసిన పుస్తకాల గురించి గొప్పచెప్పుకుంటారు, కాని నేను చదివిన పుస్తకాల గురించి గొప్పచెప్పుకుంటాను. నేను మంచి రచయితను అవునో కాదో నాకు తెలియదు గాని, నేను చాలా మంచి పాఠకుణ్ణి. సున్నితపాఠకుణ్ణి. చదివిన పుస్తకాలపట్ల సదా కృతజ్ఞుణ్ణి.

ఇంకా ఇలా అన్నాడు:

> ఒక పుస్తకం ఈ విస్తృతవిశ్వంలో తన పాఠకుణ్ణి కలుసుకునేదాకా ఎన్నిటి మధ్యనో మరుగునపడి ఉండిపోతుంది. ఆ పాఠకుడనే పెద్దమనిషి ఆ పుస్తకంలో తనకోసం ఎదురుచూస్తున్న సంకేతాల్ని తనకోసం బహిర్గతం చేసుకోగానే మనం 'సౌందర్యం' అంటామే అట్లాంటిదేదో సంభవిస్తుంది. ఆ సమయంలో అతడిలో సంభవించే ఆ భావోద్వేగాన్ని ఏ మనస్తత్వశాస్త్రం, ఏ సాహిత్యవిమర్శ కూడా మనకి అర్థమయ్యేలా వివరించలేవు. ఏంజెలస్

సైలీషియసు అన్నాడు, 'ఒక గులాబీకి ఎందుకు అన్నది తెలీదు' అని,
శతాబ్దాల తర్వాత విష్లరు ప్రకటించేసాడు 'కళ సంభవిస్తుంది. అదంతే' అని.

బోర్హెసుని చదవడమంటే పసిఫిక్ మహాసముద్రంనుంచి తూర్పుదిశగా మళ్ళా పసిఫిక్ మహాసముద్రానికి ప్రయాణించే ఒక ఓడ ఎక్కడం. ఆ ఓడలో మనం, ఇరవయి ఒకటవ శతాబ్ది పాఠకులం ప్రయాణిస్తుంటాంగాని, దారితెల్సుకోవడానికి అతడు మనల్ని పదిహేనవ శతాబ్ది సముద్రగాములు వాడిన పటాలు, దిక్సూచి, నక్షత్రమార్గాల్ని వాడమంటాడు. అందులో రెండుప్రపంచయుద్ధాల్ని చూసిన మానవులుంటారుగాని, వాళ్ళని ఐస్లాండిక్ సాగాల ప్రకారం యుద్ధానుభవాన్ని అర్థం చేసుకోమంటాడు. అతడి దగ్గర షేక్స్పియరు సమగ్రనాటకసంకలనముంటుందిగాని, దాన్ని చదవడానికి ముందు థామస్‌కిడ్‌నీ, క్రిష్టఫర్ మార్లోనీ, మాంటేను వ్యాసాల్నీ చదివితీరాలంటాడు. డాంటే డివైన్ కామెడీ గురించి అతడికి బాగా తెలుసు, చాలా బాగా తెలుసు, కానీ ఆ కవిత్వాన్ని ఇటాలియనులోనే చదివి, ఇటాలియనులోనే ఆహా ఓహో అంటాడు, కనీసం స్పానిషులో కూడా పలవరించడానికి ఇష్టపడడు.

సముద్రాన్ని చూడగానే అతడికి పో, మెల్విల్లీ, ఒడిస్సీలు తప్పనిసరిగా గుర్తు రావడంలో ఆశ్చర్యం లేదుగాని, వాటన్నిటికన్నా సింద్‌బాదు వల్లనే తనకి సముద్ర రహస్యాలు ఎక్కువ బోధపడ్డాయంటాడు. వెయ్యిన్నొక్క అరేబియా రాత్రుల కథల్ని మనలో ఎవరన్నా పూర్తిగా చదివారా? (నేనయితే చదవలేదు). కాని బోర్హెసు సంగతే వేరు. అతడు రిచర్డు ఫ్రాన్సిసు బర్టను రాసిన 72 సంపుటాలూ మాత్రమే కాదు, అరేబియా రాత్రుల కథల్ని యూరోపుకి మొదటిసారి పరిచయం చేసిన జీన్ అంటోయిను గాలందు ఫ్రెంచి అనువాదాన్ని కూడా చదవడమే కాకుండా, ఆ ఫ్రెంచి అనువాదాల్ని చదివి కోలరిడ్జి, డీక్విన్సీ, స్టెంథాలు, టెన్నిసను, పో, న్యూమను ఎట్లా పలవరించారో కూడా చెప్తాడు.

మనం బోర్హెసుని చూసి విస్మయం చెందితే అతడు విస్మయం చెందే పాఠకులు కూడా కొందరున్నారు. ఉనమునో ఇరవయ్యవ శతాబ్ది స్పానిషు కవుల్లో అగ్రగణ్యుడైన కవి. అతడు కీర్క్‌గార్డుని మూలంలో చదవడానికి డేనిషు నేర్చుకున్నాడని, ఆ చదువు వృథా కాలేదని ఉనమునో చెప్పుకున్నాడనీ బోర్హెసు పట్టలేనంత ఆనందంతో చెప్తున్నప్పటికీ, తానా పని చెయ్యలేకపోయానన్న కించిద్ నిరాశ అందులో ధ్వనించకపోదు. అలాగని బోర్హెసు భాషాపరిజ్ఞానమేమీ తక్కువ కాదు, స్పానిషు, ఇంగ్లిషులతో సహా, లాటిను, ఇటాలియను, ఫ్రెంచి, జర్మను భాషలసాహిత్యాల్ని వివరించేటప్పుడు ఆయన ఆ భాషలు మాతృభాషలుగా కలిగినవాళ్ళకి ఏ విధంగానూ తీసిపోనట్టే మాట్లాడతాడు. సాహిత్యమే

కాదు, సంగీతం కూడా. జర్మనీ రాజకీయాల గురించి ఎవరైనా మాట్లాడతారు. కాని బాక్ సంగీతం వినకుండా నీకు జర్మను జీవితమే అర్థం కాదంటాడు బోర్హెసు.

సెర్వాంటిసు, వాల్ట్ విట్మను, స్వీడెన్‌బర్గులు అతడి ఆరాధ్యదేవతలు. అతడి రాజకీయ విశ్వాసాలు రాజీలేనివి. తన విచిత్రకథ The Book of Sand లో లాగా మానవజీవితం కూడా ఎప్పటికప్పుడు చెరిగిపోతూ, ఎప్పటికప్పుడు అనంతంగా ప్రత్యక్షమవుతూ ఉండే ఒక విచిత్రగోచరానుభవం. అయితే, భావనాశీలురైన గొప్పరచయితలందరిలానే అతడు కూడా ఒక విజనరీ. ఉదాహరణకి అతడు The Book of Sand రాసేటప్పటికి కంప్యూటరు అనే విచిత్రయంత్రమింకా భూమ్మీద ప్రభవించలేదు. ఇంటర్నెట్లో The Book of Sand పేరిట నేనొక వీడియోగేము చూసాను. బహుసా బోర్హెసు దాన్ని చూసుంటే చాలా సంతోషించి ఉండేవాడు. ఎందుకంటే, భారతీయ వేదాంతుల్లాగా, ఆయన కూడా, ప్రపంచం, జీవితం, సాహిత్యం అంతిమంగా, ఒట్టి ఖేల తప్ప మరేమీకాదన్న నిశ్చయానికి వచ్చినట్టే అనిపిస్తుంది.

బోర్హెసుని చదివితే ఏమవుతుంది? ఈ ప్రశ్నకి రెండంచెల్లో జవాబివ్వచ్చు. బోర్హెసు రాసిన ఫిక్షను చదివితే ఈ ప్రపంచం మనం చూస్తున్నంతమేరకు మాత్రమే పరిమితం కాదేమో అని అనుమానమొస్తుంది. అతడు రాసిన నాన్-ఫిక్షను చదివితే ఈ ప్రపంచం మనం చూస్తున్నంతమేరకే పరిమితంకాదని నిశ్చయంగా తేలిపోతుంది.

21-6-2014

పాట్రిక్ మోడియానో

ఈసారి 'అనల్ప' ప్రచురణల బలరాం చేతిలో కవిత్వంతో పాటు నవలలు కూడా కనిపించాయి. ఏమిటని చూస్తే, పాట్రిక్ మోడియానో నవల So You Don't Get Lost in The Neighborhood. 2013 లో రాసిన నవల. 2014 లో ఆయనకు సాహిత్యానికి నోబెల్ బహుమతి లభించింది.

నవల ముందు ఆయన పూర్వ ఫ్రెంచి మహారచయిత స్టెంధాల్ రాసిన రెండు వాక్యాలు ఉదాహరించాడు:

I can not provide the reality of events,
I can only convey their shadows.

ఆదివారం నాడే ఆ నవల చదవడం పూర్తిచేసేసాను. యాదృచ్ఛికంగా ఆ రోజే హిందూలో కేశవ గుహ అనే ఆయన మోడియానో తొలిరోజుల్లో రాసిన మూడునవలలు The Occupation Triology ని సమీక్షించాడు.

అందులో ఒక నవలని మోడియానో రింబో రాసిన ఈ వాక్యంతో మొదలుపెట్టాడని రాసాడు:

If only I had a past at some other point in French history!
But, no, nothing.

తన సమీక్షలో కేశవగుహ మోడియానోని థాకరే, టాల్‌స్టాయి వంటి రచయితలతో పోల్చాడు. తాము పుట్టినప్పుడో లేదా అంతకు కొద్దిగా ముందో జరిగిన చారిత్రిక కాలం జ్ఞాపకాలనుంచి బయటపడలేని ఐతిహాసిక రచయితలు వాళ్ళు.

మోడియానో 1945 లో పుట్టాడు. తండ్రి యూదు, తల్లి ఫ్లెమిషు. 1940-44 మధ్యకాలంలో ఫ్రాన్సు జర్మనీ ఆక్రమణలో ఉంది. ఆ కాలంలో నాజీ దురాగతాలు, యూదుల హననం, రెండవప్రపంచ యుద్ధం వ్యక్తుల జీవితాల్లోనూ, జాతుల గమనంలోనూ కలిగించిన సంక్షోభం–మోడియానో వాటినుంచి ఇప్పటికీ బయటపడలేకపోయాడు.

'విసపు విత్తొకసారి వేస్తే తరతరాలా పంటవిడువదు' అంటాడు బైరాగి. ఒక్క ద్వేష బీజం కాదు, విద్వేషాల పంటలు పండించినకాలం, ఆ కాలం ఎట్లాంటిదో తెలియకుండానే పెరిగాడు, కానీ ఆ కాలం తన మనసు మీద వదిలిన దారుణమైన ముద్రలు ఎన్నటికీ చెరగని మరకలుగా తనని వేధిస్తుంటే ఆ కాలమెట్లాంటిదో, ఆ రోజుల్లో ఏం జరిగిందో పునరన్వేషిస్తూ మోడియానో రచనలు చేసాడు.

అందుకనే అతడి నవల So You. .. మొదలుపెడుతూ తాను జరిగిన సంఘటనల్ని తిరిగిచెప్పలేననీ, తాను చెయ్యగలిగిందల్లా వాటి నీడల్ని మనకు ద్యోతకం చెయ్యడమేననీ ముందే చెప్పేస్తాడు. ఆ నవల ఆత్మకథనాత్మక నవల కూడా. అందులో ఉన్న ప్రతి ఒక్క వివరం, గాలి, చీకటి, మంచు ప్రతి ఒక్కటీ తనని వెన్నాడుతున్నవే.

ఆ నవల (లేదా పెద్ద కథ) చదివితే మనకేమీ కథ కనిపించదు. ఆదిమధ్యాంతాలుండే సాంప్రదాయిక కథ కాదది. జీవితం ఎక్కడ మొదలవుతుందో, ఎవరిని ఒరుసుకుంటూ ప్రవహిస్తుందో, ఎక్కడ ఆగిపోతుందో లేదా అంతరించిపోతుందో, లేదా మలుపు తిరుగు–తుందో చెప్పడం కష్టం కాబట్టి ఆ జీవితాన్ని చిత్రించే చిత్రణ కూడా అంతే. అది ఒక slice of memory.

విమర్శకులు దాన్ని మార్సెల్ ప్రూ రాసిన Remembrance of Things Past తో పోల్చారు. వినష్టకాలం గురించిన వెతుకులాటగా పేర్కొన్నారు.

కాని మోడియానో తన బాల్యం గురించీ, కౌమార జీవిత జ్ఞాపకాల గురించీ రాసుకున్న Pedigree చదివాక, ఆ నవల నాకు మరింత బాగా అర్థమయింది.

అతడి బాల్యం, కౌమారం, తొలియవ్వనాలు అత్యంత దుర్భరమైన కాలాలు. తల్లి నటి, గాయని, అతడి మాటల్లో చెప్పాలంటే 'పాషాణ హృదయ.' తండ్రి ఏదో రహస్య వ్యాపారం చేస్తూండేవాడు, అతడి యూదు అస్తిత్వం వల్ల ఆ కుటుంబం ఎప్పుడూ ఒక్కచోట నిలకడగా బతకలేదు. తండ్రి ఎప్పటికప్పుడు కొత్త కొత్త స్త్రీలతో జీవించేవాడు. ఆ క్రమంలో మోడియానోనీ, అతడి తల్లినీ పూర్తిగా వదిలిపెట్టేసాడు. మోడియానో బాల్యమంతా బోర్డింగు

స్కూళ్ళలో గడిచింది. కొన్నాళ్ళకు తల్లి పూర్తిగా నిరుపేదరాలయ్యింది. తనని వదిలిపెట్టేసిన భర్తనే నాలుగు ఫ్రాంకులు అడుక్కుని బతికే స్థితికి చేరుకుంది. అది కూడా తాను అడిగేది కాదు, తన కొడుకుని పంపి అడిగించేది. ఒకరాత్రి అట్లా తన తండ్రి ఇంటి తలుపు తట్టి నాలుగు ఫ్రాంకులు అడుక్కున్నందుకు ఆ తండ్రి పోలీసుల్ని పిలిపించి తన భార్యనీ కొడుకునీ పోలీసు వాను ఎక్కించాడు.

కాని వీటన్నిటికన్నా అతణ్ణి తీవ్రంగా గాయపరిచిందీ, జీవితమంతా వెన్నాడుతున్నదీ అతడి తమ్ముడి అకాల మృత్యువు. అతడిట్లా రాసాడు:

> నా తమ్ముడు రూడీ, అతడి మృత్యువూ– ఇవి తప్ప ఇక్కడ నేను రాస్తున్నదేదీ నిజంగా నాకు సంబంధించింది కాదు. ఎవరైనా ఒక నివేదిక రాస్తున్నప్పుడో లేదా ఏ ఉద్యోగం కోసమో తమ జీవితవివరాలు నింపుతున్నప్పుడో ఎట్లా రాస్తారో నేను కూడా అట్లానే ఈ పేజీలన్నీ నింపుతున్నాను. నాది కాని ఒక జీవితం తాలూకు వివరాలు నమోదు చేసుకుంటూ పోతున్నాను. ఇది కేవలం కొన్ని వివరాల సంఘటనల డాక్యుమెంటరీ మాత్రమే. నాకు ఒప్పుకోవలసిందీ, విప్పి చెప్పుకోవలసిందీ అంటూ ఏదీ లేదు. నాకు అంతరాత్మను తరచి చూడటంలోనూ, అంతరంగ కథనాల్లోనూ నమ్మకం లేదు. అంతకన్నా కూడా, నాకేదైనా ఎంత అగమ్యంగా, అయోమయంగా ఉంటే అంతగా ఆసక్తికరంగా ఉంటుంది. నాకు ఇరవయ్యొక్క ఏళ్ళొచ్చేవరకూ నేను లోనైన జీవితానుభవా–లన్నీ సినిమాలో తెరమీద వెనక్కి జారిపోయే నేపథ్యదృశ్యాల్లాగా అనిపిస్తాయి. నా ముందు కూడా చాలామంది ఇటువంటి అనుభవానికే లోనైనారు. ఆ అనుభవాన్ని మాటల్లో పెట్టాలనే నా ప్రయత్నం. ప్రతి ఒక్కటీ వెనక్కి జరిగిపోతూ ఉంటుంది, కానీ జీవితాన్ని పూర్తిగా జీవించినట్టే అనిపించదు.

తన అనుభవకథనాన్ని మొదలుపెడుతూ ముందు పేజీల్లోనే ఇట్లా రాస్తాడు:

> నేను ప్రస్తావిస్తున్న ఈ పేర్లూ, ముందు ముందు ప్రస్తావించబోయే పేర్లూ అన్నిట్నీ ఓపికతో భరించండి. నా కంటూ ఒక వంశంలేదని నన్ను నేను నమ్మించుకోవాలనుకుంటున్న కుక్కపిల్లని నేను. నా తల్లి, తండ్రీ కూడా ఏ విశిష్ట సంస్కృతికీ, విలువలకీ చెందిన వాళ్ళు కారు. జీవితమంతా గమ్యంలేకుండా, అస్థిరంగానే గడిపేసారు వాళ్ళు. అందుకని నేను నా తొలిజీవితాన్ని సూచించగల గుర్తులకోసం వెతుక్కుంటున్నాను. జారిపోతున్న

> ఈ ఇసుకలో కొన్ని కొండగుర్తులు నిలపాలని చూస్తున్నాను. ఏదో గణాంక పత్రమో లేదా ప్రభుత్వ కార్యాలయంలో మన వ్యక్తిగత వివరాలు నింపే ఫారాన్నో మనమెట్లా నింపడానికి ప్రయత్నిస్తామో, ఆ క్రమంలో ఆ అక్షరాల చుట్టూ ఇంకుమరకలెలా అంటుకుంటాయో, అట్లా..

అన్ని అనుభవాలూ తనకి సంప్రాప్తించినవే. కాని ఏదీ తనది కాదు. అకాలంగా చనిపోయిన తన తమ్ముడు తప్ప మరెవ్వరూ తనవారు కారు, తల్లితోసహా, తండ్రితో సహా. ఈ వాక్యాలు చూడండి:

> నేను 1960 ల్లో కలుసుకుని మళ్ళా జీవితంలో మరెన్నడూ చూడని ఈ మనుషులంతా బహుశా ఇప్పటికీ కాలానికి చిక్కకుండా, ఒక సమాంతర ప్రపంచంలోనే జీవిస్తూంటారనుకుంటాను. గడిచిపోయిన ఆ రోజులవైపే ముఖం పెట్టి చూస్తూ ఉంటారనుకుంటాను. నిర్మానుష్యమైన ఒక వీథిలో ఎండలో నిలబడి నేను కొంతసేపటి కిందట ఈ విషయమే ఆలోచిస్తూన్నాను. 'నువ్వు పారిసులో నిన్ను విచారిస్తున్న మాజిస్ట్రేటు ముందు నిల్చున్నావు' అని రాసాడు అపోలినారు తన ఒక కవితలో. ఆ మాజిస్ట్రేటు నాకు ఎన్నో ఫొటోలు చూపిస్తున్నాడు, పత్రాలు, సాక్ష్యాలు. కాని నా జీవితం– సరిగ్గా – అలా లేనే లేదు.

వంద పేజీల ఈ చిన్ని రచనని పూర్తిచెయ్యగానే మనకి యుద్ధాన్నీ, యుద్ధానంతర శూన్యాన్నీ కూడా చూసిన అనుభూతి వెన్నాడుతుంది. కాని ఒక సమీక్షకుడు రాసినట్టుగా–

> (ఈ రచనలో) మోడియానో ప్రతిభ దీనికి సాహిత్యం రంగు పులమక పోవడంలోనే ఉంది. తన తండ్రిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించక పోవడంలో, లేదా అతడి ప్రవర్తనని చారిత్రిక కారణాల్తో వివరించకపోవడంలో, అలాగే తన తల్లిని సమర్థించాలని చూడక పోవడంలో. అంతేకాదు, తన ప్రతిస్పందనల్ని మనకు ఏకరువు పెట్టకపోవడంలో. వీటివల్ల ఈ పుస్తకం మనని కలవరపరిచేదిగానూ, ఎంతో విలువైందిగానూ అనిపిస్తున్నది.

కాని మోడియానో తన తండ్రినీ, తల్లినీ కూడా ప్రేమించాడు. అది మమకారంతో కూడిన ప్రేమ కాదు, రక్తబానిసత్వం కాదు. ఒక మనిషి, ఒక సాహిత్యకారుడిగా ఎదిగిన మనిషి మాత్రమే చేరుకోగల మనఃస్థితిలోంచి చూపగల ప్రేమ.

తన తండ్రితో తన బంధాన్ని పూర్తిగా తెంచుకుంటూ రాసిన లేఖని పూర్తిగా మనకు వినిపిస్తూ ఇట్లా రాస్తాడు:

> కాని ఆ రోజు అట్లా రాసినందుకు నేనీనాడు పశ్చాత్తాపపడుతున్నాను. కాని నేనేమి చెయ్యగలను? నాకతడి పట్ల ఎటువంటి ఆగ్రహమూ లేదు, నిజానికి నేనతడి పట్ల ఎప్పుడు ఏదీ మనసులో పెట్టుకోలేదు... బహుశా పదేళ్ళ తరువాత అతడు నన్ను కలిసి ఉంటే మా ఇద్దరి మధ్యా ఎట్లాంటి సమస్యా ఉండేది కాదనుకుంటాను. అతడు నాతో సాహిత్యం గురించి మాట్లాడేవాడనుకుంటాను, నేనతడి రహస్యజీవితం గురించి తెలుసు–కునేవాణ్ణేమో. కానివ్వండి, బహుశా, మరొక లోకంలో మేమిద్దరమూ చెట్ట పట్టాలు పట్టుకుని నడుస్తాము, బహుశా అప్పుడైనా మేము ఎవరికీ భయపడ–కుండా నిర్భయంగా కలుసుకోగలమనుకుంటాను.

మోడియానో పుస్తకాలు రెండూ చదివిన తరువాత, రాసుకోవలసిన నీతివాక్యమేమిటి?

ద్వేషించుకోకండి, వ్యక్తులుగా , సమూహాలుగా, జాతులుగా.

మీరు ద్వేషించుకుంటే, ఆ ద్వేషకాలంలో పుట్టిన పిల్లలకి అనుభవాలుంటాయికాని, జీవితముండదు.

26-1-2016

తేనెటీగల కొలను

ఒకప్పుడు ఆర్.ఎస్.సుదర్శనం గారు తెలుగులో కవితాత్మకమైన నవల రావాలని రాసారు. కావ్యంలాగా ఉందన్నకారణం వల్లనే ఆయన 'ఏకవీర'ను ఎంతో ప్రస్తుతించారు. ఆ మాటలు నన్ను తీవ్రంగా ప్రభావితం చేసాయి. ఆ స్ఫూర్తితో నేను కూడా రెండు మూడు నవలలట్లా రాసానుగాని, అవి ప్రచురణకు పోలేదు. అది వేరే సంగతి.

కానీ తెలుగు సాహిత్యం మీద వాస్తవికతావాదం మోపిన బరువు వల్ల సంభవించిన పెద్ద నష్టం, ఆదర్శవాదప్రధానంగా చెప్పుకోదగ్గ రచనలేవీ రాకపోవడం.ఇప్పుడెవరేనా 15-25 ఏళ్ళ యువతీయువకులు తెలుగులో చదవడానికి నవలలేమైనా ఉన్నాయా అని అడిగితే, వాళ్ళకు సూచించడానికి నాకే నవలా కనిపించదు. అప్పుడప్పుడే జీవితంలోకి తలెత్తి చూస్తున్న ఆ చిన్నారి హృదయాలకు ఒక నిర్మల ఆదర్శాన్నో, స్వప్నాన్నో, ఆశయాన్నో చూపించదగినట్టుగా ఉండే తెలుగు నవల ఏదన్నా ఉందా? ఉంటే చెప్పండి. కాని నా మటుకు నాకు 'అమ్మ', 'ఆరణ్యక', జమీల్యా', 'మట్టిమనుషులు' వంటి నవలలు తప్ప తెలుగు నవలలేవీ స్ఫురించవు.

మీరనవచ్చు. 'అసమర్థుని జీవయాత్ర' అని. ఆ నవల గొప్ప నవల కావొచ్చేమోగాని, 16-17 ఏళ్ళ యువకుడు చదవవలసిన నవల కాదు. నా పదహారవ ఏట, ఒక మిట్ట మధ్యాహ్నం వేళ, గుంటూరు బస్టాండులో ఆ నవల కొనుక్కుని ఆ బస్సు ప్రయాణం పూర్తయ్యేలోగా పూర్తి చేసేసాను. కాని ఆ నవలకు బదులు, ఆ లేతవయసులో ఒక 'అమృతసంతానం' నా చేతుల్లోకి వచ్చి ఉంటే ఎంతబావుండేది!

నా హైస్కూలు రోజుల్లో నేనట్లాంటి ఒక నవల చదివాను. ప్రసిద్ధ మరాఠీ రచయిత, జ్ఞానపీఠ సమ్మానితుడు వ్యంకటేశ మాడ్గూళ్కరు రాసిన 'బన్‌గర్ వాడి'. ఆ నవల నా రక్తంలోకీ ఇంకిపోయింది. నా తదనంతర జీవితంలో నేను గ్రామీణ, గిరిజనాభివృద్ధి

రంగాల్ని నా కార్యక్షేత్రంగా ఎంచుకోవడానికి ఆ నవలనే నూటికి నూరుశాతం కారణమని నమ్ముతాను.

'చివరకు మిగిలేది', 'మైదానం', వేయిపడగలు' ప్రభవించిన సాహిత్యం ఎంతో గొప్పది, సందేహం లేదు. కాని అప్పుడప్పుడే కౌమారావస్థనుంచి నవయవ్వనంలోకి అడుగుపెడుతున్న యువతీయువకులు చదవడానికి పుస్తకాలు సూచించమంటే ఒక 'గోరా', ఒక 'పథేర్ పాంచాలి' మాత్రమే సూచించాలనిపిస్తుంది నాకు.

ఇప్పుడు థియోడర్ స్టార్మ్ రాసిన The Lake of the Bees (హెస్పెరసు, 2003) చదవగానే మళ్ళా ఈ ఆలోచనలే నన్ను ముప్పిరిగొన్నాయి. తెలుగు నవలాసాహిత్యం ఏది కోల్పోయిందో మరొక్కసారి స్ఫురించి చాలా దిగులు కమ్మింది.

స్టార్మ్ (1817-1888) పందొమ్మిదో శతాబ్ది జర్మను రచయితల్లో అగ్రశ్రేణి రచయిత, కవి. జర్మను వచనసాహిత్యంలో poetic realism (కవితాత్మక వాస్తవికత) అనే తరహా సాహిత్యం సృష్టించాడు. యాభైకి పైగా రాసిన ఆయన నవలికల్లోంచి The Lake of the Bees (తేనెటీగల కొలను, 1850), A Quiet Musician (నిశ్శబ్ద సంగీతకారుడు, 1875) అనే రెండు నవలికల అనువాదాలు ఈ పుస్తకంలో ఉన్నాయి.

ఆ నవలికల్ని స్టార్మ్ హంసతూలికతో రాసాడనిపించింది. కేవలం శైలి మాత్రమే కవితాత్మకం కాదు, ఆ కథనమూ, ఆ కథనం వెనక స్పందిస్తున్న హృదయమూ కూడా కుసుమకోమలాలే.

ఏవీ ఇట్లాంటి రచనలు తెలుగులో? కవిత్వం కాదు, నేను కోరుకుంటున్నది రొమాంటిసిజం కూడా కాదు. కాని చలంగారే ఒక ఉత్తరంలో రాసినట్టుగా గొప్ప సాహిత్యం నేలమీంచి ఒక్కడుగు పైకి లేవాలి, లేకపోతే అది మరీ నేలబారుగా ఉండిపోతుంది.

పదహారేళ్ళ నవయవ్వనంలో అకారణంగా ప్రేమలో పడ్డ యువతి హృదయాన్నో, అట్లాంటి ప్రేమకోసం ఏమి చెయ్యడానికైనా సిద్ధపడే యువకుడి నిస్వార్థాన్నో చిత్రించే నవల ఏదన్నా ఉందా తెలుగులో? కొత్తగా ఉద్యోగం దొరికిన ఒక స్త్రీ, ఒక దళితుడు, పోస్టు గ్రాద్యుయేషను కోసం ఒక యూనివెర్సిటీలో చేరిన గిరిజన యువకుడు, ఆ మాటకొస్తే ఏ పల్లెటూరి యువకుడైనా సరే, అతడి ఆశావహస్వప్నాల గురించిన నవల ఏదన్నా ఉందా తెలుగులో? (కొడవటిగంటి 'చదువు' అనవద్దు, అది నా దృష్టిలో నవల కానే కాదు).

స్టార్మ్‌ని చదివాక పదేపదే ఆలోచిస్తే తెలుగులో నాలుగైదు నవలలు కనిపించక పోలేదు. చలంగారి 'మార్తా', అడివి బాపిరాజు 'తుపాను', తెన్నేటిసూరి 'చెంఘిజ్ ఖాన్', డా.కేశవరెడ్డి 'అతడు అడవిని జయించాడు', మధురాంతకం మహేంద్ర 'స్వర్ణసీమకు స్వాగతం'– ఇంకా ఏవన్నా ఉన్నాయా?

కొత్తగా వ్యవసాయం మొదలుపెట్టిన ఒక సమూహం లేదా ఒక సహకార సంఘం, ఇంకా కలిసికట్టుగా జీవిస్తున్న ఒక సమష్టి కుటుంబం, లేదా ఒక సమష్టికుటుంబం నుంచి విడిపోయి, జీవితం మొదలుపెట్టిన ఒక చిన్నకుటుంబం, లేదా ఒక రైతాంగ పోరాటం సాధించిన తొలివిజయం, ఒక పీడిత పక్షపాతి స్వతంత్రఅభ్యర్థిగా ఎన్నికల్లో గెలుపొందిన వైనం, కొత్తగా ఒక ప్రాథమికపాఠశాలలో చేరిన ఉపాధ్యాయుడు ఆ పాఠశాలని సంతోషచంద్రశాలగా మార్చాలని తపించడం, ఒక బసివినో, జోగినినో చదువు కుని తనకి నచ్చినవాణ్ణి పెళ్ళిచేసుకున్న వైనం–ఏదన్నా గానీ, జీవితం పట్ల ఒకింత ప్రేమ, మానవసంబంధాల పట్ల ఒకింత మమకారం, రేపటి గురించి ఎదురుచూడగల ఒకింత ఉత్సాహం– వీటిని రేకెత్తించగల నవలలేమన్నా తెలుగులో ఉంటే చెప్పరా, చదవాలని ఉంది.

11-2-2016

దాదీ బూఢా

చాలా రోజులుగా పుస్తకాల అలమారులో ఉన్న నవల, గోపీనాథ మొహంతి 'దాదీ బూఢా' (Ancestor, సాహిత్య అకాదెమీ, 1997) బయటకు తీసాను. ఆ అనువాదం ఏకబిగిన చదివించింది. చాలా ఏళ్ళ కిందట, 'అమృత సంతానం' చదివినప్పుడు ఎటువంటి సంతోషం కలిగిందో, అటువంటి సంతోషంలోనే చాలా సేపటిదాకా ఉండిపోయాను.

గోపీనాథ మొహంతి (1914-1991) ఆధునిక ఒరియా సాహిత్యంలో, ముఖ్యంగా వచనసాహిత్యంలో ఫకీర్ మోహన సేనాపతి తర్వాత అంతటి ఖ్యాతి పొందాడు. 24 నవలలు, 10 కథాసంపుటాలతో పాటు కవిత్వం, నాటకం, వ్యాసం, జీవితచరిత్ర వంటి ప్రక్రియల్లో కూడా చెప్పుకోదగ్గ కృషి చేసాడు. గిరిజనభాషా, సంస్కృతుల మీద అయిదు సంపుటాలు వెలువరించాడు. టాల్‌స్టాయినీ, గోర్కీని, టాగోరునీ ఒరియాలోకి అనువదించాడు. ఆయన రచనల్లో 'అమృత సంతానం' సాహిత్య అకాదెమీ పురస్కారాన్నీ, 'మటిమటాల' జ్ఞానపీఠ పురస్కారాన్నీ సముపార్జించేయి. గోర్కీ My Universities ని అనువదించినందుకు గాను, సోవియెటు లాండు నెహ్రూ పురస్కారం లభించింది. భారత ప్రభుత్వం పద్మభూషణ సత్కారాన్ని అందించింది. తన చివరిరోజుల్లో ఒక అమెరికను విశ్వవిద్యాలయంలో సాంఘికశాస్త్ర ఆచార్యుడిగా పనిచేస్తూ అక్కడే కాలం చేసారు.

మొహంతి సమకాలికులైన ఒరియా రచయితలు మేరుసమానులు చాలామంది ఉన్నారు. కాళిందీచరణ పాణిగ్రాహి, మాయాధర మానసింహ, సచ్చిదానంద రౌత్రాయి, సురేంద్రమొహాంతిలతో పాటు మొహంతి సోదరుడు కానూచరణ మొహంతి కూడా ఉన్నారు. ఒకప్పుడు నేను మా శాఖకి కార్యదర్శిగా పనిచేసిన చిత్తరంజన బిశ్వాలు గారితో గోపీనాథమొహంతి గురించి మాట్లాడినప్పుడు, ఆయన కానూచరణ్, గోపీనాథ మొహంతి కన్నా, గొప్ప రచయిత అన్నారు.

కాని గోపీనాథ మొహంతిని సమకాలిక ఒరియా రచయితల్లోనే కాక, ఆధునిక భారతీయ రచయితలందరికన్నా ప్రత్యేకంగానూ, మిన్నగానూ నిలబెట్టేది గిరిజనుల గురించి ఆయన సృష్టించిన సాహిత్యం.

ఆయన 1938 లో ఒరిస్సారాష్ట్ర పాలనాసర్వీసులో చేరిన తర్వాత చాలాకాలం పాటు అవిభక్త కోరాపుట్టు జిల్లాలో వివిధస్థాయిల్లో పనిచేసారు. గిరిజనులు అత్యధికంగా నివసించే ఆ ప్రాంతాల్లో పనిచేసినందువల్ల ఆయనకి వారిని చాలా దగ్గరనుంచి చూసే అవకాశం లభించింది. కోదులు, పొరజాలు, గదబలు, డొంబులు మొదలైన గిరిజనతెగల గురించి ఆయన ప్రత్యక్షంగా చూసి 'దాదీ బూఢా' (1944), 'పరజ' (1945), 'అమృతర సంతాన్' (1947) లతో పాటు 'అపహంచ' (1961) అనే మరొక నవల కూడా రాసారు. అందులో 'అమృతర సంతాన్' ని సాహిత్య అకాదెమీ కోసం పురిపండా అప్పలస్వామిగారు అద్భుతంగా తెలుగు చేసారు. అందులో ఆయన కోరాపుట్టు అడవుల్లోని కోదుతెగ జీవితాన్ని చిత్రించారు.

కోదులు (ఇంగ్లీషులో Khonds) భారతదేశంలోని అత్యంత ప్రాచీన మానవ సమూహాల్లో ఒకరు. వారు ద్రావిడభాషా కుటుంబానికి చెందిన 'కుయి' అనే భాష మాట్లాడతారు. ఒకప్పుడు, ఆ తెగలో, 'మెరియా' అనే పేరిట నరమేధక్రతువు కూడా జరుగుతుండేది. బెంగాల్లో సతిని రూపుమాపడానికి పూనుకున్నట్టే, ఈస్టిండియా కంపెనీ, బ్రిటిషుప్రభుత్వమూ ఆ ఆచారాన్ని నిర్మూలించడానికి ఒక శతాబ్దం పాటు చాలా ప్రయత్నాలు చేసాయి. అందులో భాగంగా, బయటి ప్రపంచానికి ఆ తెగ పట్ల అపోహలూ, అపార్థాలూ ఏర్పడటానికి కూడా కారణమయ్యింది. ఆ నేపథ్యంలో ఆ జాతి జీవితం ఒక ఉత్సవంలాంటిదని చెప్పడం కోసం మొహంతి ఆ మహేతిహాసం రాసాడు.

నా దృష్టిలో, ఆ నవల War and Peace కన్నా గొప్పది, బహుశా, భారతీయ సాహిత్యంలో, మహాభారతం తరువాత, ఆ రచనకే నేను పట్టం కడతాను. ఈ మాట రాస్తున్నప్పుడు శరశ్చంద్ర, బిభూతిభూషణ బందోపాధ్యాయ, తారాశంకర బందోపాధ్యాయ, ప్రేమ్‌చందు, తకళి శివశంకర పిళ్ళై, శివరామకారంత, ఖాండేకరు వంటి పూర్వపు మహారచయితలు మొదలుకుని భైరప్ప, విక్రమసేథ్ వంటి నేటికాలపు రచయితలెంతమందో నా మనస్సులో మెదులుతున్నారు. అయినా కూడా నేను అమృతసంతానాన్నే ఎంపిక చేస్తాను.

ఎందుకంటే ఈ మహారచయితలంతా నాగరిక, గ్రామీణ సమాజాల గురించి రాసారు. అమృతసంతానంలో గొప్పదనం ఎక్కడుందంటే, ఆయన దాన్ని బయటివాడు గిరిజనుల

గురించి రాసినట్టుగాకాక, గిరిజనులే తమ గురించి రాసుకున్నట్టుగా, గిరిజనుడి ప్రాపంచిక దృక్పథంతో మమేకమై రాసాడు. గిరిజనప్రాంతాల్లో జరుగుతున్న దోపిడీ గురించీ, పీడన గురించీ రాసినవాళ్ళు లేకపోలేదు. ఆ విషయంలో మహాశ్వేతాదేవిని మించిన వాళ్ళు లేరు. కాని మొహంతి అక్కడితో ఆగిపోలేదు. ఆయన 'జీవితం సత్యం' అని మాత్రమే కాక, 'జీవితం సుందరం' అని కూడా అనగలిగాడు. అది భారతీయ మహేతిహాసాలైన రామాయణ, మహాభారతాల సాహిత్యవారసత్వం. దుఃఖాన్ని చూసి, చిత్రించి, అక్కడితో ఆగకుండా, అధీరుడు కాకుండా, ఏ సత్త్వం ఇన్ని మహాయుగాలపాటు ఆదివాసుల్ని బతికిస్తూ వచ్చిందో, ఎన్నో ప్రతికూలపరిస్థితుల్ని దాటి మనుగడ సాగనిస్తున్నదో, ఆ జీవశక్తిని ఆయన దర్శించాడు, అద్భుతమైన ఐతిహాసిక శైలిలో చిత్రించాడు.

'దాదీబూధా' ఆయన రాసిన రెండవ నవల, కానీ గిరిజన జీవితానికి సంబంధించిన మొదటినవల. కావడానికి అమృతసంతానంలో కోదుల గురించీ, దాదీ బూధాలో పొరజాల గురించీ రాసినట్టు కనిపించినా, ఇతివృత్తం స్థూలంగా ఒక్కటే. ఒక విధంగా దాదీ బూధా అమృతసంతానానికి preliminary sketch అనుకోవచ్చు. ఈ నవల రాసిన మూడేళ్ళకే అమృతసంతానం రాసినప్పటికీ, ఈ ఇతివృత్తాన్ని తీర్చిదిద్దడానికి అవసరమైన పరిపూర్ణ శిల్పం అప్పటికి ఆయనకు పూర్తిగా సిద్ధించిందని చెప్పవచ్చు.

దాదీ బూధాఅనే పదం కోదు-పొరజా భాషలకు చెందిన రెండు పదాల కలయిక. ఆ పదానికి వాచ్యార్థం ఏమైనా గాని, లాక్షణికార్థం 'పితృదేవత' అని చెప్పుకోవచ్చు.

కోరాపుట్టుజిల్లాలోని ులల్ల అనేది పొరజాలు, డొంబులు కలిసి జీవించే ఒక గ్రామం. ఆ గ్రామస్థులు ఒక ఈతచెట్టును తమ పితృదేవతగా భావించుకుని, తమ మంచిచెడ్డల్ని ఆ దేవతకు నివేదించుకుంటూ బతుకుతుంటారు. ఆ గ్రామపెద్ద రామచంద్రముదులి పొరజా తెగకి చెందినవాడు. అతడి కొడుకు తెంగా జానికి యుక్తవయసు రాగానే తమ తెగకే చెందిన అమ్మాయితో పెళ్ళి చెయ్యాలని నిశ్చయిస్తాడు. కొత్త జంట కోసం ఒక ఇల్లు కూడా కట్టడం మొదలుపెడతాడు.

కాని తెంగా జాని తమ గ్రామానికి చెందిన డొంబు కులస్థురాలు సంతోషకుమారిని ఇష్టపడతాడు. ఒక పొరజా, అది కూడా గ్రామపెద్ద కొడుకు, కాబోయే గ్రామపెద్ద, ఒక డొంబును ఇష్టపడటం, పెళ్ళి చేసుకోవడం ఆ తెగ చరిత్రలోనే ఊహించడానికి వీల్లేనిది. అందుకని వాళ్ళిద్దరూ, గ్రామంనుంచి పారిపోయి, అస్సాం టీతోటల్లో పనివెతుక్కుంటూ వెళ్ళిపోతారు. కొన్ని రోజులకి ఆ గ్రామంలో పశువులు చనిపోవడం మొదలవుతుంది.

గ్రామపెద్ద ఇంట్లో సంభవించిన దోషం వల్లనే పశునష్టం సంభవిస్తోందని ఊరంతా భావిస్తారు. గ్రామపెద్ద ఊరికంతా విందుచేస్తాడు, ప్రాయశ్చిత్త క్రతువులు చేస్తాడు. కొన్నాళ్ళకి ఊరు మీద పులి విరుచుకు పడుతుంది, మనుషుల్నీ, పశువుల్నీ కూడా చంపి తినడం మొదలవుతుంది. ఈ సారి తప్పెవరిదో అర్థం కాదు, దేవతకు పూజచేస్తారు. దేవత గ్రామస్థుల్ని ఆ ఊరు వదిలిపెట్టి దగ్గరలో మరో కొత్త ఊరు కట్టుకొమ్మని చెప్తుంది. ఆ పౌరజాసమాజం ఎన్నో ఏళ్ళుగా జీవించిన ఆ ఊర్ని వదిలిపెట్టి కొత్త ఊరుకి తరలివెళ్ళిపోతారు. ఆ పాత గ్రామం నెమ్మదిగా కూలిపోతుంది, దానితో పాటే, ఆ గ్రామపెద్ద తన కొడుకు, కోడలి కోసం కట్టడం మొదలుపెట్టి సగంలో ఆగిపోయిన ఇల్లు కూడా.

ఇప్పుడే ఇంత దోపిడీ, పీడన,అశాంతి గిరిజన ప్రాంతాల్లో ఉంటే, స్వాతంత్ర్యం పూర్వం గిరిజనప్రాంతాలు ఎంత దుర్భరంగా ఉండేవో ఊహించడం కష్టం కాదు. మొహంతి అదంతా చూసాడు, చిత్రించాడు. కాని ఆయన హృదయం అక్కడితో ఆగిపోలేదు. అమానుషమైన ప్రతికూలపరిస్థితుల్ని ఎదుర్కొని గిరిజనులు ఎట్లా బతకగలుగుతున్నారు? వారి జీవనరహస్యమేమిటి?

గిరిజనుల గురించి మాట్లాడే వాళ్ళు రాజకీయవేత్తల్లా, ఆర్థిక శాస్త్రవేత్తల్లా మాట్లాడం సహజం. కాని మొహంతి ఒక మానవశాస్త్రవేత్తలా, ఒక సౌందర్య శాస్త్రవేత్తలా ఆలోచిస్తాడు, మాట్లాడతాడు. అందుకనే దాదీబూఢా ముగించేటప్పటికి, మాటల్లో వివరించలేని ధైర్యమేదో మనకి స్ఫురిస్తుంది. మనం ఆ సమాజాన్ని చూసి జాలిపడం, ఇష్టపడతాం, ఆశ్చర్యపోతాం, బహుశా మనకు తెలీకుండానే ఆరాధించడం మొదలుపెడతామేమో కూడా.

ఈ నవలను ఇంగ్లిషులోకి అనువదించిన అరుణ్ కుమార్ మొహంతి చాలా మేరకు సఫలమయ్యాడనే చెప్పవచ్చు. చాలాచోట్ల ఆ ఇంగ్లిషు చదువుతుంటే, నాకు తెలీకుండానే నా మనసు పురిపండాశైలిలో తెలుగులోకి అనువదించుకుంటూ ఉంది. మూలభాషలో ఏ సంగీతం, సుగంధం ప్రవహించిఉంటాయో, అవి ఇంగ్లీషు హద్దుల్ని దాటి నా హృదయాన్ని తాకుతూన్నట్టే అనిపించించింది.

బహుశా తెలుగుగిరిజనులకి కావలసింది ఒక మొహంతిలాంటి రచయితా, మరొక మొహంతిలాంటి అనువాదకుడూ కూడా.

14-7-2016

చైనాను చూపించే కథలు

ఇప్పుడు ప్రపంచమంతా ప్రయాణాలమీదా, యాత్రలమీదా గొప్ప ఆసక్తి చూపిస్తోంది. మనం ఇంగ్లీషులో వాడే travel, tourism, pilgrimage అనే పదాలన్నిటికీ వేరు వేరు అర్థాలున్నాయి. యాత్ర వేరు, తీర్థయాత్ర వేరు. ఆ రెండింటికన్నా సంచార యాత్ర మరింత వేరు.

ఒక చోటకి కొత్తగా వెళ్ళినప్పుడు అక్కడి భూగోళం మనల్ని చప్పున ఆకర్షిస్తుంది. అక్కడి చెట్లు, గాలి, నదులు, కాంతి లేదా కాంతి లేకపోవడం, ప్రతి ఒక్కటీ. మనం అడుగుపెట్టిన కొత్త చోట, అంతా కొత్తగానే ఉంటుంది కాబట్టి, అక్కడ మనకు పరిచితమయిందేదైనా ఉందేమోనని చూస్తాం. మళ్ళీ మళ్ళీ వెళ్ళినప్పుడు, మనకింకా అక్కడ తెలియకుండా ఉన్నదేమన్నా ఉన్నదేమోనని వెతుక్కుంటాం.

కొత్త స్థలంలో, కొత్త దేశంలో ప్రకృతి ఎట్లా ఉంది, మనుషులెట్లా జీవిస్తున్నారు అని చూడటంలో గొప్ప ఆసక్తి ఉంది, అధ్యయనం ఉంది. అక్కడ చూడదగ్గ ప్రదేశాలేమన్నా ఉన్నాయా అని ఆరా తీస్తాం. వాటి ప్రత్యేకత గురించి తెలిసిన వాళ్ళని అడుగుతాం, తెలుసుకుంటాం. సాధారణంగా ట్రావెల్ గైడ్లు చేసే పని ఇదే.

ఒక మనిషి ఒక కొత్త స్థలంలో అడుగుపెట్టినప్పుడు అన్నిటికన్నా ముందు ఏమి చూసాడు, అతడికెట్లాంటి అనుభవాలెదురయ్యాయని తెలుసుకోవడం తక్కినవారికి కూడా ఆసక్తిదాయకంగా ఉంటుంది. ఆ ఆసక్తిలోంచే యాత్రావర్ణనలూ, యాత్రాచరిత్రలూ పుట్టుకొచ్చాయి. కర్నూలు జిల్లాలో నల్లమల అడవుల్లో కొండల మధ్య ఉన్న పెచ్చెరువు చెంచుగూడెంలో నేను మొదటిసారి అడుగుపెట్టినప్పుడు, నాకు అన్నిటికన్నా ముందు కలిగిన స్పందన, నాకన్నా నూరేళ్ళ ముందు ఏనుగుల వీరాస్వామయ్య ఆ గూడేన్ని చూసేడన్నదే.

కాని ఒక ప్రదేశంలో లాండ్ స్కేప్‌తో పాటు, అక్కడి జనజీవన సంస్కృతితో పాటు ఆ ప్రదేశానికొక ఆత్మ కూడా ఉంటుంది. ఇక్కడ ఆత్మ అంటే, అక్కడి ప్రకృతీ, సంస్కృతీ కలిసి ఆ ప్రదేశానికి సంతరించిపెట్టే ఒక అద్వితీయ సూక్ష్మసంస్కారం. అది మనకి ట్రావెలు గైడ్లలో దొరికేది కాదు, ఎందుకంటే, అవి బాహ్యప్రకృతికి సంబంధించిన వివరాలే ఇస్తాయి కాబట్టి. అది యాత్రా చరిత్రల్లో కూడా దొరకదు. ఎందుకంటే, యాత్రావర్ణనల్లో కూడా దాదాపుగా బాహ్యప్రకృతీ, దృశ్యసంస్కృతీ మాత్రమే చిత్రణకి వస్తాయి కాబట్టి. మరి, ఒక ప్రదేశాన్ని పట్టిచ్చే ఆత్మ మనకెక్కడ గోచరిస్తుంది?

అక్కడి సాహిత్యమే దాన్ని మనకి అందిస్తుంది.

ఈ విషయం మనకి కొత్తగా చెప్పవలసిన అవసరం లేదుగానీ, ట్రావెలు గైడ్లతో, ట్రావెలోగుల తో పోల్చి చూసినప్పుడు ఏదో కొత్తగా స్ఫురిస్తున్నట్టే ఉంటుంది. ఒక చోటు గురించి సాహిత్యం మాత్రమే చెప్పగలిగేది ఏదో ఒకటి ఉంటుందనీ, అది గూగులు మాప్పులో దొరకదనీ ఎప్పటికప్పుడు కొత్తగా చెప్పుకోవలసి ఉంటుంది.

నా మిత్రురాలు ఒకామె మొదటిసారి వియన్నా వెళ్ళి వచ్చిన ఫొటోలు చూపించి–నప్పుడు, అందులో భవనాలు ఉన్నాయి, మూజియంలు ఉన్నాయి, శిల్పాలు ఉన్నాయి, కాని స్టెఫాను జ్వెయిగు రాసిన The World of Yesterday లో కనిపించే వియన్నా, జరొస్లావు సీఫర్టు కవిత్వంలో కనిపించే వియన్నా లేదు. ఆ వియన్నా ఎటువంటిదో నేనామెకి వివరించలేను, అది తెలియాలంటే ఆమె ఆ రచయితల్ని చదివి ఉండాలి.

నేను సెయింటు పీటర్సుబర్గుని ఎన్నడూ చూసి ఉండకపోయినా, గొగోలు, డాస్టవిస్కీల వల్ల ఆ నగరం నాకు రాజమండ్రి ఎంత సుపరిచితమో అంత సుపరిచితం. జాయిసుని చదివినవాళ్ళు మాత్రమే నిజమైన డబ్లినుని చూడగలుగుతారు.

నేనిప్పటిదాకా న్యూయార్కు మహానగరాన్ని చూడలేదుగానీ, ఎప్పుడైనా అక్కడ అడుగుపెడితే, ఓ హెన్రీ చిత్రించిన న్యూయార్కు కోసమే వెతుక్కుంటాను. తాను చూస్తున్న న్యూయార్కు అగోచరమని ఓ హెన్రీకి కూడా తెలుసు. లేకపోతే, The Making of a Newyorker రాసి ఉండేవాడు కాదు.

సరిగ్గా ఈ నమ్మకంతోటే, Whereabouts Press వాళ్ళు A Traveler's Literary Companion పేరిట వివిధ దేశాల సాహిత్యసంకలనాలు వెలువరిస్తూ ఉన్నారు. అందులో China, A Traveler' s Literary Companion (2008) కూడా ఒకటి.

ఓహియో విశ్వవిద్యాలయంలో చైనీయసాహిత్యం బోధించే కిర్క్.ఎ.డెంటన్ అనే అధ్యాపకుడు ఆధునిక చైనా ఆత్మని పట్టిచ్చే పది కథలు, రెండు నవలా భాగాలు సంకలనం చెయ్యడమే కాక, విలువైన ముందుమాట కూడా రాసాడు. ఈశాన్యచైనాలో హిలాంగు జియాంగు మొదలుకుని నైరుతి ప్రాంతంలో టిబెట్ సరిహద్దుల్లోని పశ్చిన సిచువాను దాకా చైనా ప్రధానభూభాగంలోని ఎనిమిది ప్రాంతాలతో పాటు, హాంకాంగు, తైపైల్ని కూడా ప్రతిబింబించే రచనల్ని అతడు సంకలనం చేసాడు. వాటన్నిటిలోనూ లూసను రాసిన 'స్వగ్రామం' (1921) కథ అన్నిటికన్నా మొదటిది. హెనాను ప్రాంతానికి చెందిన యాన్ లియాంకె రాసిన రచన అన్నిటికన్నా ఇటీవలిది, 2003 నాటిది.

దాదాపు ఒక శతాబ్ద కాలంలో, చైనా ఆధునికయుగంలో అడుగుపెట్టి, రాజకీయంగా, రాచరికం నుంచి జాతీయవాదం మీదుగా కమ్యూనిజం వైపూ, ఆర్థికంగా ఫ్యూడలిజం నుంచి స్టేట్ కాపిటలిజం మీదుగా గ్లోబలైజేషను, లిబరలైజేషను వైపూ నడుస్తున్న కాలానికి చెందిన సాహిత్యం. కాని, ఆ కథలు చదువుతున్నప్పుడు, అత్యంత విశాలమైన, సుదృఢమైన కమ్యూనిస్టు వ్యవస్థ గానీ లేదా ప్రజల స్వేచ్ఛని అణచిపెడుతున్నదని ఆరోపణలకు గురవుతున్న నియంతృత్వం గానీ మనకు కనిపించవు. అంతకన్నా కూడా, ఒక మామూలు సమాజంలో, చిన్ని చిన్ని ఆశలు, నిరాశలు, త్యాగాలు, మోహాలు, మోసాలతో కూడుకుని ఉండే జీవితమే, ప్రపంచంలో తక్కిన ప్రతి చోటా ఉండే జీవితమే అక్కడ కూడా దర్శనమిస్తుంది. కానీ ఆ సాధారణ సుఖదుఃఖాలకు ఆ ప్రజలు లోను కావడంలో, ఆ దేశానిదే అయిన అద్వితీయలక్షణమేదో ఉంది. ఆ కథలు దాన్నే పట్టుకున్నాయి, చిత్రించడానికి ప్రయత్నించేయి.

తన ముందుమాట మొదలుపెడుతూనే సంకలనకర్త ఇట్లా రాసేడు:

> ఆధునికకాలానికి చెందిన చైనా రచయితలు, ఇటీవలి రోజులదాకా, దాదాపుగా గ్రామీణ ప్రాంతాలనుంచో లేదా లోతట్టు ప్రాంతానికి చెందిన చిన్న చిన్న పట్టణాలనుంచో వచ్చినవాళ్ళే. వాళ్ళకి వాళ్ళ స్వగ్రామాలతో, వారి స్వంత ప్రాంతాలతో ఉన్న సంబంధం క్లిష్టంగానూ, సమస్యాత్మకంగానూ ఉండింది. ఒకవైపు, బాజిను రాసిన నవల 'కుటుంబం' (1931) లో కథానాయకుడిలాగా, వాళ్ళు తమ గ్రామీణగృహాల్నీ, కుటుంబాల్నీ, సంప్రదాయాల్నీ వదిలిపెట్టి ఆధునికనగరజీవితాన్ని హత్తుకోవడంలో గొప్ప ఉత్సాహం అనుభవించేరు. మరొకవైపు లూసను రాసిన 'మద్యశాల మేడపైన' (1924) కథలో లాగా, మళ్ళా మళ్ళా గృహోన్ముఖులవుతూనే ఉన్నారు. ఇరవయ్యవ శతాబ్ది

> ప్రారంభం నుంచీ కూడా చైనా రచయితలూ, మేధావులూ ఆధునిక మహానగరాలూ, తమ స్వగ్రామాలూ, రెండింటిపట్లా ఆకర్షితులవుతూనే వున్నారు, విముఖులవుతూనే ఉన్నారు. ఈ రెండు స్థలాల పట్లా (అవి ప్రతిబింబిస్తున్న సంస్కృతులపట్లా) ముందు వెనకలకు ఊగిస- లాడటం ఆధునిక చైనాసాహిత్యాన్ని నిర్వచిస్తున్న ఒక ముఖ్యలక్షణంగా చెప్పవచ్చు.

చైనీయ సాహిత్యంలో ప్రతిబింబిస్తున్న చైనీయ జీవితంలోని ఈ అద్వితీయత ఆధునిక సాహిత్యానికే పరిమితం కాదనీ, ఇది చైనీయ సాహిత్యంలో అనుస్యూతంగా కొనసాగుతున్న సంప్రదాయమేననీ, ప్రాచీన చైనాసాహిత్యం చదివినవారెవరికైనా బోధపడుతుంది. ప్రాచీన చీనాకవిత్వమంతా స్వగ్రామం కోసం, స్వజనంకోసం పెట్టుకున్న బెంగలోంచే వికసించింది. అప్పుడు కూడా గ్రామీణయువకులకి నగరంలో ప్రభుత్వఉద్యోగం సంపాదించడమే జీవితాశయంగా ఉండింది. ఒకసారి ఉద్యోగం వచ్చి దూరప్రాంతానికి వెళ్ళి పనిచేయవలసి వచ్చినప్పుడు, తమ ఊరినీ, తమవాళ్ళనీ తలుచుకోవడమే కవిత్వంగా పరిణమించింది.

ఈ సంకలనం చదివిన తరువాత, తెలుగు జీవితాన్ని ప్రతిబింబించే కథలు ఏవై వుండవచ్చు, అసలు ఆధునిక తెలుగుజీవితపు అద్వితీయ లక్షణమేమై ఉండవచ్చునని ఆలోచించడం మొదలుపెట్టాను.

ఆలోచించండి, మనమట్లాంటి కథాసంకలనం ఒకటి తేవాలనుకుంటే, ఏ కథల్ని ఏరి కూర్చితే బాగుంటుంది? మీ ప్రాంతాల్ని ఏ కథలు బాగా పట్టుకున్నాయనీ, ప్రతిబింబిస్తు-న్నాయనీ మీకనిపిస్తోంది? ఒక్కొక్కప్పుడు ఒకే ప్రాంతాన్ని ఒకటి కన్నా ఎక్కువ కథలు అద్భుతంగా ప్రతిబింబిస్తున్నాయని మీకనిపిస్తే, అందులో ఒకటిమటుకే ఎంపిక చెయ్యమంటే, మీరేది ఎంచుకుంటారు?

ఉదాహరణకి, విజయనగరం జీవితాన్ని చిత్రించే కథలు ఎన్నో ఉన్నాయి, గురజాడ నుంచి గౌరునాయుడు దాకా. కాని, ఇప్పుడు విజయనగరం ఆత్మని ప్రతిబింబించే కథ ఎంచమంటే, నేను 'మీపేరేమిటి' కథను ఎంచను. అది ఒక స్థానిక ఐతిహ్యామే అయినా, తాత్వికంగా అది మొత్తం భారతదేశాన్ని ప్రతిబింబించే కథ. కానీ చాసో 'రథయాత్ర' చూడండి. అది విజయనగరంవాసి మాత్రమే రాయగల విజయనగరం కథ.

మరి మీరే కథలు ఎంపిక చేస్తారు?

1-9-2016

టాల్‌స్టాయి చివరి కథలు

టాల్‌స్టాయి చివరి కథలు చదివాను. తెలుగులో 'విషాదసంగీతం' పేరిట రాదుగ వారు ప్రచురించిన తెలుగు అనువాదాల్లో చాలా గొప్ప కథలు– The Family Happiness (1859), The Kruetzer Sonata (1889), Father Sergius (1890-98) వంటివి వున్నాయి. ఆ సంకలనం 1975 లో ప్రొగ్రెసు పబ్లిషర్సు వారు ప్రచురించిన Short stories కి అనువాదం.

ఆ కథలు ముప్పైఏళ్ళ కిందట నా చేతుల్లోకి మొదటిసారి వచ్చినప్పుడు నేను విభ్రాంతికి లోనయ్యాను. అంత గంభీరమైన, శక్తిమంతమైన కథలు నేనప్పటిదాకా చదవలేదు. ఆ తర్వాత ఎన్నో ఏళ్ళకు The Death of Ivan Ilych (1886) చదివాను. ఆ కథ నా మీద చూపించిన గాఢాతిగాఢమైన ప్రభావంలోంచే నేను 'ప్రశ్నభూమి' కథ రాసాను.

కాని టాల్‌స్టాయి తన జీవిత ఉత్తరార్థంలో రాసినకథల్లో నీతికథలు, లెజెండ్లు తెలుగులోకి అనువాదమయ్యాయికాని, Master and Man (1895) Hadji Murad (1904) లాంటి కథలు అనువాదం కాలేదు. ఆయన తన చివరి రోజుల్లో రాసిన కథల్లో After the ball (1903) ఒక్కటే, 'విందు తర్వాత', 'విందు నాట్యం తర్వాత' లాంటి పేర్లతో, తెలుగులోకి నాలుగైదు సార్లు అనువాదమయ్యింది. నేను కూడా ఆ కథని అనువదించకుండా ఉండలేకపోయాను.

టాల్‌స్టాయి తన జీవితం మలిసంధ్యలో రాసిన కథలు రెండు మూడు సంపుటాలు నా దగ్గర చాలాకాలంగా ఉన్నప్పటికీ, వాటినిప్పటిదాకా చదవలేకపోయాను. కాని, ఈ రెండువారాలుగా, ఆ కథలు చదువుతూంటే, గొప్ప సాహిత్యం చదువుతున్నప్పుడు ఒక

పాఠకుడు లోనుకాగల ఉద్విగ్నతకూ, గొప్ప ఋషితుల్యుడి సన్నిధిలో మనం లోనుకాగల ప్రశాంతతకూ కూడా లోనవుతూ వచ్చాను.

1856 లో మరొక ప్రసిద్ధ రష్యను రచయిత తుర్జెనీవు టాల్‌స్టాయికి ఒక ఉత్తరం రాసాడు. 'నేను మీ సమకాలికుణ్ణయినందుకు ఎంత సంతోషిస్తున్నానో మీకు ప్రత్యేకంగా చెప్పడానికే ఈ ఉత్తరం రాస్తున్నాను. మీకు నా విజ్ఞప్తి, మిత్రమా, దయచేసి సాహిత్యసృజన మళ్ళీ మొదలుపెట్టండి. మీలో ఉన్న ఆ గొప్ప ప్రతిభనుంచే మీరు తక్కిందేదైనా సమాజానికి ఇవ్వగలరు. రష్యను నేలకు చెందిన మహారచయితా, నా మొరాలకించండి' అంటూ.

కాని అందుకు టాల్‌స్టాయి తుర్జెనీవుని క్షమించలేకపోయాడు. తన జీవితకాలమంతా, ఒకవైపు తుర్జెనీవూ, మరొక వైపు తన భార్య సోఫియా ఈ విషయంలో ఆయనకు ప్రత్యర్థులుగానే ఉంటూ వచ్చారు. అందుకు కారణం War and Peace, Annakarenina రాసిన తర్వాత టాల్ స్టాయిలో వచ్చిన మార్పు.

1869 లో అర్జమాస్ అనే ఒక పట్టణంలో ఒక హోటల్లో మృత్యుభయానికి లోనైనప్పణ్ణుంచీ టాల్‌స్టాయి సాహిత్యాన్ని వదిలిపెట్టి మత, తాత్త్విక గ్రంథాలవైపు మరలిపోయాడు. అంతదాకా తాను సృష్టించిన సాహిత్యానికి విలువలేదనీ, ఒక చిన్న నీతికథ, రైతులకీ, గృహిణులకీ, పిల్లలకీ అర్థమయ్యేటట్టు ఒక్కనీతికథ చెప్పగలిగితే చాలనీ అనుకున్నాడు. అట్లాగే పిల్లలకోసం కథలు చెప్పడం మొదలుపెట్టాడు కూడా.

కళలో నైతికత లేదనీ,అది మనుషుల్ని విశృంఖలత్వం వైపూ, చెడునడతవైపూ ప్రోత్సహిస్తుందనీ, కళ పరమార్థం అంతిమంగా ఉపదేశం మాత్రమేనని వాదిస్తూ What is Art (1897) అనే ప్రసిద్ధగ్రంథం వెలువరించాడు.

కాని ఇదే ఆయన జీవిత ఉత్తరార్థంలో అత్యంత ఆసక్తికరమైన విషయం. ఒకవైపు తుర్జనీవు మాట పెడచెవిన పెట్టి నైతిక, ధార్మిక, తాత్విక, రాజకీయ రచనలు చేస్తున్నప్పటికీ, కళ పరమార్థం సరళమైన నీతికథల రూపంలో ప్రజలకి ఉపదేశం చేపట్టడమే అని భావిస్తున్నప్పటికీ, మరొకవైపు తాను జీవితకాలం పాటు సాధనచేస్తూ వచ్చిన సాహిత్యకౌశల్యాన్నంతటినీ ఉపయోగించి అత్యద్భుతమైన చిన్నకథలూ, పెద్ద కథలూ రాస్తూనే వచ్చాడు.

వాటిల్లో ఎంచవలసిన రెండు గొప్ప కథల్లో మొదటిది Master and Man (1895). ఒకవైపు 'కళ అంటే ఏమిటి' అని కళని తూర్పారపడుతూ పుస్తకం రాస్తూనే మరొకచేత్తో

ఇంత కళాత్మకమైన కథ ఆయనెట్లా రాసేడా అనిపిస్తుంది. ఆ కథలో నీతి స్పష్టమే. మనిషి నిజమైన ఆనందం ఎదుటిమనిషి సంతోషాన్ని కోరుకోవడంలోనే ఉందనే నీతి.

ఆయన తొలి దశలో రాసిన The Family Happiness కథలో ఈ వాక్యమే మూడు సార్లు ఎదురవుతుంది. కాని అందులో ఎంతోకొంత రొమాంటిసిజం ఉంది. కాని, ఈ రచన అన్నిరకాల ఉద్విగ్నతలనుండీ బయటపడి మృత్యువును ఎదుర్కోవడానికి చేసిన ప్రయత్నం. ఇతివృత్తం సరళం. నిజానికి ఆయన తొలిరోజుల్లో రాసిన The Snow Storm (1856) అనే కథనే ఈ కథకీ మాతృక.

ఒక మతాధికారీ, సంపన్నుడూ ఐన ఒక భూస్వామీ,అతడి పనివాడూ ఒక దూరగ్రామానికి బయల్దేరతారు. ఆ ప్రయాణంలో ఒక మంచుతుపానులో చిక్కుకుంటారు. ప్రయాణం ఆగిపోయి, ముందుకు కదల్లేని సమయంలో ముందు ఆ భూస్వామి తన పనివాడు చచ్చిపోయినా నష్టం లేదనుకుని, అతణ్ణట్లానే ఆ తుపానులో వదిలిపెట్టి ముందుకు పోతాడు. కాని ఆ చీకట్లో దారి తప్పి మళ్ళా వెనక్కి వస్తాడు. అప్పటికి ఆ పనివాడు దాదాపుగా చచ్చిపోతుంటాడు. ఆ క్షణంలో ఆ భూస్వామిలో ఊహించని మార్పు వస్తుంది. అతడు తన ప్రాణం త్యాగం చేసి మరీ ఆ పనివాణ్ణి బతికిస్తాడు. ఈ సరళ క్రైస్తవ నైతిక సూత్రాన్ని ఆయన కథగా మలిచిన తీరు మనల్ని విభ్రాంతపరుస్తుంది.

ఇక రెండవ కథ Hadji Murad (1896-1904) బహుశా టాల్‌స్టాయి సాహిత్య–మంతటిలోనూ సర్వోన్నతమైన రచన అని చెప్పవచ్చు. 'నానృషిః కురుతే కావ్యం' అనే మాటకి ఆ కథ నిరూపణ. రచయితగా, కళాకారుడిగా మాత్రమే కాదు, ఒక మనిషిగా కూడా తనతో తాను ఎంతో పెనగులాడుకుని, తన మీద తాను విజయం సాధించి మరీ టాల్‌స్టాయి ఆ కథ రాసాడని చెప్పవచ్చు.

1225 పేజీల War and Peace రాయడానికి ఆయన ఆరేళ్ళు కష్టపడితే, 270 పేజీల ఈ రచనకు ఎనిమిదేళ్ళు శ్రమించాడు. 68 వ ఏట రాయడం మొదలుపెట్టి 76 వ ఏట పూర్తి చేయగలిగాడు. చివరిప్రతికి ముందు పది వెర్షన్లు రాసాడు. కథ ఎత్తుగడకే 23 రకాల వెర్షన్లు రాసుకున్నాడు. కథలో జార్ చక్రవర్తి ఒకటవ నికొలసు ఉన్న అధ్యాయాన్ని 25 సార్లు తిరిగి రాసాడు.

మొత్తం 2515 పేజీలు రాసి, దాన్ని 250 పేజీల చేతిరాతకి కుదించాడు. ఆ కథ రాయడం కోసం ఆ వృద్ధాప్యంలో 172 పుస్తకాలు చదివినట్టుగా జాబితా రాసుకున్నాడు. ప్రపంచవ్యాప్తంగా కథలు రాసే వాళ్ళందరూ తెలుసుకోవలసిన విషయాలివి.

అంత కఠోరమైన పరిశ్రమ కించిత్తు కూడా వృథాపోలేదనే ఆ కథ చదివితే మనకు తెలుస్తుంది. రష్యాకి, చెచెన్యాకి మధ్య సరిహద్దుల్లో ఒక మహ్మదీయ గిరిజనతెగకీ, రష్యన్లకీ మధ్య జరిగే పోరాటం ఆ కథానేపథ్యం. అందులో హాజీ మురాద్ అనే మహ్మదీయ వీరుడు తన వ్యక్తిగత ప్రయోజనాలకోసం రష్యన్లతో చేతులు కలపడం, తిరిగి వాళ్ళనుంచి తప్పించుకుపోడానికి ప్రయత్నించినప్పుడు, అతడికీ, రష్యను సైనికులకీ మధ్యజరిగిన యుద్ధంలో అతడు వీరోచితంగా పోరాడి మరణించడం ఇతివృత్తం.

కాని, ఆ కథచెప్పిన టాల్‌స్టాయి సాహిత్యప్రయోజనమేమిటో పూర్తిగా తెలిసిన టాల్‌స్టాయి. అతడు కథలో ఎవరిపట్లా తీర్పుప్రకటించడు. ఏ పాత్రనీ ద్వేషించడు, ఎవరినీ ఉన్నతీకరించడు. నీతికథాశిల్పాల్లోని సారళ్యంతో పాటు గొప్ప కళారూపాల గాంభీర్యమంతా మేళవించి మరీ ఆ కథ రాసాడు. ఆ కథ చదివితే అందరికన్నా ముందు ఆనందవర్ధనుడూ, అభినవగుప్తుడూ ఎక్కువ సంతోషిస్తారనుకుంటాను.

ఇక చివరిరోజుల్లో రాసిన నాలుగు కథలు After the Ball (1903), The Forged Coupon (1904), Alyosha (1905), చిట్టచివరి కథ What For (1906) లకు వచ్చేటప్పటికి టాల్ స్టాయి హోమరు, బొకాషియో, షేక్ స్పియరుల స్థాయికి చేరుకున్నాడు.

After the Ball పరిపూర్ణమైన కథ, నిర్మాణపరంగానూ, దృక్పథపరంగానూ కూడా. The Forged Coupon ఒక బౌద్ధజాతకకథలాంటిది, మృచ్ఛకటికనాటకంలాంటి కథ. అందులో దొంగలనుంచి జార్ దాకా ప్రతి ఒక్కరూ కనిపిస్తారు. మంచిలోనూ చెడులోనూ కూడా మనుషులు ఒకరినొకరు విడదీయలేనంతగా ఒక సమాజంగా ఎట్లా అల్లుకు పోయారో ఆ కథలో కనిపిస్తుంది.

ఆ కథ ఉపదేశాత్మకమే. కాని అత్యంత వాస్తవికరచన కూడా. ఒక విమర్శకుడు ఆ కథ చదవగానే హోమరు గుర్తొస్తాడని రాసాడు. కాని నాకు 'కన్యాశుల్కం' గుర్తొచ్చింది. టాల్‌స్టాయికి సమకాలికుడిగా గురజాడ అట్లాంటి ఇతివృత్తాన్నే అప్పటికే తెలుగునేల మీద రూపకంగా మలిచి ఉన్నాడు.

'వచనం విషయంలోనూ, కథల విషయంలోనూ ఒక పాఠకుడిగా మీరు ఆశిస్తున్న ప్రమాణాలు మరీ ఉన్నతంగా ఉంటున్నాయి, అందుకే తెలుగు కథకులెవరూ మీకు నచ్చడం లేదు' అన్నాడు ఆదిత్య. ఇంతకుముందు సంగతి నాకు తెలియదుగాని, ఇప్పుడు ఈ కథలు చదివిన తర్వాత, పాఠకుడిగా నా అంచనాల్ని తక్కిన కథకులు ఎందరు అందుకో-గలరన్నది సందేహమే.

తాజాకలం:

ఈ వ్యాసం రాసిన తరువాత, ప్రసిద్ధ కథావిమర్శకులు రమణమూర్తిగారు నన్ను సరిచేసారు. 'యజమానీ, భూస్వామీ' కథని బెల్లంకొండ రామదాసుగారూ, 'హాజీమురాద్' కథని ముక్తవరం పార్థసారథిగారూ తెలుగులోకి ఇప్పటికే అనువదించారని చెప్పడమే కాకుండా, ఆ పుస్తకాల ప్రతులు నాకు పంపించారు కూడా.

25-3-2017

అమృతసంతానం

సాహిత్య అకాడెమీ ఆఫీసుకి వెళ్ళినప్పుడు అక్కడ పుస్తకవిక్రయకేంద్రంలో అడుగు పెట్టగానే చప్పున నా దృష్టిని ఆకర్షించింది 'అమృతర్ సంతాన్'. గోపీనాథ మొహంతి ఒడియా నవలకి ఇంగ్లిషు అనువాదం, The Dynasty of Immortals (2016).

ఇటువంటి అనువాదం ఒకటి వచ్చిందని ఆదిత్య కొన్నాళ్ళకింద నాతో అన్నాడని గుర్తొచ్చింది. కాని ఆ పుస్తకం అక్కడ చూడగానే చెప్పలేనంత సంతోషం కలిగింది. ప్రపంచస్థాయి రచన. ప్రపంచమంతా చదివి తీరవలసిన రచన. 1947 లో రాసిన ఈ పుస్తకం ఏడుదశాబ్దాల తరవాతైనా ఇంగ్లిషులోకి రావడం నిజంగా ఒక సంబరమే అనిపించింది.

1982 లోనో, 83 లోనో మొదటిసారి అమృతసంతానం తెలుగు అనువాదం చదివాను. పురిపండా అప్పలస్వామిగారి తెలుగుసేత. రాజమండ్రిలో సరస్వతీ పవరు ప్రెస్సు అని ఉండేది. అక్కడ ముద్రించారు. 1965 నాటి ముద్రణ అనుకుంటాను. ఆ పుస్తకం చదివినప్పణ్ణుంచీ ఆ ప్రభావం నుంచి ఇప్పటికీ బయటపడలేకపోయాను.

అది ఒరిస్సాలో కోరాపుట్టుజిల్లా పర్వతాల్లో, అరణ్యాల్లో జీవిస్తున్న కోదులనే ఒక గిరిజనతెగ తాలూకు జీవితచిత్రణ.మహేతిహాసం. నాకు తెలిసి ప్రపంచ సాహిత్యంలోనే అట్లాంటి రచన లేదు. నేను పుట్టినవూరు కూడా గిరిజన గ్రామమే. ఆ గ్రామం కొండరెడ్ల గ్రామమైనప్పటికీ, ఒక గిరిజనతెగగా, వాళ్ళకీ, కోదులకీ మధ్య ఎన్నో సారూప్యాలు కనబడినందువల్లా, ఆ నవలలో చిత్రించిన లాండ్ స్కేప్, ఆ మనుషులు, ఆ అడవులు, ఆ నాట్యాలు, ఆ పండగలు నాకు చిన్నప్పణ్ణుంచీ తెలిసినవి అయినందువల్లా, నేను ఆ రచనతో తక్షణమే ఐడెంటిఫై కాగలిగాను. అంతేకాదు, నేను అప్పటిదాకా పెరిగిన ఆ

గిరిజనజీవితం మూలస్వభావాన్ని, సారాంశాన్ని, ఆ ప్రాపంచిక దృక్పథాన్ని ఆ నవలద్వారా ఎంతోకొంత అర్థం చేసుకోగలిగాను.

ఆ తర్వాత నేను గిరిజనసంక్షేమ శాఖలో చేరినప్పుడు, నా ట్రైనింగులో భాగంగా గుమ్మలక్ష్మీపురం మండలంలో ఒక మారుమూల గ్రామమైన గొయిపాక అనే ఊళ్ళో రెండువారాలు గడపవలసి వచ్చింది. ఆ ఊరు కొండల్లో, అడవుల మధ్య ఉండే ఒక కోదుపల్లె. ఆ ఊరిని ఆనుకుని ఒరిస్సా రాష్ట్రంలో, కోరాపుట్టు జిల్లా గిరిజన గ్రామాలు. అదంతా దండకారణ్యం. ఆ కోదులు అమృతసంతానంలో చిత్రించిన కోదులే. నేనప్పటికి అయిదేళ్ళకింద చదివిన ఆ నవల్లోని జీవితం మధ్యనే అట్లా గడపగలనని ఎన్నడూ ఊహించి ఉండలేదు. కాని, ఆ రెండువారాల ఆ సామీప్యత, ఆ కోదుపల్లె, ఆ పక్కనే డొంబు పల్లె, ఆ కొండచరియలు, ఆ పిల్లంగోవి పాటలు, ఆ కుయి భాష, ఆ సాలవృక్షాలు, ఆ సీతాకోకచిలుకలు నన్ను పూర్తిగా లోబరుచుకున్నాయి. గిరిజనుల గురించి ఒక కథ లేదా నవల రాస్తే అమృతసంతానంలాగా రాయాలనే నమ్మకం స్థిరపడిపోయింది. (అందుకనే ఇప్పటిదాకా ఒక చిన్న కథ కూడా వాళ్ళ గురించి రాయలేకపోయాను.)

అమృతసంతానంలో కథ చాలా సరళం. మిణి అపాయు అనే ఒక కోదుపల్లెకి సరుబు సావొతా అనే పెద్ద ఉండేవాడు. పూర్తిగా పండి పూర్ణజీవితం జీవించాక అతడు మరణిస్తాడు. అతడి కొడుకు దివుడు సావొతా గ్రామపెద్ద అవుతాడు. కుయి భాషలో దివుడు అంటే సీతాకోక చిలుక. అతడి భార్య పుయి (పువ్వు). కొన్నాళ్ళకు కింద పల్లపు ప్రాంతాలకు చెందిన ఒక తెలుగమ్మాయి పియొటి (పిట్ట) ఆ ఊళ్ళో అడుగుపెడుతుంది. దివుడు ఆమె ఆకర్షణలో పడతాడు. అదంతా ఒక రూపకాలంకారం. సనాతన గిరిజన సంస్కృతి పల్లపు నాగరికత వ్యామోహంలో పడిన కథ, ఆ నలుగులాట అదంతా రచయిత గొప్ప కవితాత్మకంగా చెప్పుకొస్తాడు.

ఈ మధ్యలో పుయు గర్భం దాలుస్తుంది. ప్రసవిస్తుంది. ఆ చిన్నబిడ్డడిద్వారా మళ్ళా కోదుసంతతి కొనసాగుతుంది. కాని ఆ తల్లీబిడ్డలముందు గొప్ప అనిశ్చితత పరుచుకుని ఉంటుంది. చివరికి పుయు తన భర్తని వదిలిపెట్టి తన చిన్నబిడ్డడితో విశాలమైన ఆ పర్వతభూమిలో తన కాళ్ళమీద తను నిలబడడానికి ముందడుగు వేస్తుంది.

సుమారు వెయ్యి పేజీల ఆ నవలలో మహేతిహాసాల శిల్పముంది. ఇతిహాసాల్లో చిత్రించినట్టే అందులోనూ మరణం, పుట్టుక, పెళ్ళి, కలయిక, వియోగం, యుద్ధం, శాంతి అన్నీ ఉన్నాయి. రామాయణ, మహాభారతాల వారసుడు మాత్రమే రాయగల

రచన అది. మరొకవైపు టాల్‌స్టాయి తరహా మహాకుడ్య చిత్రణ. (మొహంతి టాల్‌స్టాయి వార్ అండ్ పీస్‌ని ఒడియాలోకి అనువదించాడు కూడా).

ఇప్పుడు ఈ నవల ఇంగ్లీషులో ప్రపంచం ముందుకొస్తున్నది. ఆ అనువాదం ఎట్లా ఉందో చూదామని అక్కడే ఆతృతగా కొన్ని పేజీలు తిరగేసాను. నిజమే, ఆ అనువాదాన్ని అప్పలస్వామిగారి తెలుగు అనువాదంతో పోల్చలేం. ఆదిత్య అన్నట్టు, ఆ అనువాదానికే అప్పలస్వామిగారికి జ్ఞానపీఠపురస్కారం ఇవ్వొచ్చు. కాని, ఆ తెలుగు అనువాదాన్ని మర్చిపోయి చూసినప్పుడు, ఈ ఇంగ్లీషు అనువాదకులు ప్రశస్తనీయమైన కృషి చేసారని ఒప్పుకోక తప్పదు.

అనువాదంలో ఎదురయ్యే సమస్య గురించి, ముందుమాటలో ప్రభాత నళినీదాస్ చెప్పినట్టు, అది కావడానికి ఒడియానుంచి ఇంగ్లిషులోకి అనువాదమే అయినా, సాంస్కృతికంగా, ఒక గిరిజన సంస్కృతినుంచి ముందు ఒడియాలోకి అనువాదమై, ఇప్పుడు ఇంగ్లిషులోకి అనువాదమవుతున్న రచన. ఆ గిరిజన జీవితం, ఆ సారళ్యం, ఆ సంక్లిష్టతలు ఒడియా సమాజానికే కొత్త. ఆ ప్రాపంచిక దృక్పథాన్ని మైదానప్రాంత ఒడియా సమాజానికి అర్థమయ్యేలా చెప్పడానికే మొహంతి ఎంతో కష్టపడ్డాడు. ఇప్పుడు ఆ జీవితం గురించి సూచనప్రాయంగా కూడా తెలియని విస్తృతప్రపంచానికి దాన్ని పరిచయం చెయ్యడం మరింత సవాలుతో కూడుకున్న పని.

కాని గొప్ప సాహిత్యం చేసేది అదే. నీకెంత మాత్రం తెలియని ప్రపంచాన్ని నీకెంతో సన్నిహితంచెయ్యగలదు. మనకి నైజీరియాలో ఉండే ఇబొ తెగ గురించి ఏమి తెలుసు? కాని చినువా అచెబె Things Fall Apart చదువుతున్నంతసేపూ నాకు మా ఊళ్ళూ, మా కొండలూ, మా అడవులే కళ్ళముందు కనిపిస్తూ ఉన్నాయి. ఇప్పుడు ఈ ఇంగ్లిషు అనువాదం చదివే ఆఫ్రికాజాతుల పాఠకులు, పసిఫిక్‌సముద్ర దీవుల్లోని పాఠకులు, ఎస్కిమోలు, రెడ్ ఇండియన్లు కూడా తమలాంటి ఒక తెగ భారతదేశంలో జీవిస్తూ ఉన్నారని, తామంతా కూడా ఒకే మహా అమృతసంతానమనీ గుర్తుపడతారని తలుచు కుంటేనే నాకు ఒళ్ళు పులకరిస్తూ ఉంది.

ఈ నవలకు ఫెలిక్స్ పడెల్ అనే ఒక యాంత్రొపాలజిస్టు ముందు మాట రాసాడు. రెండున్నరపేజీల ఆ ముందుమాట ఈ నవల సమకాలీన ప్రాసంగితకతను గొప్పగా పట్టుకుంది. ఇప్పుడు గిరిజనప్రాంతాల్ని బాక్సైటు గనులుగా మాత్రమే చూస్తున్న రాజకీయ–కార్పొరేటు ప్రాపంచిక దృక్పథాన్నీ, కొండల్ని దేవతలుగా చూస్తున్న ఒక ప్రాచీన ప్రాపంచిక

దృక్పథాన్నీ ఆ యాంత్రొపాలజిస్టు తన ముందుమాటలో ఎదురెదురుగా పెట్టి చూపించాడు. ముఖ్యంగా నియాంగిరి కొండల్లో వేదాంత మైనింగుకంపెనికీ, దోంగ్రియా కోదులకీ మధ్య జరిగిన పోరాటంలో సుప్రీంకోర్టు కోదుదేవతలకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో 'అమృతసంతానం' అత్యంత శక్తివంతమైన ఒక రాజకీయనవలగా కూడా కొత్త జన్మ ఎత్తగలదని నాకు స్ఫురించింది. ఆ స్ఫురణ గొప్ప ఆశ్చర్యానుభూతిని కలిగించింది.

ఆ తెలుగు అనువాదం లభ్యంగా లేదు కాబట్టి, ఇన్నాళ్ళూ నేను అమృత సంతానం గురించి మిమ్మల్ని ఎక్కువ ఊరించలేకపోయాను. కాని ఇప్పుడు ఇంగ్లిషులో ఆ పుస్తకం లభ్యంగా ఉంది. మీదే ఆలస్యం.

28-4-2017

బోర్హెసు సంభాషణలు

మంచం మీద వెల్లకిలా పడుకుని ఏదన్నా పుస్తకం చదువుకోడంలో గొప్ప సుఖముంది. కానీ కొన్ని పుస్తకాలు పడుకుని చదువుకునేవికావు, కూర్చుని చదవవలసినవి. పక్కనొక నోటు పుస్తకం, కలం లేకుండా తానే పుస్తకం చదవలేనని అకిరా కురొసువా రాసుకున్న మాటలు నాకు మరెవరి విషయంలో కాకపోయినా బోర్హెసు విషయంలో మాత్రం అక్షర సత్యాలనిపిస్తాయి.

జోర్జి లూయీ బోర్హెసు (1899-1986) ని ప్రసిద్ధ అర్జెంటీనియను రచయిత అనో లేదా మాజికల్ రియలిస్టు ధోరణికి ఆద్యుడనో పరిచయం చెయ్యడం చాలా కొరవగా ఉంటుంది. అతణ్ణి ప్రపంచరచయిత అని అన్నా కూడా ఇంకా ఏదో మిగిలిపోతూనే ఉన్నట్టనిపిస్తుంది. 'జాన్‌డన్ అనగానే గొప్పకవి అని స్ఫురిస్తుంది. కాని షేక్స్పియరు అనగానే ఆ పేరు మనలో రేకెత్తించే స్పందనలు అపారంగానూ, అంతులేకుండానూ ఉంటాయి' అని బోర్హెసు అన్న మాటలు బోర్హెసుకి వర్తింపచెయ్యవచ్చు.

బోర్హెసుని చదువుతున్నప్పుడు పక్కన నోటుబుక్కు ఎందుకుంటాలంటే బోర్హెసు చెప్పిన మాటలు రాసుకోడానికి కాదు. (నిజానికి అతడు మాట్లాడే ప్రతి మాటా మనం మనం మళ్ళా ఎత్తిరాసుకునేదిగానే ఉంటుంది). అంతకన్నా కూడా ఆ మాటలు మనలో రేకెత్తించే అద్వితీయ, అనూహ్య స్పందనల్నీ, స్ఫురణల్నీ అప్పటికప్పుడే రాసిపెట్టుకోకపోతే అవి మనకు తెలీకుండానే ఆవిరైపోతుంటాయి. అపారమైన సముద్రాన్ని చూస్తున్నప్పుడో, ప్రగాఢమైన సంగీతం వింటున్నప్పుడో మనలో రేకెత్తే స్పందనల్లాంటివవి.

నేను మాట్లాడుతున్నది నేనింతదాకా చదివిన బోర్హెసు Fiction, Non-Fiction ల గురించి. అవి మాధ్యమాలు. అటువంటి మాధ్యమాలతో పనిలేకుండా, అతడు నేరుగా మాట్లాడితే ఎలా ఉంటుంది? అతడి 84 వ ఏట, ఆస్వాల్డో ఫెర్రారి అనే ఒక యువకవి

ఆయన్ని ఎన్నో విషయాలమీద మాట్లాడించి ఆ సంభాషణలు రికార్డు చేసాడు. అవి ఇప్పటిదాకా మూడు సంపుటాలుగా వెలువడ్డాయి. అందులో రెండో సంపుటం Conversations (సీగలు బుక్సు, 2015) చదువుతున్నాను. ఇంకా పూర్తికాలేదు. పుస్తకం పూర్తిగా చదవకుండానే రాయడం నా తత్త్వానికి విరుద్ధం కానీ, ఉండబట్టలేక రాస్తున్నాను. ఏమి చెయ్యను? బోర్హెసు 'మాటలనియెడు మంత్రమహిమ' అటువంటిది.

అసలు అన్నిటికన్నా ముందు, ఇటువంటి ఒక మానవుడు నాకు ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎందుకు కనిపించడనేది నన్ను వేధించే ప్రశ్న. ముఖ్యంగా నా సమకాలిక సమాజంలో? ఒక్క మనిషేనా, ఒక్క సాహిత్యవేత్త అయినా ఇట్లా మాట్లాడగలిగేవాడు ఇప్పుడు నాకు కనిపించడం లేదు. ఇప్పుడెవరేనా ఒక రచయితని లేదా కవిని కలిసామను–కోండి, రెండు మాటల తర్వాత సంభాషణ పరనిందగా మారిపోతుంది. మనం గాసిపింగు స్థాయిని మించి ఎదగలేకపోయాం. ఎందుకంటే, మన ప్రపంచం చాలా చిన్నది. మన దృష్టి ఎంతసేపూ, మన పొరుగుకవికి లభించిన ఆహ్వానపత్రిక దగ్గరే ఆగిపోతుంది.

తెలుగు సాహిత్యమంటే ఈ పదేళ్ళ సాహిత్యమేనా? నన్నయ, తిక్కన,పెద్దన, పోతనల గురించి సాధికారికంగా సంభాషించగలిగే సాహితీవేత్తని ఎవరినీ నేనీ మధ్య కాలంలో కలవలేదు. ఇక వ్యాసవాల్మీకుల, భాస కాళిదాసుల సంస్కృతసాహిత్యాన్ని కూడా చేరిస్తే మల్లంపల్లి శరభయ్యగారే నేను చూసిన మొదటి, చివరి సాహితీవేత్త.

అట్లాంటిది, హోమరు, వర్జిలు, సెర్వాంటిసు, గొథే, షేక్ స్పియరు, వోల్టేరు, వాల్ట్ విట్మను, ఎడ్గార్ అలన్ పో, చెస్టర్టను, బెర్నార్డ్ షా, టాల్‌స్టాయి, డోస్టొవిస్కీ వంటి పాశ్చాత్య మహారచయితల్నీ, కన్ ఫ్యూసియసు, బౌద్ధం, హిందూ దర్శనాలనీ, స్వోడెనుబర్గు వంటి మిస్టిక్కులనీ, స్పినోజా వంటి తాత్త్వికుల్నీ, టర్నరు వంటి చిత్రకారుల్నీ, బాక్ వంటి సంగీతస్వరకర్తల్నీ–ఒక్క మాటలో చెప్పాలంటే ప్రాక్పశిమాల్నీ, ఉత్తరదక్షిణాల్నీ ఒక్క గుక్కలో స్మరించుకోగల, వారి గురించి సాధికారికంగా సంభాషించగల సాహితీవేత్త ఎవరున్నారు?

నాకు తెలిసినంతవరకు బోర్హెసు మాత్రమే.

బోర్హెసు గురించి నేనింతకుముందొకసారి రాసాను. కాబట్టి అదంతా మళ్ళా రాయాలని లేదు. కానీ గమనించవలసిందేమంటే, మనం బోర్హెసుని చదువుతున్నప్పుడు, లేదా ఈ సంభాషణల్లో వింటున్నప్పుడు, మనకు తెలిసిన సాహిత్యప్రపంచం కూడా కొత్తగా కనిపిస్తుంది. అంటే, కేవలం వాళ్ళ సాహిత్యకృషిని ప్రశంసించడం కాదు, వాళ్ళని బోర్హెసు కొత్త insights తో గుర్తు చేసుకుంటాడు. ఆ అంతర్దృష్టి అత్యంత మౌలికం. అసీమిత

స్ఫూరిదాయకం. ఆ అంతర్దృష్టికోసం బోర్హెసుని చదవాలి. ప్రపంచ సాహిత్యమంతా చదివిన వాడికి మాత్రమే, చదివి జీర్ణం చేసుకున్నవాడికి మాత్రమే సాధ్యమయ్యే లోచూపు అది. ఒక సున్నితపు త్రాసులాంటి రసజ్ఞహృదయం మాత్రమే చేపట్టగల మూల్యాంకనం అది.

బోర్హెసుని ఎందుకు చదవాలి? ముఖ్యంగా నా సమకాలిక తెలుగు రచయితలు? ఎందుకంటే తమ ప్రపంచం, తమ రచనలు, తమ ఆత్మప్రశంసలు, పుస్తకావిష్కరణ సభల్లో చేసుకునే స్తోత్రాలు ఎంత సంకుచితమైనవో తెలుసుకోడానికి. వాళ్ళ సంగతి సరే, నా వరకూ నేను బోర్హెసును ఎందుకు చదవాలంటే, నేను చదివింది చాలా స్వల్పమని గుర్తుచేసుకోడానికి. జీవితాన్నిఎప్పటికప్పుడు సరికొత్తగా చూడటమెట్లానో తెలుసుకోడానికి.

ఒక్క మాటలో చెప్పాలంటే, బోర్హెసు ఒక మిస్టిక్కు, కానీ ఆధునిక rational ప్రపంచం మాత్రమే సృష్టించగల మిస్టిక్కు. ఆ మిస్టికానుభవం ఎలాంటిదో తెలుసుకోడానికి బోర్హెసు కథలు చదవాలి, పుస్తక సమీక్షలు చదవాలి, ఇదిగో, ఈ సంభాషణలు చదవాలి.

ఈ సంభాషణల గురించి మళ్ళా రాస్తాను. కానీ, బోర్హెసు మన కాలపు సోక్రటీసు, మన కాలపు కన్‌ఫ్యూషియసు అని మాత్రం ఇప్పటికి చెప్పనివ్వండి.

27-12-2017

కథల పుట్టిల్లు

ట్విట్టరులో నేను రాజకీయనాయకుల్నీ, సినిమా నటుల్నీ ఫాలో కాను గానీ, అసలు వదిలిపెట్టని ట్వీట్లు మాత్రం African Proverbs అనే అకౌంటువి. ఆ సైటునుంచి రోజుకొక సామెత వస్తూంటుంది. చినువా అచెబె నవలలు చదివినవాళ్ళకి ఆఫ్రికను సామెతల మహిమ ఎట్లాంటిదో అనుభవానికి వచ్చే ఉంటుంది. ఆఫ్రికను సామెత ప్రతి ఒక్కటీ ఒక కథలాంటిది. లేదా ఆ సామెత వినగానే మనకో కథ తడుతుంది.

ఉదాహరణకి 'లాభం గర్వాన్ని మించిపోతుంది' అట్లాంటి ఒక సామెత. 'ఆ ఊళ్ళో అంతా ఎలకలు తింటూంటే నువ్వూ ఎలకలే తిను', 'కాళ్ళ బలం పొట్టలో ఉంది', 'గోడలు కట్టడం కన్నా వంతెనలు కట్టడం మేలు', 'ఒక్కడే కూచుని తినేవాడు ఒక్కడే దగ్గాల్సి ఉంటుంది' లాంటివెన్నో సామెతలు.

మనిషి పుట్టిల్లు ఆఫ్రికా. కథల పుట్టిల్లు కూడా అదే. కథలు సందేశం కోసం చెప్పుకోడం మరీ ఇటీవలి మాట. కాని ఆఫ్రికను సామెతలు, జానపద కథలు, చిక్కు ముళ్ళు వింటే కథలు వాటికవే సందేశం అని తెలుస్తుంది. కేవలం కథనానందం ఎలా ఉంటుందో తెలియాలంటే ఆఫ్రికను జానపద కథలు వినాలి. అచ్చమైన కథన కుతూహలం ఆఫ్రికాజాతులకి తెలిసినట్టుగా మరెవరికీ తెలియదనాలి.

కాని ఆఫ్రికను జానపద కథలు మనదాకా చేరినవి చాలా తక్కువ. అది కూడా ఆ దేశాల్లో, ఆ జాతుల మధ్య తిరిగి, వాళ్ళు చెప్పుకునే కథలు విని, వాటిని ఏ మాత్రం మార్చకుండా, విన్నవి విన్నట్టుగా మనకి చెప్పేవాళ్ళు చాలా అరుదు. అట్లాంటి అరుదైన పుస్తకాల్లో నన్ను చాలా ఆకట్టుకున్నది హరాల్డ్ కౌర్లాండరు, జార్జి హెర్జోగులు సంకలనం చేసిన Cow-tail Stitch (1947). అవి పశ్చిమ ఆఫ్రికాలో, ముఖ్యంగా నైజీరియాలో, సేకరించిన కథలు.

మళ్ళా ఇన్నాళ్ళకు మరో పుస్తకం నా చేతుల్లోకి వచ్చింది. అలెగ్జాండరు మెకాల్ స్మిత్తు అనే ఆయన సంకలనం చేసిన The Girl Who Married A Lion (2005). ఇవి బోట్సువానా, జింబాబ్వేల్లో సేకరించిన కథలు. మనకి లభ్యమయ్యే జానపద కథలు దాదాపుగా పశ్చిమ ఆఫ్రికాకి చెందినవే కావడం వల్ల, ఈ సంకలనం నాకు చాల కొత్తగానూ, చాలా తాజాగానూ అనిపించింది. పుస్తకం చేతుల్లోకి వస్తూనే ఇందులో ఉన్న 18 కథలూ ఏకబిగిన చదివేసాను. ఇప్పుడు వీటిల్లోంచి మీకో కథ వినిపించకుండా ఉండలేక-పోతున్నాను.

సింహం కన్నా గొప్ప జంతువు

చెవులపిల్లికి సింహమంటే ఇష్టం లేదు. సింహం రోజూ పొద్దున్నే లేచి అడవిలో గర్జిస్తూ తిరుగుతుంటుంది. ఆ అరుపులు అడవిలో చిన్న జంతువుల్ని ఒకటే భయపెడుతుంటాయి. సింహం తమనెక్కడ తినేస్తుందోనని అవి ప్రాణాలు అరచేతులో పెట్టుకు తిరుగుతున్నాయి. సింహానికి ఆకలేసినప్పుడు కూడా అది గర్జిస్తుండేది. ఆ అరుపు విన్నవాళ్ళకి 'నా కన్నా గొప్ప జంతువు మరేదీ లేదు. జంతువులన్నీ నా ముందు మోకరిల్లాల్సిందే 'అన్నట్టుండేది.

నిజమే, సింహం కన్నా పెద్ద జంతువు, గొప్ప జంతువు మరేదీ లేదు. ఏదన్నా ఉందంటే, బహుశా ఏనుగొక్కటే. కాని అది పిరిగ్గొడ్డు. అదెవరి జోలికీ పోయేది కాదు. అరుచుకుంటూ తిరిగేది కాదు. ఒకవేళ ఎప్పుడేనా ఏదన్నా సింహం ఏనుగు మీద విరుచుకు-పడితే,ఆ ఏనుగు దాంతో తలపడేది కాదనీ, అడవిలోకే వెనుదిరిగిపోయేదనీ మనం చెప్పుకోవచ్చు.

ఏమైతేనేం, ఈ సింహం రంకెలు ఆపడానికి ఏదో ఒకటి చెయ్యక తప్పదని చెవులపిల్లి అనుకుంది. మూడురోజులట్లా సుదీర్ఘంగా ఆలోచించిందిగాని, దారి దొరకలేదు. అప్పుడు తట్టింది దానికో ఆలోచన.

ఆ ఆలోచన రాగానే అది ఉత్సాహంతో ఎగిరి గంతేసింది. మామూలుగా పొద్దుటిపూట చెవులపిల్లులు ఊరికే ఎగిరిపడుతుంటాయి చూడండి, అట్లా అన్నమాట. 'ఓ సింహమా, నీ అరుపులకీ, పెడబొబ్బలకీ తగిన శాస్తి జరుగుతుంది చూడు' అనుకుంది అది తనలో.

చెవులపిల్లి తన దగ్గరికొస్తూండటం చూసి సింహం పైకి లేచి మళ్ళా పెనుగర్జ చేసింది. ఆ అరుపు వింటూనే చెవులపిల్లికి కాళ్ళ కిందనేల కంపించింది. ఒక్క ఉదుటన

ఇంటికి పారిపోదామా అనుకుంది. ఆ అరుపులట్లా చెవుల్లో పిడుగుల్లాగా పడుతుండగానే అది సింహం వైపు నడిచింది.

'నీకెంత ధైర్యం! నా ఎదురుగా నడిచొస్తున్నావు' అరిచింది సింహం. 'నేనెవరో తెలీదా నీకు? ఇక్కడ జంతువులన్నిటికన్నా నేనే బలమైనదాన్నని తెలీదా?' అనడిగింది.

చెవులపిల్లి నిటారుగా లేచి నిలబడింది.

'ఓ సింహమా, నాకు తెలుసు, నువ్వు చాలా గొప్పదానివని, ఈ అడవిలో జంతువులన్నీ నిన్ను చూస్తేనే వణికిపోతాయని' అంది.

ఆ మాట వింటూనే సింహానికి సంతోషం కలిగింది. అది తన కంఠస్వరం కొంత తగ్గించింది.

'మంచిది. నేనంటే గౌరవం పోలేదు నీకు. ఇప్పుడు చెప్పు, ఎందుకొచ్చావు?' అనడిగింది.

చెవులపిల్లి సింహాన్ని నింపాదిగా చూసింది. తానిప్పుడు చెప్పబోయే మాటలు ఎంత ప్రమాదకరమో తలుచుకుంది.

'నేనో మాట చెప్దామని వచ్చాను ' చెవులపిల్లి నిదానంగా చెప్పింది.' నీకన్నా గొప్ప జంతువొకటి ఉందిక్కడ'.

ఆ మాటలు చెవిన పడుతూనే సింహం మళ్ళా గర్జించింది. ఎంత గట్టిగా గర్జించిందంటే, అంత పెనుగర్జన ఆ చెవులపిల్లి అప్పటిదాకా వినలేదు. ఆ అరుపుకే తాను కళ్ళు తిరిగిపడిపోతానేమో అనుకుంది. సింహం ఊపిరి పీల్చుకునేదాకా ఆగింది.

'నేను నిన్ను తక్కువ చేయాలనుకోడం లేదు', చెవులపిల్లి ప్రార్థిస్తున్నట్టుగా ముఖం పెట్టి 'ఉన్న సంగతి నీ చెవిన వేద్దామని వచ్చాను' అంది.

తన ముందున్న ఆ బక్కప్రాణిని సింహం తదేకంగా చూసింది.

'ఏది ఆ జంతువెక్కడుందో చూపించు. నన్ను చూడనివ్వు' అనడిగింది.

'తప్పకుండా చూపిస్తాను' అంది చెవులపిల్లి. కాని దాన్ని చూడాలంటే ఒక ఇంట్లో చూడాలి' అని కూడా అంది.

'పద అయితే, ఇప్పుడే ఆ ఇంటికి పోదాం' అంది సింహం.

తాను అందుకోసమే ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఇంటికి ఆ సింహాన్ని తీసుకెళ్ళింది చెవులపిల్లి.

ఆ ముందుగుమ్మం చూపిస్తూ, 'అదిగో ఆ ఇంట్లోనే ఉంది ఆ జంతువు. చూడాలంటే లోపలకి వెళ్ళాలి' అంది.

సింహం పెద్ద పెద్ద అంగలేస్తూ ఆ ఇంట్లోకి అడుగుపెట్టింది. అదట్లా లోపలకి అడుగుపెట్టిందో లేదో, చెవులపిల్లి బయట తలుపు మూసేసింది. గొళ్ళెం పెట్టేసింది. తనని ఇంట్లో బంధించిందని అర్థం కాగానే సింహం లోపలనుంచి తలుపు బాదడం మొదలుపెట్టింది.

'ఏది ఆ జంతువు? దాన్ని తీసుకురా ఇప్పటికిప్పుడు' అంటూ అరిచింది.

'చప్పుడు చెయ్యకు. అదొస్తుంది. కొద్దిగా ఓపిక పట్టు' అంది చెవులపిల్లి.

సింహం లోపల గదిలోకి వెళ్ళి నేలమీద పడుకుంది. ఆ రోజంతా, ఆ రాత్రంతా అది ఎదురుచూస్తూనే ఉంది. తెల్లవారగానే మళ్ళా చెవులపిల్లి గుమ్మం దగ్గరికొచ్చి సింహాన్ని పిలిచింది.

'కనిపించిందా నీకా జంతువు' అనడిగింది.

'లేదు, ఇక్కడ నేనొక్కత్తినే ఉన్నాను'

'సరే, ఓపిక పట్టు, అదొస్తుందెలాగూ' అంది చెవులపిల్లి.

ఆ మర్నాడు మళ్ళా అదే సమయానికి గుమ్మం దగ్గర చేరి మళ్ళా సింహాన్ని పిలిచింది.

'ఇంకా రాలేదా?' అనడిగింది.

సింహానికి కోపం కట్టలు తెంచుకుంది. 'లేదు, నన్ను బయటికి రానివ్వు, చేసింది చాలు' అంది.

కాని చెవులపిల్లి సింహం అరుపులు పట్టించుకోకుండా నవ్వేసింది.

'కొద్దిగా ఆగి చూడు. నువ్వు కోరుకున్నది తప్పకుండా రానే వస్తుంది.'

అప్పుడు కొన్నాళ్ళు గడిచేదాకా ఆగి చెవులపిల్లి మళ్ళా వచ్చింది. ఈ సారి అదెంత పిలిచినా ఇంట్లోంచి జవాబు రాలేదు. 'సింహమా? ఇంట్లో ఉన్నావా లేవా' అని కేకపెట్టింది.

కొంతసేపటికి, వెనక గదిలో అలికిడైంది. అది సింహం అరుపేకాని, పూర్వంలాగా గర్జన కాదు. ఏదో ఆకులమధ్యా కొమ్మలమధ్యా కదలాడే అల్పప్రాణి చేసే చిరుసవ్వడిలాగా వినిపించింది. చెవులపిల్లి జాగ్రత్తగా తలుపు తెరిచి లోపల అడుగుపెట్టింది.

అక్కడ ఆ లోపలగదిలో నేలమీద సింహం పడుకుని ఉంది. దాని నాలుక వెళ్ళబెట్టి ఉంది. దాహంతో అది పిడచగట్టుకుపోయింది. పక్కటెముకలు పైకి పొడుచుకువచ్చి కనిపిస్తున్నాయి. రోజుల తరబడి తిండిలేక, నీళ్ళు లేక, సింహానికి కనీసం తల పైకెత్తడానికి కూడా ఓపిక లేకపోయింది. అది ఎట్లానో కళ్ళు మాత్రం కదిలించి చెవులపిల్లి కేసి చూసింది.

'నువ్వు ఎదురుచూస్తున్న ఆ జంతువు వచ్చేసింది తెలుసా' అంది చెవులపిల్లి. 'అది నిజంగానే నీకన్నా గొప్పది' అని కూడా అంది.

సింహం కళ్ళు ఒకింత పెద్దవయ్యాయి.

'ఏదీ? ఎవరది?' అనడిగింది. ఆ గొంతుక నూతిలోంచి వినబడ్డట్టుంది.

చెవులపిల్లి నవ్వేసింది.

'నీకన్నా గొప్ప జంతువు ఆకలి' అని జవాబిచ్చింది.

29-5-2018

కథ కాదు, ఒక సంస్కారం

టాల్‌స్టాయి ఒక కవి అని అన్నాడట తుర్జెనీవ్. తక్కిన రచనలు అలా ఉంచి, ఆయన రాసిన Family Happiness (1859) నవలిక మాత్రం పూర్తిగా ఒక కావ్యం. ముప్పై ఏళ్ళ కింద, ఆ రచన తెలుగు అనువాదం 'సంసారసుఖం', 'విషాదసంగీతం' కథా సంపుటంలో చదివినప్పుడు, నా కళ్ళముందు, నా మనసులో ఆవిష్కారమైన మనోజ్ఞలోకాన్ని నేనెప్పటికీ మరవలేను.

ఇరవయ్యేళ్ళ కిందట, ఆ రచన మరోసారి చదవాలనుకుని, ఇంగ్లిషు అనువాదం కొనుక్కున్నానేగాని, ఆ పుస్తకం ఎప్పుడు తెరిచినా ఒకటి రెండు పేజీల కన్నా ఎక్కువ ముందుకు నడవలేదు. ఆ విషయంలో కూడా ఆ కథ పూర్తి కావ్యత్వాన్ని సంతరించుకుందనే అనిపించింది. ఒకటి రెండు పేరాలు చదవగానే మనసులో ఎప్పటివో జ్ఞాపకాలు, వేధించే తలపులు, ఊరించే ఊహలు కమ్ముకుని, పుస్తకం అట్లా మడిచిపెట్టేయడమే మిగిలేది.

మొన్న సాయంకాలం దిల్లీ ప్రయాణమంటే, ఈ సారేనా ఈ కథ మరోసారి పూర్తిగా చదువుదామని వెంటబెట్టుకున్నాను. పుస్తకం చదువుతూండగానే విమానం గాల్లోకి లేచింది. కొన్ని పేజీలు చదవగానే ఎప్పటిలానే మనసు మళ్ళా దూదిపింజలాగా విడిపోవడం మొదలయ్యింది. పుస్తకం అట్లానే మడిచిపెట్టి బయటకు చూసాను.

నడి ఆకాశమంతా పత్తిచేలు విరగబూసినట్టు దూదిపింజల్లాంటి మేఘాలు. సుఖదుఃఖాలతోనూ, సకల సంక్లిష్టతలతోనూ అతలాకుతలమవుతున్న లోకం పూర్తిగా కప్పడిపోయింది. తన మాలిన్యాలన్నిటినీ మనసులో అణగదొక్కుకోగలిగిన మహాయోగి అంతరంగంలాగా శుభ్రధావళ్యం తప్ప మరేమీ కనిపించడం లేదక్కడ. సంధ్యకాంతి నెమ్మదిగా ఆ మేఘమండలం మీద సిందూరం కుమ్మరిస్తోంది.

పుస్తకంలోకి చూపులు తిప్పాను. ఆ ఇంగ్లిషు వాక్యాల్ని చదువుతూనే మనసులో తెలుగు చేసుకుంటూ చదవడం మొదలుపెట్టాను:

> ఆయన నన్ను ప్రశంసించాడు. అట్లా పొగడటం ఏదో తన హక్కన్నట్టుగా. అతడి మాటలూ, చూపులూ ఒక పసిపిల్లపట్ల ప్రసరిస్తున్నట్టుగా ఎంతో దయార్ద్రభరితంగా ఉన్నాయి. ఆ క్షణాన నాకు సంబంధించింది ప్రతి ఒక్కటీ ఆయనకు ఏ ఒక్క వివరం పొల్లుపోకుండా ఉన్నదున్నట్టుగా చెప్పేసుకోవాలనిపించింది. నేను చేసిన మంచిపనులు. అలాగే ఆయన నాలో అంగీకరించలేని అంశాలు కూడా ఆయన ముందు, చర్చిలో చేసినట్టే, మనఃపూర్వకంగా వెల్లడించుకోవాలనిపించింది. ఆ సాయంకాలమంతా ఎంతో మనోజ్ఞంగా ఉంది. తేనీరు తాగిన తర్వాత కూడా చాలాసేపు మేమిద్దరం ఆ వరండా లోనే కూచుండిపోయాం. ఆ సంభాషణ నన్నెంత లోబరచుకుందంటే, కొంతసేపటికి నాకు ఇంట్లో పనివాళ్ళ మాటలు కూడా వినిపించడం మానేసాయి. నాలుగువైపుల నుండీ పూలసుగంధం మరింత దట్టంగానూ, మరింత గాఢంగానూ ఆవరిస్తూ ఉంది. తోటలో పచ్చికమీద మంచు కురవడం మొదలయ్యింది. లిలాకు పొదల్లో ఒక నైటింగేలు ఇరుక్కుని మా మాటలు వింటూ ఆగిపోయింది. నక్షత్రాలు పరుచుకున్న వినీలాకాశం కిందకు వంగి మాకు చేరువగా జరిగింది.

మరికొన్ని పేరాల తర్వాత–

> ఆమె అక్కణ్ణుంచి లేచివెళ్ళిపోగానే మేమిద్దరం మౌనంగా కూచుండిపోయాం. మా చుట్టూ ప్రతి ఒక్కటీ నిశ్శబ్దంగా ఉన్నాయి, ఒక్కటి తప్ప. రాత్రంతా అప్పుడప్పుడు మాత్రమే కూస్తూ ఉన్న నైటింగేలు ఇప్పుడు తోటనంతా తెంపులేని పాటతో ముంచెత్తుతూ ఉంది. కొంతసేపటికి కిందన ఎక్కణ్ణుంచో మరొక పక్షి దానికి బదులివ్వడం మొదలుపెట్టింది. ఆ రెండవపిట్ట ఆ సాయంకాలం దాకా గొంతెత్తనే లేదు. మా దగ్గరలో ఉన్న పక్షి తనకు బదులిస్తున్న గొంతును శ్రద్ధగా వింటున్నట్టుగా ఒక క్షణం పాటు ఆగి మళ్ళా మరింత బిగ్గరగా పాటనందుకుంది. ఆ పాటలో దాని కూజితాలు మరింత లయాత్మకంగా, దీర్ఘనిశ్వాసాలతో హృదయంలోకి సొరవేసుకుపోతున్నట్టుగా ఉన్నాయి. ఆ పక్షుల కంఠాల్లో రాచరికపుఠీవిలాంటి ప్రశాంతత ఏదో ఉంది. ఆ గాల్లో ఆ

స్వరాలు ప్రయాణిస్తుంటే, ఆ రాత్రి ఆ విహంగాలదే తప్ప మనిషిది కాదని–పించింది. తోటమాలి నెమ్మదిగా తన కుటీరంవైపు సాగిపోతున్నాడు. అతడట్లా నడిచిపోతుంటే, అతడి బూట్ల చప్పుడు నెమ్మదిగా పలచబడుతూ ఉంది. ఎవరో కొండదిగువ లోయలో రెండు సార్లు ఈల వేసిన చప్పుడు. మళ్ళా అంతా మునపటి వలె నిశ్శబ్దం. కొమ్మల రెపరెపలు కూడా వినిపించేటంత నిశ్శబ్దం. వరండాలో ఒక కిటికీ రెక్క గాలికి కదిలింది. ఎక్కణ్ణుంచో గాల్లో తేలుకుంటూ వస్తూన్న ఒక అత్తరుపరిమళం పేలగా వరండాలో పరుచుకుంది. అంతదాకా నేనేమి చెప్పానో అదంతా గుర్తొచ్చి సిగ్గుగానూ, ఇబ్బందిగానూ అనిపించింది. మరేం మాట్లాడాలో తెలియలేదు. ఆయన వేపు చూసాను. ఆ సగం చీకటిలో ఆ నేత్రాలు మిలమిలమెరుస్తూ నా వేపు తిరిగాయి.

మరొక రెండు పేజీలు, రెండవ అధ్యాయం ముగింపుకి రాబోతుండగా మళ్ళా ఈ వాక్యాలు–

నేనీ మనుషుల మధ్యనే పదిహేడేళ్ళు పెరిగాను. కాని నాకున్నట్టే, వాళ్ళకి కూడా అభిమానాలూ, ఆకాంక్షలూ, విచారాలూ ఉంటాయని నాకు అప్పటి దాకా ఎప్పుడూ ఒక్కసారి కూడా తోచనేలేదు. ఎంతో కాలంగా పరిచితమైన మా తోటా, ఆ పొదలూ, ఆ పొలాలూ హటాత్తుగా ఒక్కసారిగా నాకెంతో కొత్తగానూ, అందంగానూ కనిపించడం మొదలుపెట్టాయి. ఆయన చెప్పింది నిజం: జీవితంలో నిశ్చయంగా లభించగల సంతోషమంటూ ఉంటే అది తోటి మనుషుల కోసం జీవించడంలోనే ఉంది. ఆయన మొదటిసారి ఆ మాటలన్నప్పుడు నాకు కొంత విచిత్రంగా తోచింది. అప్పుడు నేను ఆ మాటల్ని పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాను. కాని, నెమ్మదిగా ఆ మాటలు, నేనేమీ వాటి గురించి పెద్దగా ఆలోచించకుండానే, నా జీవితవిశ్వాసంగా మారి పోయేయి. నా జీవితాన్ని ఏ మాత్రం మార్చకుండానే, తన మనోభావాలు ప్రకటిస్తూండటం తప్ప మరేదీ నా జీవితంలోకి కొత్తగా ప్రవేశపెట్టకుండానే, ఆయన నా కళ్ళముందే, నేనున్నచోటనే సంతోషాలతో నిండిన ఒక సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించేడు. నా చిన్నప్పణ్ణుంచీ నన్నంటిపెట్టుకున్న ప్రపంచమే, ఒక్క మాటకూడా లేకుండా, ఒక్కసారిగా ప్రాణంపోసుకుని సజీవంగా నా ముందు నిలిచింది. ఆయన్ని చూస్తేనే చాలు, ప్రతి ఒక్కటీ నాతో ఏదో మాట్లాడానికి ప్రయత్నిస్తూ, నా హృదయమంతటితోటీ అంగీకారం ఆపేక్షిస్తూ నన్ను సంతోషంతో ముంచెత్తింది.

ఇంత లిరికల్ సౌందర్యాన్ని నింపుకున్న ఇట్లాంటి వాక్యాలు చదివిన తర్వాత యాంత్రికంగా పేజీలు తిప్పుకుంటూ, చదువుకుంటూ పోవడం కష్టం. పుస్తకం మూసేసాను. బయట ఆకాశదేశంలో వైశాఖమాసపు నెలబాలుడు ప్రత్యక్షమయ్యాడు. మేఘాల ధవళిమ, నింగినీలిమ, సంధ్యారక్తిమల మధ్య ఒక వజ్రపుతునక లాగా నెలకూన. ఆ సన్నని కాంతిరేఖ తక్కిన కాంతులన్నిటినీ కనుమరుగు చేసేటంత ఏకాగ్రంగా, నిశితంగా, ఉజ్జ్వలంగా ఉంది.

నా మనసంతా చెప్పలేని ఒక అనిర్వచనీయమైన మధుర కలవరానికీ, కలవరపు మాధుర్యానికీ లోనయ్యింది. టాల్‌స్టాయి చెప్తున్న కథకి సమానమైన కథ ఏదో నా అంతరంగం నాకు వినిపించడానికి ఉత్సాహపడుతూ ఉంది. కథ అంటే కథ కాదు. కథలన్నిటి పరమార్థం. నిన్ను నీ తోటిమనుషులకి మరింత చేరువగా తీసుకుపోయే ఒక సంస్కారం.

మనుషుల్తో కలిసి ఉండటంలోని ఆనందం. కలిసి గడపటంలోని ఆనందం. పూర్వకాలపు సమష్టికుటుంబాల్లోలాగా, అన్నం వండుకోవడం, కలిసి తినడం, ఇంటిల్లిపాదీ కలిసి పనులు చేసుకోవడంలోని ఆనందం. నా చిన్నప్పుడు, సంక్రాంతి రోజుల్లో, ఆ చలికాలపు ప్రభాతాన, మేమంతా నీళ్ళపొయ్యి దగ్గర కూచుని ఊరికినే మాటాడుకుంటూ ఉండేవాళ్ళమే, అట్లాంటి నిష్కారణ సామూహిక సంతోషం. రామనవమికో, గంగాలమ్మ పండగకకో ఊరంతా ఏకమై పందిళ్ళు వేసి, తోరణాలు కట్టి, ఉయ్యాలలూగేవారే అట్లాంటి సామాజిక సంతోషం.

లేదా ఏదో ఒక చిన్న కుగ్రామం, లేదా ఒక ఆదివాసి గ్రామం. అక్కడ నువ్వొక బడితెరుస్తావు. ఆ పిల్లలతో మాట్లాడుతూ వాళ్ళ ప్రపంచంలో అడుగుపెట్టడానికి యోగ్యత సంపాదించుకుంటూ ఉంటావు. ఒకరోజు మీకేమీ పాఠాలు చదువుకోవాలనిపించదు. అప్పుడు మీరంతా కలిసి ఊరవతల ఏటివడ్డుకి చేరుకుంటారు. గుమ్ములో మునుగుతారు లేదా చేపలు పట్టడానికి గాలం వేస్తారు. ఒక చేప గాలానికి చిక్కుతుంది. దాన్ని కొక్కెం నుంచి తప్పించి మళ్ళా నీళ్ళల్లోకి జారవిడుస్తారు. లేదా ఒకప్పుడు నువ్వు చూసావే, బడి ఎగ్గొట్టి చెంచుపిల్లలు ఆ తెలుగుగంగ కాలవపక్కన చేరి ఊరికే నీళ్ళల్లోకి మట్టిబెడ్డలు విసుర్తూ ఎంతదూరం విసరగలమా అని పందెం పెట్టుకుంటూ ఉన్నారో, అట్లా మీరంతా పందెం కాచుకుంటారు.

కాదా, మరో దృశ్యం. అనావృష్టికి గురయిన ఊళ్ళు. కొన్నేళ్ళుగా చెట్లు నరికేస్తూ వచ్చిన చోట. వాళ్ళకి నువ్వో ప్రణాళిక చెప్తావు. ప్రతి ఒక్క నీటిచుక్కా కాపాడుకోడానికి,

భూసారం రక్షించుకోడానికీ, ఆ నేలనంతా చూస్తూండగానే సస్యశ్యామలం చేయడానికీ మీరంతా నడుం బిగిస్తారు. 'ఇదిగో, అక్కడ ఆ మట్టికట్ట ఎంతదాకా వచ్చింది', 'అరే, అప్పుడే సాయంకాలమైపోయిందా, చూసుకోనే లేదే', 'రాత్రి అన్నాలు తిన్నాక మళ్ళా మరోసారి కూచుని, ఆ తోట ఎట్లా పెంచాలో మరోసారి మాటాడుకుందాం' లాంటి మాటలు వినబడుతూ ఉంటాయప్పుడు.

లేదా ఇంకో దృశ్యం. అక్కడొక ఉద్యమం తలెత్తుతూ ఉంది. పదిమందీ చదువు కోడానికో, లేదా ఏ స్థానికంగా నడుస్తున్న ఏ దురాచారాన్ని నిర్మూలించడానికో లేదా ప్రజలు మరింత నిర్భీతులుగానూ, మరింత సాధికారికంగానూ మారడానికో. నువ్వు కూడా అందులో ఒకడివవుతావు. నీ నాలుగు చేతుల్తోనూ చెయ్యగలిగిందంతా చేయడానికి ఉత్సాహపడతావు. రాత్రి బాగా పొద్దుపోయాక, అంతా అలిసిపోయి, ఎక్కడివాళ్ళక్కడే నిద్రలోకి జారుకున్నాక కూడా నీకింకా ఏదో చెయ్యాలనే అనిపిస్తూంటుంది. లేచి అక్కడ అడ్డదిడ్డంగా పడిఉన్నవాటిని సర్దిపెడతావు. మైమరిచి నిద్రపోతున్నవాళ్ళ వంటి మీద దుప్పటి సరిచేస్తావు. ఇంకా ఏదో నీలో ఉన్న సమస్త సృజనోత్సాహం నిన్ను నిలవనివ్వక పోతుంటే, ఆ గదిలోంచి లేదా ఆ హాల్లోంచి లేదా ఆ వసారాలోంచి బయటికొచ్చి నక్షత్ర ఖచిత ఆకాశం కేసి ప్రేమగా చూస్తావు. ఎక్కడో ఏ దివ్యలోకాల్లోంచో ఎవరో కవులు, గాయకులు గంధర్వులు నీతో సంభాషించడంకోసం అక్కడ వేచి ఉన్నారని నీకెంతో నమ్మకం.

ఆలోచనలు పక్కకు నెట్టి మళ్ళా పుస్తకం తెరిచాను. మూడవ అధ్యాయం. సెర్గీ మిఖలైవిచ్, మాషా, కాత్యా, సోన్యా అంతా ఒక సాయంసంధ్యవేళ ఆ తోటలో ఇంటిముందు నిల్చొని ఉండగా–

> చూడు, ఎట్లాంటి వెన్నెల రాత్రి ఇది అన్నాడాయన ఆరుబయట నించొని ఒకింత విభ్రాంతితో. అక్కడ తోటలోకి తెరుచుకున్న ఒక గవాక్షం ముందు నిల్చొని ఉన్నాడాయన. మేము కూడా అక్కడికి చేరుకున్నాం. నిజంగానే అట్లాంటి రాత్రిని నేనంతదాకా నా జీవితంలో చూసి ఉండలేదు. పూర్ణిమా చంద్రుడు మా ఇంటిమీదా, మా వెనగ్గా ప్రకాశిస్తూ ఉన్నాడు. మాకు అతడు కనిపించడం లేదుగాని, ఇంటిముందు మట్టిబాట మీద ఏటవాలుగా ఆ ఇంటికప్పు, స్తంభాలు, వరండా జాలు పరుస్తున్న నీడ కనిపిస్తూ ఉంది. ఆ బాటపక్క పచ్చికమీద ఆ వెన్నెల నీడ మెరుస్తూ ఉంది. చంద్రకాంతి, మంచు సోనల వెండికాంతిలో ప్రతి ఒక్కటి తళుకులీనుతూ ఉంది. తోటలో ఒక

పక్క డాలియాలూ, వాటిని అల్లుకున్న లతలతో విశాలమైన బాట మరింత చల్లగా మరింత ప్రకాశభరితంగా కనిపిస్తూ ఉంది. ఎగుడుదిగుడుగా ఉన్న ఆ మట్టిబాట ఆ వెన్నెట్లో సుదూరంగా సాగుతూ దూరంలో అస్పష్టంగా వట్టి ఊహగా మారిపోతూ ఉంది. ఆ చెట్ల మధ్య ఆ ఉద్యానగృహం మరింత శోభాయమానంగా కనిపిస్తూఉంది. దూరంగా లోయలో మంచు కురవడం మొదలయ్యింది. అప్పటికే ఆకులు రాల్చడం మొదలుపెట్టిన లిలాకుపొదలు ఆ మధ్యలో మరింత కాంతిమంతంగా ఉన్నాయి. మంచులో తడుస్తున్న ఆ పొదల్లో ప్రతి ఒక్క పువ్వూ స్పష్టంగా గోచరిస్తూ ఉంది. తోట మధ్యలో బాటలకి అటూ ఇటూ ఉన్న చెట్ల నీడలూ, వెలుగూ ఎట్లా కలగలిసిపోయాయంటే, అవి చెట్లలానూ, బాటల్లానూ కాకుండా, పారదర్శకమైన గృహాల్లాగా అటూ ఇటూ ఊగుతూ తలలూపుతున్నట్టుగా కనిపిస్తున్నాయి. మా కుడిపక్క మా ఇంటినీడ. ఆ నీడలో ప్రతి ఒక్కటీ గుర్తుపట్టలేనంత దట్టంగా, చీకటిగా, మాయాజాలంగా కనిపిస్తున్నది. చుట్టూ ఆవరించిన ఆ చీకటి మధ్య సమున్నతమైన పోప్లారు వృక్షశిఖరం మాత్రం కాంతికిర్మీరంలాగా గోచరిస్తున్నది. ఏదో ఒక ఛాయలాగా దూరదిగంతంలోకి తుడిచిపెట్టుకు పోకుండా, ఆకాశగాఢనీలిమలో కరిగిపోకుండా, ఆ చెట్టు తన శాఖోపశాఖ-లన్నిటితో ఆ కాంతిలోకంలోకి చొచ్చుకుపోయి కనిపిస్తున్నది.

ఆ వెన్నెల సాయంకాలం వాళ్ళట్లా ఆ తోటదారిన నడకమొదలుపెట్టగానే నాకు శాకుంతలం గుర్తొచ్చింది. నేను ఆ కథ మొదటిసారి చదివినప్పుడు కూడా ఆ సన్నివేశంలో శాకుంతలాన్నే తలుచుకున్నానని కూడా గుర్తొచ్చింది. మోనియరు విలియమ్సు ఇంగ్లిషు అనువాదం. నాటకం మొదటి అంకంలోనే, కణ్వాశ్రమంలో దుష్యంతుడు, శకుంతల, అనసూయ, ప్రియంవదలతో కలిసి చెట్ల మధ్య నడుస్తూ, ఒక చెట్టు నీడన కొద్దిసేపు కూచుని మాట్లాడుకున్న దృశ్యం. ఏముంది అందులో? ప్రపంచసాహిత్యంలో, ఆ మాటకొస్తే, శాకుంతలంలో కూడా అంతకన్నా గొప్ప దృశ్యాలు, సంగీతమయ సన్నివేశాలు మరెన్నో ఉండవచ్చు. కానీ, ఆ దృశ్యం నా మనసులో వేసిన ముద్ర నన్నెప్పటికీ వదలదు. ఏముంది అందులో?

బహుశా మనుషులు ఒకరికొకరు పరిచయమై స్నేహితులుగా మారే తొలినాళ్ళ, తొలి క్షణాల అపురూపమైన, అమాయికమైన, నిష్కల్మషత్వమంతా ఉందనుకుంటానక్కడ. స్నేహాలు, ప్రేమాలు, సాహచర్యాలు, సహప్రయాణాలు ఎటువంటివైనా కొన్నాళ్ళకు

మసకబారిపోతాయి. దైనందిన జీవితం వాటిని మొద్దుబార్చేస్తుంది. ఎంత మహోన్నత ఆశయాల సాధనకోసం తలెత్తిన ఎటువంటి ఉద్యమాల్లోని ఎటువంటి స్ఫూర్తిదాయకమైన కామ్రేడరీ కూడా కొన్నాళ్ళకు ఆత్మస్తుతి, పరనిందగా మారిపోతుంది. ఎందరు స్నేహితుల విషయంలో, ఎన్ని సార్లు పదే పదే అనుకోలేదు నేను! మేమొకరికొకరు పరిచయమైన ఆ తొలిదినాల్లో ఇతడు లేదా ఈమె ఎంత విభ్రాంతకరంగా, ఎంత సమ్మోహకరంగా ఉండేవారు అని!

శాకుంతలం మళ్ళా రెండో సారి చదవడం కష్టం. ఆ పుస్తకం గొప్ప దిగులుని రేకెత్తిస్తుంది. ఎన్ని సార్లు చదువుదామని తెరిచినా, ఆ ప్రస్తావనలోని, రెండవ శ్లోకంలోని, ఆ 'పాటల సంసర్గ సురభివనవాతాలూ', ఆ 'ప్రచ్ఛాయ సులభనిద్రా', ఆ 'గాఢసలిలావ-గాహాలూ' కనిపించగానే చెప్పలేని బెంగ ఒక వేసవిగాడ్పులాగా ముఖాన కొడుతుంది. 'పరిణామరమణీయాలైన' ఆ దినాలేవీ? ఆ రాత్రులెక్కడ? ఏమై పోయాయి ఆ రోజులు? ఎక్కడికిపోయాయి ఆ స్నేహాలు? జీవితం ప్రతి ఒక్క రోజూ ఇట్లానే గడుస్తుందని నమ్మిన రోజులు, ఇట్లానే గడవాలని అమాయికంగా కోరుకున్న రోజులు?

పుస్తకం పక్కన పెట్టేసాను. దిల్లీ విమానాశ్రయంలో దిగగానే ఆ సంధ్యవేళ వేపపూల గాలి వెచ్చగా నన్ను ముంచెత్తింది. ఉక్కుసముద్రంలాంటి ఆ విమానాశ్రయంలో ఒక్క వేపచెట్టుకూడా లేదే, ఎక్కడిదీ గాలి అనుకున్నాను. ఆ మర్నాడు దిల్లీవీథులంతటా విరబూసిన వేపచెట్లు కనిపించినప్పుడు, దేశమంతా ఎన్నికల్లో మునిగిపోయి ఉంటే, దేశ రాజధాని మాత్రం వేపపూలతావిలో బందీ అయిపోయిందని అర్థమయింది. ఒక సుదూర జ్ఞాపకంగా మారిపోయిన ఆ పురాతన వేసవిదినాల తలపోతలనుంచి బయటపడతా-ననుకున్న నాకు అనూహ్యంగా దిల్లీలో కూడా మళ్ళా మా ఊరు, ఆ వేసవి, ఆ వేపపూల తీపిగాలులే ప్రత్యక్షమయ్యాయి. ఇక నిలువెల్లా చిగురించి, అక్బరు రోడ్డులో, అటూ ఇటూ తళతళలాడుతున్న తెల్లమద్ది చెట్లని చూడగానే నేను పూర్తిగా స్పృహ తప్పాను.

మనుషులు కోరుకోవలసింది ఒక 'సామాజిక సామూహిక సద్వర్తన' అన్నాడు శ్రీశ్రీ. ఇప్పుడు నా చుట్టూ ఉన్న ప్రపంచంలో లేనిదదే. లేనివవే. సమాజం సమూహాలుగా చీలిపోతే పోనివ్వు, కాని ప్రతి ఒక్క సమూహానికీ ఒక సామూహిక సద్వర్తన అయితే తప్పనిసరి కదా. సద్వర్తన అనే మాటని పూర్వకాలపు నైతికార్థంలో ప్రయోగించలేదు మహాకవి. అది మనుషులు కలిసి మెలిసి జీవించడంలోని సంతోషం. కలిసి బతకడం, ఒకరికోసం ఒకరు బతకడం. కలిసి పనిచెయ్యడం. వేదకాలపు మానవుడిలాగా నూరు శరత్తులు చూడాలనుకోవడం, హీబ్రూ ప్రవక్తలాగా మనిషి ఒక సామాజిక ఆత్మతో ఒక

ఒడంబడిక కుదుర్చుకున్నాడని నమ్మడం. రెండవప్రపంచ యుద్ధకాలంలో సోవియెటు రచయితల్లాగా మనుషులు కలిసి పోరాటం చెయ్యడం ద్వారానే మానవాళిని బతికించు-కోగలరని నమ్మడం.

నాకెందుకో బతకాలని చాలా బలంగా అనిపించింది. ఒక్కణ్ణీ కాదు, ఒక్కడిగా కాదు, నలుగురితో కలిసి, ఒక నమ్మకం కోసం, ఒక విలువని సృష్టించడం కోసం, సృష్టించుకున్న విలువల్ని నిలబెట్టుకోడం కోసం, ఏదో ఒక పని చెయ్యాలనిపించింది. నా పసితనంలో మా అన్నయ్యతో కలిసి ఒక వెన్నెల రాత్రి మా ఊళ్ళో చాపరాయి మీద, ఎవరో ఆరబెట్టుకున్న తుమికాకు కట్టలు విప్పి వాళ్ళ కోసం ఆ ఆకులు ఆరబెట్టినట్టు, ఏదో ఒక పని, కలిసి చెయ్యడంలోని ఆనందం తప్ప మరే ప్రతిఫలం, ఇహలోకంలోనూ, పరలోకంలోనూ కూడా అక్కర్లేని పని ఏదో ఒకటి చెయ్యాలని బలంగా అనిపించింది. అనాకెరెనినా నవల్లో లెవిను ఒకచోట ఉండబట్టలేక పంటకోతల్లో తాను కూడా కొడవలి పట్టుకుని కోతపనిలో మునిగిపోతాడే అట్లా అనిపించింది. మరీ బలంగా అనిపించింది.

9-5-2019

దక్షిణమారుతం తాకినట్లుగా

మొన్న ఆఫీసు పనిమీదే దిల్లీ వెళ్ళినా అది మళ్ళా బహిరిసన్సు చూడటానికి వెళ్ళినట్టే అయింది. అక్కడ కవిత్వసంపుటాలతో పాటు అమృత ప్రీతమ్ పుస్తకమొకటి నన్ను ఆకర్షించింది. Fifty Fragments of Inner self (2019) చేతుల్లోకి తీసుకోగానే అదొక ప్రత్యేకమైన పుస్తకమని అర్థమైపోయింది.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి యాభై ఏళ్ళు పూర్తయినసందర్భంగా, 1997 లో రాసిన పుస్తకం అది. అందులో భారతీయసంస్కృతికీ, ఆధ్యాత్మిక సంస్కారానికీ సంబంధించిన యాభై భావనలున్నాయి. జెన్ సాధువులు, సూఫీ దర్వేషులు చెప్పే కథల్లాంటి కథలున్నాయి. ఆమె అట్లాంటి పుస్తకమొకటి రాయాలనుకోవడం వెనక ఆమె మీద ఓషో ప్రభావం ఉందని కూడా అనిపించింది. ఓషో తక్కిన ప్రపంచానికి వివాదాస్పదుడైనప్పుడు కూడా, అమృతప్రీతమ్ ఆయన పట్ల తన నమ్మకాన్నీ, గౌరవాన్నీ అట్లానే నిలుపుకోగలిగింది. ఎంత గౌరవమంటే, 'మీరా నాట్యమూ, బుద్ధుడి మౌనమూ ఒక్కటయ్యే చోటు ఓషో' అనగలిగేటంత.

ఆ పుస్తకం ఆ సాయంకాలమే, ఎయిర్ పోర్టులోనే, విమానమెక్కేలోపలే పూర్తి చేసేసాను. ఎండవేడికి అలసిపోయిన దేహాన్ని దక్షిణమారుతం తాకినట్లుగా ఉందా పుస్తకం నా మనసుకీ, అంతరాత్మకీ. అందులోంచి ఒక చిన్న కథ మీకోసం.

అంతస్సత్త్వం

ఒకప్పుడు మహావీరుడూ, గోశాలకుడూ ఎక్కడికో వెళ్తున్నారట. వాళ్ళొక గ్రామం మీంచి వెళ్తున్నప్పుడు దారిలో ఒక మొక్క కనబడింది. ఆ మొక్కని చూస్తూ గోశాలకుడు 'ఏమంటావు

మిత్రమా? ఈ మొక్క గురించి నీ అభిప్రాయమేమిటి? ఇది ఎప్పటికేనా వికసిస్తుందా? పూలు పూసేదాకా బతికి బట్ట కడుతుందా?'అనడిగాడు.

మహావీరుడు ఆ మొక్కని పరీక్షగా చూసాడు. కొద్దిసేపు నిశ్శబ్దంగా నిలబడ్డాడు. అప్పుడు 'తథ్యం. ఈ మొక్క పూలు పూసేదాకా బతికి తీరుతుంది' అన్నాడు.

అతడు ఆ మాటలు అంటూనే, గోశాలకుడు ఆ మొక్క దగ్గరికి వెళ్ళి మహావీరుడి కళ్ళముందే ఆ మొక్కని వేళ్ళతో ఊడబెరికి, నవ్వుతూ 'ఇప్పుడు చెప్పు, ఇదింక పూలెట్లా పూస్తుంది?' అనడిగాడు.

మహావీరుడు ఏమీ మాట్లాడలేదు. చిరుమందహాసం చేసి ఊరు కున్నాడు. వాళ్ళిద్దరూ ఆ ఊరు దాటి తాము వెళ్ళవలసిన చోటకి నడక కొనసాగించారు. ఈలోపు వాన పడటం మొదలయ్యింది. కుంభవృష్టిగా మారిపోయింది. దాంతో వాళ్ళు వెళ్ళినచోట ఒక్కరోజు ఉండాలనుకున్నవాళ్ళు వారంరోజుల పాటు ఉండిపోవలసి వచ్చింది. వాన తగ్గాక, వారం రోజుల తర్వాత వాళ్ళు వచ్చిన దారినే తిరుగు ప్రయాణమయ్యారు. ఆ దారమ్మట, వాళ్ళంతకు ముందు ఆ మొక్కదగ్గర ఆగిన చోటకే మళ్ళా చేరుకున్నారు. అక్కడ ఊడబెరికి పక్కన పారేసిన మొక్క నిటారుగా నిలబడి ఉంది. దాని ఆకులమధ్య ఎర్రని పువ్వొకటి నిండారా వికసించి తళుకులీనుతూ ఉంది.

ఆ మొక్కని, ఆ పువ్వుని చూస్తూ గోశాలకుడు నివ్వెరపోయాడు. 'నమ్మలేకుండా ఉన్నాను. నేనే కదా, ఈ మొక్కని వేళ్ళకంటా పెకలించేసింది. ఇది మళ్ళా ఎట్లా వేళ్ళూనగలిగింది? ఇది పూలు పూసేదాకా బతుకుతుందని నువ్వు చెప్పిన జోస్యం ఎట్లా ఫలించింది?' అనడిగాడు మహావీరుణ్ణి.

మహావీరుడు అతడితో ఇట్లా చెప్పాడు:

'అందుకనే నేనా రోజు ఆ మొక్క దగ్గర ఆగి పరీక్షగా చూసింది. నేనా రోజు దాని అంతస్సత్త్వం ఏ మేరకు బలంగా ఉందో పరీక్షించడానికే దాని జీవం లోపలకంటా చూసాను. అది బతకాలని కోరుకుంటోందా లేక చనిపోవాలనుకుంటోందా అని చూసాను. అది చనిపోవాలనుకుని ఉంటే, నువ్వు దాన్ని ఊడబెరికినప్పుడే చచ్చిపోయి ఉండేది. అదట్లా చచ్చిపోడానికి నువ్వు సాయం కూడా చేసావు కదా!

నువ్వు నన్నా ప్రశ్న అడిగినప్పుడు, నువ్వు దాన్ని మృత్యుమార్గంలోకి నెడతావనే నేనూహించాను. కాని ఆ మొక్కకి బతకాలన్న కోరిక చాలా ప్రగాఢంగా ఉంది, కాబట్టే

అది మరణం అంచులనుంచి వెనక్కు వచ్చింది. వాననీటికి కొట్టుకొచ్చిన మట్టి దాని వేళ్ళచుట్టూ పోగవడంతో అది మళ్ళా బలం పుంజుకుని పైకి లేచింది, వేళ్ళూనుకుని పువ్వు పూసింది.'

'అది ఆ మొక్క అంతస్సత్త్వం. దాని లోపలి బలం.'

17-5-2019

సత్యాన్ని దర్శించిన ధైర్యం

చిత్రకొండ గంగాధర్‌ని ఒకటి రెండు సార్లు కలిసి ఉంటాను. అది కూడా పాతికేళ్ళ కిందట. 95-96 మధ్యకాలంలో, హైదరాబాదులో, సి.వి.కృష్ణారావు గారి 'నెలనెలా వెన్నెల' సమావేశాల్లో. అప్పట్లో అతడి కవితలు 'వార్త' సాహిత్యానుబంధంలో వస్తుండేవి. చాలా సాంద్రమైన అనుభూతి కనిపిస్తుండేది వాటిలో. అతడు హైకూలు కూడా రాస్తుండేవాడని గుర్తు.

రెండేళ్ళ కిందట, ఒక సాయంకాలం, అతడి కవిత్వసంపుటి ఆవిష్కరణ సభకి వెళ్ళినప్పుడు తెలిసింది. అతడు 2011 లో ఆత్మహత్య చేసుకున్నాడని. అది కూడా ఏదో క్షణికోద్రేకంలోనో, లేదా భరించలేని ఏదో ప్రేమవల్లనో లేదా మనం గుర్తుపట్టగల ఏ దుఃఖంలోనో కాదు. ఎంతో చిత్తశుద్ధితోనూ, దృఢసంకల్పంతోనూ తనని తాను అదృశ్యం చేసుకున్నాడని తెలిసింది.

శ్రీకాకుళం జిల్లాలో కాశీబుగ్గ దగ్గర తన స్వగ్రామం బొడ్డపాడులో, తాను చిన్నప్పణ్ణుంచీ ఏ చెరువుని చూస్తూ గడిపాడో, ఆ చెరువు దగ్గర, ఒక పక్కగా తన చెప్పులు విడిచి, వాటికింద ఒక చీటీ పెట్టి, ఆ చెరువులోకి నడిచివెళ్ళిపోయేడట. 'బొడ్డపాడు లో జన్మించడం అదృష్టంగా భావిస్తున్నాను, గర్వపడుతున్నాను, నా మరణానికి నేనే బాధ్యుడను' అని రాసి ఉందట ఆ చీటీలో.

అతడట్లా అదృశ్యమైపోయిన ఆరేడేళ్ళకిగాని, ఆ సంగతి తక్కిన సాహిత్య ప్రపంచానికి తెలియలేదు. అది కూడా అతడి సన్నిహిత మిత్రుడు అజయప్రసాద్ ఎన్నో ఏళ్ళు అతడి నుంచి ఎప్పుడన్నా కనీసం ఒక ఫోను కాలైయినా వస్తుందేమోనని ఎంతో నిరీక్షణలో గడిపేక. అతడు ఈ లోకం నుంచి నిష్క్రమించిన ఏడేళ్ళ తరువాత అతడి కవిత్వాన్ని

ప్రేమలేఖ ప్రచురణవారు 'ఆత్మహత్యాసదృశ్య దేశద్రిమ్మరి ఆఖరికోరిక' పేరిట ప్రచురించారు. ఆ పుస్తకావిష్కరణ సభకే నేను వెళ్ళింది.

భారతీయసాహిత్యంలోగాని, తెలుగుసాహిత్య సంప్రదాయంలోగాని, కవులంటే దీర్ఘాయుష్మంతులనే మనం భావిస్తూ ఉంటాం. దీర్ఘకాలం జీవించడమే కాదు, కవులు, ఈ లోకంలో, సన్మానాలకీ, సత్కారాలకీ నోచుకోవాలని కూడా ఆశపడుతుంటారు. మామూలుగా మనుషులకుండే జీవితేచ్ఛకన్నా కవుల జీవితేచ్ఛ మరింత బలంగా కనిపిస్తుంటుంది, వినిపిస్తుంటుంది కూడా.

కవి అనగానే మనకు ఒక టాగోరులాగా పండుగెడ్డంతో ఋషి సదృశుడిగా ఉండే స్ఫురద్రూపమే కళ్ళముందు కనిపిస్తూ ఉంటుంది. అంతే తప్ప, అల్పాయుష్కులూ, అకాలంగా మరణించినవాళ్ళూ మనకవుల్లో మనకి ఎవరూ పెద్దగా కనిపించరు. చివరికి తిలక్ కూడా నలభై అయిదేళ్ళు జీవించాడు. అప్పటికి కూడా శ్రీశ్రీ అతణ్ణి 'లోకబాల్య తిలక్' అనే సంబోధించేడు.

ఇరవయ్యేళ్ళవయసులోనో లేదా ముప్ఫైఏళ్ళు నిండకుండానో మరణించిన కవులు తెలుగులో, ఈ క్షణానికి, నాకెవరూ గుర్తు రావడం లేదు. తన యవ్వనంలోనే ఇల్లు విడిచివెళ్ళిపోయిన కవులు ఇద్దరున్నారు. ఒకరు, ముందు తరం కవుల్లో, కొడవటిగంటి కుటుంబరావుగారి సోదరుడు కొడవటిగంటి వెంకటసుబ్బయ్య. మరొకరు నా ఆత్మీయుడు, మా రాజమండ్రి మిత్రుడు, కవులూరి గోపీచంద్.

కాని యూరపియను సాహిత్యంలోనూ, ప్రపంచ సాహిత్యంలోనూ అర్థాంతరంగా మరణించిన కవులు చాలామందే ఉన్నారు. యుద్ధక్షేత్రంలో మరణించిన రూపర్ట్ బ్రూకులు, కాన్‌సెంట్రేషను కాంపుల్లో మరణించిన ఓసిప్ మెండెల్ స్టాములు, క్షయవ్యాధి తినేసిన జాన్‌కీట్సులు, ఫ్రాంజ్‌కాఫ్కాలు, మాదకద్రవ్యాలు తినేసిన జార్జిట్రాకలులు, ఆత్మాభిమానం కోసం ద్వంద్వయుద్ధానికి పాల్పడి ప్రాణాలు వదిలిన పుష్కిను, లెర్మొంటోవులు మనకి ఎందరో కనిపిస్తారు.

వాళ్ళల్లో ఆత్మహత్య చేసుకుని మరణించిన కవులు మరింత ప్రత్యేకంగా కనిపిస్తారు. రొమాంటిసిస్టులకి ఆరాధ్యనాయకుడైన థామస్ ఛాటర్‌టను, రష్యను విప్లవ ప్రవక్త మయకోవస్కీ, ఇటాలియను కవి చెసారే పావేసు, అమెరికను కవి జాన్ బెర్రీమెనులాంటి వారు చాలామంది ఉన్నారు. అలా అర్థాంతరంగానూ, నిండు జీవితం వికసించకుండానే మొగ్గలోనే తుంచేసుకుని వెళ్ళిపోయిన కవుల పట్ల పాశ్చాత్యసమాజం ప్రత్యేకమైన శ్రద్ధ

కనపరుస్తుంది. మనం చూడలేకపోతున్న ఏ సత్యమో వాళ్ళు చూసారనీ, అదేమిటో మనకి పూర్తిగా వివరించకుండానే వెళ్ళిపోయారనీ భావిస్తుంది.

వారు మరణించిన తర్వాత వాళ్ళు రాసిన ప్రతి ఒక్క కాగితం, వాడుకున్న ప్రతి ఒక్క వస్తువు, కొట్టివేతల్తో ఉన్న ప్రతి ఒక్క చిత్తుప్రతి కూడా అపారమైన విలువని సంతరించుకుంటాయి. ఆ కవులు నెమ్మదిగా cult figures గా రూపొందుతారు. మామూలు జీవితాల్లో మనం నిత్యం పడే రాజీల నుంచి, ఆత్మవంచనలనుంచి బయటపడ్డ విముక్త మానవులుగా వారు కనిపించడం మొదలు పెడతారు. కొన్నాళ్ళకు విమర్శకులు వాళ్ళని visionaries అని శ్లాఘించడం మొదలు పెడతారు.

అలా అర్థాంతరంగా ఆత్మహత్య చేసుకోగలిన కవులు తదనంతర కవులకి ఆరాధనీయులుగా మారడంలో కూడా ఆశ్చర్యం లేదు. ఒకప్పుడు ఫ్రాన్సులో జెరార్డు.డి. నెర్వాలు అనే డార్క్ రొమాంటిసిస్టు కవి ఉండేవాడు. అతడి గురించి తలుచుకుంటూ శ్రీ శ్రీ ఇలా రాసాడు:

> ఈ వ్యాసం రాస్తున్న సమయంలో నా అభిమాన రచయిత జెరార్డ్ డి నెవాల్. ఆయన అభిమాన జంతువొక పీత. దానికొక సిల్కుదారం కట్టి ఎప్పుడూ తనవెంట తిప్పుకునేవాడు. తాను రాసుకునేటప్పుడు అది కుక్కలాగా పిల్లిలాగా ఏమీ అల్లరి పెట్టదనేవాడు. అందుకు అదంటే అంత ఇష్టం. 'ఇట్ ఈజ్ ఏ స్మాల్ సైలంట్ బీస్ట్ దట్ నోస్ ది సీక్రెట్స్ ఆఫ్ ద డీప్' అని తన పీత గురించి అన్నాడు. 'సముద్రగర్భ రహస్యాలు దీనికి తెలుసు, కాని ఎవ్వరికీ చెప్పదు. అదీ దాని గొప్పదనం'. .. నెర్వాల్ హాస్యప్రియుడు. అందరినీ వేళాకోళం చేసేవాడు. అతడు చేసిన ఆఖరి వేళాకోళపు పని పారిస్ నగరం లోని ఒకానొక నిర్మానుష్యమైన సందులో లాంతరు స్తంభానికి ఉరిపోసుకుని మరణించడం. నెర్వాల్‌నే కాదు, ఎవరినీ నేను అనుకరించలేను.' (శ్రీశ్రీ ప్రస్థానత్రయం, కదంబం, పే.108)

ఇప్పుడు చిత్రకొండ గంగాధర్‌ని తలుచుకున్నప్పుడు ఈ కవులంతా జ్ఞప్తికి రావడం సహజం. కాని, మరణం ఈ కవులకి వచ్చిన ప్రకాస్తికి గంగాధర్ ఇంకా నోచుకోలేదు. రెండేళ్ళ కిందటనే అతడి కవిత్వం నా చేతుల్లోకి వచ్చినప్పటికీ, అతడు తన జీవితం ద్వారానూ, మరణం ద్వారానూ కూడా ఎలుగెత్తి చాటవలసిన కవి అని తెలుస్తున్నప్పటికీ నేనిన్నాళ్ళూ మౌనంగానే ఉండిపోయేను.

మొన్న సాయంకాలం విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటి వారు ఏర్పాటు చేసిన సమావేశానికి అనుకోకుండా నేను వెళ్ళవలసి వచ్చింది. చిత్రకొండ గంగాధర్ రాసిన 'మృతనగరంలో' అనే నవల ఆవిష్కరణ సభ అది. పల్లవి పబ్లికేషన్సు వెంకట నారాయణగారు ప్రచురించిన ఆ నవలని ఆవిష్కరించే బాధ్యత నాకు అప్పగించారు. ఆ సభకి అనిల్ డ్యానీ అధ్యక్షత వహిస్తే, కాకుమాని శ్రీనివాసరావు పుస్తక పరిచయం చేసారు. అప్పుడు అర్థమయింది నాకు, ఆ కవి నన్ను వెన్నాడుతూనే ఉన్నాడని.

నిన్న రాత్రి ఆ నవల పూర్తిగా చదివాను. అది మామూలు రచన కాదు. ఇప్పటికి తెలుగుసాహిత్యం ఏకకాలంలో పూర్తిగా modernize అయిందనీ, postmodernize కూడా అయిందనీ చెప్పవచ్చు.

పాశ్చాత్య సాహిత్యంలో ఇలియటు, జాయిసు వంటి రచయితలతో మొదలైన మాడర్నిజం తెలుగులో శ్రీశ్రీ, బైరాగి, అజంతాలతో కొంతమేరకు మాత్రమే మాడర్నైజు కాగలిగింది. ఇక డొనాల్డ్ బార్తెల్మి, ఇటాలో కాల్వినో, కార్లోస్ ఫ్యుయెంటిసు, జూలియో కోర్టజారు వంటి రచయితలతో వికసించిన పోస్ట్ మాడర్నిజం తెలుగు సాహిత్యానికి ఇంతదాకా పరిచయమే కాలేదు.

ఆ రెండు ధోరణులనీ పూర్తిగా పుణికి పుచ్చుకున్న నవల 'మృతనగరంలో.' తన మరణానంతరం వెలువడిన ఈ నవలతో గంగాధర్ తనకు తెలియకుండానే తెలుగు భాషను రాత్రికి రాత్రి ఆత్యాధునిక ప్రపంచభాషగా మార్చేసాడు.

తాను ఏ సత్యాన్ని దర్శించిన ధైర్యంతో అంత దృఢనిశ్చయంతో గంగాధర్ ఆ చెరువులోకి అడుగుపెట్టగలిగాడు? ఆ రోజు నవలని పరిచయం చేస్తూ శ్రీనివాసరావు చెప్పిందేమంటే, నవల్లో ప్రధానపాత్ర ఇకారస్ నవలమొదలవుతూనే ఒక చెరువులోంచి బయటకి వస్తాడు, బహుశా గంగాధర్ తాను ఆ చెరువులో అడుగుపెట్టిన తరువాత, తిరిగి ఇకారస్ లాగా బయటకి వస్తానని భావించి ఉండవచ్చు అని.

అయి ఉండవచ్చు. మనమంతా ఈ లోకంలో ఉన్నాం గాని, మన ఆత్మవంచనలవల్ల మనం మరణించినవాళ్ళకిందే లెక్క. అతడు మరణించినప్పటికీ, తన సత్యసంధత వల్ల, జీవించి ఉన్నట్టే.

శ్రీనివాసరావు మరొక మాట కూడా అన్నాడు. 'ఈ పుస్తకావిష్కరణ ఆ బొడ్డపాడు చెరువు దగ్గర జరుపుకోవాలని ఉంది. ఆ చెరువుని చిత్రకొండ గంగాధర్ చెరువు అని పిలవాలని ఉంది' అని. యూరోపులో అయితే ఈ పాటికి ఆ రెండూ జరిగి ఉండేవి.

ఆ పుస్తక ఆవిష్కరణ సభలో అనిల్ డ్యానీ 'అసమర్థుని జీవయాత్ర'ని గుర్తు చేసాడు. ఆయన మరొక మాట కూడా అన్నాడు. ఆ నవల చదువుతుంటే, దుస్తుల షాపులో మనం ట్రయలురూంలోకి వెళ్ళి మనకి సరిపోయే దుస్తులేవో పరీక్షించి చూసుకునేటట్టుగా అనిపిస్తుందని. 'మృతనగరంలో' చదవండి. అది మనల్ని చెప్పలేనంత అశాంతికి గురిచేస్తుంది. నా పదిహేడేళ్ళ వయసులో గుంటూరు బస్టాండులో 'అసమర్థుని జీవయాత్ర' కొనుక్కుని నాగార్జునసాగరు వెళ్ళే దారిలోనే చదవడం పూర్తిచేసేసిన రోజు గుర్తొచ్చింది. ఈ పుస్తకం వల్ల ఇన్నాళ్ళకు మళ్ళా ఆనాటి నాలోని ఆ స్వచ్ఛమానవుణ్ణి గుర్తుపట్టగలిగాను. ఈ పుస్తకం చదివితే మీరు కూడా మీలోని నిర్మలమానవుణ్ణి గుర్తుపట్టగలుగుతారు.

21-11-2020

సరిహద్దులు దాటిన సాంగత్యం

మహువా మొయిత్ర పార్లమెంటు సభ్యురాలు. గణితంలోనూ, ఆర్థికశాస్త్రంలోనూ అత్యున్నతవిద్యనభ్యసించారు. స్కాండినేవియను విద్యావ్యవస్థను ఎంతో దగ్గరగా పరిశీలించారు. కానీ ఇవేవీ ఆమెకి సంస్కారాన్ని నేర్పలేదు. ఈ మధ్య శివలింగం గురించిన వివాదంలో ఆమె తన హీనమైన అభిరుచిని చాటుకుంటూ ఒక అసభ్యకరమైన కార్టూన్ను సోషలు మీడియాలో పంచుకున్నారు.

నూపుర్ శర్మ కూడా నిరక్షరాస్యురాలు కాదు. ఆర్థికశాస్త్రంలో ఉన్నతవిద్యతో పాటు న్యాయశాస్త్రాన్ని కూడా అభ్యసించింది. ఆమెకి రాజ్యాంగం గురించీ, రాజ్యాంగ విలువల గురించీ, ఏ జాతీయోద్యమ స్ఫూర్తితో రాజ్యాంగం రూపొందిందో తెలియకుండా ఉంటుందని ఎట్లా అనుకోగలం? కాని ఆ చదువేదీ ఆమె సంస్కారహీనత్వాన్ని దాచలేక పోయింది. ప్రవక్త మహమ్మద్ పైన చిల్లరవ్యాఖ్యలు చేసి తన సొంత పార్టీతోటే 'చిల్లర గొంతు' అనిపించుకుంది.

దేశవిదేశాల్లో ఉన్నతవిద్యని అభ్యసించి, జీవితమూ, సమాజమూ తమకి అందించిన ఉన్నతస్థానాల్లో ఉన్న ఈ ఇద్దరు రాజకీయనాయకులూ సంస్కారశూన్యులుగా ప్రవర్తించ–డానికి కారణం ఏమిటి? రాజకీయ ప్రయోజనాలు. తాము ఉన్న స్థానం నుంచి రాజకీయంగా మరింత ఉన్నతస్థానానికి ఎగబాకాలన్న ఆతృత.

నూటయాభై ఏళ్ళ కిందట ఇంగ్లిషు వాళ్ళు ఈ దేశంలో ఆధునికవిద్యని ప్రవేశపెట్టి–నప్పుడు భారతీయులు ఆ విద్యద్వారా ప్రపంచాన్ని అవగాహన చేసుకుంటారనీ, సైన్సు, ఆధునిక రాజనీతి నేర్చుకుంటారని, తాము నేర్చుకున్నదాన్ని తిరిగి తమ దేశభాషల్లో తమ ప్రజలకి అందచేస్తారనీ భావించారు. కాని అలా చదువుకోవడం మొదలుపెట్టగానే అప్పటిదాకా భారతీయులుగా ఉన్నవాళ్ళు హిందువులుగా, ముస్లిములుగా విడిపోయారు.

ఇండియను సివిలు సర్వీసులో మరిన్ని సీట్లకోసం, వైస్రాయి ఎగ్జిక్యూటివు కౌన్సిల్లో మరింత చోటుకోసం ఒకరితో ఒకరు కలహించుకోవడం మొదలుపెట్టి చివరికి ఈ దేశాన్ని రెండు దేశాలుగా, మూడు ముక్కలుగా చీల్చేసారు. ఆ పుండు ఇప్పటికీ చల్లారలేదు.

గడచిన చరిత్రనుంచి ఏమీ నేర్చుకోకపోగా, ఈ ఉన్నత విద్యావంతులు, ఈ అధికార ప్రతినిధులు మరింత నిస్సిగ్గుగా, నిర్లజ్జగా, నిస్సంకోచంగా టెలివిజను ఛానెళ్ళలో, ట్విట్టర్లో, అన్నిరకాల సోషలు మీడియాలో విషం కక్కుతూ, విద్వేషం రగిలిస్తూ, మనుషుల మధ్య కొత్త సరిహద్దురేఖలు గీస్తూ ఉండగా, మరొక వైపు ఇద్దరు మహిళలు ఎంతో ఓర్పుగా, ఓపిగ్గా, ప్రేమతో, ఆవేదనతో, కన్నీళ్ళతో, తమ కన్నీళ్ళను ఆపుకోడానికి నవ్వుతో, ఆ గీతల్ని చెరుపుకుంటూ వస్తున్నారు. ఒకరు గీతాంజలి శ్రీ, 'రేత్ కీ సమాధి' అనే నవలా రచయిత్రి. మరొకరు ఆ నవలను ఇంగ్లిషులోకి అనువదించిన డైసీ రాక్‌వెల్, అమెరికను అనువాదకురాలు. ఒకప్పుడు ఈ దేశంలో జాతీయ నాయకులు రచయితలకు స్ఫూర్తిగా ఉండేవారు. ఇప్పుడు ఈ దేశస్ఫూర్తిని రాజకీయనాయకులు మంట కలుపుతున్న సమయంలో, ఇదిగో, ఇటువంటి రచయిత్రులు, అనువాదకులు, ఈ రాజకీయ నాయకులు మాట్లాడుతున్న మాటలు ఈ దేశప్రజల మాటలు కావనీ, ఈ దేశప్రజలు సరిహద్దుల్ని కోరుకోవడం లేదనీ, సరిహద్దుల్ని దాటిన సాంగత్యాన్ని కోరుకుంటున్నారనీ ఎలుగెత్తి చాటుతున్నారు.

ఉదాహరణకి, Tomb of Sand లో ఈ వాక్యాలు (పే.652-53) చూడండి:

> సరిహద్దు మూసెయ్యదు. తెరిచిపెడుతుంది. అదొక ఆకృతిని రూపొందిస్తుంది. అంచుల్ని అలంకరిస్తుంది. .. సరిహద్దు అంటే ఏమిటి? అది వ్యక్తిత్వాల్ని ఇనుమడింపచేస్తుంది. బలపరుస్తుంది. అది చించి పోగులుపెట్టదు. అందుకు బదులుగా గుర్తింపునిస్తుంది. ఆ అంచు దగ్గర రెండంచులూ కలిసి వికసిస్తాయి. వారి సమావేశాన్ని సరిహద్దు వెలిగిస్తుంది. ..
>
> గాడిదలారా! సరిహద్దు అంటే ఆపేది కాదురా. అది రెండు విభాగాల్ని కలిపే వంతెన. రాత్రికీ, పగటికీ మధ్య; జీవితానికీ, మృత్యువుకీ మధ్య; కనుక్కోడానికీ, కోల్పోడానికీ మధ్య ఒక వంతెన. ఆ రెండూ ఎప్పుడూ కలిసే ఉంటాయి. వాటిని నువ్వు విడదియ్యలేవు. సరిహద్దు అంటే దిగంతం. రెండు ప్రపంచాలు కలుసుకునే తావు. రెండు ప్రపంచాల ఆలింగనం.

సరిహద్దు అంటే ప్రేమ. ప్రేమ కైదుల్ని సృష్టించదు. మన దారిలో ఎదురయ్యే ఆటంకాల్ని పక్కకు విసిరి పడేస్తుంది. సరిహద్దు అంటే ఒక సమావేశ రేఖ. ఆ భాగాన్నీ, ఈ భాగాన్నీ కలిపి అదొక సుందరాకృతిని రూపొందిస్తుంది. ఇద్దరు కలిస్తే ఏర్పడేదే సరిహద్దు. అదొక కూడలి. కూడలసంగమం.

సరిహద్దు ఒక ఖేల. సంతోషకరమైన ఆట. ఒక గీతగీస్తారు. అప్పుడు అటూ ఇటూ ఉన్నవారిద్దరూ తొక్కుడు బిళ్ళ ఆడుకోవడం మొదలుపెడతారు. గెంతు, గెంతు అని అరుస్తారు. ఒక తాడు కట్టి వేలాడదియ్యండి, ఉయ్యేలవుతుంది. అప్పుడు అటూ ఇటూ ఊగడం మొదలుపెడతారు. అటూ ఇటూ రెండువైపులా జారతారు. తీగ మీద క్రీడాకారుడు నడుస్తాడే, అటూ ఇటూ ఊగుతూ రెండు వైపులా, అలా అన్నమాట. పట్టలేనంత సంతోషంగా కేరింతలు కొట్టడం. ఆడుకోవడం. నవ్వుకోవడం, మళ్ళీ ఆడుకోవడం. ముందు మా వంతు. అప్పుడు మీ వంతు. బంతి విసరండి. అది బాటుకి తగులుతుంది. అప్పుడు బౌండరీ మీంచి ఎగురుతుంది. చక్కా! నువ్వు సిక్సరు కొట్టావు! ఆ బంతి సరిహద్దుని తాకనివ్వండి. చక్కా! నాలుగు పరుగులు తీసినట్టు! ప్రతి ఒక్కరూ తుళ్ళిపడతారు. అబ్బా! ఆట ఎంత బాగా నడుస్తోంది!

ఆ బౌండరీ చుట్టూ ఎంత సరదా. పాటలు పాడండి, నాట్యం చెయ్యండి, కవిత్వం చదువుకోండి, దాన్ని మరింత సౌందర్యభరితం చెయ్యండి. అనంతం వైపుగా సాగిపొండి. నిర్భయంగా సాగిపొండి. అంచులదాకా ప్రయాణించండి. అంచు, అది పటానికి అంచు. కాని దానికి అతుక్కుపోకండి. ముందుకు పయనించండి, మరింత ముందుకు. భయరహితులుగా, గంభీరమైన, ప్రేమా–స్పదమైన బృందంగా మారండి. కంటికి కనబడని ఒక తాటికి రెండు కొసలా నిలబడ్డట్టుగా టగ్ ఆఫ్ వార్ లాగించండి. మరింతగా, మరింతగా, కాని పట్టు తప్పకండి, విడిపోకండి, తెగిపోకండి. అటువైపుకు జరగండి.

పెద్దమనుషులారా, సరిహద్దు ఉన్నదే దాటడానికి.

సరిహద్దు నిన్ను గెంతమంటుంది. తనని దాటమంటూ నిన్ను కవ్విస్తుంది. రా, వెనక్కి రా, గెంతు, ఆడు, చిరునవ్వు, స్వాగతం, కలుసుకో, పలకరించుకో, కొత్త సంతోషం సృష్టించుకో.

> సరిహద్దు దాటడంలో గొప్ప మజా ఉంది. అక్కడ నిరంతరం ఆదానప్రదానాలు కొనసాగుతూ ఉంటాయి. సరిహద్దు ఉన్నదే ఒకరితో ఒకర్ని కలపడానికి. ఒకరున్నారంటే రెండోవారూ ఉన్నట్టే. అది ప్రేమతో కలిపే గీత. ..

ఇలా పుస్తకం మొత్తం తెలుగుచేసి చూపించాలని ఉంది. 732 పేజీలు. ఈ పుస్తకానికి ఇంటర్నేషనలు బుకర్ ప్రైజు ఎందుకిచ్చారో తెలుసుకోడానికి చదివాను. అక్షరం, అక్షరం, వాక్యం, వాక్యం చదివాను. ఒక బాధ్యతగా చదివాను. ఒక నవలగా ఈ రచన ఇచ్చిన ఆనందం కన్నా, ఒక సంక్షుభిత కాలంలో, సంస్కారహీనులైన రాజకీయనేతలు మాట్లాడే మాటల మధ్య ఈ రచన ఇచ్చిన మనోధైర్యం వెలకట్టలేనిది. ఈ దేశం పట్ల, ఈ దేశ సంస్కారం పట్ల, ఈ దేశ రాజ్యాంగస్ఫూర్తి పట్ల నా నమ్మకం మరోసారి నిలబడింది.

ఎందుకంటే, నేను హిందువుని, ముస్లింని కూడా. ఇంకా చెప్పాలంటే, నేను హిందువునీ కాను, ముస్లింనీ కాను. భారతీయుణ్ణి. నాది కబీరు దారి. 'సరిహద్దులెరగని జగజ్జనులారా! మానవుడే నా సంగీతం, మనుష్యుడే నా సందేశం' అని నినదించిన మహాకవుల దారి.

మహూవా మొయిత్రలు, నూపుర్ శర్మలు కాదు, ఈ దేశానికి మరింతమంది గీతాంజలిశ్రీలు కావాలి, తెలుగుతో సహా, అన్ని భాషల్లోనూ కావాలి.

8-6-2022

విలువైన కథ

నాలుగేళ్ళ కిందట గౌహతి వెళ్ళినప్పుడు ఈశాన్యరాష్ట్రాల సాహిత్యం కొంత కొనుక్కున్నాను. అందులో నాగాలాండుకి చెందిన Eastern Kire అనే ఆమె రాసిన Sky is My Father: A Naga Village Remembered (2018) నవల కూడా ఒకటి. అది ఇంగ్లిషులో వెలువడ్డ మొదటి నాగా నవల. చిన్న నవల. కానీ విలువైన కథ, ఎంతో విలువైన చారిత్రిక చిత్రణ.

1826 లో ఈస్టిండియా కంపెనీకీ, బర్మా రాజుకీ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం అస్సాం, మణిపూరులతో సహా ఈశాన్యభూభాగం కంపెనీ ఆధీనంలోకి వచ్చింది, మన రాయలసీమలాగా. అప్పణ్ణుంచీ బ్రిటిషువాళ్ళకీ, నాగా గిరిజనులకీ మధ్య నిరంతరం యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి. 1832 లో నాగా కొండల్లోకి కంపెనీ సైన్యాలు అడుగుపెట్టడంతో మొదలైన ఆ పోరు దాదాపుగా పందొమ్మిదో శతాబ్దం పొడుగునా కొనసాగుతూనే వచ్చింది. అందులో, 1879 లో, నాగా కొండల్లోని ఖొనొమొ అనే గిరిజన గ్రామానికీ, బ్రిటిషు సైన్యాలకీ మధ్య భీకరమైన పోరాటం జరిగింది.

ఆ యుద్ధంలో మణిపూరు నుండి, డిబ్రూఘరు నుండి, సిబ్సఘరు నుండి, ఢాకానుండి పెద్ద సంఖ్యలో ఏనుగులు, గుర్రాలు, కాల్బలం, తుపాకులు, ఫిరంగులతో బ్రిటిషుసైన్యాలు పట్టుమని 300 మంది కూడా లేని ఖొనొమొ గిరిజన గ్రామం మీద దండెత్తాయి. ఆ యుద్ధం బ్రిటిషు వారికి ఎంత ముఖ్యమైపోయిందంటే, చివరికి, ఆఫ్గను యుద్ధానికి పంపవలసిన సైన్యాన్ని కూడా ఆ చిన్న గిరిజనగ్రామం మీదకి మోహరించారు. కాని, నాలుగు నెలల ముట్టడి తర్వాత కూడా, 500 మంది సైనికుల్ని పోగొట్టుకుని కూడా, బ్రిటిషువాళ్ళు ఆ చిన్న అంగామీ గ్రామాన్ని వశపర్చుకోలేకపోయారు. చివరికి 1880 మార్చిలో, గిరిజనులకీ, బ్రిటిషువారికీ మధ్య మౌఖికంగా ఒక సంధి కుదిరింది. ఆ సంధి

ఒకరకంగా కాల్పుల విరమణ కోసమే చేసుకున్నారా అన్నట్టుగా, అనతికాలంలోనే బ్రిటిషు వాళ్ళు ఆ గ్రామాన్ని నేలమట్టం చేసారుగాని, ఏడాది గడిచేలోపే తిరిగి గిరిజనులు తమ గ్రామన్ని మళ్ళా పునర్నించుకోగలిగేరు.

దాదాపు అరవై ఏళ్ళ పాటు అంగామీ గిరిజనులతో పోరాడి వారిని తుపాకులతో లొంగదియ్యలేమని తెలిసిన తర్వాత, అమెరికన్ బాప్టిస్టు చర్చి మిషనరీలు బైబిలు సువార్తల ద్వారా వారి మనసు గెలుచుకోగలిగేరు. ఏళ్ళ తరబడి ఆ గ్రామాల్లో పాఠశాలలు, వైద్యశిబిరాలు నిర్వహించి, 1930 నాటికి, ఆ గ్రామాలనుంచి ఎందరో డాక్టర్లనీ, శాస్త్రవేత్తల్నీ, సంగీతకారుల్నీ తయారు చెయ్యగలిగారు. నేడు అటువంటి ఒక గ్రామం నుంచి ఒక అంగామీ మహిళ చదువుకుని తమ జాతి కథని ఇలా ఇంగ్లిషులో చెప్పడం వెనక, ఒక శతాబ్దం పాటు ఆ మిషనరీలు చేసిన నిరుపమానమైన కృషి ఉందని నిస్సంకోచంగా చెప్పవచ్చు.

1879-1880 మధ్యకాలంలో ఖొనొమో ముట్టడి, చివరికి బ్రిటిషువారికి, అంగామీ గిరిజనులకి మధ్య కుదిరిన ఒప్పందం, ఆ తర్వాత, మొదటి నాగా బాప్తిస్మం పొందడం ఈ నవలకి నేపథ్యం. ఆ కల్లోల కాలంలో ఒక అంగామీ గిరిజన కుటుంబం చుట్టూ ఆమె తన కథ అల్లింది. లెవి అనే గిరిజనయోధుడు, అతడి భార్య పెనొ, అతడి పెద్దకొడుకు రొకొఖొటొ, అతడి చిన్న కొడుకు సటొ ఈ కథలో ప్రధాన పాత్రలు. బ్రిటిషువారికి తలవంచని పోరాటం చేసిన లెవి తన చిన్నకొడుకు క్రైస్తవం పట్ల ఆకర్షితుడు కావడంతో చెప్పలేని సంఘర్షణకు లోనవుతాడు. ఆ తండ్రీ, కొడుకుల మధ్య సంఘర్షణ నిజానికి, గిరిజన ఆరాధనాపద్ధతులకీ, క్రైస్తవమతానికీ మధ్య సంఘర్షణ. సాంప్రదాయిక ఆరాధనలూ, విశ్వాసాలూ, సాంఘిక విధినిషేధాలతో కూడిన ప్రాచీన గిరిజనమతాన్ని వదిలిపెట్టి శాంతి, క్షమలతో కూడిన క్రైస్తవం వైపు నెమ్మదిగా ఒకరూ ఒకరూ గిరిజనులు మొగ్గుతూ ఉండటంతో కథ ముగుస్తుంది.

నైజీరియాకు చెందిన సుప్రసిద్ధ ఆఫ్రికను రచయిత చినువా అచెబె రాసిన Arrow of God (1964) లో కూడా ఇటువంటి సంఘర్షణనే చిత్రితమైంది. కాని ఈ నవలా రచయిత్రి, ఎటువంటి ప్రభావాలూ కనిపించని విధంగా, తన జాతికథని చాలా కొత్తగా, నేర్పుగా, స్థిమితంగా చెప్పగలగడం నన్ను ఆశ్చర్యపరిచింది. ఇటువంటి సంఘర్షణ మన గిరిజన ప్రాంతాల్లో కూడా నేడు కనిపిస్తున్నది. ముఖ్యంగా, సీతంపేట ప్రాంతానికి చెందిన సవర జీవితాల్లో ప్రాచీన సవర ఆరాధనాపద్ధతులకీ, క్రైస్తవానికీ మధ్య ఒక సైద్ధాంతిక సంఘర్షణ నడుస్తూ ఉన్నది. కొన్నేళ్ళ కిందట అత్యధిక సంఖ్యలో సవరలు

క్రైస్తవం వైపు మళ్ళిపోయారు. దాంతో సవర ఆరాధనా పద్ధతుల్లో, ఒక Reformation ఉద్యమం లాంటిది మొదలయ్యింది. 'అక్షర బ్రహ్మ' లేదా 'మడిబ్రహ్మ' ఉద్యమం, పురాతన సవర కర్మకాండనీ, ఆచారవ్యవహారాల్నీ సంస్కరించి, క్రైస్తవంలో చేరిన సవరలను తిరిగి సవర దేవతలవైపు, పితృదేవతల వైపు మరల్చడానికి ప్రయత్నిస్తూ ఉంది. ఆ సంఘర్షణని కనీసం ఒక కథగా కూడా ఏ రచయితా ఇప్పటిదాకా చెప్పలేదు. కానీ, ఈ అంగామీ రచయిత్రిలాగా, ఒక సవరయువకుడో, యువతినో, తమ జాతికథను ఒక నవలగా రాస్తే ఎంత బాగుంటుంది!

ఈ చిన్ననవలలో అంగామీ జీవనసంస్కృతి లోని ముఖ్య పార్శ్వాల్నీ, పుట్టుక, పెళ్ళి, మరణం, యుద్ధం, శాంతి వంటి జీవనసందర్భాల్నీ రచయిత్రి ఐతిహాసిక ప్రమాణాల్తో చిత్రించారు. నవలకు అనుబంధంగా నలుగురు గిరిజనులు తమ తెగల గురించీ, తమ తెగల పుట్టుక, నివాసం, తమ విశ్వాసాల గురించిన చెప్పిన మౌఖిక కథనాల్ని కూడా రచయిత్రి సేకరించి పొందుపరిచారు. వాటితో పాటు, అంగామీ పదకోశం నుంచి కొన్ని ముఖ్యమైన పదాలకు అర్థాలతో పాటు, స్థలవాచకాల సూచిక కూడా అనుబంధంగా అందించారు.

ఈశాన్య భారతదేశంలో అస్సాం, మేఘాలయ, మిజోరం, త్రిపుర ప్రాంతాల్లో పాలన భారత రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూలులో పొందుపరిచిన విధానం ప్రకారం జరుగుతుంది. 1962 లో నాగాలాండు ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడేదాకా నాగాకొండలు కూడా ఆరవషెడ్యూలు పరిధిలోనే ఉండేవి. కాని ప్రత్యేకరాష్ట్రంగా ఏర్పడ్డాక నాగాలాండుని ఆరవ షెడ్యూలు పరిధినుంచి తప్పించారు. (అది పూర్తి గిరిజనరాష్ట్రం కాబట్టి, అయిదవ షెడ్యూలు పరిధిలోకి రావాలిగాని, ఇప్పటిదాకా అటువంటి చర్యలు భారతప్రభుత్వం తీసుకోలేదు.) అయితే, ఏ నేపథ్యంలో బ్రిటిషువాళ్ళు ఈశాన్యప్రాంతాల్లో తమ పాలనావిధానాన్ని సవరించుకోవలసి వచ్చిందో, ఇటువంటి నవలలు చదివితే మనకి అర్థమవుతుంది.

ఈశాన్యప్రాంతాలు కూడా భారతదేశంలో అంతర్భాగం అనీ, వారు కూడా భారతజాతి అని మనకి తెలియాలంటే ఇటువంటి సాహిత్యం మనకి విస్తృతంగా పరిచయం కావాలి. నా వరకూ నాకు, ఈ నవల చదివిన తరువాత, వెర్రియరు ఎల్విను, రెవరెండు రివన్‌బర్గ్ వంటి వాళ్ళ రచనలు వెంటనే చదవాలనిపించింది. మన ప్రాంతాల్లో కూడా ఇటువంటి సాహిత్యం రావాలంటే ఇటువంటి రచనలు తెలుగులోకి రావడం అవశ్యం అని కూడా అనిపించింది.

10-6-2022

చారిత్రిక అనివార్యతకి అద్దం

పది పదిహేనేళ్ళకిందట, మాజికల్ రియలిజం గురించి తెలుసుకుందామని ఏ పుస్తకాలు చదవాలి అని అడిగితే ఎవరో అలేహో కార్పెంటియరు పేరు చెప్పారు. ఆయన్ను మేజికల్ రియలిజంకి ఆద్యుడని చెప్పవచ్చని, ఆయనతో మొదలుపెట్టమనీ చెప్పారు. అప్పుడు ఆయన రాసిన నవల The Kingdom of This World (2006) (ఇహలోక రాజ్యం) కొనుక్కున్నాను. కాని ఇన్నాళ్ళకు చదవగలిగాను.

అలేహో కారెపెంటియరు (1904-1980) క్యూబాకి చెందిన రచయిత, సంగీతవేత్త. ఆయన ఈ నవల 1949 లో రాసాడు. ఇది ఇది మధ్య అమెరికాకు చెందిన కరీబియను దీవుల్లో భాగమైన హైతీ అనే ఒక దేశానికి సంబంధించిన చరిత్ర చుట్టూ అల్లిన కథ. పద్ధెమినిదో శతాబ్దిలో హైతీలో బానిసల తిరుగుబాటు మొదలుకుని సంభవించిన చారిత్రిక పరిణామాల్ని టిన్‌నోయెల్ అనే ఒక కల్పితపాత్ర దృక్కోణం నుంచి చెప్పుకొస్తాడు. తన కథనాన్ని ఆయన lo real maravilloso లేదా the marvelous real అని పిలిచాడు. తర్వాతి రోజుల్లో అది బోరేసు, మార్క్వెజు వంటి దక్షిణమెరికా రచయితల చేతుల్లో మాజికల్ రియలిజంగా రూపుదిద్దుకుంది.

ఇంత ఆలస్యంగా ఈ పుస్తకం చదివినందువల్ల ఇందులో మాజికల్ పార్శ్వం నన్ను ఎక్కువగా ఆకట్టుకోలేక పోయిందిగాని, అంతకన్నా విశేషమైన ప్రమాణాలు ఈ రచన సాధించిందని చెప్పాలి. వాటిల్లో మొట్టమొదట చెప్పవలసింది రచన నిడివి. దాదాపు రెండువందల సంవత్సరాల చారిత్రిక పరిణామాన్ని రెండువందల పేజీలకు కుదించి చెప్పడం, కాని ఆ క్రమంలో, మనకి రచయిత ఏదో చెప్పకుండా వదిలిపెట్టేసాడని అనిపించకపోవడం చిన్న విషయం కాదు. తాను ఏ ఘట్టాల్ని చిత్రిస్తున్నాడో అక్కడ సూక్ష్మవివరాల్ని చెప్తూనే నిడివిమీద నియంత్రణ సాధించడం మామూలు విషయం కాదు.

రెండవ విశేషం రచయిత బహుభాషా పాండిత్యం. అతడు రాస్తున్నది ఒక ఫ్రెంచి కాలనీ గురించి. రాసింది స్పానిషులో. ఇతివృత్తం ఆఫ్రికానుంచి బానిసలుగా తీసుకువచ్చిన మనుషుల జీవితం, చరిత్ర. మూడు ఖండాలు, యూరోపు, ఆఫ్రికా, మధ్య అమెరికాల గురించి ఎంతో తెలిసి ఉంటే తప్ప ఇంత సాధికారికంగా కథనం చెప్పడం సాధ్యం కాదు.

ఇక మూడవ విశిష్టత, కవితాత్మకత. తిరిగి తిరిగి, సన్నివేశాలు మారుతున్నప్పటికీ, చరిత్ర స్వభావం మారలేదనే స్ఫురణ కలిగేటట్టుగా ఒక సంగీత రూపకంలాగా, సున్నితంగా, అందులో వివిధ చారిత్రికదశల్ని ఒక గీతంలో చరణాల్లాగా చెప్పిన కథనం.

'పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుట్టెను' అన్నాడు మహాకవి. కాని దురదృష్టమేమిటంటే, చరిత్ర ఏదో ఒక నాటికి ఆగిపోయే కాలం, తావు ఏవీ ఉండవు. నిన్నటి బానిస నేడు ప్రభువు కాగానే తోటిమనిషిని బానిసగా మారుస్తూనే ఉంటాడు. ఆ బానిస మళ్ళా ప్రభువు మీద తిరగబడుతుంటాడు. తిరిగి మళ్ళా అతడు ప్రభువు కాగానే మరింత క్రూరుడిగా మారుతుంటాడు. ఈ నవల ఆ చారిత్రిక అనివార్యతకి అద్దం.

అయితే, ఒకవైపు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే నినాదాలతో ప్రపంచానికి కొత్తద్వారాలు తెరిచిన ఫ్రెంచి సమాజమే మరొకవైపు ఒక మారుమూల ద్వీపంలో మనుషుల్ని ఎలా అణచి ఉంచిందో తెలియడంలో గొప్ప విషాదం ఉంది. ఇక మనుషుల్ని బానిసలుగా మార్చి వాళ్ళని జంతువులకన్నా హీనంగా చూస్తూన్న వలసపాలకులు మరొకవైపు రూసోని, వాల్టేరుని ప్రస్తావిస్తూండటం అత్యంత విషాదకరమైన హాస్యం.

నవల ముగింపుకి వచ్చేటప్పటికి, కథకుడు, సూత్రపాత్ర టిన్ నోయెల్‌కి ఇలా గ్రహింపుకి వచ్చిందని రాస్తున్నాడు:

> ఇప్పుడతడికి అర్థమయింది, మనిషి తాను ఎవరి కోసం వేదన అనుభవి–స్తున్నాడో, ఎవరికోసం కలలు గంటున్నాడో ఎప్పటికీ తెలుసుకోలేడని. అతడు తానెవరికోసం వేదన పడుతున్నాడో, ఎవరి మీద ఆశలు పెట్టుకుంటున్నాడో, ఎవరికోసం చెమటోడుస్తున్నాడో ఎప్పటికీ తెలుసుకోలేడు. ఆ వాళ్ళెవరో వాళ్ళు కూడా సంతోషంగా ఉంటారని చెప్పలేం. ఎందుకంటే మనిషి ఎప్పటికీ తనకు లభ్యమవుతున్న దానికన్నా మించినదేదో దానికోసమే పాకులాడు తుంటాడు. తానున్నదానికన్నా మరింత మెరుగైన స్థితికోసం వెంపర్లాడతాడనే యథార్థంలోనే మనిషి గొప్పదనం ఆధారపడి ఉంది. పరలోక రాజ్యంలో

> ఇంక గెలుచుకోవలసిన గొప్ప వైభవమేదీ ఇంక అతడికి మిగల్లేదు. పైగా ఆ పరలోక రాజ్యంలో పాలనాయంత్రాంగం, ఆ నిచ్చెనమెట్ల వ్యవస్థ ఎంత కట్టుదిట్టంగా ఉంటాయో అతడికి క్షుణ్ణంగా తెలుసు. ఇంతవరకూ అజ్ఞాతంగా ఉన్నది అతడికిక వెల్లడైపోయింది. ఆ పరలోకరాజ్యంలో మనుగడ అనంత కాలం పాటు కొనసాగుతుందనీ, అక్కడికి చేరుకున్నాక ఇక బలులూ, నైవేద్యాలతో పనిలేదనీ, అక్కడ ఉన్నదంతా సంతోషమూ, విశ్రాంతి మాత్రమే ననీ తెలిసిపోయింది. కాబట్టే, దుఃఖాలూ బాధ్యతలూ కిందకి దిగలాగుతుంటే, అపారమైన నలుగులాటమధ్య కూడా బహుసుందరంగా వెలిగిపోతూ, అగ్ని గుండాల మధ్య, కఠినపరీక్షల ఎదట కూడా ప్రేమించడానికి ప్రయత్నిస్తూ, మనిషి తన సంపూర్ణ మహిమని ఇదిగో, ఇక్కడే, ఈ ఇహలోక రాజ్యంలోనే కనుగొంటున్నాడు. (పే.178-79)

బహుశా ఈ వాక్యమొక్కటే ఈ రచనలోని అత్యంత ఆశావహమైన వాక్యం. కాని ఈ వాక్యం దగ్గరకు చేరడానికి ముందు మనం వరసగా ఒకదానివెనక మరొక నరకం దాటుకుంటూ రావాలి. అప్పుడు కూడా, ఈ వాక్యం ఇచ్చే ఆసరాతో, మళ్ళా మరొక కొత్త నరకంలో అడుగుపెట్టడానికి సిద్ధపడాలి.

16-6-2022

ఎవరు రాయబోతున్నారు ఆ కథ?

రెండువందల పేజీలకన్నా నిడివి మించని నవలల్లో ఉత్తమ నవలలుగా పరిగణించబడే వాటి జాబితా ఒకటి, ఆ మధ్య, చేర్చి పెట్టుకున్నాను. అందులో The Prime of Miss Jean Brodie (1961) (మిస్ బ్రోడీ వయసులో ఉన్నప్పుడు) కూడా ఒకటి. స్కాట్లాండుకి చెందిన మురియెలు స్పార్కు (1918-2006) రాసిన రచనల్లో ఈ నవల చాలా ప్రశస్తి సంపాదించింది. తర్వాత రోజుల్లో నాటకంగానూ, సినిమాగానూ కూడా మలిచారని విన్నాను. నవల కొనుక్కుని చాలా రోజులే అయినప్పటికీ ఎప్పుడూ మొదటి పేజీ దగ్గరే ఆగిపోయేవాణ్ణి. ఇన్నాళ్లకు పూర్తిగా చదవగలిగాను.

ఇటువంటి రచనల్ని అర్థం చేసుకోవడానికి పెద్దగా కష్టపడక్కర్లేదు గాని, వీటికి లభించిన అంతర్జాతీయ ప్రకాస్తికి గల కారణాలు అర్థం చేసుకోవడానికి నిజంగానే కొంత ప్రయత్నం చేయాలి. ఉదాహరణకి ఈ నవల ఒక స్కాటిషురచయిత కాకుండా బ్రిటిషురచయిత్రినో లేదా అమెరికను రచయితనో రాసి ఉంటే ఈ పుస్తకానికి అంత ప్రశస్తి వచ్చిఉండేదా అన్నది అనుమానమే. అయితే ఈ పుస్తకం ప్రశస్తిని, ప్రాసంగికతని అర్థం చేసుకోవటానికి స్కాటిషు సాహిత్యం గురించి కూడా ఎంతోకొంత తెలుసుకోవలసి ఉంటుంది. ఉదాహరణకి జేమ్స్ హాగ్ అనే రచయిత రాసిన The Private Memoirs and Confessions of a Justified Sinner అనే నవల చదివి ఉంటే ఈ నవల వంశ వృక్షం మన కొంత బోధపడుతుంది. (ఆ నవల కూడా చదవబోతున్నాను). అలానే ప్రసిద్ధ స్కాటిషు రచయిత రాబర్టు లూయీ స్టీవెన్సను రాసిన Dr Jekyl and Mr Hyde నవల కూడా.

ఈ నవల ఇతివృత్తం పైకి చూడడానికి చాలా సరళం. స్కాట్లాండులో ఎడింబరోలో మార్షియా బ్లెయిను స్కూలు అనే ఒక మిడిలు స్కూల్లో మిస్ జీన్ బ్రోడీ ఒక ఉపాధ్యాయిని.

ఆమె సరికొత్త పద్ధతుల్లో పిల్లలకి విద్య నేర్పాలనే ప్రయోగాలు చేస్తున్నానని, ఆ ప్రయోగాలు కూడా తాను వయసులో ఉన్నప్పుడే చేయాలని అనుకుంటున్నానని అని చెప్తుంటుంది. తన పాఠశాలలో చదువుతున్న బాలికల్లో నుంచి ఐదుగురు బాలికల్ని ఆమె ప్రత్యేకంగా ఎంపిక చేసి వాళ్లని ఒక బృందంగా రూపొందిస్తుంది. మోనికా డగ్లస్ (లెక్కల్లో బెస్ట్), యూనిస్ గార్డినర్ (ఆటల్లో నంబర్ వన్), సాండీ స్ట్రేంజెర్ (చిన్ని కళ్ళు), రోజ్ స్టాన్లీ (ఆమె పేరు చెప్పగానే అందరికీ సెక్స్ గుర్తొస్తుంది) లతో పాటు మెక్ గ్రెగర్ (అభాగ్యురాలు) అనే ఆ అయిదుగురు బాలికలూ 'బ్రాడీసెట్' గా తయారవుతారు.

ఆ పిల్లలు తమ కౌమారజీవితంలో మిస్ బ్రాడీ సన్నిధిలో తమ వ్యక్తిత్వాన్ని వికసింప చేసుకోవడం మొదలు పెడతారు. ఆ ఉపాధ్యాయినిలో వారికి గొప్ప ఆకర్షణ కనిపిస్తుంది. ఆమె ప్రత్యేకంగా ఎంచుకున్న ఆ చిన్న బృందంలో తాము కూడా ఉండటం వారికి ఎంతో గర్వంగానూ, ఉత్సాహంగానూ వుంటుంది. ఇది నవలలోని ఆకర్షణీయమైన, ఉల్లాసకరమైన పార్శ్వం. ఇక ఈ నవల్లో దారుణమైన చీకటిపార్శ్వం కూడా ఉంది. మిస్ బ్రాడీకీ అదే పాఠశాలలో పనిచేస్తున్న ఆర్టు మాస్టారికీ, సంగీతం మాస్టారికీ మధ్య ఏర్పడ్డ ఆసక్తి నెమ్మదిగా రహస్య ఆకర్షణగా మారుతూండగా ఆ రహస్యలోకంలోకి ఆ పిల్లలు కూడా ప్రవేశిస్తారు. నవయవ్వనంలో ప్రవేశిస్తున్న ఆ పిల్లల జీవితాల్లో, మనసుల్లో, వాళ్ళ మధ్య ఉన్న పరస్పర సంబంధాల్లో, ఆ ఉపాధ్యాయుల మధ్య తలెత్తిన రహస్య ఆకర్షణ ఎటువంటి కలకలం సృష్టించిందీ కథలో రెండో పార్శ్వం.

మనుషుల జీవితాల్లో, అది కూడా చిన్న చిన్న గ్రామాల్లోనో, పాఠశాలల్లోనో, కార్యాలయాల్లోనో, నాటకబృందాల్లోనో, ఆకర్షణీయమైన కోణాలతో పాటు అగాధమైన పార్శ్వాలు కూడా ఉండటం సహజం. మనుషులు చిన్న చిన్న బృందాలుగా మసిలే తావుల్లో ఆ ఆకర్షణలూ, వికర్షణలూ, కుతూహలాలూ, అసూయలూ వాళ్ళ మనసుమీదా, దైనందిన జీవితం మీదా కలిగించే ఒత్తిడి సామాన్యంగా ఉండదు. దాన్ని రచయిత్రి ఎంతో నేర్పుతో, గొప్ప శైలితో, అరుదైన కథాశిల్పంతో చిత్రించడంతో ఈ నవల ఉత్తమ సాహిత్యకృతిగా ప్రసిద్ధిచెందింది అనుకుంటాను.

ఈ నవల కథాకాలం రెండవ ప్రపంచ యుద్ధం మొదలు అయ్యే సమయం. రచయిత్రి ఈ నవలను 60 ల మొదట్లో రాసింది అందులో పాత్రలు పదిహేనేళ్ల తర్వాత, ఇరవై ఏళ్ల తర్వాత, పాతికేళ్ల తర్వాత కూడా తమ పాఠశాల రోజుల్ని గుర్తు చేసుకుంటూ ఉంటాయి. అంటే దాదాపుగా 1930 నుంచి 1960 దాకా స్కాట్లాండు జీవితం ఈ నవల్లో మనకు కనబడుతుంది. ఆ రోజుల్లో ప్రపంచం తలకిందులు అవుతున్నది. కానీ స్కాట్లాండులో ఆ

పాఠశాల, ఆ ఉపాధ్యాయులు, ఆ పిల్లలు మాత్రం ఆ ఆటుపోట్లకు అతీతంగా తమదైన లోకంలో జీవిస్తూ ఉండటంలో ఏదో ఒక అమాయకమైన ఆకర్షణ ఉంది. అయితే ఆ ఉపాధ్యాయిని మాత్రం తన తరగతి గదిలో హిట్లరు గురించి, ముస్సోలినీ గురించి, ఫాసిజం గురించి మాట్లాడుతూ ఉంటుంది, కానీ ఆ మాటలు ఆ పిల్లల జీవితాన్ని ఏ విధంగానూ ప్రభావితం చేయకపోగా చివరికి ఫాసిజానికి మద్దతు ఇస్తోందనే ఆరోపణ మీద ఆ ఉపాధ్యాయిని తన ఉద్యోగం పోగొట్టుకుంటుంది.

ఈ పుస్తకం మీద కొన్ని సమీక్షలు కూడా చదివాను. వారంతా రచయిత్రి శిల్ప నైపుణ్యాన్ని బాగా మెచ్చుకున్నారు. బహుశా ఇంత బాగా పకడ్బందీగా కథ చెప్పడంలో ఈమెని మన చాసోతో పోల్చవచ్చు. ఇద్దరూ సమకాలికులు కూడా. అయితే ఈ పోలిక కేవలం శిల్పం వరకు మాత్రమే. కథా వస్తువులో, కథా సందేశంలో ఇద్దరూ భిన్న ధ్రువాలు.

అయితే ఈ కథనీ, కథలో చర్చించిన చిత్రించిన వెలుగునీడల్నీ పక్కనబెడితే ఈ నవల చదువుతున్నంత సేపూ నాకు మన ప్రాంతాల్లో, మన పల్లెటూళ్ళలో, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలూ, ఆ ఉపాధ్యాయులూ, అక్కడ చదువుకున్న పిల్లలూ గుర్తొస్తున్నారు. ఉదాహరణకి మా రాజవొమ్మంగిలో అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల తీసుకుంటే, నేను ఆ స్కూల్లో చదువుకోలేదుగాని, మా ఇద్దరు అన్నయ్యలూ, మరెందరో మిత్రులు ఆ పాఠశాలలో చదువుకున్నవారే. 60 ల్లో, 70 ల్లో ఆ పాఠశాల మా గ్రామాల్లో, మా కుటుంబాల్లో ఎంతో ముఖ్యస్థానం ఆక్రమించింది. ఆ పాఠశాలలో చదువుకున్న ఎందరో విద్యార్థులు వారి హైస్కూలు జీవితంలో లోనైన అనుభవాల్లో ఎంతో ఉత్కంఠ, నవ్యత, ఉల్లాసం, విస్మయం, కొన్ని షాకులు కూడా ఉన్నాయి. ఆ పాఠశాలనే వాళ్ళకి విస్తృతప్రపంచాన్ని పరిచయం చేసింది. ఆ రోజుల్లో ఆ పాఠశాల హెడ్ మాష్టారు, అసిస్టెంటు హెడ్ మాస్టారు, డ్రిల్లు మాష్టారు, తెలుగు మాష్టారు, హిందీ మాష్టారు, చివరికి గంటలు కొట్టే అటెండరుతో సహా ప్రతి ఒక్కరూ వారి జీవితాన్ని ఎంతో వెలిగించిన వారే. ఆ రోజు తమతో చదువుకున్నవాళ్ళు తర్వాత జీవితంలో ఏమైనారో తెలుసుకోవడంలో ఒక నోస్టాల్జియాతో పాటు, గొప్ప స్థానిక చరిత్ర కూడా ఉంటుంది. అటువంటి అనుభవాల్ని ఎవరైనా ఒక కథగా రాస్తే ఆ కథ కూడా ఇంత ఆసక్తికరంగానూ ఉంటుందని చెప్పగలను.

మన రచయితలు చాలామంది రాజవొమ్మంగి జిల్లా పరిషత్తు హైస్కూల్లాంటి స్కూళ్ళల్లో చదువుకున్న వాళ్ళే. వారి బాల్యం నుంచి నవ యవ్వనానికి చేసిన ప్రయాణంలో ఆ హైస్కూళ్ళు మరవలేని మజిలీలు. మరి ఎవరు రాయబోతున్నారు ఆ కథ?

19-6-2022

సూక్ష్మ చిత్రణ

నేను అసాం వెళ్ళినప్పుడు తెచ్చుకున్న పుస్తకాల్లో నాగాలాండు సాహిత్యంలో ఈస్టరన్ క్రైర్ రాసిన నవల 'అంగామీ' తెగ జీవితాన్ని చిత్రిస్తే, తెంసులా కథాసంపుటి These Hills called Home: Stories from a War Zone (2006) 'ఆవో' తెగ జీవితాన్ని వర్ణిస్తున్న రచన. క్రైర్ రాసిన కథ పందొమ్మిదో శతాబ్దిలో బ్రిటిష్ ప్రభుత్వంతో అంగామీ తెగ చేసిన పోరాటాన్నీ, సంఘర్షణనీ చిత్రిస్తే, తెంసులా రచన, ఇరవయ్యవ శతాబ్దంలో ఆవో తెగవారు, ప్రత్యేకనాగాలాండు కోసం భారతప్రభుత్వంతో చేసిన పోరాటాన్నీ, సంఘర్షణనీ ఎంతో వాస్తవికంగా, గొప్ప కౌశల్యంతో చిత్రించిన రచన. బహుశా గత రెండు శతాబ్దాలుగా నాగాలాండు అనుభవించిన సంఘర్షణనీ, రక్తపాతం నుంచి ప్రజాస్వామ్యానికి చేసిన ప్రయాణాన్నీ తెలుసుకోవాలనుకునేవారికి, ఈ రెండు పుస్తకాలూ, ఒక సమగ్ర అవగాహన కలిగిస్తాయని చెప్పవచ్చు.

తెంసులా ఆవో చెప్పిన కథలు దాదాపుగా స్వతంత్ర భారతదేశంలో కాశ్మీరు, పంజాబు, మధ్యభారతదేశంలో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండు, ఒడిశా, ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల్లోని అంతర్గతసంఘర్షణ ప్రాంతాల కథలే అని చెప్పవచ్చు. ప్రజాస్వామిక భారతదేశంలో, కారణాలేమైనా గానీ, ఒకసారంటూ insurgence తలెత్తాక, ఆ ప్రాంతాలు సైన్యం ఆధీనంలోకి పోయిన తరువాత, అక్కడి సాధారణ ప్రజాజీవితం ఎలా అతలాకుతలం అయిపోతుందో ఈ కథల్లో చూడవచ్చు.

భారతప్రభుత్వ సార్వభౌమాధికారాన్ని పరిరక్షించే సైన్యానికీ, ప్రభుత్వం మీద ధిక్కారం ప్రకటించి రాజ్యాధికారం కోరుకునే అండరుగ్రౌండు సైన్యానికీ మధ్య జరిగే పోరాటంలో మామూలు మనుషులు ఎలా నలిగిపోతారో, వాళ్ళు పగలు ప్రభుత్వం వైపూ, రాత్రి అండరుగ్రౌండు ఆర్మీ వైపూ, ఊళ్ళో ప్రభుత్వం వైపూ, అడివిలో అజ్ఞాతసైన్యం వైపూ, ఇలా

రెండు విధేయతల కోరల్లోనూ చిక్కి ఎలా దయనీయమైన పరిస్థితుల్లోకి జారిపోతారో రచయిత్రి ఎంతో సూక్ష్మంగా చిత్రించారు.

ఈ సంపుటిలో మొత్తం పది కథలున్నాయి. ఈ పది కూడా నలభైలనుండీ మొదలై 1962 లో నాగాలాండు ఒక రాష్ట్రంగా ఏర్పడే దాకా నడిచిన కథలు. చివరి కథలో ఒకడు జీవితంలో ఉన్నతోద్యోగాల్లో స్థిరపడలేక చిన్నపాటి కంట్రాక్టరుగా మారి, పెద్ద కంట్రాక్టరుగా ఎదిగి, అటు అండరు గ్రౌండుకీ, ఇటు బయటి సైన్యానికీ కూడా ముడుపులు చెల్లించుకుంటూ, నాగాలాండు ప్రత్యేకరాష్ట్రంగా కాగానే ఎమ్మెల్యేగా ఎన్నికవడం దాకా కనిపిస్తుంది.

అంత సూక్ష్మవివరాలు ఆమె ఎలా తెలుసుకున్నారో ఆశ్చర్యమనిపిస్తుంది. నాకు తెలిసి, తెలుగు సాహిత్యంలో ఇటువంటి సంఘర్షణ గురించి ఇటువంటి సూక్ష్మ చిత్రణతో కూడిన రాలేదనే అనుకుంటున్నాను. పరస్పరం పెనగులాడిన రెండు వర్గాల్లోనూ ఆమె ఎవరి పక్షమూ వహించలేదు. ఉన్నది ఉన్నట్టుగా, నిష్పాక్షికంగా, తనంతటతాను ఎటువంటి తీర్పులూ ఇవ్వకుండా, తనకు తెలిసింది చెప్పడానికే ప్రయత్నించారు.

పుస్తకం తెరవగానే మొదటి పేజీలో ఈ వాక్యం కనిపిస్తుంది: I hear the cry, over and over again, Let all the dead awaken and teach the living how not to die అని. ఈ మాటలో రెండు అర్థాలు వినిపించాయి నాకు. మరణించిన వారు మరణించకుండా ఉండి ఉంటే బాగుండేదనే ఒక అర్థం, లేదా జీవిస్తున్నవాళ్ళు సార్థకంగా జీవించకపోతే అది కూడా మరణంలాంటిదే అనే మరొక అర్థమూ. ఏమైనప్పటికీ, నూట యాభై పేజీలు మించని ఈ పది కథల సంపుటి, జీవితాన్నీ, మృత్యువునీ; యుద్ధాన్నీ, శాంతినీ ఐతిహాసిక ప్రమాణాల్తో చిత్రించిందనే చెప్పాలి.

తన సంపుటికి ఆమె Lest We Forget అని ఒక ముందుమాట రాసుకున్నారు. అందులో ఇలా అంటున్నారు:

> మరొకరి జ్ఞాపకాన్ని నువ్వేమి చేస్తావు? అందులోనూ ఆ జ్ఞాపకం వేదనతో, కేవలం వేదనతో మాత్రమే కూడుకుని ఉన్నప్పుడు? అది నీకు సంబంధించి-నది కాదని పక్కన పెట్టేస్తావా? అలా చేసావే అనుకుందాం. అయితే ఒక్క మాట చెప్పు, ఆ వేదన గురించి తెలిసిన తర్వాత కూడా నువ్వు మునుపటిలానే ఉండగలుగుతావా? ఉండలేవు కదా. కాబట్టే, ఇదిగో, ఈ కథలు. తమ వేదన గురించి ఎవరూ మాట్లాడకుండానే, ఎవరూ పట్టించుకోకుండానే

> నిష్క్రమించిన వారి వేదనని పునఃపరామర్శించే ఉద్దేశ్యంతోనే నేను ఈ కథలు చెప్పడానికి ప్రయత్నించాను. కొంతమంది అదేమంత అవసరం కాదనవచ్చు. కొంతమంది హెూలోకాస్టు లాంటిది అసలు జరగనే లేదని నమ్ముతున్నట్టు. 'అదేమంత ముఖ్యంకాదు' అనే వాళ్ళని చూస్తే మనుషుల మనస్సుల్లో ఇంత నిర్లక్ష్యం పేరుకుపోయి ఉండగలదా అనిపిస్తుంది. తమని తాకనంతవరకూ ఎటువంటి అన్యాయాన్నీ, అమానుషత్వాన్నీ మనుషులు పట్టించుకోరన్నమాట అనిపిస్తుంది. అయితే ఈ కథలు 'చారిత్రిక యథార్థాలు' కావు. దాదాపు అర్థ శతాబ్దం కిందట ఈ భూమిని కార్చిచ్చులాగా చుట్టబెట్టిన సంఘటనల్ని ఖండించడానికో, సమర్థించడానికో, లేదా న్యాయం చెయ్యడానికో రాసిన కథలు కూడా కావు. అందుకు బదులుగా ఈ కథలు చెప్తున్నదేమిటంటే, అటువంటి సంఘర్షణల్లో విజేతలంటూ ఉండరు, బాధితులు మాత్రమే ఉంటారు అనేది. ఆ పర్యవసానాల్ని మానవ ప్రమాణాల ప్రకారం మాత్రమే లెక్కించవలసి ఉంటుంది అనేది. ఎందుకంటే ఆ బాధితులు అనుభవించిన ఆఘాతం కేవలం శారీరిక చిత్రవధకో, లేదా ప్రాణనష్టానికో మాత్రమే సంబంధించింది కాదు, అన్నిటికన్నా ముందు అక్కడ మానవత్వమే చెరచబడింది, అత్యాచారానికి లోనయ్యింది. ఆ నరమేధంనుంచి ఎవరు బయటపడ్డారో వారి ఆత్మల్లోనూ, మనసుల్లోనూ కూడా ఆ గాయాల మరకలు ఇప్పటికీ మిగిలిపోయాయి.

బహుశా, ఈ కథల సారాంశాన్ని ఆమె రాసుకున్న ఈ వాక్యాలే మరింత స్పష్టంగా చెప్పగలవనుకుంటాను:

> ఈ సంపుటిలోని చాలా కథలకు మూలం గత శతాబ్దంలోని యాభైల మొదటి నుంచీ నాగాలాండు చరిత్రగా మారిన నెత్తురూ, కన్నీళ్ళూను. భారతదేశం నుంచి తామొక ప్రత్యేకదేశంగా విడివడాలన్న కోరికతో యుద్ధం చేసిన సంక్షుభిత సంవత్సరాలనుంచి ఏరిన కథలు ఇవి. అయితే ఆ సంఘర్షణ ఈ కథలకు నేపథ్యం మాత్రమే. ఆ శకంలో సంభవించిన సంఘటనలు నాగా మానసాన్ని ఏ విధంగా 'విప్లవీకరించాయో' పరిశీలించడం ఈ కథల ఉద్దేశ్యం. ఆ కాలంలో ఒక ప్రళయసన్నిభమైన తిరుగుబాటు ఎన్నో వాస్తవాల్ని నాగాలముందుకు తీసుకొచ్చింది, తమదైన యథార్థమైన గుర్తింపు ఏమిటో తెలుసుకోడానికి వారింకా తమలో తాము నలుగుతూనే ఉన్నారు. ఒక రకంగా

చెప్పాలంటే అది అగ్నిలోంచి సంభవించిన జన్మ. కొంతమంది ఆ అగ్నిశిఖలు తమని తాకకుండా ఉండగలిగినప్పటికీ, చాలామంది ఆ అగ్నిలో నడిచి తమని తామే గుర్తుపట్టలేనంతగా మారిపోయారు. స్వయంనిర్ణాయకత్వం కోసం నాగాలు చేపట్టిన ఈ యుద్ధగాథ గొప్ప ఆదర్శవాదంతోనూ, తీవ్ర జాతీయవాదం తాలూకు స్వప్నాలతోనూ మొదలయ్యింది కాని, చివరికి, తాము ఏ పరిస్థితుల్ని అధిగమించాలనుకున్నారో అటువంటి పరిస్థితుల్లోకే కుప్పకూలి పోయింది.

నేను 1987-90 ప్రాంతంలో పార్వతీపురంలో పనిచేస్తున్నప్పుడు అప్పటికి ఇరవయ్యేళ్ళ కిందట శ్రీకాకుళం తిరుగుబాటులో పాల్గొన్న గిరిజనుల్నీ, ఎన్నో ఏళ్ళ పాటు ఏ విచారణా లేకుండానే విశాఖపట్టణం సెంట్రలు జైల్లో మగ్గి వచ్చిన పోరాటకారుల్నీ, వాళ్ళ త్యాగాల్ని దగ్గరగా చూసిన రచయితల్నీ కొందర్ని చూడగలిగాను. వాళ్ళల్లో కురుపాం మండలం లంకాజోడు గ్రామానికి చెందిన ఆరిక గుంపస్వామి, చినమేరంగికి చెందిన ప్రసిద్ధ రచయిత భూషణంగారూ ఇంకా నా కళ్ళముందు మెదుల్తున్నారు. కాని ఆ పోరాటం తాలూకు ప్రకంపనాలు, అది విడిచిపెట్టి వెళ్ళిన గాయపుమరకలూ చిత్రించవలసినంతగా చిత్రణకు నోచుకోలేదనే ఈ కథలు చదివాక నాకు అర్థమయింది.

మా గ్రామాల్లో 1980 తర్వాత నక్సలైట్లు అడుగుపెట్టాక సంభవించిన ఎన్నో పరిణామాల్ని ఈ కథల్లో నేను పోల్చుకోగలిగాను. కాని వాటిని కూడా ఎవరూ, నాతో సహా, ఏ రచయితా రాసినట్టు లేదు (మా అక్క రాసిన 'కొండఫలం' లాంటి ఒకటి రెండు కథలు తప్పించి.)

రచయితలూ, కవులూ ఎవరూ పైకి ప్రకటించని ప్రజాప్రతినిధులు అన్నాడు కవి. నేనేమంటానంటే, ప్రతి రచయితా తనకంటూ ప్రత్యేకంగా ఒక వార్తాపత్రిక లేని విలేకరి. ఏ యాజమాన్యం ప్రయోజనాల కోసమూ పనిచెయ్యనవసరం లేని రిపోర్టరు అతడు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రతి రచయితా ప్రజల విలేకరి కావాలి. ఇదిగో ఇటువంటి రచయితల్ని చూస్తే ఆ మాట నిజమే అనిపిస్తుంది.

21-6-2022

రెండు నిస్సహాయత్వాల గురించిన వర్ణన

క్లారిసు లిస్పెక్టరు పేరు మొదటిసారి పదేళ్ళ కిందట విన్నాను. కార్లోసు ఫ్యుయెంటిసు సంకలనం చేసిన The Vintage Book of Latin American Stories (1998) లో ఆమె కథ Love చదివాను. చదవగానే ఎంత ముగ్ధుణ్ణైపోయానంటే, ఆ కథ నాకోసం నేను, పూర్తిగా తెలుగులోకి తిరిగి రాసుకున్నాను. ఆ ఒక్క కథతోటే ఆమె నాకు మొత్తం అర్థమయిపోయినట్టు అనిపించింది. ముఖ్యం ఆ కథనం. అంత శాంతంగా, స్థిమితంగా తన అంతరంగాన్ని తాను చీల్చి చెండాడుకోగల రచయితలు చాలా అరుదు.

ఆమె అంతరంగాన్ని నేను గ్రహించగలిగాను అనడం కొంత సాహసమే. ఎందుకంటే, ఆమె రాసిన ఒక కథ The Smallest Woman in the World సుప్రసిద్ధం. ఆ కథకి కనీసం ఇప్పటిదాకా మూడు ఇంగ్లిషు అనువాదాలు వచ్చాయి. నేను చదివింది, మరొక సుప్రసిద్ధ కవయిత్రి, ఎలిజెబెతు బిషప్పు అనువాదం. ఆ కథలో ఒక ఫ్రెంచి పరిశోధకుడు కాంగో అడవుల్లో ఒక చెట్టుమీద అతి చిన్న మహిళను చూస్తాడు. ఆమె ఎత్తు పదిహేడు పద్ధెనిమిది అంగుళాలు మించి ఉండదు. ఆ కథలో ఆ మహిళ ఆ పరిశోధకుడికి కైవసం కావడానికి ఇష్టపడదు. ఆ కథని ఒక మెటఫరుగా సంభావిస్తూ, లిస్పెక్టరు జీవితచరిత్రకారుడు బెంజమిను మోసరు ఏమంటాడంటే ఆ పిగ్మీ మహిళలానే లిస్పెక్టరు కూడా తన పరిశోధకులకు కైవసం కావడాన్ని ఇచ్చగించరు అని.

క్లారిసు లిస్పెక్టరు (1920-1977) పోర్చుగీసులో రాసిన బ్రెజీలియను రచయిత్రి. యుక్రెయినులో పుట్టారు. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ఆమె తల్లిదండ్రులు మొదట్లో రొమేనియాకి, అక్కణ్ణుంచి ఎలాగో బ్రెజిలుకి వలస వచ్చారు. వాళ్ళు బ్రెజిల్లో అడుగు పెట్టినప్పుడు ఈశాన్యప్రాంతంలో దిగి నెమ్మదిగా కాలక్రమంలో రియో–డి–జెనిరో చేరుకున్నారు. ఆ తొలిరోజుల కాందిశీక జీవితం, బ్రెజిలు లోతట్టు ప్రాంతాల్లో గడిపిన

జ్ఞాపకాలు ఆమె అంతరంగంలో నిగూఢంగా గూడుకట్టుకున్నాయి. తర్వాత రోజుల్లో ఆమె ఒక రాయబారిని పెళ్ళి చేసుకుని దాదాపు ఇరవయ్యేళ్ళ పాటు బ్రెజిలుకి బయటే గడిపారు. తన ఇరవై మూడవ ఏట Near to the Wild Heart అనే నవల రాసారు. ఆ నవలకి అవశ్యం జాతీయప్రకాస్తి లభించింది. ఆ తర్వాత ఇక ఆమె వెనుతిరిగి చూడలేదు.

లిస్పెక్టరుని మనం ఇంగ్లిషులోనే చదవగలం కాబట్టి ఆమె పోర్చుగీసు వచనంలోని విలక్షణత్వం, ఆమె పాఠకులూ, విమర్శకులూ కూడా ఒక్కలానే, సమస్యగా భావించిన ఆ వచనం ఎలా ఉంటుందో మనకి తెలిసే అవకాశం లేదు. ఆమె వాక్యనిర్మాణంలోని విలక్షణత, పంచువేషను లోని వైచిత్రి కూడా మనం పోల్చుకోలేం. బహుశా బెంజమిను మోసరు అన్నట్టు ఆమెని పోర్చుగీసులో చదవడం కష్టం, అనువాదాల్లో చదవడం సులభం అయి ఉండవచ్చు. ఇక, ఇరవయ్యవశతాబ్ది మధ్యలో మొదలై లాటిను అమెరికను సాహిత్యమంతా విస్తరించి, తదనంతరం ప్రపంచమంతా వ్యాపించిన, మాజికల్ రియలిస్టు సాహిత్యంలో ఆమె రచనల్ని కూడా ఒక భాగంగా ఎంచుతారు కాని, నా వరకూ నేను, ఆమెని పూర్తి మాజికల్ రియలిస్టు రచయిత్రిగా కూడా పరిగణించలేను.

ఇన్నాళ్లుగా ఆమె సాహిత్యం మొత్తం చదవాలని అనుకుంటూనే ఉన్నాను. అందుకోసం ఎప్పుడో కొనుక్కున్న Hour of Star (1977, 2014) ఇన్నాళ్ళకు చదవగలిగాను. ఇది ఆమె చివరి నవల. ఆమె సాహిత్యంలో అత్యున్నత రచనగా కూడా పరిగణన పొందింది. పట్టుమని వంద పేజీలు కూడా లేని ఈ నవలను, బహుశా నవలిక అని కూడా కాదు, పెద్ద కథ అనవచ్చు. కాని ఇందులో ఒక సంఘటన కాదు, ఒక జీవితం, ఒక్క జీవితం కూడా కాదు, ఒక జీవితం నెపం మీద ఒక సమాజం మొత్తం కనిపిస్తుంది కాబట్టి, ఇతిహాసం అని కూడా అనవచ్చు. ఇది ప్రధానంగా నిస్సహాయత్వం గురించిన రచన. ఒక నిస్సహాయత్వం కాదు, రెండు నిస్సహాయత్వాల గురించిన వర్ణన. ఒకటి, కథలో సూత్రపాత్ర మకాబియో అనే నిరుపేద టైపిస్టు జీవితం, మరణాల చిత్రణ. మరొకటి ఆమె జీవితకథని చెప్పడానికి తనకు మాటలు రావడం లేదనీ, చాతకావడంలేదనీ, ఎంత ప్రయత్నించినా తాను చెప్పవలసినట్టుగా ఆ కథ చెప్పలేకపోతున్నాననీ, ఆ నవలలో కథకుడు పదే పదే ప్రకటించే నిస్సహాయత్వం.

ఈ నవలకు మలిమాట రాసిన లిస్పెక్టరు జీవితచరిత్రకారుడు బెంజమిను మోసరు ఇలా రాస్తున్నాడు:

> తదనంతర కాలంలో క్లారిసు లిస్పెక్టరు సముపార్జించుకున్న ఖ్యాతి, విదేశీ పాఠకుల్లో ఆమె సంపాదించుకున్న శాశ్వత జనాదరణ ప్రధానంగా ఈ చిన్న పుస్తకం మీదనే ఆధారపడి ఉన్నాయి. ఇందులో ఆమె తన రచనల్లోని ఎన్నో పాయల్ని, పోగుల్ని ఒక్కచోటకు తెచ్చి అల్లింది. తన విస్పష్ట యూదు వారసత్వం, స్పష్టంగా కనిపించే బ్రెజీలియను స్వభావం, ఈశాన్యప్రాంతంలో గడిచిన తన బాల్యం, రియో–డి–జనిరోలో గడిపిన నడివయస్సు; 'సాంఘికం', నైరూప్యం; విషాదం, హాస్యం మొదలైనవాటిని తన మతావేశంతోనూ, భాషా ప్రయోగాలతోనూ మేళవించి తన కథనస్రవంతిలో ముంచి తేల్చి మనకి అందించారు. రచయిత్రి 'దుస్సహమైన ప్రతిభాపాటవాల' కు The Hour of Star పూర్తి దృష్టాంతంగా నిలబడే మహానిర్మాణం.

ఇందులో ఇతివృత్తం ముందే చెప్పినట్టుగా, రియో–డి–జనిరో మహానగరంలో అతి తక్కువ వేతనానికి పనిచెయ్యవలసి వచ్చిన ఒక బీద యువతి జీవితం. ఇటువంటి ఒక ఇతివృత్తం మీద పందొమ్మిదో శతాబ్దంలో ఓ హెన్రీ కూడా అద్భుతమైన ఒక కథ రాయకపోలేదు. కాని లిస్పెక్టరు ఈ కథలో చెప్పడానికి ప్రయత్నించింది కేవలం ఆర్థిక విషాదం మాత్రమే కాదు. ఈ కథలో ఇతివృత్తాన్ని ఒక్కమాటలో చెప్పాలంటే loss of innocence అనవచ్చు. ఇందులో రచయిత్రి జీవితానికి సంబంధించిన కొన్ని సంఘటనలు కూడా ఉన్నాయని తర్వాతి రోజుల్లో విమర్శకులు గుర్తుపట్టారు. అంతమాత్రాన దీన్ని ఆత్మకథనాత్మకం అనుకోవద్దని కూడా హెచ్చరించారు. జీవితచిత్రణలో ఇది ఆత్మకథ కాకపోవచ్చుగాని, జీవితసారాంశ చిత్రణలో మాత్రం, అవును, నిస్సందేహంగా. ఎందుకంటే, రచయిత్రి, ఒక నిరుపేద టైపిస్టు జీవితం అనే నెపం మీద, తన విహ్వలత్వాన్నే మన ముందు విప్పిపరిచారని చెప్పవచ్చు.

ఈ నవల్లో రెండు బ్రెజిళ్ళు ఉన్నాయని ఈ పుస్తకానికి ముందుమాట రాసిన Olm Toibin అనే రచయిత అన్నాడు. ఈ నవల 'పేదరికం మీద రాసిన నవలే గాని పేదనవల కాదు' అని మరొక విమర్శకుడు కూడా అన్నాడట. ఈ నవల్లో మనల్ని ఆకట్టుకునేది, రచయిత్రి తాను చెప్పాలనుకున్నది చెప్పడానికి వెతుక్కున్న మాటలు, ఇంకా చెప్పాలంటే ఆ శిల్పం. అందుకనే ఎలిజబెతు బిషప్పు ఒక ఉత్తరంలో లిస్పెక్టరుని ఆదిమచిత్రకారుడితో పోల్చకుండా ఉండలేకపోయారు.

ఈ నవల చదువుతున్నప్పుడు, ఇటీవల బుకరు బహుమానం పొందిన గీతాంజలి శ్రీ రాసిన The Tomb of Sand గుర్తొస్తూ ఉంది. గీతాంజలి కథాశిల్పానికి ఈ నవలనే

స్ఫూర్తి అయి ఉండవచ్చునేమో అనిపించింది (కాని గీతాంజలి తన నవల్లో ఎందరి పేర్లో ప్రస్తావించారు కాని ఈమె పేరు ఎక్కడా రాయలేదు.) ఈ రెండు నవలలూ చదివినతర్వాత తెలుగులో రావిశాస్త్రి కథనశిల్పం ఇటువంటిదే కదా అని కూడా అనిపించింది. ఇంగ్లిషులోకి అనువాదమైఉంటే బహుశా 'రత్తాలు-రాంబాబు' నవల గురించి కూడా ఇలానే మాట్లాడుకుని ఉండేవారు కదా అనిపించింది. అలాగని రావిశాస్త్రి, క్లారిసు లిస్పెక్టరు ఒక్కలాంటి రచయితలని కాదు. తన రచనా ప్రవాహంలో పడి కొట్టుకుపోకుండా తనని తాను అదుపు చేసుకోగలగడం లిస్పెక్టరుకి తెలుసు. రావిశాస్త్రి, గీతాంజలి శ్రీలలో ఆ స్వీయనియంత్రణ కనరాదు.

ఈ పుస్తకం మీరు చదవకుండా, ఇలా నేను ఎంత చెప్పినా, ఆమె గురించి మీకై మీరు ఒక అభిప్రాయానికి రావడం కష్టం. అయితే పుస్తకం మొత్తం అనువదించలేను కాబట్టి, ఆమె వాక్యనిర్మాణం, ఆమె భావనాప్రపంచపు లోతు ఎలా ఉన్నాయో తెలపడానికి, ఆమె రాసిన అంకితవాక్యాలు తెలుగు చేస్తున్నాను.

రచయిత్రి రాసిన అంకిత వాక్యాలు

కాబట్టి ఈ రచనని నేను మా షూమానుకీ, ఆయన ప్రియమైన లారాకీ అంకితం చేస్తున్నాను. కాని అయ్యో, వాళ్ళిద్దరూ ఇప్పుడు అస్థిగత అవశేషాలు మాత్రమే. నా పురుషుడి నెత్తురు అతడు వయసులో ఉన్నప్పుడు జపాపుష్పసన్నిభంగా ఉంది కాబట్టి, ఆ నా రక్తంలో రక్తానికి అంకితం చేస్తున్నాను. అందరికన్నా ముఖ్యంగా ఈ పుస్తకాన్ని నా జీవితమంతా ఆక్రమించిన పిశాచాలకీ, గంధర్వులకీ, అప్సరసలకీ, యక్షులకీ అంకితమిస్తున్నాను. నా పూర్వాశ్రమ జీవితంలోని పేదరికానికి, దాని గాంభీర్యానికి, నాకిష్టమైన మాంసం కూర ఒక చిన్న ప్లేటు తినడానికి కూడా నోచుకోకుండా చేసిన ఆ లేమికలిమికి అంకిత-మిస్తున్నాను. బీథోవెను సృష్టించిన తుపానుకి అంకితమిస్తున్నాను. నన్ను మూర్ఛిల్లచేసే చోపేకి అంకితమిస్తున్నాను. నన్ను భయోద్రేకానికి గురిచేసి తనతో పాటు మంటల్లో విహరింపచేసిన స్ట్రావిన్స్కీకి అంకితమిస్తున్నాను. రిచర్డ్ స్ట్రాసుకి, తన కృతి 'మృత్యువూ, రూపాంతరం' లో నా విధిపర్యవసానాన్ని నాకు తెలియచేసినందుకా? మొత్తం మీద దీన్ని నేటి నా నిన్నలకి, నేటికి, డిబస్సీ ఆవిష్కరించిన పారదర్శకపు పొరకీ, మార్లోసు నోబరు కీ, కారల్ ఆర్ఫుకీ, షోహెనుబర్గుకీ, పన్నెండుశ్రుతుల సంగీతస్రష్టలకీ, ఎలక్ట్రానికు తరాల కఠోర, కర్కశ ధ్వనులకీ- నాతో పాటు నా లోపల్లోపల ఊహించలేనంత అగాధాలకి

పయనించినవారందరికీ, నా కాలపు ప్రవక్తలు, ఈ క్షణాన నేను నేనుగా విస్ఫోటనం చెందకముందే నా గురించి నన్ను ముందే హెచ్చరించినవారికి, మీకందరికీ కూడా, ఎందుకంటే మీరు లేకుండా నేను నేనుగా ఉండలేనుకాబట్టి, నన్ను నేను కనుగొనడానికి ఇతరులు కావాలి కాబట్టి, అయ్యో, నేనెంత మూర్ఖురాల్ని, దారితప్పుతున్నాను, కాని మీరు మాత్రం ఏం చెయ్యగలరు, మీ ధ్యానంలో మీరు ప్రయాణించగలిగినంత దూరం ప్రయాణించి చివరికి ఆ పూర్ణశూన్యంలో పడిపోవడం తప్పించి. ధ్యానమంటే ఏదో చివరికి దక్కే ఫలితమని కాదు, ధ్యానం దానికదే ఒక సంపూర్ణగమ్యం కావచ్చు. నేను పదరహితంగా, శూన్యాన్ని ధ్యానిస్తూంటాను. నా జీవితాన్ని కూల్చేసేది నా సాహిత్యమే.

మరోమాట, అణువు ఎలా ఉంటుందో మనం చూడలేం, కాని మనకు తెలుసు. నేను చూడని ఎన్నో విషయాల గురించి నాకు తెలుసు. అలాగే మీక్కూడా. అత్యంత సత్యాస్తిత్వం గురించి మీరు ఋజువులు చూపలేరు, మీరు చెయ్యగలిగిందల్లా దాన్ని విశ్వసించడమే. నమ్మడం, ఆపైన, ఏడవడం.

ఈ కథ ఒక అత్యవసర పరిస్థితిలో, ఒక పౌర ఉపద్రవం మధ్య సంభవించే కథ. దీనికింకా జవాబు దొరకలేదు కాబట్టి ఇది అసంపూర్తి రచననే. ఈ ప్రపంచంలో ఎవరో ఒకరు దీనికి జవాబు చెప్తారేమోనని ఎదురు చూస్తున్నాను. అది మీరేనా? ఇది టెక్నికలరు లో చిత్రించిన కథ. ఎందుకంటే ఈ పాటి హంగూ, ఆర్భాటం, దేవుడి దయవల్ల, నాక్కూడా కావాలిగా. మనందరికీ శుభమగుగాక.

26-6-2022

సంపూర్ణంగా సఫలమయినట్టు లేదు

హరూకి మురకామి. సమకాలిక ప్రపంచ రచయితల్లో తరచూ వినబడే పేరు. జపనీయ రచయిత. కథకుడు, నవలాకారుడు. ప్రతి ఏడాదీ నోబెలు ప్రైజు ప్రకటించేముందు నలుగురూ చేసే ఊహాగానాల్లో తరచూ వినిపించే పేరు. పదేళ్ళ ముందు, ఈసారి తప్పకుండా వచ్చే అవకాశం ఉండే మొదటి అయిదుగురిలో మురకామి కూడా ఉన్నాడన్నారు సదాశివరావు గారు.

ఇరవయ్యేళ్ళుగా ఏ పుస్తకాల షాపులో అడుగుపెడుతూ వస్తున్నా లిటరరీ ఫిక్షను అనే విభాగంలో మురకామి పుస్తకాలు చాలానే కనబడుతూ ఉంటాయి. మరీ ముఖ్యంగా Kafka on the Shore. కాబట్టి ఏం రాస్తున్నాడో చదువుదామని ఆయన పుస్తకాలు కూడా అప్పుడూ అప్పుడూ చేర్చిపెట్టుకున్నానని నా అల్మారా చూస్తే అర్థమయింది. కనీసం మూడు కథాసంపుటాలు కనబడ్డాయి నా పుస్తకాల్లో.

ఏ కొత్త ప్రపంచాన్ని చూస్తున్నాడో, చూపిస్తాడో చూద్దామని After the quake (2003) తీసాను. ఆరు కథల సంపుటి. దాదాపు నూటనలభై పేజీల పుస్తకం. ఆరింటిలోనూ చివరి కథ కొద్దిగా పెద్ద కథ. కాని నవలిక అని అనలేం. అన్నీ కథలే, చిన్న కథలు కాదు, పెద్ద కథలు, ఖదీరుబాబు సంతోషిస్తాడు.

కథలన్నిటికీ ఒక ఉమ్మడి ఇతివృత్తం ఉంది. అది భూకంపం. 1995 లో జపానులో కోబె ప్రాంతంలో సంభవించిన ఒక భూకంపం చుట్టూ అల్లిన కథలు. అలాగని పాత్రలేవీ భూకంపబాధితులు కారు. వాళ్ళు ఆ భూకంపానికి దూరంగా, అంచుల్లో, దాదాపుగా ప్రేక్షకులుగా మాత్రమే ఉండిపోయినవాళ్ళు. కానీ ఏదో ఒకరకంగా ఆ భూకంపం వాళ్ళ జీవితాల్ని ఎంతో కొంత మంచికో, చెడ్డకో ప్రభావితం చేస్తుంది.

రచయిత పుస్తకం మొదట్లో గొడార్డు సినిమానుంచి ఒక సంభాషణ పొందుపరిచాడు. అది ఈ కథలకి స్ఫూర్తి అని అర్థమవుతుంది. అంటే మనం న్యూసుపేపర్లో ఫలానా చోట భూకంపం వచ్చింది, ఇంతమంది మరణించారు, ఇంతమంది క్షతగాత్రులయ్యారు, ఇంతమంది నిరాశ్రయులయ్యారు అని చదువుతాం. అలాగని ఆ వార్తలు చదివితే మనకి వాళ్ళ గురించి మనకి నిజంగా ఏమీ తెలియదు. అవన్నీ వట్టి అంకెలు. ఒకవేళ టెలివిజన్లో దృశ్యాలు చూస్తే మాత్రం అదనంగా ఏమి తెలుస్తుంది? ఏమీ తెలియదు. మనం రిమోటు నొక్కి మరో ఛానెలుకి వెళ్ళిపోతాం.

కోబెలో భూకంపం సంభవించింది. దానిలో కొందరు మరణించి ఉంటారు, కొందరు గల్లంతయి ఉంటారు, కొందరు దిక్కులేనివారవుతారు. వాళ్ళెవరై ఉండవచ్చు, ఎక్కడో దూరంగా ఉన్న వాళ్ళ బంధువులో, స్నేహితులో ఆ వార్తకి ఎట్లా స్పందిస్తూ ఉండవచ్చు? కథకుడు ఆ ఊహాగానం మీంచి అల్లిన కథలివి.

కాని ఎందుకనో నాకు ఈ కథల్లో నేను ఎదురుచూసిన ప్రగాఢత కనిపించలేదు. కథకుడు తన చుట్టూ ఉన్న జీవితాన్ని ప్రగాఢంగా అనుభవంలోకి తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్నట్టూ, తన అనుభూతి ప్రగాఢంగా ఉందని నమ్మినట్టూ అనిపిస్తోందిగానీ ఆ ప్రగాఢత్వం నాదాకా అందలేదు.

అన్నిటికన్నా నన్ను ఆశ్చర్యపరిచిన విషయం, ఈ కథల్లో అనా కెరినినా, డాస్టవిస్కీ, ఆయన శ్వేతరాత్రులు, నీషే, జాన్ అప్ డైక్ లాంటి అమెరికను, యూరపియను రచయితలు కనిపించారుగానీ, ఒక్క జపనీయ రచయిత పేరుకూడా కనబడలేదు. అకుతగవా పేరు కనిపించిందిగాని, అకుతగవా బహుమతి అనే సందర్భంలో మాత్రమే. కనీసం హైకూ అనే మాటకూడా వినబడలేదు. ఒక్క జపనీయ చిత్రలేఖనం కూడా కనిపించలేదు. అయితే జపాను విమానశ్రయాలు ఉన్నాయి, రెస్టరెంట్లు, స్పాలు, రిసార్టులు, సముద్రం, ఒక మారుమూల జపనీయ పల్లె కూడా ఉన్నాయిగాని, జపాను లేదు. జపనీయ మనస్సుని పట్టుకోడానికి తాను రచనలు చేస్తున్నానని చెప్పుకున్న ఈ రచయిత రాసిన కథలు చదువుతుంటే జపనీసు లొకేషన్లలో తీసిన వెస్టర్ను టెలివిజను సిరీసు చూస్తున్నట్టుంది.

వస్తువు మాత్రమే కాదు, శిల్పం కూడా. మొదటి కథ చదవగానే రచయిత రేమండు కార్వరు తరహా శైలి కోసం ప్రయత్నిస్తున్నాడని అర్థమయిపోయింది. మురకామి కార్వరు ను జపనీసులోకి అనువదించాడట కూడా. రెండవ కథ, స్పష్టంగా డాస్టవిస్కీ తరహా కథనం. కాని డాస్టవిస్కీ లోతు లేదు. మూడవ కథ మాజికల్ రియలిస్టు పంథాలో నడుస్తుంది.

నాలుగవ కథ కాఫ్కా మెటమార్ఫసిసు తరహా కథ. దాదాపు ఆరు కథల్లోనూ కూడా రచయిత శక్తిమంతులైన కొందరు పాశ్చాత్య రచయితల ధోరణిలో తనదైన కొత్త శిల్పం కోసం ప్రయత్నించాడుగాని, సంపూర్ణంగా సఫలమయినట్టు లేదు.

కాని రచయితకి అంతర్జాతీయ ప్రకాస్తి ఊరికే రాలేదు. అందుకు కారణం అతడు కథ చెప్పడంలో చూపించే స్థిమితం. సన్నివేశ కల్పనలో ఇవ్వగల అత్యంత సూక్ష్మవివరాలు. పాత్రలతో అతడు మెయింటెయిను చేసే దూరం. (అన్నట్టు ఈ కథల్లోనే అతడు ప్రథమ పురుష కథనాన్ని వాడాడుట. మామూలుగా అతడిది ఉత్తమపురుష కథనం అని విన్నాను).

సరే, ఇంతకీ, take home ఏమిటి? రెండు విషయాలున్నాయి. మొదటిది, కథలు రాయాలనుకున్నవాళ్ళు, బాగా రాయాలనుకున్నవాళ్ళు ఎంత పాశ్చాత్యశిల్పాన్ని అనుకరించినా, తమ ప్రాంతపు కథనరీతులకి దూరంగా జరిగిపోకూడదు.

(పాశ్చాత్య కథకుల్ని ఎంతమందిని చదివినా, వారి తాత్కాలిక ప్రభావానికి లోనవకుండా ఎంత ఉండలేకపోయినా మళ్ళీ మళ్ళీ చెహోవుని చదువుతూనే ఉండాలి. ఇంతమంది రచయితల్ని, సమకాలికంగా ప్రఖ్యాతి చెందిన ఎందరో కథకుల్ని, చదివాను, కాని చెహోవుని మించిన కథకుడు, చివరికి మపాసాతో సహా, నాకిప్పటిదాకా ఎవరూ కనబడలేదు. అన్నట్టు కార్వరు కూడా చెహోవుని పదే పదే చదివినవాడే. అయితే కథ రాయడానికి కూచున్నాక ఆ original model ని తాను పూర్తిగా చెరిపేసుకుంటానని కార్వరు ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. అలా చెరిపేసుకోగలగడం మురకామికి బహుశా ఇంకా చాతకాలేదు అనుకోవాలి.)

ఇక రెండవది, ఇట్లాంటి ఒక ఇతివృత్తం చుట్టూ కథలు రాసే ఆలోచన. కరోనా కూడా భూకంపం లాంటిదే. అయితే ఒక్కరోజు ప్రకంపన కాదు, కొన్ని నెలలపాటు సంభవించిన ప్రకంపన. ఆ ఇతివృత్తం చుట్టూ ఇట్లాంటి కథలు ఒక్క రచయితనో లేదా నలుగురు రచయితలో అల్లితే ఎలా ఉంటుందంటారు?

28-6-2022

తెగిన బంధనాలు

టాగోరు రాసిన 'చతురంగ' (1916) నవల ఇంగ్లిషు అనువాదం Quartet (2019) చదివాను. అనువాదకుడు నిర్మలకాంతి భటాచార్య నేషనల్ బుక్ ట్రస్టు డైరక్టరుగానూ, సాహిత్యఅకాడెమీ పత్రిక ఇండియను లిటరేచరు సంపాదకుడిగానూ పనిచేసినవాడు. ప్రసిద్ధ అనువాదకుడు.

టాగోరు రచనల్లో ఈ నవల తెలుగులోకి వచ్చినట్టు గుర్తులేదు. తొంభై పేజీలు కూడా లేని ఈ నవల లేదా నవలిక రాయడానికి టాగోరుకి దాదాపు రెండేళ్ళ పైనే పట్టిందట. ఆ నవల రాయడానికి తనకు అనుకూలమైన వాతావరణం దొరకడంలేదనీ, అందుకని శాంతినికేతనం నుండి దూరంగా వెళ్ళిపోయి రాస్తున్నాననీ రాసాడు ఆయన ఒక ఉత్తరంలో.

ఆ నవల రాసిన సమయం కూడా ఆశ్చర్యకరమైందే. సరిగ్గా నోబెలు పురస్కారం (1913) పొందిన మరుసటి ఏడాది ఆ కథ రాయడం మొదలుపెట్టాడు. తన సుప్రసిద్ధ నవల 'గోరా' (1910) రాసి అప్పటికే నాలుగేళ్ళు. ఈ నవల రాయడం పూర్తికాగానే మరొక సుప్రసిద్ధ రచన 'ఘరే–బైరే' (1916) రాసాడు. కాని గోరాకి, ఘరే బైరేకి వచ్చిన ప్రశస్తి ఈ చిన్నిపుస్తకానికి రాలేదు. కాని ఇది టాగోరు సృజనాత్మక వచనరచనల్లో చాలా ప్రత్యేకమైనదనీ, దీన్ని టాగోరు తన కాలం కన్నా ఎంతో ముందుకు వెళ్ళి రాసినందువల్ల ఈ రచన పాఠకులస్థాయిని దాటిపోయిందనీ అందుకే జనాదరణకు నోచుకోలేదనీ విమర్శకులు తమకి తాము సర్దిచెప్పుకున్నారు.

ఇది ఒక ప్రయోగాత్మక నవల. ఒక రచయిత తన యాభయ్యల్లో ఇటువంటి ప్రయోగానికి పూనుకోవడం ఆశ్చర్యం కలిగించే విషయమే. ఇది నాలుగు అధ్యాయాల్లో నడిచే రచన. నలుగురు ప్రధాన పాత్రధారుల మీద నాలుగు కథనాలు. అలాగని ఆ

కథనం ఆ పాత్ర తన గురించి చెప్పుకునే కథ కాదు. ప్రతి పాత్రా మరొక పాత్రని దృష్టిలో పెట్టుకుని కథ చెప్తుంది. అంటే ఒకరినొకరు అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నారని మనకి అర్థమవుతుంది. కాని ఆ క్రమంలో ఎవరూ ఎవరినీ సరిగా అర్థం చేసుకోలేదనే ధ్వని కూడా ఉందేమో, చెప్పలేను.

హరిమోహన్, జగమోహన్ అన్నదమ్ములు. హరిమోహన్ సనాతనుడు. మతాన్నీ, మత క్రతువుల్నీ నమ్ముకున్నవాడు. జగమోహన్ పందొమ్మిదోశతాబ్ది మహాసంస్కర్తల దారిలో, బ్రిటిషు పాజిటివిస్టుల స్ఫూర్తితో అన్ని సంప్రదాయాల్నీ, దేవుణ్ణీ, మతాన్నీ పూచికపుల్లగా ఎంచి పక్కన పారేసినవాడు. కనబడని దేవుడికి అన్నం పెట్టి సేవచేసేకన్నా కంటికి కనిపించే బీద ముస్లిములకీ, దళితులకీ సేవచేయడం జీవితానొక సార్థకత చేకూరుస్తుందని నమ్మినవాడు. ఆ అన్నదమ్ములిద్దరికీ పిత్రార్జితం కొంత ఆస్తి, ఇల్లు ఉన్నాయి. తన అన్నకి దేవుడిలోనూ, మతంలోనూ నమ్మకం లేదుకాబట్టి, తమ ఆస్తి దైవకార్యాలకోసమే ఖర్చు చేయాలని వీలునామా ఉంది కాబట్టి, తన అన్నవాటా కూడా తనకే దక్కాలంటూ తమ్ముడు హరిమోహన్ కోర్టులో కేసు వేసాడు. అన్న ఆ కేసులో వాదించకపోగా, తాను నమ్మని దేవుడి పేరుమీద తనకు చిల్లిగవ్వ కూడా అవసరం లేదని చెప్పేస్తాడు. ఆ పాతకాలపు ఇల్లు రెండుముక్కలవుతుంది.

హరిమోహన్‌కి ఇద్దరు పిల్లలు. పురందర్, శచి. శచి జగ్‌మోహన్ జీవితాన్నీ, ఆదర్శాల్నీ, సంస్కర్తహృదయాన్నీ చూసి గాఢంగా ప్రభావితుడవుతాడు. కాని అతడి తండ్రికి అది ఇష్టం ఉండదు. తన చిన్న కొడుకుని ఎలాగేనా తన పెదతండ్రి ప్రభావం నుంచి బయట పడెయ్యాలని చూస్తాడు. ఈ లోగా శచి ఒకరోజు నానిబాల అనే ఒక బాలవితంతువుని తన పెద్దనాన్న దగ్గరకు తీసుకొస్తాడు. ఆమెని ఎవరో మోసం చేసి గర్భవతిని చేసారని చెప్తాడు. ఆమెకి జగమోహన్ ఆశ్రయమిస్తాడు. దేవుణ్ణి నమ్మని ఆ సంస్కర్త ఆమెలో తన తల్లిని చూస్తాడు. కాని లోకాపవాదం అతడిమీద విరుచుకుపడుతుంది. అయినా చలించడు. కొన్నాళ్ళకు రహస్యం తెలుస్తుంది. తన తమ్ముడి పెద్దకొడుకు పురందర్ ఆమెని మోసం చేసాడని తెలుస్తుంది.

ఆమెని ఆ సమాజం నుంచి ఎలా కాపాడాలో జగమోహన్‌కి అర్థం కాదు. ఆయన వేదన, ఆ బాలవితంతువు దైన్యం చూసి శచి ఆమెని తాను పెళ్ళాడతానని ముందుకు వస్తాడు. జగమోహన్ ఆనందానికి హద్దు ఉండదు. తన ఆశయాలకూ, ఆదర్శాలకూ శచి తగిన వారసుడయ్యాడని సంతోషిస్తాడు. ఆ విషయం ఆ అమ్మాయితో చెప్పి ఆమెకొక పట్టుచీర ఇచ్చి ఆ రాత్రి శచితో మాట్లాడమని చెప్పి బయటకు వెళ్తాడు. కాని ఆ అమ్మాయి

ఆత్మహత్య చేసుకుంటుంది. ఇది మొదటి కథ. జగమోహన్ పేరు మీద 'పెదనాన్న' అంటూ నడిచే అధ్యాయం.

కలకత్తాలో ప్లేగు వ్యాపిస్తుంది. బీద ముస్లింరోగులకి సపర్య చేస్తూ జగమోహన్ ప్లేగుబారి పడి మరణిస్తాడు. శచి అక్కణ్ణుంచి వెళ్ళిపోతాడు. కొన్నాళ్ళకు అతడు లీలానంద స్వామి అనే ఆయన ఆశ్రమంలో ఆయనకు పరిచర్యలు చేస్తూ కనబడతాడు. లీలానంద స్వామి జగమోహన్‌కి విరుద్ధధ్రువం. ఆయన నిరంతరం నామసంకీర్తనంలో, దైవసేవలో, ప్రవచనాల్లో కాలం గడుపుతుంటాడు. ఆయన ప్రభావం అపారం. ఆయన్ని విమర్శించాలను కున్నవాళ్ళు కూడా ఆయన దగ్గర కొన్నాళ్ళు ఉంటే ఆయన ప్రభావంలో పడిపోతారు. ఆయన శిష్యుడొకాయన అకాలమరణం చెందినప్పుడు తన యావదాస్తినీ ఆశ్రమానికి రాసిచ్చేస్తాడు. తన భార్య, ఇప్పుడు వితంతువు, ఆమెని కూడా ఆ స్వామి సంరక్షణలో పెట్టి చనిపోతాడు. ఆ యవ్వన వితంతువు దామిని ఆకర్షణీయమైన వ్యక్తి. ఆమె మొదట్లో స్వామిపట్ల, ఆశ్రమం పట్ల ఎటువంటి గౌరవం చూపించదు. కాని శచి వచ్చిన తరువాత ఆమెకి ఆ ఆశ్రమం ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఆమె తన పట్ల ఆకర్షితురాలవుతున్నదని గ్రహించడం శచికి కష్టమేమీ కాదు. కాని ఆమెనుంచి ఎలా పారిపోవాలన్నదే అతడి సమస్యగా మారిపోతుంది. ఇది రెండవ అధ్యాయం. శచి పేరిట నడిచిన కథ.

శ్రీవిలాస్ శచి స్నేహితుడు. గొప్ప వక్త, విద్యాధికుడు. అతడు శచిని వెతుక్కుంటూ ఆశ్రమానికి వెళ్ళి అక్కడి వాతావరణంలో శచిని చూసి ఆశ్చర్యపోతాడు. చివరికి తన మిత్రుడికోసం అక్కడే ఉండిపోతాడు. శచి తన ఆకర్షణ నుంచి పక్కకు తప్పుకుంటున్నాడని గ్రహించిన దామిని శ్రీవిలాస్‌కు దగ్గరగా జరుగుతుంది. ఆశ్రమానికి సంబంధించిన పనుల్లో అతడి సాయం తీసుకుంటూ ఉంటుంది. అతణ్ణేవేనా ఆధునిక బెంగాలీ రచనలు తెచ్చిపెట్టమని, చదివి వినిపించమని అడుగుతుంది.

దామిని శ్రీవిలాస్ పట్ల చూపిస్తున్న ఆసక్తి శచిని, స్వామీజీనీ కూడా కలవర పరుస్తుంది. చివరకు వారిద్దరూ కూడా ఆమెని ఆశ్రమం నుంచి బయటకు వెళ్ళిపోయి వేరే ఎక్కడేనా ఉండమంటారు, ఆమె పోషణ బాధ్యత మాత్రం తాము వహిస్తామని చెప్తారు. ఆమె బయటకి వెళ్ళదు. దాంతో శ్రీవిలాస్ ఆమెని కలకత్తాలో ఆమె బంధువుల దగ్గర చేరుద్దామనుకుంటాడు. కాని బంధువులెవరూ ఆమెకి ఆశ్రయమివ్వరు. చివరకి శ్రీవిలాస్, దామిని ఊరవతల ఒక నిర్జన గృహంలో ఉండటానికి నిశ్చయించుకుంటారు. తమతో పాటు ఉండమని శచిని కూడా అడుగుతారు. శచి ఒప్పుకుంటాడు. ఇది మూడో అధ్యాయం, దామిని పేరు మీద జరిగిన కథ.

ఇక చివరి అధ్యాయం శ్రీ విలాస్ పేరు మీద జరిగిన కథ. ఆ ఊరి బయట బంగళాలో శచి, దామిని, శ్రీ విలాస్ ఉండగా, దామిని శచి మీద తన ఇష్టాన్ని ప్రకటిస్తూనే ఉంటుంది. చివరికి ఒక తుపాను రాత్రి శచి ఆ ఇల్లు వదిలి బయటకు పారిపోతాడు. దామిని కూడా ఆ తుపానులో అతణ్ణి వెతుక్కుంటూపోతుంది. చివరికి ఆమె శచి ముందు ఓడిపోయి ఇంటికి వస్తుంది. శ్రీవిలాస్ దామిని పెళ్ళి చేసుకుంటారు. కాని రెండేళ్ళు తిరక్కుండానే దామిని మరణిస్తుంది. మరణించేముందు శ్రీ విలాస్‌తో 'నీ పట్ల నా తృష్ణ ఈ జన్మలో పరిపూర్తి కాలేదు. నీ కోసం మళ్ళీ పుట్టాలని ఉంది' అని చెప్తుంది.

స్థూలంగా ఇదీ కథ. అప్పటికింకా మనస్తత్వశాస్త్ర పరిశోధనలేవీ భారతదేశానికి చేరలేదు. ఆ తర్వాత పదేళ్ళకుగానీ టాగోరు ఫ్రాయిడుని కలుసుకోలేదు. కాని ఈ రచనలో మనస్తత్వ పరిశీలన ప్రగాఢంగా కనిపించడంతో పాటు, మానవ అంతరంగాన్ని అర్థం చేసుకోవడంలో ఉండే నలుగులాట మొత్తం కనిపిస్తుంది.

కాని ఈ నవలలోని ప్రధాన ఇతివృత్తం శచి-దామినిల మధ్య నడిచే ఆకర్షణ-వికర్షణ కాదు. నవల చదువుతుండగానే ఇది టాగోరు సమస్య అని అనిపించింది నాకు. ఇందులో ఆయన తనకీ, భగవంతుడికీ మధ్య నడుస్తున్న సంవాదాన్ని చిత్రించడానికి ప్రయత్నించాడు. అప్పటికి ఆయన భగవంతుడి వాగ్గేయకారుడిగా గీతాలు రాస్తూ ఉన్నాడు. అటువంటి ఒక గీతసంపుటికి నోబెలు బహుమతి కూడా వచ్చింది. మరొకవైపు సాంఘికసేవలో భాగంగా శాంతినికేతను ప్రారంభించాడు. కాని దేవుణ్ణి చేరుకోడానికి ఏది సరైన మార్గం? మానవుణ్ణి మించిన మాధవుడులేడని సంఘసేవ చెయ్యడమా (కథలో శచి పెదనాన్న జగమోహన్ లాగా) లేదా భగవల్లీలా స్మరణలో, నామసంకీర్తనలో, జీవితం ప్రతిరోజూ ఒక ఉత్సవంగా గడపడమా (కథలో లీలానంద స్వామిలాగా). (ఈ కథలో మూడవ ఆదర్శం అంటే జాతీయోద్యమంలో పాల్గొని జైలుకి వెళ్ళడం అన్న ప్రశ్న టాగోరు ఎత్తుకోలేదు. అది 'ఘరే-బైరే'కి వదిలిపెట్టాడు.)

మనుషుల్ని సేవించడం లేదా భగవంతుణ్ణి ఆరాధించడం వాటికవే గొప్ప ఆదర్శాలు అయిఉండవచ్చునేమోగాని, వాటిని తన ప్రకృతినుంచి తప్పించుకోడానికో లేదా మానవ ప్రకృతిని పక్కన పెట్టడానికో చెయ్యకూడదనేది టాగోరు నమ్మిక. ఒక బాలవితంతువుని పెళ్ళి చేసుకుంటానని శచి ముందుకు వచ్చినప్పుడు, పందొమ్మిదో శతాబ్ది మహాసంస్కర్తల కోవలో, జగమోహన్ సంతోషించడంలో, ఎంతలేదన్నా ఒక అమానుషత్వపు అపస్వరం ఉంది. ఆమెని ఉద్ధరిస్తున్నామన్న ఊహలేకపోలేదందులో. అంతకన్నా కూడా బుచ్చమ్మ విషయంలో సౌజన్యారావు పంతులు అనుకున్నట్టుగా, ఆమెని చదివించడానికి సిద్ధపడి

ఉంటే ఆ కథ మరోలా ఉండేది. ఇక లీలానందస్వామి శిష్యుడొకడు తన ఇంటికొచ్చిన అనాథమరదలితో ప్రేమలో పడటంతో ఆ శిష్యుడి భార్య ఆమెకీ, తన భర్తకీ పెళ్ళి చేసి తాను మరణిస్తుంది. తన కళ్ళ ఎదట, తన శిష్యుడి ఇంట్లోనే ఇంత ఘాతుకం జరుగుతుండగా, దాన్ని పట్టించుకోకుండా దేవుణ్ణి కీర్తించడంలో ఉన్న క్రూరత్వాన్ని విమర్శించడం ఎలానూ సులభమే.

మరేది దారి? మనిషికి అన్నిటికన్నా కష్టమైనవి తోటిమనుషుల్తో తనకి ఏర్పడే మహకార, మోహ బంధాలు. వాటిని బలవంతంగా తెంచుకుని ఉపయోగం లేదు. అలాగని కూరుకుపోవడమూ శ్రేయస్కరం కాదు. Broken Ties అని పేరుపెట్టాడుట, టాగోరు ఈ పుస్తకానికి, ఇంగ్లిషులో. తెగిన బంధనాలు. బంధనాలు తెగడమే ప్రతి మనిషీ కోరుకునేది. కాని వాటంతట అవి తెగడమే కాదు, ఒకసారి ఒకరితో తెగిపోయాక, మళ్ళా మరొకరితో అతుక్కోకూడదు. అదెలా సాధ్యం?

ఈ నవలికలో టాగోరు ఒక పరిష్కారం కోసం వెతికాడనుకోను. మనల్ని ఆలోచింప చేయడమే ఆయన ఉద్దేశంలాగా కనిపిస్తుంది. కథలో ఒకచోట, శంకరాచార్యుల 'మోహముద్గరం' ప్రస్తావన కూడా వస్తుంది. శంకరాచార్యుడు భార్యాబిడ్డలు మాయ అని అనడమయితే అన్నాడుగానీ, ఆయన సన్యాసి. వివాహితుడు కాడు, ఆ సంబంధాలు ఎటువంటివో ఆయనకేమి తెలుసు అంటాడొక పాత్ర. భార్య, బిడ్డలు మాయ అంటే వాళ్ళు లేరనీ, వాళ్ళ బాధ్యత నీకు లేదనీ కాదు. అటువంటి మూసల్లో వాళ్ళు లేరనీ, ఉండరనీ, ఉండాలని అనుకోకూడదనీ దాని అర్థం అని చెప్పకనే చెప్తాడు టాగోరు, నవల పూర్తయ్యేటప్పటికి.

ఏమైనప్పటికీ, టాగోరుని చదవడంలో గొప్ప ఆనందం ఉంది. అది మాటల్లో చెప్పగలిగేది కాదు. నాలుగు అధ్యాయాల ఈ నవల కూడా ఒక గీతం లాంటిదే. టాగోరు గీతాల్లో, ధ్రుపద్ గానంలోలాగా, సాధారణంగా నాలుగు చరణాలుంటాయి. స్థాయి, అంతర, సంచార, ఆభోగ్ అని. ఈ నవల్లో నాలుగు అధ్యాయాలూ కూడా ఒక గీతంలోని నాలుగు దశలు. నవల పూర్తయ్యేటప్పటికి, ఒక ధ్రుపద్ గీతాలాపన పూర్తయిన తర్వాత నిశ్శబ్దమే మనలోనూ మిగుల్తుంది.

30-6-2022

తీవ్రమానవానుభవానికి అక్షరరూపం

నేను చెప్తున్న ఈ కథనం చదివి కొంతమంది పాఠకులు ఆగ్రహోద్రిక్తులు కావచ్చు, లేదా జుగుప్సకి లోనుకావచ్చు. అది సభ్యసమాజం వినడానికి రుచించని విషయంగా కూడా భావించవచ్చు. కానీ ఏ అనుభవమైనా సరే, అది ఎటువంటిది కానీ, దాన్ని నలుగురికీ తెలిసేటట్టుగా నమోదు చెయ్య వలసిన హక్కు ప్రతి అనుభవానికీ ఉంటుందని నమ్ముతాను నేను. సత్యంలో తక్కువస్థాయి సత్యమంటూ ఏదీ లేదు. అదీకాక నేను ఈ నా ప్రయత్నంలో, అంటే నా అనుభవాన్ని నమోదు చెయ్యడంలో విఫలమయితే ఎందరో స్త్రీల జీవితాల్ని మూగబోయేటట్టు చేసే అపరాధం చేసినట్టే, తద్వారా ఈ పురుషాధిక్య ప్రపంచాన్ని అభిశంసించకుండా ఉండిపోయినట్టే.

ఈ రోజు నోబెలు కమిటీ సాహిత్యానికి నోబెలు బహుమతి ప్రకటించిన ఫ్రెంచి రచయిత్రి అన్నీ ఎర్నో నవల Happening (1999) లో వాక్యాలివి.

ఆ నవల ఒక ఉత్తమపురుష కథనం. అక్షరాలా రచయిత్రి స్వీయ అనుభవం. 1963 లో ఆమె ఇంకా కాలేజి విద్యార్థిగానే ఉండగానే 'సంభవించిన' ఒక అవాంఛిత గర్భం, ఆ గర్భవిచ్ఛిత్తికోసం ఆమె పడిన దుర్భరసంఘర్షణ ఆ నవలకి ఇతివృత్తం. కాని అంతకన్నా ముఖ్యం, ఆ అనుభవానికి ఆమె అక్షరరూపాన్నివ్వడం.

ఆ happening ని writing గా మార్చడం అత్యంత సాహసోపేతమైన చర్య మాత్రమే కాదు, ఒక విధంగా చెప్పాలంటే ఒక విముక్తి గాథ కూడా. తన కథనం (దాన్ని నవల అని పిలవాలనిపించడం లేదు) చివరి పేజీలకు వచ్చేటప్పటికి ఆమె ఇలా రాస్తున్నారు:

> ఒక తీవ్రాతితీవ్రమైన మానవానుభవానికి అక్షరరూపాన్నివ్వడం పూర్తి చేసాను. జీవన్మరణాల అంచుల్లో, కాలం, చట్టం, నీతులు, నిషేధాల మధ్య– నేను నా దేహాన్ని దాటిపోగలిగిన అనుభవం అది.

ఆమె ఇంకా ఇలా అంటున్నారు:

> ఈ సంఘటనకి సంబంధించిన ఒకే ఒక్క అపరాధభావమేదైనా ఉంటే దాన్నుంచి బయటపడ్డాను. అది ఈ అనుభవం నాకు సంభవించిందనేది, అది నా ప్రయత్నం వల్ల జరిగింది కాదనేది. తిరస్కరించిన కానుక లాంటిదన్నమాట. నా గతానికి సంబంధించిన ఎన్నో సాంఘిక, మానసిక కారణాలన్నిటిమధ్యా, ఒక విషయం మాత్రం నాకు స్పష్టం. అదేమంటే ఈ అనుభవాలు నాకెందుకు సంప్రాప్తమయ్యాయంటే నేను వాటిని నలుగురికీ చెప్పగలను కనుక. బహుశా నా జీవితం తాలూకు యథార్థమైన ప్రయోజనం నా దేహం, నా సంవేదనలు, నా ఆలోచనలు రచనలుగా మారడమే అనుకుంటాను. మరో విధంగా చెప్పాలంటే నా అనుభవాలు తద్వారా నలుగురూ అర్థం చేసుకోగలిగేవిగానూ, సార్వజనీనంగానూ మారి తద్వారా నా అస్తిత్వం ఇతరుల జీవితాల్లోనూ, భావనల్లోనూ సంగమిస్తుంది.

ఆమె మాటలు అక్షర సత్యాలు. పట్టుమని 130 పేజీలు కూడా లేని ఈ కథనం చదివిన తరువాత స్త్రీపురుష ప్రేమ, లైంగిక సంబంధాలు, గర్భధారణ, అబార్షను, నీతిసూత్రాలు, చట్టాలు, సమానహక్కుల ఉద్యమాలు, మతం, మతనియమాలు– వీటన్నింటి గురించిన మన ఆలోచనలు పెద్ద కుదుపుకి లోనవుతాయి.

వాటన్నిటి గురించీ మనకి ఇప్పటికే స్పష్టంగా ఏవో కొన్ని అభిప్రాయాలంటూ ఉన్నా, లేకపోయినా, లేక, మనకి అటువంటి అభిప్రాయాలున్నట్టు మనకి తెలియకపోయినా కూడా, మన ప్రాపంచికదృక్పథం ఒక్కసారిగా పెద్ద పరీక్షకు లోనవుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆమె ఈ రచన చెయ్యడం ద్వారా యావత్ప్రపంచాన్నీ అగ్నిపరీక్షకు గురిచేసారని చెప్పవచ్చు.

ఒక అబార్షనుకు సంబంధించిన కథనం అనడం ఈ రచనను సరిగ్గా వివరించినట్టు కాదు. అన్నిటికన్నా ముఖ్యమైన విషయం స్త్రీ దేహం మీద, ఆ దేహానికి సంబంధించిన అన్ని అనుభవాల మీద ఆమెకే పూర్తి హక్కు ఉండాలని ఎందరో మానవతావాదులు, ఫెమినిస్టులు, హక్కుల ఉద్యమకారులు చెప్తూనే ఉన్నారు. కాని ఆ మాటల్ని ఒక స్త్రీగా

తన స్వీయానుభవాన్ని నిస్సంకోచంగా చెప్పడం ద్వారా చెప్పి మనల్ని పూర్తిగా తనవైపు తిప్పుకోవడమే ఈ రచన సాధించిన విజయం.

ఈ రచనలోని అనుభవం, ఆ సంఘర్షణా వాటికవే తీవ్రమైనవి. కాని వాటిని మనతో పంచుకుంటున్నప్పుడు ఆమె చూపించిన సంయమనం వల్ల ఆ కథనం మరింత తీవ్రీకరణ చెందింది. నోబెలు కమిటి తన ప్రకటనలో ఇలా అన్నదంటే ఆశ్చర్యం లేదు:

> ఆమె రచనల్లో సర్వోత్తమమమైందిగా చెప్పదగ్గ L'Evéngement (2000, Happenigng, 2001) చట్టవిరుద్ధంగా అబార్షనుకు పాల్పడిన ఒక 23 ఏళ్ళ కథకురాలి అనుభవాన్ని ఎంతో శస్త్రతుల్యమైన సంయమనంతో చెప్పిన రచన. అదిఉత్తమపురుష కథనం మాత్రమే కాక, తక్కినరచనల్లోలాగా ఆ కథకురాలి చారిత్రిక యథార్థాన్ని దూరంగా పెట్టినట్టు కనిపించదు. అప్పటికే సామాజిక అణచివేత స్వభావంవల్లా, చుట్టూ ఉండేవారు ఆమెనేదో ఉద్ధరిస్తున్నట్టు మాటాడే మాటల వల్లా ఆ కథకురాలి 'నేను' ఒక మనిషిగా కాక, ఒక వస్తుగతవిషయంగా మారిపోయింది. ఆ కథనం అత్యంత కర్కశమైన నిజాయితీతో కూడినదే కాక, ఆమె తన కథనం మధ్యలో బ్రాకెట్లలో పెట్టి చెప్తూ వచ్చిన వ్యాఖ్యలు ఏకకాలంలో స్వగతాలూ, పాఠకులతో సంభాషణలూ కూడా. ఆ 'సంఘటన' జరిగిన పాతికేళ్ళ తరువాత కూడా పాఠకుణ్ణి ఆ సంఘటనలో సంలీనం చేసుకునే విధంగా ఆ కథనం సాగుతుంది.

నోబెలు కమిటి రాసిన వాక్యాల్లో అతిశయోక్తి ఎంత మాత్రం లేదు. రచయిత్రినే ఒక చోట ఇలా అంటున్నారు:

> నేను రాస్తున్నప్పుడు నా కోపమో, బాధనో కవితాత్మకంగా పొంగిపొర్లకుండా నన్ను నేను కాపాడుకోవాలి. ఈ కథనాన్ని నేను ఏడుపుతోనూ, పెడబొబ్బల తోనూ ఎందుకు నింపట్లేదంటే, ఆ రోజుల్లో అవి నా జీవితంలో లేవు కాబట్టి. ఆ రోజు నన్ను పరిశోధిస్తున్నట్టుగా పరిశీలించిన ఆ ఫార్మసిస్టు చూపులు, ఆ గదిలో ఆవిరిగక్కుతున్న వేడినీళ్ల బేసినులో హెయిర్ బ్రష్ అవి నాకు ఏ అసంతోషాన్ని కలిగించాయో ఆ అసంతోషానుభవ ప్రవాహాన్ని అంతే స్థిరంగా పట్టుకోవడం నాకు ప్రధానం. కొన్ని చిత్రాలు చూసినప్పుడు, కొన్ని మాటలు విన్నప్పుడు నాకు కలిగే క్షోభ నేను అప్పుడు అనుభవించినదాని ముందు

నిలబడగలిగేది కాదు. ఇవి సాహిత్య భావోద్వేగాలు. వీటి ప్రయోజనం ఒక రచనగా బయటపడటం, ఆ అనుభవ యాథార్థ్యాన్ని నిర్ధారించడం మాత్రమే.

Happening ఒక సర్జను చేతిలో శస్త్రంలాగా ఎంతో నిర్మమత్వంతో, అపారమైన దయతో, ముఖ్యంగా స్త్రీల దుఃఖం పట్ల ఎంతో సహానుభూతితో చెప్పిన కథనం. ఆ కథకురాలు ఒక సాహిత్యవిద్యార్థి కావడం వల్ల ఆ రచన మరింత ప్రగాఢతను సంతరించుకుంది. ఒక విక్టర్ హ్యూగో, ఒక మార్సెల్ ప్రూ మహేతిహాసాలు రాయడం ద్వారా మనతో పంచుకున్న మానవానుభవగాఢతని ఈ రచయిత్రి నూటముప్ఫై పేజీల్లోనే సాధ్యం చేసుకోవడం సామాన్యమైన విషయం కాదు.

ఆమె రచనలోని ఆ క్లుప్తత, గాఢత, ఆ సర్జనికుడి నిర్మోహత్వాల్ని చూపించడానికి ఏ వాక్యాన్ని ఉదాహరించాలంటే మొత్తం పుస్తకాన్ని ఎత్తి రాయవలసి ఉంటుంది. అయినా రెండు మూడు ఉదాహరణలు ఇవ్వడం నా ధర్మం. ఆమె ఇలా రాస్తున్నారు:

> అది (అబార్షన్ అనుభవం) వర్ణించలేని దృశ్యం. జీవన్మృత్యువులు ఒక్క గుక్కలోనే అనుభవానికొచ్చాయి. క్రతువుల్లో బలి ఇచ్చే దృశ్యంలాంటిదది. ..
>
> మొదటిసారిగా నేను పుట్టుకకీ, చావుకీ రెండింటికీ జన్మనిచ్చాను. ..
>
> ఆ రోజుల్లో మా తల్లితండ్రులు హాస్పటలు నుంచి ఇంటికి వెళ్ళిపోయాక అప్పటి దృశ్యం ఒకే ఒక్కటి నాకళ్ళముందు ఇప్పటికీ కదలాడుతూ ఉంటుంది. నేను మంచం మీద పడుకుని ఉంటాను, ఎదురుగా తెరిచిన కిటికీ, నా చేతుల్లో జెరార్డ్ డి నెర్వాల్ కవితల పేపరుబాక్ సంపుటి. బిగుతుగా ఉండే నల్లని పాంటులో కప్పబడ్డ నా కాళ్ళని చూసుకుంటూ ఉండేదాన్ని, వాటిమీద వర్షిస్తున్న సూర్యరశ్మి, ఇప్పుడు ఆ కాళ్ళు మరొక స్త్రీవి. ..

అన్నిటికన్నా ముఖ్యంగా మరీ ఈ రెండు పేరాలు:

> నా గదిలో బాక్ స్వరపరిచిన సెయింట్ జాన్ వేదనను వినేదాన్ని. క్రీస్తు వేదనని ప్రకటించడానికి ఆ సువార్తీకుడి వాక్యాల్ని గాయకుడు జర్మనులో ఆలాపిస్తున్నప్పుడు నేను ఆ ఆక్టోబరు నుంచి జనవరిదాకా అనుభవించిన వేదనని నాకు తెలియని ఏదో భాషలో ఆలపిస్తున్నట్టుగా అనిపించేది. అప్పుడు 'వొహిన్! వోహిన్!' అంటో కోరసు వంత కలిపేది. దిగంతాలు విచ్చిపోయేవి.

నాకు అబార్షను చేసిన ఆ గది, ఆ ముల్లు, ఆ రక్తం, అవన్నీ ఈ ప్రపంచ దుఃఖంలో, నిత్యమృతువులో కలిసిపోయేవి. నేను రక్షించబడ్డాననిపించేది.

ఆ నగరవీథుల్లో నడిచేను. ఆ జనవరి 20-21 రాత్రి రహస్యాన్ని నా దేహం ఒక పవిత్రానుభవంగా గుర్తుచేసుకుంటూ ఉంది. నేను భయానక అనుభవం అంచులకు చేరుకున్నానా లేక మహాసౌందర్యతీరానికి చేరుకున్నానా తేల్చుకో లేకపోయాను. నాకు చాలా గర్వంగా అనిపించింది. ఆ అనుభవం సాధారణంగా ఒంటరివాళ్ళయిపోయిన నావికులకూ, దొంగలకూ, డ్రగ్గుల వ్యసనానికి లోనయ్యేవాళ్ళకీ లభించే లాంటి అనుభవం. ఇతరులెవ్వరూ అడుగుపెట్టడానికి సాహసించని ప్రాంతాల్లో అడుగుపెట్టేటప్పటి అనుభూతి. బహుశా ఈ రచన రాయడానికి కూడా ఆ అనుభూతినే కొంత వరకూ కారణమనుకుంటాను.

చివరగా ఏ వాక్యాలతో ముగిద్దామా అనుకుంటే నోబెలు కమిటి రాసిన ఈ వాక్యాలే మరొకసారి చెప్పదగ్గవిగా కనిపిస్తున్నాయి. స్వీడిషు కమిటి ఇలా అంటున్నది:

సాహిత్యానికున్న విమోచనశీల శక్తిని అన్నీ ఎర్నో స్పష్టంగా నమ్ముతున్నారు. ఆమె సాహిత్యం అత్యంత సాధారణభాషలో, అత్యంత పరిశుభ్రంగా, రాజీలేని విధంగా రాసిన సాహిత్యం. శ్రామికవర్గానికి చెందిన అనుభవాలు కలిగించే వేదననీ, అవమానాన్నీ, న్యూనతనీ, అసూయనీ, నువ్వెవరో నువ్వు తెలుసు కోడానికి వీల్లేకుండా చేసే అశక్తతనీ గొప్ప సాహసంతోనూ, వైద్యనిదానం తోనూ ఆమె వెల్లడిస్తున్నప్పుడు, ఆ పని శాశ్వతంగా నిలిచేదిగానూ, ఎంతో ఆరాధనీయంగానూ కనిపిస్తున్నది.

6-10-2022

భీముడి ఆత్మకథ

కేరళ నుంచి రాగానే చేసిన మొదటి పని Bhima పుస్తకం అలమారులో ఎక్కడుందో వెతకడం. ఎం.టి.వాసుదేవన్ నాయరు రాసిన 'రండ మూళం' (రెండవ వంతు, 1983) అనే నవలకి ఇంగ్లిషు అనువాదం అది. పదేళ్ళ కిందట ఒక మిత్రురాలు ఆ పుస్తకం కానుక చేసి 'దీని మీద నీ అభిప్రాయం వినాలని ఉంది' అన్నారు. నాలుగు వందల పేజీల నవల. ఆ నవల గురించి ఎంతో విన్నాను. ఎం.టి.వాసుదేవన్ నాయరుకి జ్ఞానపీఠ పురస్కారం (1995) రావడానికి ఆ నవల చాలావరకు కారణమని చెప్తారు. ఆయన రాసిన తొమ్మిది నవలలు, పందొమ్మిది కథాసంపుటాలు, నాటకాలు, సాహిత్యవిమర్శ, యాత్రాకథనాలూ అన్నింటిలోనూ ఈ నవల సర్వోత్కృష్టమని చెప్పడం విన్నాను. ఆయన తొలిసారిగా రాసి, దర్శకత్వం వహించిన 'నిర్మాల్యం' సినిమాకు జాతీయస్థాయి ఉత్తమ స్క్రీన్ ప్లే, ఉత్తమ దర్శకత్వం పురస్కారాలు లభించాయి. కాని, ఇప్పటికీ, ఎం.టి అంటే 'రండమూళం' నవలనే గుర్తుచేసుకుంటారు ఆయన అభిమానులు.

నేను ఆయన రచనల్లో ఇప్పటిదాకా చదివింది, ఆయన మొదటినవల, ఆయనకు సాహిత్యలోకంలో గుర్తింపు తెచ్చిన 'నాలుకెట్టు' (1958). దాన్ని నేషనల్ బుక్‌ట్రస్టు వారు 'సమష్టి కుటుంబం' పేరు మీద తెలుగులోకి తెచ్చారు. ఆ ఒక్క నవలతోనే ఆయన్ని ఎన్నదగ్గ రచయితల్లో ఒకడని గుర్తుపెట్టుకున్నాను.

ఇప్పుడు ఈ Bhima, Lone Warrior (2013) ఆయన రచనల్లో నేను చదివిన రెండవ నవల. చదవడం ఇన్నేళ్ళుగా వాయిదా వేస్తూ వచ్చిన ఈ పుస్తకం తీరా చేతుల్లోకి తీసుకోగానే రెండు రోజుల్లోనే పూర్తిచేసేగలిగాను. కాబట్టి అన్నిటికన్నా ముందు ఈ రచన తాలూకు పఠనీయత అత్యంత ప్రశస్తమని చెప్పగలను.

Bhima, Lone Warrior భీముడి దృక్కోణంలో చెప్పిన మహాభారత కథ. మహాభారతం అంటే మొత్తం ఇతిహాసాన్ని అంతటినీ నాయరు తిరిగిచెప్పాలనుకోలేదు. ప్రధానంగా కురుపాండవ వైరం, యుద్ధం, యుద్ధానంతర శూన్యం– వీటి చుట్టూతానే ఆయన కథ నడిపాడు. ఈ ఇంగ్లిషు అనువాదం చివర ఒక ఎపిలోగు ఉంది. అందులో ఆయన ఈ నవల తాను ఎందుకు రాసిందీ, ఎలా రాసిందీ, దీన్ని రాయడంలో తాను ఏ వ్యూహాలు అనుసరించిందీ వివరంగా రాసుకొచ్చాడు. ఆయన చెప్పినదాని ప్రకారం అన్నిటికన్నా ముందు ఆయన మూల మహాభారతాన్ని క్షుణ్ణంగా మళయాళం అనువాదా–ల్లోనూ, కిసారి మోహన్ గంగూలి ఇంగ్లిషు అనువాదంలోనూ చదివాడు. ఇవి కాక మహాభారతం కాలం నాటి సాంఘిక, రాజకీయ పరిస్థితుల గురించి, వైదిక సంస్కృతి గురించి ఇంగ్లిషులో లభ్యమవుతున్న గొప్ప గ్రంథాలు, మేగ్డొనాల్డు, కీతు, గ్రిఫితు వంటి వారి రచనలతో పాటు శతపథ బ్రాహ్మణానికి ఎగెరిలింగు అనువాదం కూడా చదివానని చెప్పుకున్నాడు. 1977 లో తనకి మహాభారతాన్ని భీముడి దృక్కోణం నుంచి చెప్పాలనే తలపు కలిగిందనీ, దాన్ని 1983 నాటికి పుస్తకరూపంలోకి తీసుకురాగలిగాననీ చెప్పాడు.

మహాభారతం గత రెండు వేల ఏళ్ళుగా భారతీయ భాషల్లో ఏ విధంగా పునఃసృజనకు లోనవుతూ వచ్చిందో చూడటం ఆసక్తి కలిగించే అంశం. కాని అంతకన్నా ఆసక్తి కలిగించే అంశం, 20-21 శతాబ్దాల్లో నవల, నాటకం, కవిత్వం, సినిమా రూపాల్లో మహాభారతం లోనవుతూ వస్తున్న పునఃసృజన మరింత ఆసక్తికరం. ఆ ఇతిహాసంలోంచి ఒక చిన్నభాగాన్ని ఎంచుకున్నా కూడా ఆ రచయిత తన రచనని ఎంతో ప్రశస్త రచనగా మార్చుకోగలిగాడు. సావిత్రిని ఒక ఆధ్యాత్మిక ఇతిహాసంగా మార్చిన అరవిందులు, కుంతి–కర్ణ సంవాదాన్ని రాసిన టాగోరు, పాంచాలీ శపథం రాసిన సుబ్రహ్మణ్య భారతి, పాండవోద్యోగ విజయాలు రాసిన తిరుపతి వెంకట కవుల్ని అలా ఉంచండి, దినకరు, ఖాండేకరు, ప్రతిభా రాయి వంటి రచయితలకి మహాభారతమే జ్ఞానపీఠపురస్కారాన్ని సముపార్జించిందని చెప్పినా అతిశయోక్తి కాదు. వీరిలో ప్రతి ఒక్కరూ ఒక పార్శ్వాన్ని తీసుకున్నారు. ఆ కిటికీ లోంచి మహాభారతమనే విస్తారమైన ప్రపంచాన్ని చూడడానికీ, మనకి చూపించడానికీ ప్రయత్నించారు. వాసుదేవన్ నాయరు కూడా ఈ కోవలోకే వస్తాడు. అయితే అతడు ఎంచుకున్నది భీముణ్ణి. అతడి అనుభవాలమీంచి మహాభారతకథ మనకి చెప్పడాన్ని.

ఒక పాత్ర దృక్కోణం నుంచి ఇక ఇతిహాసాన్ని తిరిగి చెప్పడంలో, వ్యాఖ్యానించడంలో చాలా సమస్యలు ఉన్నాయి. పాఠకులూ, పండితులూ కూడా అంగీకరించలేని విషయాలు ఎన్నో ఉంటాయి. లక్షశ్లోకాల మహాభారతాన్ని నాలుగువందల పేజీల నవలగా

కుదించినప్పుడు చాలా పాత్రలకి న్యాయం జరగలేదనిపిస్తుంది. చాలా పాత్రలు తమకి లభించవలసినదానికన్నా ఎక్కువ ప్రాముఖ్యాన్ని పొందాయనిపిస్తుంది. కాని ఒక పాత్ర దృక్కోణం నుంచి చెప్పే కథలో మనం పట్టించుకోవలసింది వాటిని కాదు. రచయిత తాను ఎంచుకున్న దృష్టికోణానికి న్యాయం చేసాడా లేదా, తాను నిలబడ్డ చోటనుంచి కథ చెప్తున్నప్పుడు పాఠకుడిలో గంభీరమైన, ఉదాత్తమైన పర్యావలోకనాన్నీ, రసానుభూతినీ కలిగించగలిగాడా లేదా- అది మాత్రమే చూడాలి. అలా చూసినప్పుడు నాయరు రాసిన ఈ మహాభారత కథని చదవడం పాఠకుడికి ఎంతో విలువైన అనుభవం అని చెప్పగలను.

ఈ నవల ఆయన ఒక రచయితగానో, కవిగానో, నాటకకర్తగానో కాక, ఒక చలనచిత్రనైపుణ్యంతో రాసాడని చెప్పవచ్చు. యాభైకి పైగా స్క్రీన్‌ప్లేలు రాసినవాడు, రాసినవాటిలో ఇరవైరెండింటికి రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాల్నీ, ఆరింటికి జాతీయ స్థాయి పురస్కారాలు పొందినవాడు ఒక కథని ఎలా చెప్పాలో, సన్నివేశాలు ఎలా కల్పించాలో, ఎక్కడ కత్తిరించాలో, ఎక్కడ విస్తరించాలో తెలిసినవాడు రాసిన నవల ఇది. అందుకనే పుస్తకం చేతుల్లోకి తీసుకోడం దాకానే మనం చెయ్యవలసింది. ఆ తర్వాత ఆయన కథనమే మనల్ని ముందుకు తీసుకుపోతుంది.

'మహాభారతంలో మనుషులు ఎదుర్కొన్న కొన్ని సంక్షోభాలే' తన నవలకి ఇతివృత్తమని నాయరు చెప్పుకున్నాడు. అంత విస్తారమైన గ్రంథంలో కూడా కృష్ణద్వైపాయన వ్యాసుడు మౌనం వహించిన కొన్ని తావుల్ని తాను పట్టుకున్నాననీ, ఆ తావుల్ని తనకు విడిచి పెట్టినందుకు వ్యాసుడికి ప్రణమిల్లుతున్నాననీ కూడా రాసుకున్నాడు.

దుర్బలమైన కుటుంబ సంబంధాలు, వాటిలో చిక్కుకుపోయిన మనుషులూ- ఈ ఇతివృత్తాల్ని తన స్వగ్రామం తనకు సమకూరుస్తూ వచ్చిందనీ, కాగా ఈ కుటుంబకథ కూడా అదే కథ గానీ, సుదూరకాలానికి చెందింది కావడమొక్కటే తేడా అని కూడా రాసాడు. ఒక గ్రామంలో పుట్టిపెరగడం, చిన్నప్పుణ్ణుంచీ ఇతిహాసాలూ, చరిత్రలూ వింటూ పెరగడమే తనకి ఈ గ్రంథం రాయగల ఆత్మబలాన్నిచ్చిందని కూడా చెప్పుకున్నాడు.

ఈ సందర్భంగా ఇంగ్లిషు అనువాదకురాలు గీతా కృష్ణకుట్టిని కూడా అభినందించాలి. పుస్తకంలో ఆమె కనబడరు, నాయరు కనబడడు, భీముడు మాత్రమే మనపక్కన నిలబడి కొన్నిసార్లు తనలోతాను, కొన్నిసార్లు మనతోనూ మాట్లాడుతుంటాడు.

ఆస్వాదించవలసిన రసస్పృష్టి. ఆ రసానుభూతి ఎలా ఉంటుందో రుచి చూపటానికి, నవలలోంచి రెండు సన్నివేశాలు మీకోసం తెలుగు చేస్తున్నాను.

1

కృష్ణుడు తిరిగి వచ్చేంతవరకూ మేమంతా కూడా కొంత అస్థిమితంగానే ఉన్నాం. వాళ్ళకి ఎవరూ ఏమీ చెప్పకపోయినప్పటికీ సైన్యంలో ఉత్సాహం కొద్దిగా తడబడుతోందని తెలుస్తూనే ఉంది. ఆయుధకర్మాగారాల్లో పని వేగం మందగించింది. ఇప్పటిదాకా యుద్ధ వాసన పసిగట్టిన విరాటసైన్యంలోని యువకులు ఇప్పుడు నిరుత్సాహానికి లోనయ్యారు. ఇరుపక్షాల మధ్య సంధి ఏదన్నా కుదురుకుందా అని నన్ను చాలామంది వచ్చి నన్నడిగారు కూడా. వాళ్ళందరికీ నేను చెప్పింది ఒకటే జవాబు: కృష్ణుడు రానివ్వండి, అప్పుడు నిర్ణయిస్తాం.

కృష్ణుడు వచ్చాడు. అతడి ముఖంలో తృప్తి గోచరిస్తోంది. అది చూసి అర్ధరాజ్యం ఇవ్వడానికి దుర్యోధనుడు అంగీకరించి ఉంటాడని అనుకున్నాం. అతణ్ణి దారిలోనే ఆపి ఆత్రుతగా వివరాలు అడిగాను. కృష్ణుడు ఏమీ స్పష్టంగా చెప్పలేదు.

'రాజ్యవ్యవహారాలు సభాసదులమధ్యలో చర్చించవలసినవి' అన్నాడు అతడు నా ప్రశ్నలు దాటేస్తూ.

ద్రుపదు, విరాటుడు, విరాటుడి కొడుకు ఉత్తరుడు అందరూ సభామందిరంలో ఉన్నారు. మేము కూడా మళ్ళీ అక్కడికి చేరుకున్నాం. సాత్యకి ముగ్గురు సేనానాయకులకీ కూడా కబురు పంపించాడు. ఒకవేళ యుద్ధంతో పనిలేకపోతే ఆ మాట వాళ్ళకి యుధిష్ఠిరుడే స్వయంగా చెప్పవచ్చునని అతడి ఆలోచన.

తాను చెప్పాలనుకున్న విషయం కృష్ణుడు మరీ సాగదియ్యలేదు. ఇంతకుముందు బ్రాహ్మణదూతలాగా, సంజయుడిలాగా అతడు నీళ్ళు నమల్లేదు.

'మీకు అర్ధరాజ్యం ఇవ్వడానికి దుర్యోధనుడు సిద్ధంగా లేడు. అయిదూళ్ళు కూడా ఇవ్వడానికి ఇష్టపడలేదు. అతనేమన్నాడో అతడి మాటలే వినాలనుకుంటున్నారా? అయితే వినండి, సూదిమొన మోపినంత రాజ్యం కూడా పాండవులకి ఇవ్వబోను' అని చెప్పేసాడు.

మరి అమ్మ ఏమంది? ఆ ప్రశ్న ప్రతి ఒక్కరికీ పెదాల దాకా వచ్చింది. నువ్వు వెళ్ళి తనని కలిసినప్పుడు మా అమ్మ నీతో ఏమంది?

'ఆమె చెప్పిన మాటలు మీరు వినాలనే మిమ్మల్నందరినీ ఈ సభామందిరానికి పిలిపించాను. ఆమె నాతో ఇలా చెప్పింది: నా పిల్లలు రాజ్యం పోగొట్టుకున్న విషయం

నేను మర్చిపోగలను. అడవుల్లో అష్టకష్టాలూ పడ్డ సంగతి కూడా మర్చిపోగలను. కానీ ఆ రోజు జూదమందిరంలో నా కోడలు రక్తమలినవస్త్రంతో ఒక అనాథలాగా వేదనతో ఆక్రోశించిన దృశ్యం మాత్రం మర్చిపోలేకపోతున్నాను. నా పిల్లలకి విదుల కథ గుర్తు చెయ్యి. వాళ్ళకి తెలియకపోతే చెప్పు.'

కృష్ణుడు తన మాటలు ఆపి ద్రౌపది కేసి చూసాడు. ఆమె తనకళ్ళల్లో చిందిన సంతోషబాష్పాల్ని తుడుచుకుంటున్నది.

అప్పుడు అతడు ఆ కథ తన మాటల్లో చెప్పాడు: విదుల ఒక క్షత్రియ స్త్రీ. తన కొడుకుని యుద్ధానికి పంపించింది. కాని ఆ పిల్లవాడు యుద్ధభయంతో పారిపోయి వచ్చి దాక్కోబోయాడు. అప్పుడామె తన కొడుకుతో ఏం చెప్పిందో తెలుసా? ఏదో ఒక ఉద్దేశ్యంగాని, లేదా సాహసంగాని లేని ప్రేమ ఆడగాడిద ప్రేమలాంటిది అని చెప్పింది.

మేము మా తల్లి గురించే ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాం. యుధిష్ఠిరుడు ఏమి చెప్పబోతాడా అన్న ఉత్కంఠతో ప్రతి ఒక్కరూ ఊపిరి ఉగ్గబట్టారు.

కృష్ణుడు తన మాటలు కొనసాగించాడు: ఇక ఆమె మీకు చెప్పమన్న మాటలు మీకు చెప్పడమే నేను చెయ్యవలసిన పని. ఆమె మీకు పంపిన సందేశం ఇది: తమ రాజ్యాన్నీ, తమ ప్రజల్నీ రక్షించుకోవడం చాతకాని రాజులకి లభించేది వీరస్వర్గం కాదు, నరకమే.

యుధిష్ఠిరుడు ఆలోచనలో కూరుకుపోయాడు. సాత్యకి, దృష్టద్యుమ్నుడూ లేచి అటూ ఇటూ పచార్లు చేయడం మొదలుపెట్టారు. ద్రుపదుడు, విరాటుడు రెప్పవాల్చకుండా యుధిష్ఠిరుణ్ణే చూస్తూ ఉన్నారు.

ఆ మందిరంలో అలముకున్న నిశ్శబ్దాన్ని చెదరగొట్టిన చప్పుడంటూ ఏదన్నా ఉంటే అది ద్రౌపది కదిలినప్పుడు ఆమె చరణకంకణనిక్వణం మాత్రమే.

యుధిష్ఠిరుడు నిట్టూర్చి 'మరి అభిమన్యుడి పెళ్ళి సంగతి..' అంటూ ఏదో అన్నాడు.

కృష్ణుడు ఆ ప్రశ్న విననట్టే నటించాడు. నిశ్శబ్దం మరికొంత సేపు రాజ్యం చేసింది. తన సహనం పూర్తిగా అంతరించాక కృష్ణుడు అడిగాడు: 'ఇంతకీ నీ నిశ్చయం ఏమిటి? ఏం చెయ్యాలంటావు?'

యుధిష్ఠిరుడు తలపైకెత్తి మాకేసి చూసాడు. అపారమైన అంతరంగ ప్రశాంతతతో, అతడు ఒకేఒక్క మాటతో జవాబిచ్చాడు.'యుద్ధమే!' (పే. 271-273)

2

నా చిన్నప్పుడు ఒక పిల్లవాడిగా ఈ నది ఒడ్డున సాయంసంధ్యవేళల్లో నిలబడి నేనెట్లా ప్రార్థించేవాణ్ణో గుర్తుచేసుకున్నాను. ఈ స్నానఘట్టాల దగ్గర వాయుదేవుడి సందేశం కోసం ఎట్లా వేచి ఉండేవాణ్ణో తలుచుకున్నాను. మహాబలశాలి కావాలని కలలుగన్న ఆనాటి పసివాణ్ణి గుర్తుతెచ్చుకున్నాను. సుదూరగతంలో అతణ్ణిప్పటికీ చూడగలుగుతున్నాను, ఆడుతూ గెంతులేస్తూ తిరుగుతున్న ఆ వృకోదరుణ్ణి.

ఇప్పుడతడు నిజంగానే మహాబలశాలి అయ్యాడు. ఒక యుద్ధంలో జయించాడు.

నా చిట్టచివరి శత్రువు ఇప్పుడు శమంతకపంచకంలో కొనశ్వాసతో పడి వున్నాడు. చేసిన శపథాలన్నీ నెరవేర్చుకున్న క్షత్రియుణ్ణి నేనిప్పుడు.

మహాబలశాలి భీముణ్ణి. అడవుల్లో పోరాడేను. రాజప్రాంగాణాల్లో తలపడ్డాను. చివరికి ఇక్కడ కురుక్షేత్రంలో నా శత్రువుల్ని మట్టికరిపించాను. చాలా మామూలు మనిషిని. నన్ను నిజంగా మహాబలశాలిని చేసింది నా సొంత బలం కాదు. నేను యుద్ధనినాదం చేసినప్పుడు నా గళానికి ఆ శక్తిని వేరెవరో అందించారు. అలిసిపోయినప్పుడు నా బాహువులకి వేరెవరో జవసత్త్వాలు సమకూర్చారు. విజయం సాధించిన ఈ క్షణాల్లో నేను అహంకారపూరితుడిగా ఉండకూడదు. వినయంతో నా శిరసు వంచక తప్పదు.

ఓ దేవా, తుపానుల్ని కట్టడి చేసే నువ్వు, మేఘమండల ఉపరితలంలో వేటాడే నువ్వు, నా తండ్రీ, నీకు నేను ధన్యవాదాలు సమర్పిస్తున్నాను. ఈ గండశిలల్ని నీ పాదాలుగా భావిస్తూ వాటి మీద నా శిరసు వాలుస్తున్నాను.

ఆ ప్రార్థన తర్వాత నా మనసు తేలికపడ్డట్టు అనిపించింది. నిర్మానుష్యయుద్ధక్షేత్రం లోకి మళ్ళా వెళ్ళాలనిపించలేదు. యుద్ధశిబిరాలు అంధకారంలో నిద్రిస్తున్నాయి. స్కంధా–వారాల్లో వంధిమాగధుల జయగీతాలు సద్దుమణిగాయి. మా అన్నదమ్ములు మాత్రమే ఎక్కడో మేలుకుని ఉన్నారు, పండగ చేసుకుంటూ.

ఆ స్నానఘట్టం మెట్ల మీద మరికొంతసేపు కూచున్నాను.

రాత్రి గడిచింది. వేగుచుక్క పొడిచింది. సూర్యుడు ఉదయించే శిఖరం మీంచి రక్తారుణ రేఖలు పరుచుకున్నాయి. నేను వెనుదిరిగాను.

దృషద్వతీ సంగమం దగ్గర స్మశానం మీంచి పొగ రేగుతున్నది.

సాధారణంగా ప్రభాతవేళల్లో ఆలపించే కైశికీ రాగం బదులు నిర్జన కురుక్షేత్రమైదానం మీంచి దీర్ఘవిలాపం ఒకటి వినబడింది. జనసందోహం కట్టగట్టి పెద్దగా ఏడుస్తున్నారు. నాకు ఒళ్ళు జలదరించింది.

విశోకుడు నా దగ్గరికి పరుగెత్తుకుంటూ వచ్చాడు. వెక్కి వెక్కి ఏడుస్తూ, పొరలిపొరలి వస్తున్న ఏడుపు మధ్య 'అశ్వత్థామా, అతడి మనుషులూ రాత్రి మన శిబిరానికి నిప్పు పెట్టారు' అని చెప్పాడు.

ఇంతలో నకులుడు, సహదేవుడు కూడా అక్కడికి చేరుకున్నారు. 'రాత్రి నిద్రపోతున్న వాళ్లని నిద్రపోతున్నట్టే వాళ్ళు ఊచకోత కోసేసారు. పారిపోడానికీ, తప్పించుకోడానికీ ఒక్కరు కూడా మిగల్లేదు.'

స్మశానం నుంచి రేగుతున్న పొగ అని నేను అనుకున్నది శిబిరాలు దగ్ధమైన పొగ అన్నమాట.

నా పెదాల మీద ఒక ప్రశ్న పదాల కోసం వెతుక్కుంటోంది. ఎవరు వాళ్లంతా? ఎవరు?

నిద్రాసుఖాన్ని ఆస్వాదిస్తున్న దృష్టద్యుమ్నుడు, పాంచాలి పుత్రులు అయిదుగురూ–ప్రతివింధ్యుడు, సుతసోముడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతకర్ముడు, వాళ్లతో పాటే నిద్రిస్తున్న సర్వదుడు కూడా.

అశ్వత్థామ వాళ్లందరినీ చంపేసాడు.

అతడితో పాటు కృపాచార్యుడూ, కృతవర్మా కూడా వచ్చారు. ఏ ఒక్కరూ పారిపోకుండా డేరాలకి అడ్డంగా నిలబడ్డారు. తప్పించుకోవాలని ప్రయత్నించిన సేవకుల్నీ, సైనికుల్నీ, ఏ ఒక్కరూ మిగలకుండా అశ్వత్థామ వారిని చంపటానికి సాయంగా నిలబడ్డారు.

యుద్ధరంగం మీద కొత్త రక్తం ఇంకా ప్రవహిస్తున్నది. ఆ భీకర సన్నివేశాన్ని వర్ణిస్తున్న సూతుడొకడు ఇలా చెప్తున్నాడు: 'వాళ్ళు ఎలాంటి అత్యాచారం చేసారో మీరు మీ కళ్లతో చూస్తే తప్ప నమ్మరు.'

నాకు వాళ్ళని చూడాలనిపించలేదు.

దుర్యోధనుడు మరణించేముందు అశ్వత్థామని సేనాధిపతిని చేసాడని విన్నప్పుడు మేము నవ్వుకున్నాం. సైన్యం లేని సేనాధిపతి అనుకున్నాం.

ఆ భయానకమైన కాళరాత్రి గురించిన వర్ణనలే నా చుట్టూ వినబడుతున్నాయి. రుద్రుడు ప్రసాదించిన ఖడ్గం అశ్వత్థామ దగ్గర ఉంది. దాంతోనే అతడు ఈ సంహారం కావించాడు. ఆ రాత్రి ఆ స్కంధావారం ఎదట సాక్షాత్తూ రుద్రుడే నిలబడ్డాడట. మా పిల్లలు ఆ సాయంకాలం ప్రార్థనలు చేసినప్పుడు ప్రార్థించిన నలుగురు దేవతల్లోనూ రుద్రుడు కూడా ఒకడై ఉండవచ్చు. ఇప్పుడు ఆ రుద్రుడి ఖడ్గమే వాళ్లమీద విరుచుకుపడింది.

ఇక ఈ వర్ణనలు చాలనిపించింది నాకు. నేను అర్థం చేసుకోలేకపోయినవి చాలానే ఉన్నాయనిపించింది. కాని ఒక్కటి మాత్రం అర్థమయింది, రేపొద్దున మా అంత్యక్రియలు, శ్రాద్ధకర్మలు జరిపించడానికి నా పిల్లలూ, పాండవుల పిల్లలూ మాత్రం జీవించి లేరు. అదొక్కటీ బాగా అర్థమయింది.

శత్రువు మరణించలేదు. మరణించదు కూడా. (పే. 331-333)

24-2-2023

కోసక్కులు

ఆ మధ్య పద్మ ఆమె ఇంట్లో పుస్తకాల బీరువాలో 'కోసక్కులు' నవల కనబడింది. తీసి చూసాను. 1982 లో ప్రచురణ. ఆర్వియార్ అనువాదం. ఏడు రూపాయల వెల. మహత్తరమైన సోవియెటు సాహిత్యం రోడ్ల మీద గుట్టలుగా పోసి అర్థరూపాయికీ, పావలాకీ కూడా అమ్ముతున్న కాలంలో ఏడురూపాయలు చిన్న మొత్తం కాదు. అయినా ఆ నవల ఒకటో రెండో కాపీలు ఆ రోజుల్లోనే కొనుక్కున్నాననీ, కానీ చదవకుండానే ఎవరికో ఇచ్చేయడమో లేదా ఎవరో పట్టుకుపోవడమో జరిగిందనీ గుర్తొచ్చింది. ఆ రోజుల్లో టాల్‌స్టాయిని 'అనా కెరినినా', 'యుద్ధము-శాంతి' నవలలు రాసిన రచయితగానే ఆరాధించేవాణ్ణి కాబట్టి, పైగా ఈ పుస్తకం ఆయన తొలిరోజుల్లో రాసిన పుస్తకం అన్న కారణం వల్ల కూడా అప్పట్లో చదవనే లేదు. Sebastopol stories, Childhood Adolescence and Youth కూడా తొలిరోజుల పుస్తకాలేగాని, అవి ఇంగ్లిషులోనే కూడబలుక్కుని చదివినవాణ్ణి, ఈ తెలుగు అనువాదం కొనుక్కుని కూడా ఎందుకు చదవలేకపోయానో తెలియదు. కాని పద్మ దగ్గర్నుంచి ఆ పుస్తకం తెచ్చుకున్నవెంటనే చదువుదామని మొదటి పుట తెరిచినవాణ్ణి మొత్తం 260 పేజీలూ ఆపకుండా చదివేసాను. ఆ పుస్తకం చదవకపోవడం ద్వారా నా యవ్వనకాలానికి నేను చాలా అన్యాయం చేసుకున్నానని అనిపించింది, చివరి పుట మూసేసాక.

అప్పణ్ణుంచీ ఆ పుస్తకం గురించి రాద్దామని అనుకుంటూనే ఉన్నానుగాని, కాకససు పర్వతశ్రేణి రష్యను ఇమేజినేషన్నీ, సాహిత్యాన్నీ దాదాపు రెండు శతాబ్దాల పాటు ఏ విధంగా ఆవహించిందో తెలిసాక, ఆ పూర్వరచనలన్నీ మళ్ళా చదవడం మొదలుపెట్టాను. ముఖ్యంగా లెర్మంటోవు 'మనకాలం వీరుడు.' సమస్య ఎక్కడొస్తుందంటే, ఇలాంటి పుస్తకాలన్నీ చిన్నప్పుడు కథకోసం చదువుకుంటూ పోతాం. ఆ కథ మాత్రం ఆ వయసులో

మనకేమి అర్థమవుతుందని? బహుశా ఒక మనిషి అరవయ్యేళ్ళొచ్చాక, మళ్ళా తాను చిన్నప్పుడు చదివిన పుస్తకాలన్నీ మరోసారి చదవడం మొదలుపెట్టాలేమో. అప్పుడు కాని ఆ కథలు ఏం చెప్తున్నాయో నిజంగా అర్థం కాదు.

ఉదాహరణకి పుష్కిను, లెర్మంటోవులు కాకసస్సు గురించీ, కోసక్కుల గురించీ ఎటువంటి రొమాంటిక్ ఇమేజినేషన్ని రష్యను మనస్సుకి అలవాటు చేసారో మనం అర్థం చేసుకుంటే తప్ప, టాల్‌స్టాయి ముప్పై నాలుగేళ్ళ వయసులో (1863) రాసిన ఈ చిన్న నవల ఎంత రష్యను మనోప్రక్షాళనకు పూనుకుందో మనకి అర్థం కాదు. ఇవేవీ తెలియకుండా నా ఇరవయ్యేళ్ళప్పుడు ఈ నవల చదివి ఉంటే నేనేమి అనుభూతి చెందేవాణ్ణా అని ఆలోచించాను. ఈ సామాజిక-రాజకీయ చరిత్ర తెలియకపోయినా కూడా ఒక నిర్మలత్వమేదో నా మనసుని ఆవరించి ఉండేదని మాత్రం నిస్సందేహంగా చెప్పగలను. ఎందుకంటే, టాల్‌స్టాయి రచనలన్నిటిలోనూ ఇంత కవితాత్మకమైన రచన మరొకటి లేదు కాబట్టి.

'కోసక్కులు' నవలని రొమేరోలా కావ్యం అన్నాడంటే ఆశ్చర్యం లేదు. టాల్‌స్టాయి మీద రాసిన మోనో గ్రాఫులో మొదటి అధ్యాయంలో ఆయనిలా రాస్తున్నాడు:

> ఈ మొత్తం రచనలన్నిటి కన్నా (తొలిదశలో రాసిన రచనలు), ఈ ప్రథమపర్వత శ్రేణిలో శిఖరాయమానంగా, టాల్‌స్టాయి కలం నుంచి వెలువడ్డ అత్యంత సంగీతమయ ప్రేమకథ, ఆయన యవ్వనగీతం, కావ్యం అని చెప్పదగ్గ కోసక్కులు నిలబడుతుంది. ప్రకాశవంతమైన అకాశం నేపథ్యంగా ఉదాత్తమైన, గంభీరమైన తమ అంచుల్ని ప్రస్ఫుటింపచేసే హిమపర్వతాల వైభవం ఈ మొత్తం కృతిని సంగీతంతో నింపేసింది. అతడి ప్రతిభ అప్పుడప్పుడే వికసిస్తున్న కాలానికి చెందినందువల్ల ఈ పుస్తకాన్ని అద్వితీయం అని చెప్పవచ్చు. సర్వశక్తిమంతుడైన యవ్వనదేవతకి చెందిన ఆ కాలం మరెన్నటికీ తిరిగి రాదని టాల్‌స్టాయే రాసుకున్నాడు. ఎటువంటి ఊటబుగ్గ ! ఎంత ప్రేమపొంగిపొర్లింది ఆ రచన నిండా!

ఈ మాటల్లో అతిశయోక్తి రవ్వంత కూడా లేదు. కానీ గమనించవలసిందేమంటే, కోసక్కుల్లో టాల్‌స్టాయి యవ్వనసంగీతాన్ని మాత్రమే కాదు, తన తర్వాతి జీవితానికి మూలాధారంగా నిలబడ్డ ఒక నైతికదర్శనాన్నికూడా, అదెంత అస్పష్టంగానేనా ఉండనివ్వు, కనుగొన్నాడని చెప్పవచ్చు.

యూరపియను రొమాంటిక్ కవులకీ, రచయితలకీ ఆల్ప్సు పర్వతశ్రేణి ఎలానో రష్యను రొమాంటిసిస్టులకి కాకసస్సు పర్వతశ్రేణి అలా. అది వారికొక oriental space. వాళ్ళ రహస్యోద్రేకాల్నీ, స్వైరప్రవృత్తినీ, దేన్నైనా ఆక్రమించుకోవాలనే దాహాన్నీ ప్రేరేపించే ఒక స్వాప్నిక భూమి. నిన్ననో మొన్ననో వార్తల్లో చూసాను, యుక్రెయిను తర్వాత, ఇజ్రాయిలు-పాలస్తీనా తర్వాత ఇప్పుడు వెస్టు-రష్యా-చైనాలకు తదుపరి యుద్ధభూమి కజకస్తాను కాబోతున్నదని. ఇప్పుడే కాదు, మూడువందల ఏళ్ళుగా కజక్కుసీమ మీదనుంచి రష్యా తన దృష్టి ఎప్పుడూ పక్కకి తిప్పింది లేదు. ఒకప్పుడు అడవుల కోసం, ఆ తర్వాత అణుపరీక్షకి, ఇప్పుడు గనుల కోసం.

తన పూర్వపు రొమాంటిక్ రచయితల దారిలోనే టాల్‌స్టాయి కూడా కాకసస్సు పట్ల ఒక రొమాంటిక్ భావోద్వేగాన్ని పెంచుకున్నాడు. కాని పుష్కిను, లెర్మంటోవులకు సాధ్యంకాని పరివర్తన టాల్‌స్టాయికి సాధ్యపడింది. కాకసస్సు ఆయనలోని మాస్కోవైటులోని డొల్లతనాన్ని ఆయనకు ఎరుకపరిచింది. కాకసస్సులో ఒక సైనికుడిగా పోరాడటానికి వచ్చినప్పటికీ, అక్కడి జీవితానుభవాలు ఆయనకు రైతుగా, గ్రామీణుడిగా, నిష్కల్మషమైన బాలుడిగా జీవించగల ఒక ఆదర్శాన్ని చూపించాయి. తదనంతరకాలంలో, అంటే, 'వార్ అండ్ పీస్' నవల రాయడం పూర్తిచేసాక, 1869లో ఆర్జమాసులో ఒక రాత్రి చెప్పలేని భయాందోళనకు లోనయి, టాల్‌స్టాయి టాల్‌స్టాయివాదిగా మారడం మొదలుపెట్టాక, ఆయన చేసిందల్లా తనలోని మాస్కోవైటుని పూర్తిగా త్యజించి ఒక గ్రామీణుడిగా, ఇంకా చెప్పాలంటే ఒక కోసక్కుగా మారడానికి ప్రయత్నించడమే. నాకు తెలిసి ఇటువంటి పరివర్తన ఏ భారతీయ రచయితలోనూ ఏ గిరిజన ప్రాంతమూ తీసుకురాలేదని చెప్పగలను. ఇది ఒక వాల్డెను ఒక థోరోలో తెచ్చిన పరివర్తనలాంటిది, ఒక బోయరు యుద్ధం ఒక గాంధీలో తెచ్చిన పరివర్తనలాంటిది.

ఈ పరివర్తన టాల్‌స్టాయిలో ఎంత దూరం సాగిదంటే, చివరికి ఆయన 'హాజీ మురాద్' నవల్లో పూర్తిగా జార్ పక్షం వదిలి చెచెన్ల పక్షాన నిలబడేటంతదాకా. కోసక్కులు నవల్లో రష్యను దళం ఒక చెచెన్ని చంపడం ఒక ముఖ్యసంఘటన. 1863 లో రాసిన ఆ సంఘటన నుంచి 1904 లో పూర్తి చేసిన హాజీమురాద్ నవల నాటికి టాల్‌స్టాయి తనలోని రష్యన్ సామ్రాజ్యవాద అవశేషాలనుంచి పూర్తిగా బయటపడ్డాడు. నాకు తెలిసి ఇంత మానసిక విముక్తిని సాధించిన రచయిత, చలంగారు కాక, మరొకరు కనబడరు.

ఇన్నాళ్ళకు కోసక్కులు చదివేక నాకు అర్థమయిందేమంటే, తనలోని ఈ విముక్తి అవసరాన్ని ఆయన కాకసస్సులో గడిపిన తొలిరోజుల్లోనే గుర్తుపట్టాడని. పూర్వ రచయిత

ల్లాగా ఆ ప్రకృతిని ఒక సుందరసీమగా మాత్రమే ఆయన చూడలేకపోయాడు. అక్కడ స్వతంత్రంగా జీవించే మనుషులున్నారనీ, నువ్వు నిజంగా ఆ సీమని ప్రేమిస్తే, నువ్వు చెయ్యవలసింది ముందు వాళ్ళల్లో ఒకడివి కావడమేననీ ఆయన గుర్తుపట్టాడు.

కోసక్కులు నవలలో తాను కాకసస్సు వెళ్ళి పాడయిపోతాడేమో అని ఆందోళనగా మాస్కోనుంచి వస్తున్న ఉత్తరాల గురించి రాస్తూ ఒలేనిన్ ఇలా అంటున్నాడు:

> అబ్బా, యెంత అసహ్యంగా, దీనంగా కనిపిస్తారు మీరందరూ నాకు! మీకు ఆనందమంటే యేమిటో తెలీదు! జీవితాన్ని సహజసిద్ధమైన సౌందర్యంలో ఆస్వాదించాలి! నా ముందు ప్రతి రోజూ నేను యేం దర్శిస్తున్నానో చూసి అర్థం చేసుకోవాలి యెవరేనా, యెన్నటికీ సమీపించలేని ఆ హిమశిఖరాలు, సృష్టికర్త హస్తాలనుంచి రూపు తీసుకున్న ఆదివనిత ఆదిమసౌందర్యంతో అలరారే ఒక రాజతేజస్సుగల స్త్రీ, అప్పుడు అర్థమవుతుంది యెవరు పతన మవుతున్నారో, యెవరు నిజంగా బతుకుతున్నారో, యెవరు మృషాజీవనులో, – మీరో నేనో, మీ భ్రమల్లో మీరు నాకు యెంత అసహ్యకరంగా, దీనంగా కనిపించేదీ మీకు తెలిసి ఉంటే! నా యింటికి, నా అడవులకి, నా ప్రేమకి బదులుగా ఆ కచ్చేరీలూ, సుగంధతైలాలు రాసుకుని జుట్టుని దొంగ ఉంగరాలు తిప్పుకునే ఆడవాళ్ళూ, అసహజంగా ఇకిలించే పెదాలూ, దాచి పెట్టుకుని నీరసంగా వంకర్లు పోయిన అవయవాలూ, యెందుకొచ్చిన పీడరా అన్నట్టుండే అతిథులగది సంభాషణలూ–ఆమాటకే అవి తగవు–నా మనసులో చిత్రించుకున్నప్పుడు భరించలేనంత వికారంగా అనిపిస్తాయి నాకు..

ఇంకా ఇలా రాస్తున్నాడు:

> అందమంటే ప్రకృతితో కలిసి వుండటం, ప్రకృతిని చూడ్డం, ప్రకృతితో మాట్లాడ్డం. 'వాడా మాటకొస్తే ఓ సామాన్య కోసక్ పిల్లని పెళ్ళి కూడా చేసుకోవచ్చు (అన్యాయం ప్రతిహతమగుగాక) నాగరిక సమాజానికి పూర్తిగా దూరమైపోవచ్చు.' వాళ్ళు పాపం నా గురించి యెంతో సానుభూతితో అనడం నేను వూహించగలను! కాని నేను కోరేదేమంటే, ఆ మాటకి మీ అర్థంలోనే 'పూర్తిగా నాశనమైపోవడం.' ఒక సామాన్య కోసక్ పిల్లని పెళ్ళాడాలని అనుకుంటున్నాను. కాని నేను సాహసించలేను. యెందుకంటే, అది నా యోగ్యతకి మించిన ఆనంద శిఖరం.

కాని చాలా కాలం తర్వాత వెర్రియరు ఎల్విను ఈ పని చేయగలిగాడు. మధ్యభారత–దేశంలోని గిరిజనుల జీవితాల్ని అధ్యయనం చేయడానికి వచ్చిన బ్రిటిషు యాంత్రొపాల–జిస్టు ఎల్విను ఒక గోందుమహిళను పెళ్ళిచేసుకుని ఇక్కడి గిరిజనుల్తో మమేకం కాగలిగాడు.

సాధారణంగా మన గిరిజనప్రాంతాల్లో ఉద్యోగరీత్యానో, వ్యాపారరీత్యానో మరే కారణాల వల్లనో కొన్నాళ్ళు ఉండటానికి వచ్చేవాళ్ళల్లో చాలామంది చేసే పని ఆ గిరిజనస్త్రీలను ఉంపుడుగత్తెలుగా మార్చడం. ఎవరో ఒకరిద్దరు మాత్రమే ఆ గిరిజనస్త్రీలను పెళ్ళి చేసుకునేవాళ్ళు కనిపిస్తారు. కోసక్కులు నవలలో టాల్‌స్టాయి మనః స్థితి తన పూర్వపు రొమాంటిక్ రచయితల్లాగా తాత్కాలిక సంతోషాల్నీ, సుఖాల్నీ కోరుకోడం మీదలేదు. అతడు లెర్మంటోవు వర్ణించిన 'మనకాలం వీరుడు' కావాలనుకోలేదు. అతడు నిజంగానే ఒక కోసక్కుగా, ఒక సామాన్య గిరిజనుడిగా మారిపోవాలనుకున్నాడు. కాని కోసక్కులు నవలలో ఆ తెగ ఒలేనిన్‌ని తమ మనిషిగా స్వీకరించడానికి ఇష్టపడలేదు. ఈ నవలకి ముందుమాట రాసిన విమర్శకుడు టాల్‌స్టాయి నిజజీవితంలో వాళ్ళతో కలవగలిగాడనీ, వాళ్ళు కూడా ఆయన్ని దగ్గరకు తీసుకున్నారని రాసాడు. కాని టాల్‌స్టాయికి తెలుసు, తాను ఆ నవల రాసినప్పటికి తనలోని మాస్కొవైటు ఇంకా పచ్చిగా, బలంగానే ఉన్నాడని. ఒక సాధారణ కోసక్కుమహిళకు భర్తకాగలిగే మానసిక యోగ్యత తనకు పూర్తిగా సిద్ధించలేదని.

కాని మరొకవైపు తనలోని ఈ నైతికసంక్షోభం,ఈ పరిత్యాగం ఇవన్నీ కూడా తాను కోరుకుంటున్న ప్రేమని తనకి దక్కకుండా చేస్తున్నాయా అన్న విచికిత్స కూడా టాల్‌స్టాయికి లేకపోలేదని ఒలేనిన్ మాటలు మనకి పట్టిస్తున్నాయి. ఆయన ఎటూ తేల్చుకోలేకపోయాడు. కాని చివరికి నవల్లోనూ, జీవితంలోనూ కూడా టాల్‌స్టాయిలోని పరిత్యాగిదే పైచేయి అయ్యింది.

ఏ విధంగా చూసినా, కోసక్కులు, అత్యంత సంగీతమయం మాత్రమేకాదు, అత్యంత సుశీలసంపన్నమైన నవల కూడా. అనాకెరినినా, వార్ అండ్ పీస్ రాసిన టాల్‌స్టాయి రష్యను సమాజానికి చెందిన టాల్‌స్టాయి. దాన్ని ప్రేమిస్తూ, శపిస్తూ, జాలిపడుతూ, ఏవగించుకుంటూ గడిపిన మానవుడు. కాని కోసక్కులు రాసిన టాల్‌స్టాయి నిర్మల మనస్కుడైన యువకుడు. ఒక కోసక్కుకావాలని కలలుగన్నవాడు. హాజీ మురాద్ రాసిన టాల్‌స్టాయి తన అంతరంగంలో ఒక చెచనుగా మారగలిగినవాడు. పూర్తి ఋషిగా మారగలిగిన విప్లవకారుడు. ఈ రెండు నవలలూ చదివినతర్వాతనే ఎవరేనా టాల్‌స్టాయిని తన అభిమాన రచయిత అని చెప్పుకోగలిగే హక్కు సాధిస్తారు.

11-11-2023

జోర్బా ద గ్రీక్

ఒకప్పుడు ఓషోకి డెంటలు ఆపరేషన్ అయినప్పుడు ఆ డెంటలు రూములోనే కూచుని కొన్ని ప్రసంగాలు చేసాడు. కేవలం ఇద్దరు ముగ్గురు శిష్యులు మాత్రమే వినడానికి నోచుకున్న ఆ ప్రసంగాల్లో ఆయన తనకి నచ్చిన పుస్తకాల గురించి మాట్లాడేడు. మొత్తం పదహారు ప్రసంగాలు. 167 పుస్తకాలు. ఆ తర్వాత ఆ శిష్యులు వాటిని Books I have Loved (2005) పేరిట పుస్తకంగా తీసుకొచ్చారు. తన జీవితకాలంలో లక్ష పుస్తకాలు చదివానని చెప్పుకున్న ఓషో వాటిల్లో తన మనసుకి బాగా దగ్గరయిన పుస్తకాల గురించి ఆ ప్రసంగాల్లో తన భావాలు పంచుకున్నాడు. అలాగని వాటిల్లో ప్రతి ఒక్క పుస్తకం గురించీ వివరంగానో, విపులంగానో మాట్లాడలేదు. కొన్నిటిగురించి ఒకటిరెండు వాక్యాలు మాత్రమే చెప్పాడు. కొందరు రచయితల గురించి, కొన్ని పుస్తకాల గురించి ఇంతదాకా మనకి తెలిసి ఉండని అంతర్దృష్టితో మాట్లాడేడు.

ఓషో ప్రేమించిన పుస్తకాల గురించి చేసిన ప్రసంగాల గురించి ఇరవయ్యేళ్ళ కిందట, 'ఓషోటైమ్సు' పత్రికలో, మొదటిసారి తెలిసిందినాకు. అప్పట్లో ఆ పత్రికలో నెలకి ఒక పుస్తకం గురించి మాత్రమే వచ్చేది. నేను ఆ పుస్తకాల గురించి తెలుసుకోడానికి మళ్ళా నెల వచ్చేదాకా ఆగలేకపోయాను. అన్నిటికన్నా ముందు ఆ పుస్తకాల జాబితా చూడాలన్న కుతూహలం నన్ను నిలనివ్వలేదు. నేరుగా Books I have Loved పుస్తకం సంపాదించి, ఆ జాబితా మొత్తం ఒక్కసారి ఆమూలాగ్రం పరిశీలించుకున్నాను. అందులో చాలామంది రచయితల పేర్లు అప్పటికి నాకు కొత్త. నాకు అప్పటికి తెలిసిన రచయితల్లో కూడా ఓషో ప్రస్తావించిన కొన్ని పుస్తకాల పేర్లు నేనప్పటిదాకా విని ఉండలేదు. కొన్ని పేర్లూ, కొన్ని పుస్తకాలూ తప్పనిసరిగా ఉంటాయనుకున్నవి లేనేలేవు. ఉదాహరణకి డాంటే, గొథే లాంటి వాళ్ళు ఆ జాబితాలో లేరు. రామాయణం లేదు, అరవిందుడు లేడు, సావిత్రి లేదు. కాని

నాకు తెలియని ఎందరో రచయితలు, ముఖ్యంగా మిస్టిక్కులు, ఆ పుస్తకం ద్వారా నాకు పరిచయమయ్యారు. ఆయన ప్రస్తావించిన రచయితల పుస్తకాలు ఒక్కొక్కటే సంపాదించి చదవడమే ఆ తర్వాత కొన్నాళ్ళపాటు పనిగా పెట్టుకున్నాను. George Gurdjieff రాసిన Meetings with Remarkable Men, Alan Watts రాసిన The Way of Zen, Paul Reps రాసిన Zen Flesh, Zen Bones లాంటి పుస్తకాలు అలా పరిచయమైనవే.

అప్పుడు పరిచయమైన పుస్తకమే Zorba the Greek కూడా. ఆ పుస్తకం ఓషోని ఎంతగా ప్రభావితం చేసిందంటే, ఆ పుస్తకం ఇచ్చిన మెలకువతో ఆయన Zorba the Buddha అనే భావనని ప్రపంచానికి పరిచయం చేసాడు. తాను దర్శిస్తున్న మానవుడు Zorba the Buddha లాగా ఉంటాడనీ, ఉండాలనీ చెప్పుకున్నాడు.

ఓషో పుస్తకం చదివిన వెంటనే తెప్పించుకున్నానో లేదా ఆ తర్వాత కొనుక్కున్నానో గుర్తులేదుగాని, Zorba the Greek (2000) ఇన్నాళ్ళుగా నాతోనే ఉన్నప్పటికీ ఇప్పటికి చదవగలిగాను. ఆ పుస్తకం చదవడం పూర్తిచేయగానే ముందు ఓషోనే గుర్తొచ్చాడు.

Zorba the Greek ఒక గ్రీకు నవల. దాని రచయిత నికోసు కజంజకిసు ఆధునిక గ్రీకు కవుల్లో, రచయితల్లో అగ్రగణ్యుడు. హోమరు రాసిన ప్రాచీన గ్రీకు ఇతిహాసం ఒడెస్సీకి కొనసాగింపుగా Odessy, A Modern Sequel (1938) అనే మహేతిహాసం రచించాడు. కాని బయటి ప్రపంచానికి ఆయన నవలా రచయితగానే ఎక్కువ పరిచితుడు. నీషే Superman అనే భావనని ప్రపంచానికి పరిచయం చేసినట్టుగా, కజంజకిసు Zorba the Greek అనే భావనని రక్తమాంస పరిపుష్టమైన పాత్రగా చిత్రించి ప్రపంచానికి పరిచయం చేసాడు.

నోబెలు పురస్కారం పొందడానికి అన్నివిధాలా అర్హుడైనప్పటికీ, తొమ్మిదిసార్లు ఆ పురస్కారానికి నామినేటు అయినప్పటికీ కజంజకిసుకి ఆ బహుమతి రాలేదు. ఒకసారి ఆయన కన్నా ఒక్క ఓటు ఎక్కువ రావడంతో ఆల్బర్టు కామూకి నోబెలు బహుమతి దక్కింది. ఆ సంగతి తెలిసినప్పుడు కామూ తనకన్నా కూడా కజంజకిసుకి ఆ పురస్కారం లభించిఉంటే తనకెక్కువ సంతోషం కలిగి ఉండేదని అన్నాడట.

కాని సాహిత్యప్రపంచంలో ఇదేమీ వింతకాదు. చాలాసార్లు అత్యున్నత పురస్కారాలు లభించిన రచయితలకన్నా కూడా ఏ పురస్కారాలు పొందని రచయితలే ప్రజల్ని ఎక్కువగా ప్రభావితం చేస్తుండే దృష్టాంతాలెన్నో ఉన్నాయి. కజంజకిసు రాసిన The Last Temptation నవలని సినిమాగా తీసినప్పుడు అది ప్రపంచాన్ని ఒక్కసారిగా కుదిపేసింది.

వాటికను ఆ నవలని తన నిషేధిత పుస్తకాల జాబితాలో చేర్చడం కజంజకిసుకి దక్కిన గొప్ప గుర్తింపు అని చెప్పవచ్చు.

కజంజకిసు జీవితానుభవం అత్యంత సుసంపన్నమైంది. ఆయన పారిసులో బెర్గ్‌సను ప్రసంగాలు విన్నాడు. నీషే తత్త్వశాస్త్రం మీద డాక్టరేటు చేసాడు. గ్రీసు తరఫున బాల్కను యుద్ధాల్లో సైనికుడిగా పోరాడేడు. వియన్నాలో కూచుని బౌద్ధధర్మాన్ని అధ్యయనం చేసాడు. బెర్లినులో రాడికల్సుతో కలిసి పనిచేసాడు. సైకెలియానోసు అనే ఆధునిక గ్రీకు కవితో కలిసి ప్రాచీన గ్రీసు మొత్తం పర్యటించాడు. ఒక్క గ్రీసు మాత్రమే కాదు, దాదాపుగా ప్రపంచమంతా, ముఖ్యంగా చీనా, జపానులు కూడా విస్తృతంగా పర్యటించాడు.

సుసంపన్నమైన జీవితానుభవమూ, విస్తృతప్రపంచాన్ని చాలా దగ్గరగా చూసిన మెలకువా, వివిధ తాత్త్విక దృక్పథాల్ని లోతుగా అధ్యయనం చేసిన అంతర్దృష్టీ కూడుకున్న రచయిత ఒక నవ్యమానవుణ్ణి సంభావిస్తే ఎలా ఉంటుందో Zorba the Greek లో మనకి కనిపిస్తుంది. అది కజంజకిసు స్వీయానుభవాల మీంచి రాసిన నవల. ఆయన కొన్నాళ్ళు పెలిపొన్నెస్ససు ద్వీపకల్పంలో లిగ్నైటు గనుల తవ్వకం మొదలుపెట్టి చేతులు కాల్చుకున్నాడు. ఆ రోజుల్లో అతడికి జార్జి జోర్బాసు అనే అతనితో స్నేహం కలిసింది. ఆ స్ఫూర్తితో అతడు Zorba the Greek పాత్రని మలిచాడు.

Zorba the Greek నవల ఇంగ్లిషు అనువాదం వచ్చిన తొలిరోజుల్లోనే టైము పత్రికకోసం సమీక్షిస్తూ ఒక విమర్శకుడు దాన్ని ఒడెస్సీ, డాన్ క్విక్సోటులతో పోల్చాడు. ఎందుకంటే ఒడెస్యూసులాగా, డాన్ క్విక్సోటులాగా జోర్బా కూడా రక్తమాంసాలు పరిపుష్టంగా ఉండే మానవపాత్ర. ఆ నవలలో కథకుడు ఒక మేధావి. అధ్యయనశీలి. ఇరవయ్యవ శతాబ్దపు హామ్లెటులాంటివాడు. బుద్ధుడిపైన ఒక సమగ్రమైన పుస్తకం రాసే పనిలో ఉంటాడు. అతడికి స్టవ్రిడకిసు అనే స్నేహితుడుంటాడు. ఆ స్నేహితుడు కాకసస్సు లోనూ, యుక్రేనులోనూ ఉన్న గ్రీకుల్ని విడిపించడంకోసం పోరాడే ఒక యోధుడు. కథకుడికి అతడొక విస్పష్టమైన ఆదర్శం. తాను అలా జీవించలేకపోతున్నాననే ఒక అపరాధభావం కథకుణ్ణి పీడిస్తూ ఉంటుంది.

కథ మొదటి ప్రపంచయుద్ధం ముగిసిన తర్వాతి కాలంలో మొదలవుతుంది. కథకుడికి ఒకరోజు మాసిడోనియాకి చెందిన ఒక గ్రీకు పరిచయమవుతాడు. తను బాగా వంటచేసి పెట్టగలననీ, తనని పనిలో పెట్టుకోవచ్చు కదా అని కథకుణ్ణి అడుగుతాడు. అతడే జోర్బా. కథకుడు అతడితో కలిసి క్రీటులో ఒక లిగ్నైటు గని తెరిచే పని మొదలుపెడతాడు.

వంటవాడిగా పనిచెయ్యడానికొచ్చిన జోర్బా గనిపనివాడిగా, ఇంజనీరుగా కూడా అవతార మెత్తుతాడు. ఇక ఆ తర్వాత ఆ నవల మొత్తం కథకుడూ, జోర్బా కలిసి క్రీటు ద్వీపంలో సాగరతీరంలో ఒక గ్రామంలో జీవిస్తూ లోనైన అనుభవాల కథనం. ఆ అనుభవాలూ, ఆ అనుభవాల మధ్య జోర్బా మాట్లాడే మాటలూ, అతడి చిత్రమైన ప్రవర్తనా కథకుణ్ణి ఎప్పటి కప్పుడు ఆశ్చర్యంలో ముంచెత్తుతుంటాయి. కాకసస్సులో గ్రీకు విముక్తికోసం పోరాడుతున్న తన మిత్రుడిలాగా జోర్బాకి స్పష్టమైన జీవితాదర్శం కానీ, విస్పష్టమైన సిద్ధాంతం గానీ ఏమీ ఉండవు. అతడికొక నైతికతా, శీలప్రాధాన్యతా ఉన్నట్టు కనబడవు. అతడు తన తలపులకీ, మాటలకీ, చేతలకీ మధ్య ఒక అంగీకారం ఉన్నట్టుగా తన చుట్టూ ఉన్నవాళ్ళని నమ్మిచే ప్రయత్నం ఏదీ చెయ్యడు. నిజానికి అతడికి తన చుట్టూ ఉన్న ప్రపంచం తాలూకు అభిప్రాయాల పట్ల లక్ష్యం లేదు. తననీ, తన జీవనసరళినీ ప్రపంచం ఆమోదించాలన్న తాపత్రయం ఏదీ అతడికి లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే అతడు మూర్తీభవించిన జీవశక్తి. మనిషిలోని ప్రాకృతిక జీవశక్తి ఎప్పుడు ఎలా వ్యక్తంకావాలనుకుంటే అలా వ్యక్తం కావడమే మనిషి జీవించవలసిన పద్ధతి అన్నట్టుగా కనబడతాడు. 'లోపాలు లేని మనిషి అంటూ ఎక్కడుంటాడు చెప్పు? అసలు ఏ లోపం ఉండకూడదనుకోడమే అసలైన లోపం' అని అంటాడు అతడు కథకుడితో.

ఆ సముద్రతీరగ్రామంలో వాళ్ళు చాలా అనుభవాలకు లోనవుతారు. చాలా సంతోషాల్ని పంచుకుంటారు. ఊహించలేని దురాగతాల్ని కళ్ళారా చూస్తారు. వాళ్ళు తలపెట్టిన గని పని విఫలమవుతుంది. కథకుడు ఆర్థికంగా నష్టపోతాడు. చివరికి అతడు ఆ గ్రామం వదిలిపెట్టి వెళ్ళిపోడానికే నిశ్చయించుకుంటాడు. జోర్బానుంచి సెలవు తీసుకుంటాడు. ఆ తర్వాత కొంతకాలానికి జోర్బా మరణించినట్టు ఉత్తరం వస్తుంది. కాని నవల ముగిసేటప్పటికి కథకుడిలో అపారమైన పరివర్తన సంభవించినట్టు మనకి అర్థమవుతుంది. అంతదాకా పుస్తకాల ద్వారానూ, ఆదర్శవాదదృక్పథం ద్వారానూ మాత్రమే జీవితాన్ని చూడటానికి అలవాటు పడ్డ కథకుడికి మొదటిసారి జీవితాన్ని చాలా దగ్గరగా, ఎలాంటి ముసుగులూ, దాపరికాలూ లేకుండా చూసిన అనుభూతి కలుగుతుంది. ఒక నిజమైన మనిషితో కొంతకాలమైనా దగ్గరగా గడిపిన స్పృహ మిగులుతుంది.

ఒక మనిషిగా కజంజికసు అనుభవించిన ద్వైదీ భావాన్నే తన రచనల్లో విపులంగా చిత్రిస్తూపోయేడని చెప్పవచ్చు. ముఖ్యంగా అతడిలో ఒక క్రైస్తవుడితో పాటు ఒక గ్రీకు కూడా ఉన్నాడు. ఆ గ్రీకు కూడా డయొనీషియను గ్రీకు. గ్రీకు ప్రాపంచిక దృక్పథాన్ని తొలినుంచీ అపొలో, డయొనిససులు రెండు వేపులా లాగుతూ వచ్చారు. అపొలొనియను

గ్రీకు సుకుమారుడు. స్వాప్నికుడు, ఆదర్శవాది. కాని అదంతా పై పై పొరల్లో మాత్రమేననీ, మనిషి అంతరాంతరాల్లో అత్యంత ప్రాకృతిక స్వభావి అనీ, మనిషిలోని స్వాభావిక జీవశక్తి మంచిచెడ్డలకు అతీతమైందనీ డయోనిసను గుర్తుచేస్తుంటాడు. డయోనిసను, అతణ్ణి బాకసు (Bacchus) అని కూడా అంటారు, మద్యానికీ, ఉన్మాదానికీ కూడా అధిదేవత. గ్రీకు ట్రాజెడీ ఆవిర్భవించడం వెనక డయోనిసను క్రతువుల ప్రభావం ఉందంటారు. కజంజకిసు ఒక మనిషిగా, ఒక రచయితగా, క్రీస్తుకీ, డయోనిససుకీ మధ్య నలిగిపోయాడని ఆయన రచనలు చదివితే మనకు తెలుస్తుంది. ఇందులో కూడా ఆ సంఘర్షణ కనిపిస్తుంది.

అయితే ఇందులో క్రీస్తుకి బదులు బుద్ధుణ్ణి ప్రతిపాదిస్తాడు. అంటే బుద్ధుడికీ, డయోనిససుకీ మధ్య నలుగులాట అన్నమాట. జీవితకాంక్షని బుద్ధుడు స్పష్టంగా నిరాకరించాడు. ప్రపంచం తనపైన విసరగల రంగులవలని ఆయన మారలీలగా గుర్తుపట్టి దాన్ని సునాయాసంగా తిరస్కరించగలిగాడు. కాని సమస్య ఎక్కడొస్తుందంటే, జోర్బా లాంటి వ్యక్తులు ప్రాపంచికసుఖాల్ని ప్రేమిస్తున్నట్టే కనబడతారుగాని, వాటిల్లో కూరుకుపోరు. పూర్తి సాంగత్యం మధ్య వాళ్ళల్లో నిస్సంగి మరింత తేటతెల్లంగా కనబడుతూనే ఉంటాడు. జీవితం జీవించు, కాని కూరుకుపోకు, ఎప్పటికప్పుడు జీవితం నీముందు సంధించే ప్రశ్నలనుంచి పారిపోకు, సరాసరి ఆ ప్రశ్నలకొమ్ములు పట్టుకుని వాటితో కలయబడు, కాని నీ ప్రవర్తనని సిద్ధాంతీకరించకు అన్నట్టే ఉంటుంది జోర్బా ప్రవర్తన.

తాము చెప్తుండే ఆదర్శాలకు తగ్గట్టుగా జీవించలేకపోతూ, ఆదర్శాలకూ, ఆచరణకూ మధ్య అంతరాల్ని శుష్కసమర్థనలతో పూరించడానికి బదులు, ఏ ఆదర్శాల్నీ వల్లెవేయ–కుండానే, ఎప్పటికప్పుడు తన అంతరంగం ఎలా చెప్తే అలా నడుచుకుంటూ పోవడం ద్వారా మనిషి తనని తాను మరింత మానవీయంగా వికసింప చేసుకోగలడనిపిస్తుంది జోర్బాని చూస్తుంటే.

అయితే, ఏ ఆదర్శాల బరువుకిందా నలిగిపోని ఒక పాత్రను చిత్రించడం ద్వారా కజంజకిసు మరొక ఆదర్శపాత్రను చిత్రిస్తున్నాడా అని అనుమానం కూడా కలుగుతుంది. అందుకనే ఆ నవల గురించి మాట్లాడుతూ ఓషో ఇలా అన్నాడు:

> జోర్బా, నిరక్షరాస్యుడైన జోర్బా, నిరుపేద జోర్బా, ఒక కార్మికుడు..అతడు బలిష్టదేహుడే గాని, ఒకింత ఉన్మాది కూడా. అతడు తన మిత్రుడైన యజమానికి గొప్ప సలహా ఇచ్చాడు: 'ఒకింత ఉన్మాదిగా ఉండవయ్యా' అని. నేనంటాను, ఒకింత ఉన్మాదం చాలదు, సంపూర్ణ ఉన్మాదం కావాలని. కాని

> పరిపూర్ణ ఉన్మాదం ధ్యానంలో మాత్రమే సాధ్యమవుతుంది. లేకపోతే నువ్వు కుప్పకూలిపోతావు. అంత ఉన్మాదాన్ని నువ్వు అరాయించుకోలేవు. పైగా అదే నిన్ను తినేయడం మొదలుపెడుతుంది. ధ్యానమంటే ఏమిటో నీకు తెలియకపోతే నువ్వు దగ్ధమైపోతావు. అందుకనే నేను Zorba the Buddha కావాలంటాను.

ఓషో ఇంకా ఇలా అంటున్నాడు:

> Zorba the Buddha నా సమన్వయం. గొప్ప కళాసృష్టి చేసినందుకు నేను కజంజకిసుని నేను అభిమానిస్తాను. కాని అతడింకా చీకటిలోనే ఉండిపోయినందుకు జాలిపడతాను కూడా. కజంజకిసు, నీకు ఒకింత ధ్యానం కావాలి, అది నిన్ను లోబరుచుకోవాలి. లేకపోతే జీవితమంటే ఏమిటో నువ్వెప్పటికీ తెలుసుకోలేవు.

ఓషో వాక్యాలు ఆసక్తికరంగానే ఉన్నప్పటికీ, ఆయన జోర్బాను మరింత సరళంగా అర్థం చేసుకోడానికి ప్రయత్నించాడా అనిపిస్తుంది. ఎందుకంటే ఏ రచయిత అయినా తన సాంస్కృతిక వారసత్వానికి బందీగానే ఉంటాడు. గ్రీకు నేలమీద ఒక బుద్ధుడు ఎప్పటికీ ప్రభవించలేడు. గ్రీకు సంస్కృతి, శిల్పం, సాహిత్యాలు చేసిన పని మానవదేహాన్ని కేవలం ప్రేమించడం కాదు, ఆరాధించడం.

క్రైస్తవం గ్రీకు నేలమీద అడుగుపెట్టినప్పుడు క్రైస్తవదృక్పథాన్ని గ్రీకు మనస్తత్వానికి సన్నిహితంగా తీసుకుపోడానికి తొలిక్రైస్తవులు ప్లేటో రచనలమీద ఆధారపడ్డారన్నది మనం మర్చిపోకూడదు. గ్రీకు మనస్తత్వానికి సొఫోక్లీసు, యురిపిడిసు వంటి నాటకకర్తలు తప్ప సోక్రటీసు, ప్లేటోలు ప్రతినిధులు కారని మనం చెప్పగలం. గ్రీకు లిరిక్ కవిత్వంలో విస్తారంగా కనవచ్చే మానవదేహప్రేమని నిరాకరించడం కోసమే ప్లేటో సింపోజియం రాసాడని కూడా మనం మర్చిపోలేం.

గ్రీకు సాంస్కృతిక నేపథ్యంలోంచి చూసినప్పుడు కజంజకిసు పడుతున్న సంఘర్షణ ఆయనొకడిదే కాదనీ, మొదటి ప్రపంచయుద్ధం తర్వాత మొత్తం గ్రీకు జాతి సంఘర్షణ అనీ మనం ఊహించగలం. అలాగని అది కేవలం గ్రీకులకి మాత్రమే పరిమితమైన అవస్థకాదనీ, ప్రపంచమంతటా ఆధునికమానవుడి ప్రశ్నలు కూడా దాదాపుగా అటువంటివే ననీ కూడా మనం పోల్చుకోవచ్చు. అందుకనే Zorba the Greek ని ప్రపంచమంతా రెండుచేతులా స్వాగతించింది.

అలాగని నవల మొత్తం సిద్ధాంతచర్చనో లేదా తాత్త్వికసంఘర్షణనో ఉందని అనుకుంటే అది పొరపాటే. ఆ కథనం ఆద్యంతం ఎంతోహృద్యంగా నడుస్తుంది. ఎన్నో తావుల్లో కజంజకిసులోని కవి గొంతు ఎంతో స్పష్టంగా వినిపిస్తుంది. ఆ సముద్రతీర క్రీటను గ్రామంలో మనం కూడా కొన్నాళ్ళు ఉండివచ్చినట్టుగా అనిపిస్తుంది ఆ నవల చదవడం ముగించాక.

నవల చదువుతుండగానూ, తర్వాతా కూడా తెలుగులో ఇటువంటి భావతీవ్రతకు నోచుకున్న పాత్రలుగాని, నవలలుగాని ఏమైనా ఉన్నాయా అన్న ఆలోచన రాకపోలేదు. తెలుగు రచయితకి ఆదర్శపాత్రల్ని సృష్టించడం పట్లనే ఎక్కువ మక్కువ. ఒక 'అసమర్థుని జీవయాత్ర', ఒక 'అల్పజీవి', ఒక 'చివరకు మిగిలేది' లాంటి నవలల్లో ఆదర్శమానవుణ్ణి కాక, అసమర్థమానవుణ్ణి చిత్రించినప్పుడు కూడా ఆ అసమర్థతని ఒక ఆదర్శంగా ప్రతిపాదించడం లేదు కదా అనే అనుమానం రాకపోదు. చాలా ఆలోచించిన మీదట, చలంగారి నవలల్లోనూ, కథల్లోనూ కాదుగాని, ఆయన మూజింగ్సులో ఇటువంటి భావ తీవ్రత కనిపిస్తుందనిపించింది. ఆదర్శానికి నిలబడలేని ఆచరణ వల్ల మనుషులు ఆత్మ లోకంలో దివాలా తీస్తుండటాన్ని నిస్సంకోచంగానూ, తీవ్రాతితీవ్రంగానూ బయటపెట్టిన రచయిత ఎవరన్నా ఉన్నారా అంటే ఇప్పటికీ చలంగారే కనిపిస్తున్నారు. ఇక కథల్లోనూ, నవలల్లోనూ, నాటకాల్లోనూ ఇంత గాఢమైన భావతీవ్రతకు నోచుకున్న రచయితలు మరెవ్వరూ కనిపించడం లేదుగాని, త్రిపుర గారి 'జర్కన్' కథలో వీరాసామి జోర్బాకు దగ్గరగా రాగల పాత్ర అనిపించింది.

ఏ భాషలోనైనా గాఢమైన రచనలు రావాలంటే, రచయితలు ప్రగాఢమైన పాత్రలు సృష్టించాలంటే, ముందు ఆ రచయితలకి తీవ్రమైన అన్వేషణ ఉండాలి. వారు తమకై తాము తీవ్రమైన సంఘర్షణకి లోనై ఉండాలి. తమ ప్రశ్నల్ని తాము సాహసంగా ఎదుర్కొని వాటికి సమాధానాలు అన్వేషించాలనే తపనతో రగిలిపోవాలి. అటువంటి తపనలోంచీ, అన్వేషణలోంచీ రాసే వాక్యాలు ఎలా ఉంటాయో ఈ నవలనుంచి చిన్న ఉదాహరణ చూపిస్తాను. కజంజకిసు ఇలా రాస్తున్నాడు:

> నేను స్కూల్లో ఒకటో తరగతి చదువుతున్నప్పుడు మాకు ఒక పాఠముండేది. అక్షరమాల నేర్పటానికి ఆ పాఠం చెప్పేవారు. ఆ కథలో ఒక పిల్లవాడు ఒక బావిలో పడిపోతాడు. అక్కడ అతడికొక అద్భుతమైన నగరం కనబడుతుంది. పూలతోటలు, తేనె నిండిన కొలను, అన్నం ముద్దలాంటి కొండా, రంగు

రంగుల బొమ్మలూ కనిపిస్తాయి. నేను ఆ బొమ్మల కింద ఉన్న ఒక్కో అక్షరాన్నీ బిగ్గరగా పలుకుతుంటే నాకు ఆ ఇంద్రజాల నగరం మరింతగా కళ్ళముందు తెరుచుకుంటూ ఉండేది. ఒక మధ్యాహ్నం నేను స్కూలునుంచి ఇంటికి రాగానే తోటలోకి పరిగెత్తాను. అక్కడ ద్రాక్షతీగని ఆనుకుని ఉన్న బావి అంచుదగ్గర నిలబడి ఆ బావిలోపలి నల్లటి నీటి అంచుని తదేకంగా చూస్తో ఉండిపోయాను. మరికొంతసేపు అట్లానే చూస్తే ఒక అద్భుతనగరం, ఇళ్ళూ, వీథులూ, పిల్లలూ, ద్రాక్షతోటలూ కనిపిస్తాయనిపించింది. ఇంక ఉండబట్టలేక తలకిందికి వంచి రెండు చేతులూ చాచి కాళ్ళు నేలమీంచి పైకి లేపి బావి అంచుమీంచి లోపలకి దూకబోయాను. సరిగ్గా ఆ క్షణమే మా అమ్మ కళ్ళల్లో పడ్డాను. ఆమె కెవ్వున కేకపెట్టి పరుగు పరుగున వచ్చి నా నడుం పట్టుకుని నన్ను వెనక్కి లాగేసింది.

ఒక చిన్నపిల్లవాడిగా అప్పుడు నేను దాదాపు ఆ బావిలో దూకినంత పనిచేసాను. కాని పెద్దయ్యాక, కొన్ని పదాల్లోకి నేను నిజంగానే దూకేసాను. 'అనంతత్వం' అటువంటి పదం. అలాంటి పదాలు చాలానే ఉన్నాయి– 'ప్రేమ', 'ఆశ', 'దేశం', 'దైవం'– అలా ప్రతి ఒక్క పదాన్ని దాటుకుంటూ నేను ముందు కొచ్చేస్తున్నకొద్దీ ఎప్పటికప్పుడు నేనో పెద్ద విపత్తునుంచి బయటపడుతున్నట్టూ, ముందుకు పోగలుగుతున్నట్టూ అనిపించేది. కాని, కాదు, నేనింతదాకా చేస్తూ వస్తున్నదల్లా పదాలు మార్చడమే. దాన్నే పురోగతి అనీ విముక్తి అనీ అనుకుంటూ వచ్చాను. ఇక ఇదుగో, గత రెండేళ్ళ బట్టీ, ఈ 'బుద్ధుడు' అనే పదం అంచుని పట్టుకుని వేలాడుతున్నాను.

'ఈ ఘనత జోర్బాదే. ఇప్పుడు అతడి పుణ్యమా అని ఈ బుద్ధుడనే పదమే నేను నిలబడ్డ చివరి బావి అనీ, ఇదే నన్ను సమ్మోహితుణ్ణి చేస్తూ వచ్చిన చిట్టచివరి బావి అంచు అనీ, ఇంక దీని తర్వాత నాకు నిజంగానే విముక్తి అనీ నమ్మకం కలుగుతోంది. ఎప్పటికీ. నిజంగా ఎప్పటికీనా? ఏమో? ప్రతిసారీ మనకి మనం ఇలానే చెప్పుకుంటాం. ..

ఇలా రాయగల రచయితలూ, ఇటువంటి నవలలూ తెలుగులో వచ్చే రోజు కోసం ఎదురుచూస్తుంటాను.

28-4-2024

భగవంతుడి భిక్షువు

నికోసు కజంజకిసు రాసిన Zorba the Greek (1946) నవల గురించి ఇంతకుముందే మీతో పంచుకున్నాను. తనలో సంఘర్షిస్తున్న రెండు విరుద్ధధోరణుల్ని సమన్వయ పరుచుకోడం కోసం నికోసు ఆ నవల రాసాడు. కాని God's Pauper (1954) అలా కాదు. ఇది స్పష్టంగా తనని వేధిస్తున్న ప్రశ్నలనుంచి బయటపడటానికి తన ఆత్మాన్వేషణను ఏకోన్ముఖం చేసుకోడానికి రాసిన నవల అని చెప్పవచ్చు. నవల మొదట్లోనే కథకుడు బ్రదరు లియో, సెయింటు ఫ్రాన్సిసు తనతో ఇలా అనేవాడని, చెప్తాడు:

> సోదరా, ప్రపంచం ఇప్పుడున్న పరిస్థితిలో, ఎవరేనా శీలవంతుడు కాదలచు కుంటే, అతడు పూర్తి సాధుసాజ్జనుడిగా, ఇంకా చెప్పాలంటే అంతకంటే ఎక్కువ స్థాయికి చేరవలసి ఉంటుంది. ఎవరేనా పాపి కాదలచు కుంటే పూర్తి మృగంగా, ఇంకా చెప్పాలంటే అంతకంటే తక్కువగా కూడా బతకవలసి ఉంటుంది. నేడున్న పరిస్థితుల్లో మధ్యేమార్గమంటూ ఏదీ లేదు.

నిజమే, అసిసీకి చెందిన సెయింటు ఫ్రాన్సిసుకి మధ్యేమార్గం తెలీదు. రాజీపడటం తెలీదు. పుస్తకానికి రాసుకున్న ముందుమాటలో నికోసు మరోమాట కూడా రాసాడు:

> తన విధ్యుక్తధర్మాన్ని నెరవేర్చడమే ముఖ్యమైన మానవుడెలా ఉంటాడో అందుకు సెయింటు ఫ్రాన్సిసు నాకో నమూనా. ఏదో ఒక నీతికి కట్టుబడి ఉండటమో లేదా ఏదో ఒక సత్యాన్నో, సౌందర్యాన్నో పైకెత్తి చూపడమో కాదు. భగవంతుడు మనకి అనుగ్రహించిన ఈ దేహమృత్తికని ఆత్మగా మార్చు కోవడమే ఆ పరమోన్నతధర్మం.

నికోసు కజంజకిసు ఇరవయ్యవ శతాబ్దపు గ్రీకు రచయితల్లో అగ్రేసరుడు. ఆయనలో ప్లేటో, అరిస్టాటిలుల తాత్త్విక విచారం, క్రైస్తవుల ఈశ్వరాన్వేషణ, మార్క్సిస్టుల తార్కిక చింతన, బౌద్ధుల శూన్యసంపాదనాలతో పాటు నీషే లోని అస్తిత్వవేదన కూడా సమానంగా కనవస్తాయి.

ఆలోచనాపరుడైన ఏ రచయితమీదనైనా విభిన్న దర్శనాల, అనుష్ఠానాల ప్రభావం తప్పకుండా ఉంటుంది. చాలా సార్లు పరస్పర విరుద్ధాలుగా ఉండే ఆ ఆలోచనల్ని తమకై తాము సమన్వయించుకోలేక మనుషులు ఏదో ఒక ధోరణికి వీరాభిమానులుగా మారిపోవడంలోని సౌకర్యాన్ని ఎక్కువ కోరుకుంటారు. కాని ఏ ఒక్క ధోరణికో కట్టుబడి పోకుండా, ప్రతి ఒక్క భావధారలోని మంచినీ స్వీకరిస్తూ, తనకై తాను ఒక స్వతంత్ర సత్యాన్వేషిగా కొనసాగడం అందరికీ చాతనయిన విద్య కాదు. అందుకు చాలా ఆత్మశక్తి, మనోబలం, బుద్ధికుశలత, అన్నిటికన్నా మిన్నగా సృజనశీలత ఉండాలి. కజంజకిసు అటువంటి అరుదైన రచయిత.

యూరోపులో మొదటినుంచీ రెండు పరస్పర విరుద్ధప్రవృత్తులు కనిపిస్తాయి. ఒకటి పాగన్ల బహుదేవతారాధన. ఇహలోక జీవితాన్ని కామించే, కాంక్షించే, ప్రేమించే జవసత్త్వాలతో కూడిన మానవత్వం. మరొకటి యూదుల, క్రైస్తవుల ఏకేశ్వరోపాసన. పరలోకరాజ్యం కోసం ఇహలోక సంతోషాల్నీ, సౌభాగ్యాల్నీ నిరాకరించుకోగల నిష్ఠుర నైతికత. ఏ ప్రాచీనకాలంలోనో ఒలింపసు పర్వతం మీద దేవతల రాగద్వేషాల్లో పుట్టి పరిఢవిల్లిన పాగనీయ యూరోపు సా.శ నాలుగవ శతాబ్దం నుంచి క్రైస్తవ యూరోపుగా మారిపోయింది. ఆ తర్వాత తిరిగి 14-15 శతాబ్దాల్లో ప్రాచీన గ్రీకును కనుక్కోవడం ద్వారా రినైజాన్సు మొదలయ్యాక, మళ్ళా హ్యూమనిస్టు యూరోపుగా తలెత్తడం మొదలుపెట్టాక, క్రైస్తవ, పాగనీయ యూరోపుల మధ్య సంఘర్షణ నానాటికీ తీవ్రమవుతూనే ఉంది.

అయితే మతంతో, ముఖ్యంగా క్రైస్తవంతో, విభేదించడం మొదలుపెట్టాక యూరోపు మళ్ళా రెండుగా చీలిపోయింది. ఒకటి హేతువునీ, తర్కాన్నీ, సైన్సునీ నమ్ముకున్న యూరోపు. ఈ ధోరణినే సెక్యులరిజం అని వ్యవహరిస్తున్నారు. కానీ, మనిషి మనసులోని అవ్యక్త ఆకాంక్షల్నీ, భయాల్నీ, అస్తిత్వ సందేహాల్నీ పూర్తిగా సమాధానపరచగల శక్తి సెక్యులరిజంకీ, హేతువుకీ, ఎన్లైటెన్‌మెంటు ఆదర్శాలకీ లేదని కూడా యూరోపుకి తెలుసు. కాబట్టి ఆ సుప్తతృష్ణల్ని ఏ కవులు, ఏ సంగీతకారులు, ఏ చిత్రకారులు గుర్తుపట్టగలిగినా, తృప్తిపరచ గలిగినా, యూరోపు వాళ్ళకి పాదాక్రాంతమవుతూ ఉంటుంది. ఎన్లైటెన్‌మెంటు యుగం

తర్వాత అంటే పద్ధెనిమిదో శతాబ్దం తర్వాత యూరోపులో వచ్చిన గొప్ప కళా ఉద్యమాలు– రొమాంటిసిజం, సింబలిజం, ఇంప్రెషనిజం, మాడర్నిజం, ఎక్స్‌ప్రెషనిజం, ఎగ్జిస్టెన్షియ–లిజం, అబ్సర్డిజం వంటివి తలెత్తిన ప్రతిసారీ యూరోపు పెద్ద కుదుపుకి లోనవుతూనే ఉంది.

కజంజకిసులో కూడా ఈ రెండు విరుద్ధ ధోరణులు కనిపిస్తాయి. ఆయన Zorba the Greek లో కథకుడు ఒక తాత్త్వికక్రమంలో ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకోవా–లనుకుంటూ ఉంటాడు. కాని జోర్బా ఆచరణవాది. అతడిలో క్రైస్తవానికి పూర్వపు యూరోపు మానవుడు సజీవంగా కనిపిస్తాడు. అపారమైన జీవశక్తికి అతడు ప్రతినిధి. హోమరు, హెసియోదుల కావ్యాల్లో చిత్రించిన దేవతల్లాగా అతణ్ణి మనం మన అల్ప నీతిసూత్రాలకు కట్టిపడేయలేం. జోర్బా పాత్ర ప్రపంచవ్యాప్తంగా భావుకుల్ని స్పందింపచేయడానికి కారణం మతానికీ, సాధారణ నైతికాదర్శాలకీ అతీతమైన మానవత్వాన్ని ఆ పాత్ర కనపరచడమే.

కాగా God's Pauper ఆ నవలకు పూర్తిగా ఆవలి పార్శ్వానికి చెందిన రచన. ఇందులో క్రీస్తు అనుయాయి కావడానికి తపన పడ్డ ఒక ఐరోపీయ మానవుడు కనిపిస్తాడు. ఆ తపన మామూలు తపన కాదు. నికోసు చెప్పినట్లుగా, an effort to trans-substantiate matter into spirit. బహుశా క్రీస్తు మాట్లాడిన ప్రతి ఒక్క మాటకీ తన మొత్తం జీవితాన్నిఅంత విధేయంగా నడుపుకున్న మరొక సాధుసత్పురుషుడు మనకు మొత్తం కేథలిక్కు చరిత్రలోనే కనబడడు. కానీ చిత్రమేమిటంటే, సెయింటు ఫ్రాన్సిసు ప్రతి ఒక్క అస్తిత్వంలోనూ, పువ్వులో, పిట్టలో, తోడేలులో, గొర్రెలో, మనిషిలో, మట్టిలో–ప్రతి ఒక్కచోటా, చరాచరాలన్నిటిలోనూ క్రీస్తును దర్శించడానికి తపించాడు. అలా చూసినప్పుడు అంతకన్న పాగనుని మరొకర్ని మనం చూడలేమనిపిస్తుంది. అంటే ఆయన క్రైస్తవుడు కావడం ద్వారా పూర్తి పాగను కాగలిగాడనీ లేదా పూర్తి పాగనుగా మారడం ద్వారానే నిజమైన క్రైస్తవుడు కాగలిగాడనీ మనకి తెలుస్తూంటుంది. సరిగ్గా ఈ అపురూపమైన భావావేశ సమన్వయం వల్లనే God's Pauper గ్రీకులో రాసిన ఒక భాగవతకథ అనిపిస్తుంది.

సెయింటు ఫ్రాన్సిసు ఆఫ్ అసిసీ 1181 లేదా 82 లో ఇటలీలోని అసిసీలో జన్మించాడు. 1226 లో శివైక్యం చెందాడు. దాదాపు నలభై నాలుగేళ్ళ జీవితంలో అతడు పూర్ణజీవితం, సఫలజీవితం జీవించాడు. ఫ్రాన్సిసు పుట్టిన కాలానికి యూరోపు రెండుగా విడిపోయి ఉంది. ఒకటి పశ్చిమ యూరోపు. రోము ఆధీనంలో ఉన్న పడమటి చర్చి. మరొకటి తూర్పు యూరోపు. కాన్ స్టాంటినోపిలు ఆధీనంలో ఉన్న తూర్పు చర్చి. ఈ రెండు శాఖలూ

పరస్పరం కలహించుకుంటూ ఉండేవి. వట్టి కలహమే కాదు, ఫ్రాన్సిసు పుట్టేటప్పటికే తూర్పుచర్చి పడమటిచర్చికి చెందిన వాళ్ళని ఎందరినో, స్త్రీబాల వృద్ధులతో సహా, ఊచకోత కోసేసింది. ఫ్రాన్సిసు కాలం నాటి ఇటలీ కూడా రెండుగా విడిపోయి ఉంది. నిజానికి అప్పటికీ ఇటలీ అనే ఒక దేశం లేదు. అనేక దుర్గాలూ, నగరరాజ్యాల, పట్టణప్రభుత్వాల సమాహారం అది. అందులో కొందరు పోపు ఆధిక్యానికి తలవొగ్గి ఉండేవారు. మరికొందరు పవిత్ర రోమను సామ్రాజ్యానికి విధేయులుగా ఉండేవారు. ఫ్రాన్సిసు కాలానికి అసిసీ కూడా రెండుగా విడిపోయింది. ఒక వర్గం గ్రామీణ భూస్వామివర్గం. మరొకరు పట్టణ వర్తక, వాణిజ్యశ్రేణి.

ఫ్రాన్సిసు అసిసీ పట్టణానికి చెందిన ఒక వస్త్రవ్యాపారి ఇంట్లో జన్మించాడు. ఆ కుటుంబానికి ఐశ్వర్యానికి లోటులేదు. ఫ్రాన్సిసు విద్యాభ్యాసం అయినతర్వాత, యుక్తవయస్సు వచ్చాక, అప్పటి యువకుల్లానే, తను కూడా కొన్ని చిన్న చిన్న యుద్ధాల్లో పాల్గొన్నాడు. ఒక యుద్ధంలో అతణ్ణి రాజవంశానికి చెందినవాడిగా పొరబడి బందీగా పట్టుకుపోయి ఏడాది పాటు చెరసాలలో కూడా పెట్టారు. చెరసాలనుంచి బయటపడ్డాక కూడా ఫ్రాన్సిసు మళ్ళా ఒకటి రెండు యుద్ధాల్లో పాల్గొన్నాడుగానీ, అతడికి ఆ సైనిక జీవితం మీద ఆసక్తి పోయింది. ఒకరోజు తన కత్తినీ, గుర్రాన్నీ మరొకడికి దానం చేసేసి నడుచుకుంటూ ఇంటిబాట పడ్డాడు. తన ఊరు ఇంకా కనుచూపు మేరలో ఉందనగా, దారిలో సాన్ డామియానో అనే చోట అతడికి ఒక పాడుపడ్డ చర్చి కనిపించింది. ఆ రాత్రి ఆ చర్చిలో అతడికి ఒక దివ్యదర్శనం లభించింది. లోకరక్షకుడు అతడికి కలలో కనబడి పాడుపడ్డ తన చర్చిని పునరుద్ధరించమని అడిగినట్టుగా తోచింది. ఆ మర్నాడు అతడు అసిసీకి వెళ్ళాడన్నమాటేగాని, అతడి మనసు మనసులో లేదు. ఆ రోజునుంచీ అతడు ప్రాపంచిక జీవితానికి దూరంగా, అంతర్ముఖుడిగా జీవించడం మొదలుపెట్టాడు. ప్రార్థన, దానధర్మాలతో పాటు ఉపవాసక్లేశంతో శరీరాన్ని శుష్కించేసుకోవడం కూడా మొదలుపెట్టాడు.

ఫ్రాన్సిసులో వచ్చిన ఈ మారు అతడి తండ్రిని తీవ్రంగా కలత పెట్టింది. మొదటిది, ఒక చక్కటి రాజకీయ భవిష్యత్తుని వదులుకుని తన కొడుకు రికామీగా తిరుగుతున్నాడన్న చింత. అంతకన్నా కూడా తన ఆస్తిపాస్తులు, వారసత్వం అటువంటి కొడుక్కి ఎలా అంద చేయగలనన్న బాధ. వాళ్ళిద్దరి మధ్యా గొడవ చివరికి స్థానిక మాజిస్ట్రేటు ముందుకు చేరింది. 'నువ్విట్లా తిరిగేటట్టయితే నీ తండ్రి ఆస్తికి నువ్వు వారసుడివి కాలేవు' అన్నాడు మాజిస్ట్రేటు. 'ఆస్తి దాకా ఎందుకు, ఇదుగో, నా వంటి మీద ఉన్న గుడ్డలు, మా నాన్న కుట్టించినవే, అవి కూడా నాకవసరం లేద'ని ఫ్రాన్సిసు అక్కడిక్కడే నలుగురూ చూస్తుండగా

తన కట్టుగుడ్డలు విప్పి పారేసాడు. ఆ దృశ్యం చూసిన స్థానిక మతాధిపతి ఫ్రాన్సిసులో ఒక దైవావేశం అభివ్యక్తమవుతున్నదని మొట్టమొదటగా గుర్తుపట్టాడు.

ఆ తర్వాత కొన్నాళ్ళపాటు ఫ్రాన్సిసు అనాథగా, పిచ్చివాడిగా, దిమ్మరిగా సంచరించాడు. కాని అతనిలో కనిపిస్తున్న దివ్యావేశాన్ని చూసి నెమ్మదిగా ఇద్దరు యువకులు అతడికి శిష్యులయ్యారు. ఆ శిష్యుల్ని ఏం చేసుకోవాలో ఫ్రాన్సిసుకి తెలియలేదు. అంతకన్నా ముందు అసలు తానేమి చెయ్యాలో కూడా అతడికి తెలియలేదు. కాబట్టి ముగ్గురూ ఒక మతాచార్యుడి దగ్గరికి వెళ్ళి తామేం చెయ్యాలో చెప్పమని అడిగారు. వాళ్ళ విషయంలో భగవంతుడి నిర్ణయమేమిటో తెలుసుకోడానికి, ఆ మతాచార్యుడు, సువార్తల్లోంచి మూడు పేజీలు అక్కడక్కడా తెరిచి కొన్ని వాక్యాలు చదివి వినిపించాడు.

మొదటిది, మార్కు సువార్త (10:21) నుంచి:

> యేసు అతణ్ణి చూసి నీలో ఒకటే కొరత. నువ్వు వెళ్లి నీకున్నదంతా అమ్మేసి బీదసాదలకి పంచిపెట్టు. నువ్వు పరలోకంలో ఐశ్వర్యవంతుడివి అవుతావు. నువ్వు వచ్చి నన్నునుసరించు అని ప్రేమగా చెప్పాడు.

ఇది మత్తయి సువార్తలో (19:21-24) కూడా కనిపించే వాక్యమే. రెండవది లూకా సువార్త (9:3) నుంచి:

> మీరు మీ ప్రయాణం కోసం చేతికర్రగాని, జోలెగాని, రొట్టెగాని, సొమ్ముగాని ఏదీ తీసుకుపోకండి. చివరికి మీ వంటిమీద ఉన్న అంగీ తప్ప మరొక అంగీకూడా వెంట తీసుకుపోకండి.

మూడవది కూడా లూకా సువార్త (9:23) నుంచే:

> మీలో ఎవరైనా నన్ను అనుసరించదలచుకుంటే తనను తాను నిరాకరించుకుని నా సిలువ తన భుజానికెత్తుకుని నా వెంటనడవలసి ఉంటుంది.

1207 లోనో లేదా 08 లోనో సంభవించిన ఈ సంఘటన తర్వాత, 1226 లో తన నిర్యాణం దాకా దాదాపు రెండు దశాబ్దాలపాటు ఫ్రాన్సిసు ఈ మూడు వాక్యాల్నీ పూర్తిగా ఆచరణలోకి తెచ్చుకోడానికే జీవించాడు. ఆ మూడు వాక్యాల సారాంశాన్నీ ఆయన మూడు సూత్రాలుగా మలచుకున్నాడు. మొదటిది, పరిపూర్ణమైన దారిద్ర్యం. రెండవది, పరిపూర్ణ బ్రహ్మచర్యం. మూడవది దైవవాక్యం పట్ల పరిపూర్ణ విధేయత.

దారిద్ర్యాన్ని ఐచ్ఛికంగా స్వీకరించినవాళ్ళు ఫ్రాన్సిసుకి ముందూ, తరవాతా కూడా లేకపోలేదు. నిరాడంబరజీవితం దాదాపుగా ప్రతి ఒక్క యోగీ మనఃపూర్వకంగా స్వీకరించేదే. స్టోయిక్కులూ, సూఫీలూ, దిగంబర జైనులూ, జెన్ సాధువులూ పరిపూర్ణమైన దారిద్ర్యాన్ని వరించినవాళ్ళే. కాని ఫ్రాన్సిసు దారిద్ర్యస్వీకరణలో, చెస్టర్‌టను చెప్పినట్లుగా ఒక passion ఉంది. ఆకలిగొన్నవాడు విందుబల్లని సమీపించినంత ఉద్రేకంతో, గాఢచిత్తంతో, ఫ్రాన్సిసు ఉపవాసాల్ని ఆస్వాదించేవాడు.

తర్వాత రోజుల్లో ఫ్రాన్సిస్కన్లుగా పిలవబడే ఫ్రాన్సిసు మతావలంబులు ఈ ఒక్క అంశం మీదనే ఎన్నో శాఖలుగా చీలిపోయారు. అంటే ఒక మనిషి ఎంత మేరకు నిరుపేదగా ఉండవచ్చుననే అంశం మీద. నియమావళి అంటూ పెట్టుకున్నతరువాత, ఏదో ఒక మేరకు రాజీపడాలనే ప్రవృత్తి కూడా మానవస్వభావమే. బుద్ధుడి బోధల్లోని నియమాల్ని యథాతథంగా ఆచరించాలనుకున్నవాళ్ళు థేరవాదులుగా మిగిలిపోగా, వాటిని జనసామాన్యానికి తగ్గట్టుగా సవరించాలని వాదించినవాళ్ళు మహాయానులు కావడం మనకు తెలిసిందే. కాని ఫ్రాన్సిసు పూర్తిగా భగవత్‌భిక్షువుగా జీవించాడు. లేమి అతడి మతం. దానిలో అతడికి ఎటువంటి రాజీనీ కోరుకోలేదు.

ఇక రెండవ నియమం, పరిపూర్ణ బ్రహ్మచర్యం. దాన్ని పరీక్షించడానికా అన్నట్టు క్లేర్ అనే ఒక యువతి ఆయన జీవితంలోకి ప్రవేశించింది. ఒక నవయవ్వని తన జీవితంలో అడుగుపెట్టినప్పుడు, ఒక భావుకుడు ఎంత సంక్షోభానికి లోనుకాగలడో అదంతా నికోసు చాలా అద్భుతంగా చిత్రించేడు. కాని ఫ్రాన్సిసు భగవంతుడి పాదాలు వదల్లేదు. ఆ యువతిని సోదరీ అని పిలిచాడు. స్త్రీలకోసం ఒక సన్న్యాసినులమఠాన్ని ఆమెతో ప్రారంభింపచేసాడు.

మూడవ నియమం, భగవంతుడి పట్ల పరిపూర్ణ విధేయత. ఫ్రాన్సిసు దృష్టిలో విధేయత అంటే, క్రీస్తు తన దేహంతో అనుభవించిన, శారీరిక హింస మొత్తాన్ని తాను కూడా అనుభవించడం. ఎలా అయ్యిందో తెలియదుగానీ, సిలువ పైన క్రీస్తు దేహం లాగా, ఫ్రాన్సిసు శరీరం కూడా ఒక పచ్చిపుండుగా మారిపోయింది. క్రీస్తు పట్ల ప్రేమతో తన మొత్తం దేహాన్నే ఒక మానని గాయంగా మార్చుకోగలగడం మానవచరిత్రలో ఫ్రాన్సిసు ఒక్కడికే చాతనయిందని చెప్పవచ్చు. అటువంటి గాయాలు, ఆ stigmata వల్ల, ఫ్రాన్సిసుకి చివరి సంవత్సరాల్లో నిలబడటం, నడవడం, చూడటం కూడా కష్టమైపోయింది. నికోసు నవల్లో దాదాపు అరవై డెబ్బై పేజీలపాటు చివరిపుటల్లో ఫ్రాన్సిసు జీవితంలోని చరమ క్షణాల తెంపులేని చిత్రణ. ఆయన ఆ జీవితాన్ని ఎలా జీవించాడోగాని, దాన్ని చదవడమే

మనకి కష్టంగా ఉంటుంది. కానీ, ఫ్రాన్సిసు దృష్టిలో తాను అనుభవిస్తున్నది వేదనకాదు, విజయమే. నికోసు ఇలా రాస్తున్నాడు:

> 'సోదరా ఫ్రాన్సిస్, నీకు మరీ నొప్పిగా ఉందా?' అనడిగాను.
>
> అతడు ఒక క్షణం పాటు తన నేత్రాలు తెరిచిచూసాడు. 'సోదరా, లియో, నాకు ఈ క్షణాన నిశ్చయంగా ఉన్నది ఒక్కటే, అదేమంటే, నేను చాలా సంతోషంగా ఉన్నాను. పట్టలేనంత సంతోషంగా ఉన్నాను. జయం! జయం! సోదరా లియో! మనం గెలిచాం. నేను పుట్టినప్పటినుంచీ నాలో భగవంతుణ్ణి ద్వేషించేవాడెవడో ఒకడు నాలో మసలుతున్నట్టే అనిపించేది. ఇప్పుడు వాడు పూర్తిగా అదృశ్యమైపోయాడు. ఇటువంటప్పుడు సంతోషించకుండా ఉండట మెలా?'
>
> 'తండ్రీ, ఎవరతను?
>
> 'నా దేహంలోని దేహేచ్ఛ' అని అన్నాడతడు. అప్పటికే అలసిపోయిన ఆయన నేత్రాలు మళ్ళా నిమీలితాలయ్యాయి.

మరొకచోట ఇలా రాస్తున్నాడు:

> 'తండ్రీ ఫ్రాన్సిస్, నీ ముఖంలో గొప్ప వెలుగు కనిపిస్తోంది. ఏదైనా మంచి కలగన్నావా?'
>
> 'సోదరా లియో, నా నుంచి రక్తం ఇలా కారిపోతుండగా కలలుగంటూ చిరునవ్వులు చిందించగలనని ఎలా అనుకుంటున్నావు? ఇప్పటిదాకా నేను రోదించాను, నా గుండెలు బాదుకున్నాను. నా పాపాల చిట్టా విప్పి భగవంతుడి ముందు మొరపెట్టుకున్నాను. కాని ఇప్పుడు నాకు అర్థమవుతోంది. దేవుడి చేతుల్లో ఒక స్పాంజి ఉంది. దేవుడు, తన సమస్త దయాపరత్వంతోనూ, ప్రత్యక్షమయ్యే దృశ్యాన్ని చిత్రించమని నన్నెవరైనా అడిగితే, చేతిలో ఒక స్పాంజితో ఆయన మనముందు నిలబడ్డట్టు చిత్రిస్తాను. ..అన్ని పాపాలూ తుడిచిపెట్టుకుపోతాయి, తమ్ముడూ లియో, పాపులందరికీ క్షమాభిక్ష లభిస్తుంది – చివరికి సాతానుకి కూడా. సోదరా, నరకమంటే ఏమిటనుకున్నావు, అది స్వర్గాన్ని అనుకుని ఉండే మరో గది, అంతే.'

'కాని–' అంటో నేనేదో చెప్పబోయాను.

'హుష్!' అన్నాడాయన. 'భగవద్వైభవాన్ని తక్కువ చెయ్యకు.'

విధేయత అంటే ఫ్రాన్సిసుదృష్టిలో భగవంతుడి వాక్యాన్ని శిరసావహించడమే కాదు, దైవకుమారుడి జీవితానుభవాన్ని తాను తిరిగి అనుక్షణం జీవించడమే, తన దేహంతో, తన ప్రాణంతో, తన ఆత్మతో. అప్పుడు మాత్రమే తాను భగవంతుడితో ఏకం కాగలడని ఆయన నమ్మాడు. మరొక సన్నివేశంలో ఇలా రాస్తున్నాడు:

> మర్నాడు నేనాయన్ని చూసినప్పుడు వణికిపోయాను. నా కళ్ళకి కనబడుతున్నది పూర్వంలాగా ఒక శరీరం కాదు. చినిగిపేలికలైన గుడ్డలో చుట్టిపెట్టిన ఎముకలపోగులాగా ఉన్నాడాయన. ఆ పెదాలు చలికి పాలిపోయి ఉన్నాయి.
>
> నేనాయన చెయ్యి ముద్దుపెట్టుకుంటూ 'నా తండ్రీ, ఫ్రాన్సిసు, కొద్దిగా కట్టెలు పోగేసి నీకోసం ఒక నెగడి వెలిగించనివ్వు' అని అన్నాను.
>
> 'తమ్ముడూ, లియో, వెళ్ళు, ప్రపంచమంతా తిరిగి చూడు. ప్రతి ఒక్క గుడిసెలో, ప్రతి ఒక్క నిర్భాగ్యుడి ఇంట్లో నెగడి మండుతున్నట్లయితే, అప్పుడొచ్చి నాకోసం కూడా ఒక నెగడి రగిలించు. ఈ ప్రపంచంలో ఏ ఒక్కచోటైనా ఏ ఒక్క మనిషి చలికి వణుకుతున్నా నేను కూడా అతడితో పాటు వణుకుతూ ఉండక తప్పదు' అని అన్నాడు ఫ్రాన్సిసు.

చివరి పుటలకి వచ్చేటప్పటికి ఈ దర్శనం మరింత స్పష్టత సంతరించుకోడం మనం గమనిస్తాం. ఇలా రాస్తున్నాడు నికోసు:

> 'సోదరులారా, ప్రేమంటే ఏమిటి?' అనడిగాడు ఆయన తన చేతులు ముందుకు చాపుతూ, మా ప్రతి ఒక్కరినీ ఆలింగనం చేసుకోవాలన్నట్టుగా. అప్పుడు తనే జవాబిచ్చాడు: 'ప్రేమంటే ఏమిటి? అది కేవలం దయకాదు, కేవలం సహానుభూతి కాదు. సహానుభూతి అంటేనే అక్కడింకా ఇద్దరున్నట్టు: దుఃఖపడే వాడూ, అతణ్ణి ఓదార్చేవాడూ. నువ్వు ఎవరి పట్లనైనా దయ చూపిస్తున్నావంటే అక్కడ కూడా ఇద్దరున్నట్టు: ఇచ్చేవాడూ, తీసుకునేవాడూ. కాని ప్రేమలో ఒక్కరు మాత్రమే ఉంటారు. అక్కడ ఇద్దరుండరు. ఆ ఇద్దరూ విడదీయ లేనంతగా ఒక్కరైపోతారు. అప్పుడు నువ్వూ, నేనూ అన్నవి అదృశ్యమైపోతాయి. ప్రేమ అంటే ప్రియతముడిలో తనని తాను పూర్తిగా లయం చేసేసుకోవడం.'

ఇటువంటి వాక్యాల దగ్గరకి వచ్చేటప్పటికి ఈ నవల ఒక ఈశోపనిషత్తు వ్యాఖ్యానం చదువుతున్నట్టూ లేదా ఒక రూమీని చదువుతున్నట్టూ లేదా రమణమహర్షి సంభాషణలు చదువుతున్నట్టూ అనిపించడంలో ఆశ్చర్యం లేదు. సెయింటు ఫ్రాన్సిసు తన ప్రేమని రోమను కాథలిక్కులకి మాత్రమే పరిమితం చెయ్యలేదు. ఆ దయాప్రసారం ఒక్క మనుష్యుల్తోటే ఆగిపోలేదు. పశుపక్ష్యాదులన్నిటినీ తన సోదరులుగా నమ్మిన జీవితం ఆయనది. ఈ అంశంలో ఆయన పూర్తి పాగను.

God's Pauper చదువుతున్నంతసేపూ రచయిత చెప్పుకున్నట్లుగా ఒక odour of sainthood మనల్ని తాకుతూనే ఉంటుంది. భారతీయ భక్తికవులు, యోగులు, తపస్వులు, మహర్షులు ఎందరో మనకి పదే పదే గుర్తు రావడంలో ఆశ్చర్యం లేదు. ముఖ్యంగా, సెయింటుఫ్రాన్సిసుకీ గాంధీకీ మధ్య పోలిక కనబడకపోతే ఆశ్చర్యపడాలి. గాంధీ మరణించి నాలుగేళ్ళు తిరక్కుండా ఇటలీలోని పెరుగియా వద్ద గాంధీ–సెయింటు ఫ్రాన్సిసుల జీవితాల పైన ఒక తులనాత్మక సదస్సు జరిగిందని విన్నప్పుడు నాకెంతో సంతోషం కలిగింది. సెయింటు ఫ్రాన్సిసు భగవంతుడి భిక్షువు. ఆ పదబంధాన్ని తిప్పి చదివితే దరిద్రనారాయణుడే కదా అవుతుంది. గాంధీగారు గుర్తుపట్టి ఉండకపోవచ్చుగానీ, దక్షిణాఫ్రికా జీవితంలో ఆయన్ని ప్రభావితం చేసిన క్రైస్తవుల ద్వారా, టాల్‌స్టాయి రచనల ద్వారా సెయింటు ఫ్రాన్సిసు ఆయన్ని ప్రభావితం చేసాడని మనం పోల్చుకోవచ్చు.

గాంధీగారి కాలం కన్నా కూడా సెయింటు ఫ్రాన్సిసు గురించి తెలుసుకోవడం ఇప్పుడు బహుశా మరింత అవసరం. మరీ ముఖ్యంగా మన వస్తువ్యామోహం, ఏ విధంగా ప్రయత్నించినా, ఎన్ని రకాలుగా శమింపచెయ్యాలని చూసినా శమించని ఇంద్రియ తాపం, ఎవరి మాటలూ, చివరికి అంతర్వాణి మాటల్ని కూడా లెక్కపెట్టని విచ్చలివిడితనం పేట్రేగి పోతున్న ఈ కాలంలో, ఒకప్పుడు సెయింటు ఫ్రాన్సిసు, టాల్‌స్టాయి, గాంధీ వంటి వారు కూడా ఈ ప్రపంచంలో జీవించారనీ, మనలాగే వారు కూడా దేహానికీ, దైవానికీ మధ్య నలిగి పోయారనీ, కాని చివరికి వారు తమ చీకటిని జయించారనీ తెలుసుకోవడంలో, పదే పదే గుర్తుచేసుకోవడంలో గొప్ప ఓదార్పు, ధైర్యం, సంతోషం ఉన్నాయని ఎన్నిసార్లేనా చెప్పాలనిపిస్తుంది.

25-6-2024

కొత్త యుగం రచయిత్రి-1

మనుషులు ప్రాయికంగా క్రూరులనే మాట నిజమేనా? మనం ఒక జీవజాతిగా ఒకరితో ఒకరం పంచుకోగలిగేది క్రూరత్వం తాలూకు అనుభవమేనా? మానవమర్యాదగా మనం పిలుచుకునేది కేవలం మనల్ని మనం మభ్యపెట్టుకోవడమేనా? మనలో ప్రతి ఒక్కరం ఒక క్రిమిస్థాయికి, ఆకలి అణచుకోలేని మృగాల స్థాయికి, వట్టి మాంసం ముద్దల స్థాయికి మనల్ని మనం దిగజార్చుకోగలమనే ఒకే ఒక్క సత్యానికి ఎదటపడకుండా ముఖం చాటేయడమేనా? అత్యంత హీనస్థాయికి దిగజారడం, పరస్పరం నాశనం చేసుకోడం, ఒకరినొకరు వధించుకోడం-ఇదేనా మానవాళికి దక్కిన విధి? ఇదేనా చరిత్ర అనివార్యమంటూ ఘోషిస్తున్నది?

Human Acts, పే.56

---

95 పేజీల నవల. నవల అనడానికి కూడా లేదు. కాని నాకైతే ఎంతకీ ముగియబోని వేలపేజీల ఒక విషాదగ్రంథాన్ని చదువుతున్నట్టుగా అనిపించింది. ఏదో ఒక జైలు రికార్డు లేదా ఒక అణుబాంబు పడి ఒక నగరమంతా తుడిచిపెట్టుకుపోయాక, ఆ ధూళిని తీసుకొచ్చి గంటల తరబడి, రోజుల తరబడి పరిశీలిస్తూ, అందులో మామూలు నేత్రాలకు కనిపించని ఒక కన్నీటి తడిని ఓపిగ్గా గుర్తుపట్టడం లాగా ఉంది. ఒక నవల చదవడం మానసికంగా ఇంత అలసట కలగచెయ్యగలదని నేను ఊహించలేదు. ఒక్కొక్కపేజీ చదువుకుంటూ పోతూ, ఇంకా ఎన్ని పేజీలు మిగిలి ఉన్నాయా అని చూస్తూ ఉంటే, నేను నా దుర్బల దేహంతో ఎక్కలేని ఒక కొండ, కాని ఎలాగేనా ఒక రోజు గడిచేలోపు ఎక్కి తీరాలని నాకై నేను విధించుకున్న ఒక బాధ్యతకొద్దీ, అతి కష్టం మీద ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ,

ఆయాసపడుతూ, రొప్పుతూ, ఆగుతూ, కాని ఆగలేక, మళ్ళా ఎక్కడం మొదలుపెడుతూ– ఈ పుస్తకం చదవడం నాకు కలిగించిన అలసట ఒట్టి మానసికమే కాదు, శారీరికం కూడా అని అర్థమయ్యింది ఇప్పటికి.

Human Acts (2014) దక్షిణ కొరియా రచయిత్రి హన్‌కాంగ్ రాసిన నవల. మొన్న ఆమెకి నోబెలు కమిటి 2024 సంవత్సరానికి గాను సాహిత్యానికి నోబెలు బహుమతి ప్రకటించింది. ఆమె పేరు నిన్నటిదాకా నేను వినలేదు. కానీ, గత కొన్నేళ్ళుగా ప్రతి సారీ నోబెలు కమిటి ప్రపంచాన్ని నిర్ఘాంతపరుస్తూనే ఉందనీ, ప్రతి ఏడాదీ సాహిత్యానికీ నోబెలు బహుమతి తప్పకుండా ఫలానా రచయితలకి రాబోతోందని బెట్టింగు చేసే వాళ్ళమీద తనదే పైచేయి అని నిరూపించుకుంటూనే ఉంది కాబట్టి, ఈసారి కూడా మరొక కొత్త రచయిత్రికి ప్రకటించారనే అనుకున్నాను నిన్న.

కానీ ఆమె రచనల్లో మూడు నవలలు Vegetarian (2007), The White Book (2017), Human Acts (2014) చదివేక అర్థమయింది నాకు, ఆమె మామూలు రచయిత్రి కాదనీ, ఆమె ఒక దేశానికీ, ఒక దేశచరిత్రకీ మాత్రమే ప్రతినిధి కాదనీ, ప్రపంచంలో ఏ మూల ఏ పాఠకుడు తన పుస్తకాలు చేతుల్లోకి తీసుకున్నా అతణ్ణి లోపలనుంచీ కుదిపెయ్యగల శక్తి ఏదో ఆమె అనుభవాలకీ, ఆలోచనలకీ, భావనలకీ, పర్యావలోకనానికీ ఉందని అర్థమయింది. తన తక్కిన వ్యాపకాలన్నిటినీ, భ్రమలన్నిటినీ పక్కనపెట్టి అతడు కొంతసేపేనా తన అంతరంగం ఎదట ముఖాముఖి నిలబడ్డేట్టు చేసే ఒక దివ్యనిర్బంధం ఏదో ఆమెకి చాతనవునని అనిపించింది.

2

గత కొన్నేళ్ళుగా మన ప్రభుత్వాలు ఆర్థిక అభివృద్ధి సాధించడానికి పరుగులుపెడుతూ తరచూ ఉదాహరించే దేశాల్లో దక్షిణ కొరియా పేరు వినబడుతూ ఉంది. ఉత్తర కొరియా కమ్యూనిస్టు సిద్ధాంతాలకు అంటిపెట్టుకుని పాశవిక నియంతృత్వరాజ్యంగా మారి అణ్వాయుధాలతో ప్రపంచాన్ని భయపెడుతూ ఉండగా, దక్షిణ కొరియా పెట్టుబడిదారీ విధానాల్ని అనుసరించి పెద్ద పెద్ద అంగల్తో అద్భుతమైన ఆర్థికప్రగతి సాధించిందని చాలా సమావేశాల్లో ఎవరెవరో చెప్తూండగా విన్నాను. అది ఒక చరిత్ర. పెట్టుబడిదారులూ, వారి మీడియా రాసే చరిత్ర. కానీ 'ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగున పడి కాన్పించని కథల్ని' తవ్వితీసి నిజమైన చరిత్రని చెప్పే బాధ్యత రచయితలది. కానీ అన్నిసార్లూ, అందరూ రచయితలూ ఆ పని చెయ్యలేరు. దానికి సాహసం, విషయపరిజ్ఞానం మాత్రమే కాదు,

అన్నిటికన్నా ముందు, తన ప్రజలు నిశ్శబ్దంగా అనుభవించిన trauma ని తిరిగి తాను అనుభవించకుండా ఉండలేని సున్నిత హృదయం ఉండాలి. తనకి తెలిసిన సత్యాలు, వాస్తవాలు, విన్నవీ, కన్నవీ తనకు నిద్రపట్టకుండా nightmares గా తనని వేధిస్తుంటే నిలవలేకుండా అల్లల్లాడిపోయే మనసు ఉండాలి. పలికే ప్రతి ఒక్క మాటా తన గుండెని చీల్చుకు రావడమే కాదు, Human Acts నవల్లో డాంగ్–హో అనే పిల్లవాడి సోదరుడు రచయిత్రిని అడిగిన మాటలు, Please, write your book so that no one will ever be able to desecrate my brother's memory again- ఒక్కటే తనని నడిపించే సూత్రం కాగలగాలి.

సుదీర్ఘ కాలం వలసపాలనలో చిక్కి శల్యమయి రాజకీయ స్వాతంత్ర్యం పొందాక కూడా దక్షిణ కొరియా పూర్తి ప్రజాస్వామ్యంగా మారడానికి చాలా ఏళ్ళే పట్టింది. 1960-63 మధ్యకాలంలో కొరియాలో ఏర్పడ్డ రెండో రిపబ్లిక్కుని 1961 లో పార్క్ చుంగ్ హీ అనే సైనికాధికారి కూలదోసి అధికారం హస్తగతం చేసుకున్నాడు. అతను 1963-72 మధ్యకాలంలో మూడో రిపబ్లిక్కుని ఏర్పాటు చేసి దక్షిణ కొరియాని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి పరుగులు పెట్టించాడు. అతడి పాలన మొదట్లో దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసినట్టే కనిపించింది. ప్రజల జీవనప్రమాణాలు కూడా మెరుగయ్యాయి. అలా రెండు సార్లు అతడు దక్షిణా కొరియా అధ్యక్షుడిగా పనిచేసాడు. అయితే రాజ్యాంగపరంగా ఏ ప్రభుత్వమేనా రెండుసార్లకు మించి అధికారంలో ఉండే అవకాశం లేకపోవడంతో తాను మళ్ళా మూడోసారి అధికారంలోకి రావడానికి వీలుగా 1969 లో రాజ్యాంగాన్ని సవరించి ఎన్నికలు జరిపి 1971 లో మళ్ళా అధ్యక్షుడయ్యాడు. కాని ఆ రాజ్యాంగ సవరణని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున ప్రజలు నిరసన తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రతిపక్షాలకి మెజారిటీ లభించింది. దాంతో పార్క్ హీ 1971 లో ఎమర్జన్సీ ప్రకటించాడు. 1972 లో కొత్త రాజ్యాంగానికి అనుగుణంగా నాలుగో రిపబ్లిక్కు ఏర్పాటయ్యింది. కానీ ఒకవైపు పార్క్ హీకి వ్యతిరేకంగా ప్రజాపోరాటాలు నడుస్తూనే ఉన్నాయి. మరోవేపు అభివృద్ధి కూడా ఆగలేదు. ఈ పరిస్థితుల్లో 1979 లో ఒక ఇంటలిజెన్సు అధికారి పార్క్ హీని హత్యచేసాడు. ఆ ఆకస్మిక సంఘటనలమధ్య జున్ దువాన్ అనే సైనికాధికారి అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు. 1988 లో అధికారాన్ని వదులుకునేదాకా అతడు దక్షిణా కొరియాకి నిజమైన నియంత అంటే ఎలా ఉంటాడో చూపించాడు. అతడికి ఒక విధంగా పార్క్ హీ గురువు. అధికారాన్ని హస్తగతం చేసుకోడానికీ, చేజిక్కించుకున్న అధికారాన్ని ఎలాగేనా నిలబెట్టుకోడానికీ ఒక రాజ్యాధినేత ఎంతకు తెగించవచ్చో పార్క్ హీ ఒక దారి చూపిస్తే, జున్ దువాన్ ఆ దారిలో కడదాకా ప్రయాణించాడు.

పార్క్ హీ కాలం నుంచే కొరియా అభివృద్ధి చెందుతూ వున్నప్పటికీ ఆ అభివృద్ధికి ప్రజలు రెండు రూపాల్లో మూల్యం చెల్లించుకుంటూ వచ్చారు. ఒకటి, తమ హక్కుల్ని పూర్తిగా రాజ్యాధినేతకి తాకట్టుపెట్టడం, రెండోది, చాలీచాలని కనీసవేతనాలమధ్యనే అమానుషమైన వర్కింగ కండిషన్సులో పనిచేయవలసి రావడం. ఈ రెండింటినీ ధిక్కరిస్తూ ప్రజలు చేస్తూ వచ్చిన పోరాటాలకి 1979 లోనే బూసాన్-మాసాన్ తిరుగుబాటు శ్రీకారం చుట్టింది. కాని పార్క్ హీ ఆ తిరుగుబాటుని అత్యంత కర్కశంగా అణచివేసాడు. ఆ తిరుగుబాటురోజుల్లో పార్క్ హీ పక్కనుండే ఒక ఇంటలిజెన్సు అధికారి అన్నాడట: 'పక్కనున్న కంబోడియా చూడండి, రెండులక్షలమందిని చంపేసైనా సరే శాంతి నెలకొల్పింది. మనం కూడా అందుకు ఏ మాత్రం వెనకాడకూడదు' అని.

పార్క్ హీ హత్య తర్వాత జున్ దువాన్ అధికారంలోకి వచ్చిన వెంటనే 1980 మే 17 న దేశమంతా మార్షలు-లా ప్రకటించాడు. ఆ మార్షలు-లా ని ధిక్కరిస్తూ దక్షిణ కొరియాకి దక్షిణభాగంలో ఉన్న గ్వాంగ్-జూ అనే పట్టణంలో ప్రజలు ప్రజాస్వామికీకరణ కోసం పెద్ద ఎత్తున నిరసన ప్రకటించారు. మార్షలు-లా ప్రకటించిన మర్నాడే అంటే మే 18 ననే గ్వాంగ్-జూ ప్రకటించిన నిరసనకు విద్యార్థులు నాయకత్వం వహించారు. వారిలో ముక్కుపచ్చలారని హైస్కూలు విద్యార్థులు కూడా ఉన్నారు. జున్ హువాన్ వెంటనే ఆ నిరసనని ఉక్కుపాదంతో అణచివెయ్యడానికి మిలటరీని పంపించాడు. ఒక లెక్క ప్రకారం, ఆ మిలటరీకి ఎనిమిదిలక్షల తూటాలు అందించి మరీ పంపించాడట. ఇంతాచేస్తే ఆ రోజుకి ఆ పట్టణ జనాభా నాలుగు లక్షలు మాత్రమే! అంటే ప్రతి ఒక్క పౌరుణ్ణీ రెండుసార్లు చంపగలిగేటంత ఆయుధసామగ్రితో సైనికులు ఆ పట్టణంలో అడుగుపెట్టారు.

ఆ తర్వాత అక్కడ ఏమి జరిగిందనేది 1987 దాకా బయటి ప్రపంచానికి తెలీదు. కానీ ఆ విషయాలు నెమ్మదిగా తెలియవస్తున్న కొద్దీ, 18 మే 1980 న గ్వాంగ్- జూ పట్టణంలో చరిత్ర ఎరగని నరమేధం జరిగిందని తెలుస్తూ ఉంది. నరమేధం అంటే చంపుకుంటూ పోవడమే కాదు, ఊహించని తీరులో అత్యంత పాశవికంగా, క్రూరంగా, భయానకంగా, నిర్దయాత్మకంగా చిత్రహింసలు పెట్టడం. తిరిగి మళ్ళా మనిషన్నవాడు రాజ్యానికి వ్యతిరేకంగా గళం ఎత్తడం కాదు, పిడికిలి బిగించాలన్న తలపు కలగడానికి కూడా వణికిపొయ్యేటట్టు చెయ్యాలన్నది జున్ దువాన్ ఆలోచన. అందుకనే అతడీ రోజు దక్షిణ కొరియా చరిత్రలో The Butcher of Gwangju గా మిగిలిపోయాడు.

1980 మే 18 న అంటే, 5:18 న, ఏమి జరిగిందో చిత్రిస్తూ హన్ కాంగ్ Human Acts నవల రాసారు. అంటే 1988 లో సియోలులో ఘనంగా ఒలింపిక్సు నిర్వహించిన

దేశంగా మాత్రమే ప్రపంచానికి తెలిసిన దక్షిణ కొరియాలో 1980 నుంచి 2013 దాకా దాదాపు మూడున్నర దశాబ్దాల పాటు ఏమి జరుగుతూ ఉందో హన్ కాంగ్ ఈ నవల్లో ప్రపంచానికి తెలియచెప్పారు. అంటే ఆమె సమకాలిక కొరియా చరిత్రను, ఒక ప్రత్యామ్నాయ చరిత్రకారిణిగా, మనముందు ఉంచారన్నమాట.

అత్యంత హృదయవిదారకమైన ఈ కథనాన్ని చదువుతున్నంతసేపూ నేను మన చరిత్రలో కూడా ఇటువంటి సంఘటనలు తక్కువేమీ లేవు కదా అని అనుకుంటూనే ఉన్నాను. సీతారామరాజు తిరుగుబాటు చేసినప్పుడు బ్రిటిషు సైన్యాలు విశాఖపట్టణం మన్యం గిరిజనుల్ని పెట్టిన చిత్రహింసలు, చిట్టగాంగు పోరాటం తర్వాత ఈశాన్యప్రాంతపు గిరిజనుల్ని పెట్టిన చిత్రహింసలు, 1969-71 మధ్యకాలంలో శ్రీకాకుళంలో గిరిజనులు తిరుగుబాటు చేసినప్పుడు ఆంధ్రప్రదేశ్ పోలీసుబలగాలు గిరిజనుల్నీ, ఆ పోరాటానికి నాయకత్వం వహించిన విద్యార్థినాయకుల్నీ పెట్టిన చిత్రహింసలు, ఎమర్జన్సీ రోజుల్లో, చివరికి ఇప్పుడు కూడా కాశ్మీరులో, ఛత్తీస్‌గఢ్‌లో సైన్యాలు ప్రజల మీద సాగిస్తున్న దమనకాండ తక్కువేమీ కాదు కదా. కానీ ఒక హాన్ కాంగ్ రచనలో ప్రత్యేకత ఎక్కడ ఉంది?

Human Acts పుస్తకాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన దెబొరా స్మిత్ ఈ పుస్తకానికి ఎంతో విలువైన ముందుమాట కూడా రాసారు. అందులో ఆ ప్రజాస్వామిక ఉద్యమం తాలూకు సంక్లిష్ట నేపథ్యాన్ని చిత్రించడంలో కూడా ఈ నవల అసాధారణంగా ఉందని చెప్తూ తాను జరిగిందాన్ని సూటిగా చెప్పకుండా తన పాత్రల అనుభవాల ద్వారా మాట్లాడించడం ద్వారా హన్ కాంగ్ ఈ కథనం ఒక నిస్సారమైన చరిత్రకథనం కాకుండా చూసుకుంది అంటారు. క్లుప్తంగా చెప్పాలంటే రచయిత్రి శైలి, కథనం ఈ నవలను గొప్ప సాహిత్యకృతిగా మార్చేసాయి.

రాజ్యానికీ, రాజ్యహింసకీ వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టాలనుకున్నప్పుడు రెండు మార్గాలుంటాయి. ఒకటి ప్రత్యక్ష రాజకీయ పోరాటం. ప్రసంగాల ద్వారా, కరపత్రాల ద్వారా, నినాదాల ద్వారా, ఉద్యమాల ద్వారా, ప్రసార సమాచార సాధనాల ద్వారా చేసేది. కాని సాహిత్యానిది పరోక్ష పోరాటం. అక్కడ వక్తృత్వం, సెంటిమెంటాలిటి కన్నా కూడా తన వాక్యాల మీద అపారమైన అదుపు ముఖ్యం. బాణాన్ని సూటిగా చెక్కినట్టుగా, పేల్చాలనుకున్న శతఘ్నిలో మందుదట్టంగా కూరినట్టుగా, రచయిత తన కవితలోనో, కథలోనో, నవలలోనో, నాటకంలోనో తన ఆవేదననీ, ఆగ్రహాన్నీ నేర్పుగా కూరిపెట్టాలి. లేకపోతే తన రచన వాచాలత్వంగా, దూషణగా, వట్టి ఊకదంపుడుగా మారిపోతుంది.

మన అంతరంగాన్ని, మనస్సాక్షిని నిలవనివ్వకుండా పట్టికుదిపేసే ఈ రచన వంద పేజీలు కూడా దాటలేదంటే, రచయిత్రి ఎంత ఆత్మసంయమనంతో ఈ రచన చేసారో మనం గమనించాలి. రెండేళ్ళ కిందట నోబెలు పురస్కారం పొందిన ఫ్రెంచి రచయిత్రి అన్నీ ఎర్నో లో కూడా ఈ సామర్థ్యమే గమనించాన్నేను. వీళ్ళు కొత్త యుగం రచయిత్రులు. కాబట్టే వీళ్ళకన్న రాశిలోనూ, వాసిలోనూ కూడా గొప్ప సాహిత్యం సృష్టించినప్పటికీ ఒక మార్గరెట్ అట్‌వుడ్, ఒక సాల్మన్ రూష్ధి, ఒక హరూకి మురకామి వంటి వాళ్ళింకా నోబెలు పురస్కారానికి వేచి ఉండకతప్పడం లేదు.

నోబెలు కమిటి హన్‌కాంగ్‌ని ప్రస్తుతిస్తూ ఆమెది కావ్యశైలి అని కూడా అంది. అందులో చాలా నిజముంది. ఎందుకంటే ఈ Human Acts అన్న నవలనే తీసుకోండి, దీన్ని ఈమె ఎనిమిది భాగాలుగా రాసారు. మొదటి ఏడు భాగాలూ ఏడు వాఙ్మూలాలు. కాని వాటన్నిటినీ ఆమె 1980 నాటి సాక్ష్యాలుగానే చెప్పలేదు. అందులో మొదటి రెండు అనుభవాలు 1980 నాటివి, నాలుగోది 1985 నాటిది, అయిదోది 1990, ఆరోది 2002, ఏడోది 2010, ఇక చివరి వాఙ్మూలం రచయిత్రిది, 2013 నాటిది. ఈ నిర్మాణశిల్పాన్ని మన కావ్యభాషలో చెప్పాలంటే ప్రబంధం అనాలి. ఎందుకంటే ఆమె చెప్పాలనుకున్నది 1980 నాటి నరమేధం గురించి మాత్రమే కాదు, ఆ నరమేధాన్ని తట్టుకుని బతికిన వాళ్ళు, ఆ survivors తమ విశ్వాసాల్నీ, విలువల్నీ కాపాడుకుంటూ బతకడానికి ఎంత సంక్షోభానికి లోనవుతున్నారో అదంతా కూడా ఆమె చెప్పాలనుకున్నారు. ఉదాహరణకి మనం ఆటంబాంబు సర్వయివర్సు గురించి మాట్లాడినప్పుడు వాళ్ళ శరీరంలో, చివరికి వాళ్ళ పిల్లల శరీరాల్లో కూడా ఆ మారణకాండ అవశేషాలు తరం నుంచి తరానికి ప్రవహిస్తూనే ఉన్నాయని చెప్పుకుంటాం. హన్‌కాంగ్ దృష్టిలో గ్వాంగ్-జూ నరమేధం ఆటంబాబు విధ్వంసానికేమీ తక్కువ కాదు. ఆ భయానక అనుభవం కొరియా చరిత్రనీ, ఆ జాతిస్మృతినీ చిరకాలం వెన్నాడుతూనే ఉండక తప్పదని తెలుసు ఆమెకి. నవల చివరి అధ్యాయంలో రచయిత్రి వాఙ్మూలంలో భాగంగా ఆమె ఇలా రాస్తున్నారు:

> చిత్రహింసకి గురైన ఒకాయన ఇచ్చిన ఇంటర్వ్యూ ఒకటి చదివాన్నేను. అందులో అతడు ఆ చిత్రహింస అనంతర ప్రభావాలు రేడియోధార్మిక విషధూళికి బలైన వాళ్ళ అనుభవాలకన్నా ఏమీ ప్రత్యేకం కాదని అన్నాడు. రేడియోధార్మిక ధూళి దశాబ్దాల పాటు ఎముకల్లో, కండరాల్లో కొనసాగుతూ క్రొమోజోములమీద కూడా దుష్ప్రభావాన్ని చూపిస్తూ ఉంటుంది. వాళ్ళ రక్తకణాలు కేన్సరు కణాలుగా మారిపోతాయి. అప్పుడు వాళ్ళ ప్రాణం తనను

తనే తినేయడం మొదలుపెడుతుంది. ఆ అభాగ్యులు మరణించినా కూడా, వాళ్ళ మృతదేహాల్ని తగలబెట్టినా కూడా, చివరికి కాలిన మసిబొగ్గు తప్ప మరేమీ మిగలకపోయినా కూడా, ఆ రేడియో ధార్మిక పదార్థం నశించదు.

2009 లో జనవరిలో సెంట్రలు సియోలులో నిరసన ప్రకటిస్తున్న పౌరులమీద పోలీసులు విరుచుకుపడి ఆరుగుర్ని కాల్చి చంపినప్పుడు, ఆ అర్థరాత్రి నేను టెలివిజనుకి అతుక్కుపోయి మరీ ఆ మండుతున్న భవనాల్నే చూస్తో ఉండి పోయేను. ఆ క్షణాన ఆశ్చర్యంగా నా నోటివెంట 'కాని అది గ్వాంగ్ జూ కదా' అనే మాటలు వెలువడ్డాయి. మరో మాటలో చెప్పాలంటే ఎవర్నేనా బలవంతంగా ఖాళీచేసిన ప్రతి చోటూ, మనుషుల్ని దారుణంగా హింసిస్తున్న ప్రతి స్థలానికీ, ఇక సరిదిద్దలేని విధంగా జీవితాన్ని చిదిమేసిన ప్రతి చోటుకీ గ్వాంగ్ జూ ఒక పర్యాయపదంగా మారిపోయింది. ఆ రేడియో ధార్మిక ధూళి వ్యాప్తి ఆగడం లేదు. మళ్ళా మరొక సారి వధించడానికే గ్వాంగ్ జూ తిరిగి పుట్టినట్లుగా కనిపిస్తున్నది. ఆ పట్టణాన్ని నేలమట్టం చేసేసారు. అయినా అది తిరిగి మళ్ళా నెత్తుటిమధ్యనే ప్రాణంపోసుకుంటున్నది.

3

హన్ కాంగ్ రాసిన మరొక పుస్తకం The White Book కూడా ఇటువంటి మరొక గ్వాంగ్ జూ గురించిన చిత్రణనే. (నాయుడూ! ఈ పుస్తకం నాకు వెంటనే పంపినందుకు మీకు ఎన్ని ధన్యవాదాలు చెప్పినా తక్కువే).

ఇందులో కథకురాలు ఒక యూరపియను దేశంలో ఒక పట్టణంలో కొన్నాళ్ళు ఉండటానికి వెళ్ళారు. ఆ దేశం పేరు మనకి ఆమె ఆ పుస్తకంలో చెప్పలేదు కానీ అది వార్సా నగరం అని మనం ఊహించవచ్చు. హిట్లరు కాలంలో ఆ నగరం నాజీ సైన్యాల్ని తరిమేసి నాలుగురోజులు ప్రజాస్వామిక పాలన నడుపుకుంది. దాన్ని హిట్లరు భరించలేక పోయాడు. ఆ నగరాన్ని నేలమట్టం చెయ్యమని తన సైన్యాల్ని పంపించాడు. వాళ్ళు ఆ నగరాన్ని పూర్తిగా ధ్వంసం చేసేసారు.

ఆ శిథిలాలమీద దట్టంగా పేరుకున్న తెల్లని మంచు చూడగానే రచయిత్రి తన జీవితంలో తనకి ఎక్కడెక్కడ తెల్లటి జ్ఞాపకాలున్నాయో అవన్నీ ఒక జాబితా రాసుకున్నారు. ఆ జాబితాలోని ప్రతి ఒక్క శ్వేతస్మృతినీ వివరించడం మొదలుపెట్టారు. అందులో

పేర్కొన్నవన్నీ కల్పితమని రచయిత్రి మొదట్లో డిస్క్లెయిము చేసారుగానీ, సాహిత్యంలో సత్యం తప్ప అబద్ధం ఉండదు. ఒకవేళ అసత్యాన్నే చిత్రించినా అది అంతిమంగా ఏదో ఒక నిగూఢసత్యం పట్ల మన కళ్ళు తెరవడానికే అయి ఉంటుంది.

The White Book ని మనం ఫలానా ప్రక్రియ అని లేబులు తగిలించలేం. అది ఒక విధంగా కవిత్వసంకలనం కూడా. లేదా ఒక ఫొటో ఆల్బం. లేదా ఒక memoir. లేదా కొంగలు, మంచు, ఉప్పు, చంద్రుడు, బియ్యం, కెరటాలు, తెల్లటి జుట్టు, శవ వస్త్రం, పొగ, శ్వేత రాత్రులు వంటి తెల్లటి దృశ్యాలతో కూర్చిన ఒక నిశ్శబ్ద చలనచిత్రం అనుకోవచ్చు.

లేదా ఒక పిన్ కుషను. రచయిత్రి ముందు తన హృదయానికి గుచ్చుకున్న పిన్నులు మనం ఒక్కో పేజీ తిప్పుకుంటూ పోతున్నప్పుడు మన గుండెకి గుచ్చుకోడం మొదలు పెడతాయి.

ఇందులో కథకురాలు తాను పుట్టడం కన్నా ముందు తన తల్లికి ఒక బిడ్డ పుట్టిందనీ, సకాలంలో వైద్యం అందక ఆ పుట్టిన బిడ్డ పుట్టిన రెండు మూడు గంటల్లోనే మరణించిందనీ చెప్తారు. ఇక ఆమెకి తెల్లటి వస్తువుల్ని వేటిని చూసినా తాను చూడని తన ఆ అక్కే గుర్తొస్తూ ఉంటుంది. ఆమె బతికి ఉంటే తాను పుట్టి ఉండేది కాదనే ఒక జ్ఞానం కూడా ఆమెని వెంటాడుతూ ఉంటుంది.

(నిజానికి ఈ పుస్తకంలో ఆమె ఇదంతా కల్పితమని రాసారు కానీ తన బ్లాగులో ఒక ఇంటర్వ్యూలో ఇది నిజమేనని చెప్పుకున్నారు. నాలుగైదేళ్ళ కిందట నోబెలు పురస్కారం పొందిన అమెరికను కవయిత్రి లూయీ గ్లక్ కవిత్వంలో కూడా ఇదే ప్రధాన ఇతివృత్తం కావడం గమనార్హం.)

ఇరవైరెండేళ్ళ వయసులో తన మొదటి బిడ్డను పుట్టిన రోజే పోగొట్టుకున్న తల్లి ఈ పుస్తకంలో మనకి పదే పదే కనిపిస్తూ ఉంటుంది. ఈ కథకీ, గ్వాంగ్-జూ మారణ హోమానికీ ఏదో సంబంధం ఉంది. రెండు పుస్తకాల్లోనూ కూడా బిడ్డను పోగొట్టుకున్న తల్లులే ప్రధాన పాత్రలు. వాళ్ళ శోకానికి ప్రతి ఒక్కరూ జవాబుదారులే.

కథకురాలు ఎక్కడికి వెళ్ళనివ్వు, అకాలంగా మరణించిన చిన్నారులు ఆమెని నిద్రపోనివ్వరు. వాళ్ళు తెల్లని నీడలాగా ఆమెని వెంటాడుతూనే ఉంటారు. అదుగో ఆ అనుభవం లోంచి రాసిన రాత ఇలా ఉంటుంది:

మొత్తం తెల్లదనం

నీ కళ్ళతో నేను ఒక తెల్లకాబేజి లోపల్లోపల మిరుమిట్లు గొలిపే చోటు ఒకటి చూస్తాను. దాని హృదయంలో దాగి ఉన్న ఎంతో విలువైన లేతపొరల్ని దర్శిస్తాను.

నీ కళ్ళతో పట్టపగలే ఉదయించిన అర్ధచంద్రుడి శీతలత్వాన్ని కనుగొంటాను.

కొంతసేపటికి ఆ కళ్ళు ఒక హిమప్రవాహాన్ని చూస్తాయి. ఆ అపార హిమరాశిని పరికిస్తూ అవి జీవితపు మరక అంటని పవిత్రతని దేన్నో గమనిస్తాయి.

తెల్లటి బిర్చి చెట్ల అడవిలోపలి నిశ్శబ్దాన్ని చూస్తాయవి. హేమంతకాలపు సూర్యరశ్మి ప్రసరిస్తున్న కిటికీలోని నిశ్చలత్వపు లోతుల్ని చూస్తాయి. గదిలోపల పైకప్పు మీద వచ్చి వాలుతున్న సూర్యకిరణాలమధ్య మెరుస్తున్న ధూళికణాల్లోకి తొంగిచూస్తాయి.

నువ్వు విడిచిపెట్టిన చివరి ఊపిరిని ఆ తెలుపులో, మొత్తం తెల్లటివాటన్నిటి తెలుపు లోనూ, నేను ఆశ్వాసిస్తాను.

12-10-2024

కొత్త యుగం రచయిత్రి-2

మనుషులు తోటిమనుషుల పట్ల చూపించగలిగే క్రూరత్వం ఒక్కటే కాదు హన్‌కాంగ్‌ని వెంటాడింది. కొన్ని సందర్భాల్లో మనుషులు ఒక సమూహంగా చూపించగల నిరుపమానమైన త్యాగం, సహానుభూతి, ఔదార్యం, తోటిమనుషులకోసం తమ ప్రాణాల్ని కూడా తృణ ప్రాయంగా ఎంచగల నిస్సంకోచం కూడా ఆమెని ఆశ్చర్యపరుస్తూ వచ్చాయి.

Human Acts నవల్లో ఆమె ఒక పుస్తకం గురించి ప్రస్తావిసాట్‌తీబ. అది క్రౌడు సైకాలజీ గురించిన ఒక పరిశోధన. ఆ పరిశోధకురాలు ఫ్రెంచి విప్లవం, స్పానిష్ సివిలు వార్, రెండో ప్రపంచ యుద్ధాల్లో మనుషులు సమూహాలుగా ప్రవర్తించిన ఉదాహరణల్ని తీసుకుని తన ప్రతిపాదనలు చేస్తారు. ఆ పుస్తకాన్ని అనువదించిన అనువాదకుడు ఆ పుస్తకానికి ముందుమాట రాస్తూ ఇలా రాసాడని రచయిత్రి మనకు చెప్తారు:

> గుంపు లేదా మంద లేదా సమూహం తాలుకు నైతికతని ప్రభావితం చేసే నిర్ణాయకశక్తి ఏమిటనేది మనకింకా పూర్తిగా బోధపడలేదు. కాని మనుషులు ఒక గుంపుగా మారకముందు వాళ్ళ వాళ్ళ నైతిక ప్రమాణాల కన్నా భిన్నమైన ఒక ప్రత్యేక నైతిక ప్రవర్తన మాత్రం ఆ సమూహంలోంచి తలెత్తడం చూస్తాం మనం. సాధారణంగా కొన్ని గుంపులు దోచుకోడానికీ, హత్యలు చెయ్యడానికీ, మానభంగాలు చెయ్యడానికీ వెనకాడని స్థితిలోనే మరోవేపు అదే సమూహం, దానిలోని వ్యక్తులు, వ్యక్తులుగా చూపించలేని ఒక మహౌదార్యాన్ని, మానవత్వాన్ని చూపిస్తుంటారు కూడా. ఈ పరిశోధకురాలు చెప్పేదేమంటే అటువంటి గుంపుల్లో వ్యక్తులు వ్యక్తులుగా ఏమీ మహోన్నతమానవులు కారనీ, ఆ క్షణాల్లో వాళ్ళు చూపించే ఆ ఆత్మోన్నత్యం సాధారణ మానవలక్షణమేననీ దాన్ని వాళ్ళు ఆ క్షణాన ఆ సమూహం నుంచి అందిపుచ్చుకుంటారనీ. అలాగే

మొదటి తరహా గుంపులో మనుషులు చూపించే అనాగరికత, అమానుషత్వం కూడా వ్యక్తులుగా వాళ్ళ లక్షణం కాదనీ, వాళ్ళు గుంపుగా మారగానే ఆ గుంపుతనంలోంచే వాళ్ళకి ఆ నీచత్వం సంక్రమిస్తుందనీ.

ఎందుకంటే, ఆ రోజు, మే 18 న గ్వాంగ్ జూ మీద సైనిక దళాలు విరుచుకుపడ్డరోజు, ఆ ప్రొవిన్షియలు భవనం దగ్గర రక్షకవలయంగా నిలబడ్డ సివిలియను మిలిషియా తమ చేతుల్లో తుపాకులున్నప్పటికీ కాల్పులు జరపలేదు. వాళ్ళుగాని ఆ రాత్రి కాల్పులు జరిపి ఉండే ఆ సైనికమూకలు గ్వాంగ్ జూ నగరాన్ని మొత్తం ధ్వంసం చేసేసి ఉండేవనే రచయిత్రి అంటారు.

ఇదే. ఇదే ఆమెని పదే పదే వెన్నాడుతూ వస్తున్న అంశం. మనుషులుగా రాక్షసులుగా ప్రవర్తించగల మనం, ప్రవర్తిస్తున్న మనం, ప్రవర్తించాలనుకుంటున్న మనం, అపారమైన మానవాతీత సంయమనాన్నీ, ఆత్మోన్నత్యాన్నీ కూడా చూపగలం, చూపగలుగుతున్నాం కూడా. ఎక్కణ్ణుంచి వస్తున్నది ఈ శక్తి మనుషులకి? దీన్ని అన్వేషించడంకోసమే ఆమె రచనలు చెయ్యడం మొదలుపెట్టారని మనకు తెలుస్తున్నది.

మార్చి 2016 లో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆమె ఇలా అంటున్నారు:

> మనుషులు ఒకరిపట్ల మరొకరు అటువంటి పనులకి ఎలా పాల్పడగలరు? కాని ఈ ప్రశ్న అడిగినవెంటనే మరొక ప్రశ్న కూడా తలెత్తకుండా ఉండదు: అటువంటి హింస ఎదట మనం ఏమన్నా చెయ్యగలమా? రక్తదాతల కోసం పిలుపునివ్వగానే హాస్పటళ్ళముందు అంతులేకుండా క్యూకట్టిన మనుషుల ఫొటో ఒకటి ఇప్పటికీ నా కళ్ళముందు కదలాడుతూనే ఉంది. హింసకు గురైన తోటిమనుషులకి రక్తదానం చెయ్యడంకోసం ఎందరో సాధారణపౌరులు తమ భద్రతనీ, తమ ఇళ్ళనీ పక్కనపెట్టి కూడా ముందుకొచ్చిన దృశ్యం. గ్వాంగ్ జూ కమ్యూనులో పదిరోజుల పౌరపాలనకి ముగింపు పలుకుతూ మార్షలు-లా సైన్యాలు ప్రొవిన్షియలు ఆఫీసుని తిరిగి చుట్టుముట్టినప్పుడు- అంతకు ముందు కొన్నిదినాల కిందటిదాకా మామూలు పౌరులుగా ఉన్న వాళ్ళు- ఆ రోజు తమ ప్రాణాలకు కూడా తెగించి ఆ సైన్యాల్ని ధిక్కరిస్తూ నిలబడ్డారు. అది కూడా ఆ ఫోటో బుక్కులో రికార్డయ్యింది. అలా చూసినప్పుడు నేనొక రెండు చిక్కుప్రశ్నలముందు నిలబడ్డానని చెప్పవచ్చు. ఒకటి మానవ హింసాప్రవృత్తి, మరొకటి ఏం చేసైనాసరే మనుషులు తమ గౌరవాన్ని కాపాడు-

కోవాలన్న తెగువ. ఆ రెండు దృశ్యాలూ నా హృదయం మీద అచ్చొత్తినట్టుగా ముద్రపడిపోయాయి. జవాబు లేని ఈ రెండు చిక్కుప్రశ్నల్నీ ఎలా నిభాయించు కోవాలో తెలియని నా తొట్రుపాటునే Human Acts నవల.

4

గ్వాంగ్ జూ నరమేధం జరిగినప్పటికి హన్‌కాంగ్ చిన్నపిల్ల. ఏడేళ్ళ పిల్ల అనుకుంటాను. కాని ఆ తర్వాత ఆమెకి ఆ సంఘటన గురించి చదివి, అర్థం చేసుకునే వయసు వచ్చినప్ప-ణ్ణుంచీ, ఆమె హృదయం ఆ సంఘటనకి ఒక శాశ్వత రంగభూమిగా మారిపోయింది. ఆ trauma ఆమెని వదల్లేదు. అది కలలుగా, నాసియాగా, ఏమి చేసినా తప్పించుకోలేని ఒక అపరాధభావంగా మారిపోయింది. ఏం చేస్తే మనుషులు ఈ హింస నుంచి, ఈ హింసాప్రవృత్తినుంచి, ఈ రక్తదాహం నుంచి బయటపడతారు?

బహుశా మనం మనుషులుగా కాకుండా, ఉదాహరణకి చెట్లుగా మారిపోతే? మొక్కలుగా మారిపోతే? మరొక మనిషిని హింసించి లేదా మరొక ప్రాణిని వధించి ఆ తిండి తిని బతికే బదులు నేరుగా సూర్యకాంతినే స్వీకరిస్తూ బతగ్గలిగితే?

ఈ ఊహ ఆమెను వెన్నాడింది. ఆమె Human Acts నవల రాయకముందే, 1997 లో The Fruit of my Woman అనే ఒక కథ రాసారు. ఆ కథలో ఒక స్త్రీ తన దేహం మీద ఆకుపచ్చని మరకలు గమనిస్తుంది. ఆమె నెమ్మదిగా ఒక మొక్కగా మారి పోతుంది. ఆమె భర్త ఆమెని ఒక కుండీలో ఉంచి బాల్కనీలో పెట్టి రోజూ నీళ్ళు పోయడం మొదలుపెడతాడు. హేమంతకాలం రాగానే ఆ మొక్క ఒక ఫలాన్ని ప్రసవించి నెమ్మదిగా వాడిపోతుంది.

కాని ఈ కథతో ఆమె ఆలోచన ఆగిపోలేదు. పదేళ్ల తరువాత ఆమె ఈ ఆలోచననే మరింత విస్తరించి The Vegetarian అనే నవలగా రాసింది. ఈ నవల మూడు భాగాల ఒక ట్రిప్టిచ్చి. అందులో మొదటి భాగం The Vegetarian లో ఈ కథాంశమే మరింత వివరంగా చిత్రితమయ్యిందిగాని, మరొక కొత్త అంశం ఈ కథలో వచ్చి చేరింది. అదేమంటే, హింస. మనుషుల ఇష్టాయిష్టాలమీద జరిగే హింస. నా వరకూ నాకు, Human Acts చదివాక గానీ, ఈ నవలలోని కీలకపార్శ్వం అర్థం కాలేదు.

అదేమిటో నాకు నేను స్పష్టం చేసుకోడానికి నాకు కొంత సమయం పట్టింది. Human Acts నవలలో గ్వాంగ్ జూ పౌరులపైన, విద్యార్థుల పైన మార్షలు-లా సైన్యం

చేసిన అత్యాచారాల గురించి, పెట్టిన చిత్రహింసల గురించీ రచయిత్రి రాసారని చెప్పాను కదా. ఆ అత్యాచారాలకీ, ఆ నరమేధానికీ పాల్పడ్డ సైనికులూ, సైనికాధికారులూ కూడా దక్షిణా కొరియా ప్రజలే కదా, పౌరులే కదా. వారు తమ అక్కచెల్లెళ్ళ పట్ల, తమ అన్నదమ్ముల పట్లనే కదా అంత క్రూరత్వాన్ని చూపించింది. అదే సైనికులు లేదా ఆ పౌర, మిలటరీ అధికారులు తమ తమ కుటుంబాల పట్ల ఎలా ప్రవర్తిస్తూ ఉండవచ్చు?

ఆ ప్రశ్నకి జవాబు బహుశా ఈ నవలలో కనిపిస్తుంది. ఇందులో మాంసాహారాన్ని త్యజించి పూర్తి శాకాహారిగా మారాలనుకున్న యెవోంగ్-హ్యే తండ్రి ఒక సైనికాధికారి. వియత్నాం యుద్ధంలో ముప్ఫై మంది వియత్నాంగు గెరిల్లాల్ని ఒంటిచేత్తో మట్టుపెట్టానని చెప్పుకోవడం అతడికి తీరిక సమయపు వ్యాపకం. తన చిన్న కూతురుకి పద్ధెనిమిదేళ్ళ వయసు వచ్చేదాకా కూడా అతడు ఆమెని క్రమశిక్షణలో ఉంచడానికి కొడుతూనే ఉండేవాడు. తన చిన్న కూతురు శాకాహారిగా మారిందనీ, ఆమె భర్త చెప్పినా వినలేదనీ, తనే ఆమెకి హితవు చెప్పడానికి ఇంటికి వచ్చినవాడు, ఆమెని మాంసాహారం తినమనీ, తాను చెప్తున్నాడు కాబట్టి తినమనీ అడుగుతాడు. అయినా తన కూతురు వినకపోడంతో ఆమెని కొట్టి మరీ మాంసాహారం బలవంతంగా ఆమె నోట్లో కుక్కుతాడు. ఆ హింసని, ఆ దాడిని తట్టుకోలేక ఆమె ఆత్మహత్య చేసుకోబోతుంది. ఆమెని హాస్పటల్లో చేర్చడంతో మొదటిభాగం ముగుస్తుంది.

కాని ఇక్కడ గమనించవలసింది మాంసాహారం, శాకాహారాల సంగతి కాదు. తోటి మనిషిని చిత్రహింసపెట్టే సైనికుడు తన కుటుంబం పట్ల కూడా అదే ప్రవృత్తిని చూపిస్తాడు. అంటే అతడిలో పితృస్వామ్యం కూతురి పట్ల ప్రేమని చూపించే క్రమంలో ఆమెని హింసిస్తుంది, రాజు పట్ల విధేయత చూపించే క్రమంలో తన పౌరుల్ని చిత్రవధకి గురి చేస్తుంది. రెండు సందర్భాల్లో కూడా తాను హింసకి పాల్పడుతున్నానని ఆ పితృస్వామ్యం అనుకోదు. తాను వాళ్ళ మంచికోరే చెప్తున్నప్పటికీ వాళ్ళెందుకు వినిపించుకోవట్లేదనే అనుకుంటుంది, ఆగ్రహిస్తుంది, నరకం చూపిస్తుంది.

The Vegetarian నవలని సమీక్షించిన వారెవరూ ఈ అంశంలో ఈ నవల చదివినట్టుగా నాకు అనిపించలేదు.

The Vegetarian నవలలోని రెండవ భాగం Mongolian Mark చాలా చాలా సున్నితమైన రచన. మనుషులు తమ దేహాల్లోని జంతులక్షణం నుంచి బయటపడటానికి పువ్వులుగా, లతలుగా, సీతాకోక చిలుకలుగా మారాలనుకోడానికి సంబంధించిన కథ అది. అటువంటి ప్రయత్నం చేసే ఏ మనిషినైనా లేదా ఏ ఇద్దరు మనుషుల్నైనా ప్రపంచం

పిచ్చివాళ్ళుగా జమకట్టడం సహజమే కాబట్టి, చివరి భాగం Flaming Trees మొత్తం పిచ్చాసుపత్రి చుట్టూ నడుస్తుంది.

కాని చివరి భాగానికి కూడా మరో పార్శ్వం ఉంది. ఆ భాగాన్ని రచయిత్రి హెవోంగ్–హ్యే అక్క ఇన్–హ్యే ద్వారా చెప్పిస్తారు. ఈ ఇన్–హ్యే తన చెల్లెల్ని కాపాడుకోడం కోసం చెయ్యవలసిన ప్రయత్నాలన్నీ చేస్తుంది. కాని ఆమె ద్వారా హాన్‌కాంగ్ తాను పుట్టక ముందే మరణించిన తన అక్కని మనముందుకు తీసుకొస్తున్నారా అనే అనుమానం కలక్కుండా ఉండదు. మరొక పార్శ్వం కూడా ఉంది. మనిషి జీవితం వదిలిపెట్టి, ఈ హింసాచక్రం నుంచి బయటపడి ఒక మొక్కగా మారిపోవాలనుకుంటున్న తన చెల్లెల్ని చూసి ఆ అక్క అనుకుంటుంది: తాను తన కుటుంబానికీ, తన తల్లిదండ్రులకీ, ముఖ్యంగా తండ్రికి ఎదురుచెప్పకుండా జీవించడం ఇన్నాళ్ళూ ఒక పరిణతి అనుకుందిగాని, అది నిజానికి పిరికితనం, వట్టి survival tactic మాత్రమేనని. అంతిమంగా తనచుట్టూ జరిగే హింసని చూస్తూ, దాన్ని ఆపలేక, దాన్ని ఎదిరించలేక, మనిషి చేరుకోగల ఏకైక స్థితి తనని తాను హింసించుకోడమే. ఇదుగో ఇలా అనుకోవడం:

> It’s your body, you can treat it however you please. The only area where you’re free to do just as you like.

దీన్నే బైరాగి ఆత్మహననం అన్నాడు. ఒకప్పుడు, నేను రాజమండ్రిలో ఉన్నప్పుడు, సావిత్రిగారిలో ఈ ప్రవృత్తినే చూసాను. ఎదటిమనుషుల్ని చంపలేక, ఆమె అన్నం తినడం మానేసి, తనని తాను చంపుకోవడం కళ్లారా చూసాను. కాని కుటుంబం, ప్రభుత్వం, రాజ్యం, సమాజం దాన్ని కూడా పడనివ్వవు, కాబట్టే, తర్వాత వాక్యంలో ఇలా అంటున్నది రచయిత్రి:

> And even that doesn’t turn out how you wanted.

హన్‌కాంగ్ మీద నేను రాసిన వ్యాసం చదివి ఎం.ఎస్.నాయుడు నాకొక మెసేజి పెడుతూ హన్‌కాంగ్‌ని Kafka of Korea అంటారని రాసాడు. ఆశ్చర్యం లేదు. పలాయనం, కృతకశక్తుల పూజనం చెయ్యలేని నీతిమంతులైన మనుషులకి మిగిలేది ఆత్మహననం ఒక్కటే. అలాగని హన్‌కాంగ్‌ని పూర్తి స్థాయిలో కాఫ్కాగా భావించలేం. ఆమె తనని వేధిస్తున్న ప్రశ్నల మీద విజయం సాధించాలన్న పట్టుదలతో ఉంది. దీన్ని ఆమె రెండు విధాలుగా సాధించుకునే ప్రయత్నంలో ఉంది. మొదటిది, ఆత్మహననానికి పాల్పడకుండా ఉండటం. హింసనీ, హింస తనలో రేకెత్తిస్తున్న భయభీతినీ ముఖంలో ముఖం పెట్టి చూడటం. 2016 లో ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఇలా అంటున్నారు:

> Trauma అనేది మనం దాన్నుంచి బయటపడవలసిందో, లేదా నెమ్మదిమీద మాన్చుకోవలసిందో కాదు. దాన్ని మనం వదులుకోకుండా ఎప్పటికీ హత్తుకుని ఉండవలసిందే. మరణించినవాళ్ళకి శోకం వల్ల మాత్రమే బతుకు మధ్యలో చోటివ్వగలుగుతాం. అది మనలో ఒక చోటుగా మారిపోతుంది. మౌనంగానూ, భరించలేని బాధతోనూ పదే పదే ఆ చోటుని ఒక జీవితకాలం పాటు పునర్దర్శించడం ద్వారానూ, ఆ జ్ఞాపకాల్ని హత్తుకోవడం ద్వారానూ మాత్రమే మన బతుకుని నిలబెట్టుకోగలుగుతాం.

ఆమె రచనలు చెయ్యడానికీ, చేస్తూ ఉండటానికి ఇదే కారణం. యూరోపుకి Auschwitz ఎలానో, ఆమెకి గ్వాంగ్-జూ అలా. ఆష్విజు తర్వాత కవిత్వాన్ని ఊహించలేమని ఒక భావుకుడు అన్నాడు. కాని అది నిస్సహాయత్వంలోంచి పలికిన మాట. హన్‌కాంగ్ దృష్టిలో ఒక ఆష్విజు, ఒక గ్వాంగ్-జూ సాహిత్యానికి ఒక అర్థాన్నీ, ప్రయోజనాన్నీ సంతరిస్తాయి. వాటిని పదేపదే తలచుకోడం ద్వారా మాత్రమే మరొక ఆష్విజు, మరొక గ్వాంగ్ జూలు తలెత్తకుండా మానవాళిని కాపాడుకోగలుగుతాం.

ఇక రెండో అంశం, మానవహింస ఎంత యథార్థమైనప్పటికీ, అదొక్కటే సత్యం కాదనే మెలకువ. ఒకవైపు హింసకు పాల్పడుతున్న మానవుడే మరొకవైపు మానవమర్యాదకీ, గౌరవానికీ భంగం వాటిల్లకుండా ఉండటానికి తన ప్రాణాలైనా త్యాగం చెయ్యడానికి సిద్ధపడుతున్నాడు. ఇదుగో, ఈ పార్శ్వమే తనకు బతకడానికి స్ఫూర్తినిస్తున్నదని హన్ కాంగ్ అంటున్నది. అదే ఇంటర్వ్యూలో ఆమె చెప్తున్న ఈ మాటలు చూడండి:

> నేను Human Acts రాస్తున్న క్రమంలో నాలో అనుభవానికి వచ్చిన మార్పు గురించి కూడా నేను చెప్పవలసి ఉంటుంది. డిసెంబరు 2012 తర్వాత మూడు నెలలపాటు రోజుకి ఎనిమిది తొమ్మిది గంటలపాటు నేను గ్వాంగ్-జూకి సంబంధించిన అమానుష కృత్యాల పత్రాలు చదువుతూ గడిపేను. అక్కడితో ఆగకుండా ఇరవయ్యవశతాబ్దం పొడుగునా మానవాళి పట్ల జరుపుతూ వచ్చిన క్రూరకృత్యాల గురించి కూడా చదువుతూ వచ్చాను. అవన్నీ చదివే కొద్దీ మానవాళిపట్ల అంతదాకా నాకున్న నమ్మకం నశించిపోతూ వచ్చింది. నేను కుప్పకూలిపోయేను. రాయడం ఇంకెంతమాత్రం సాధ్యం అనిపించలేదు. దాదాపుగా నా రచన పక్కనపెట్టేసాను.
>
> అప్పుడు నా చేతికొక డైరీ దొరికింది. గ్వాంగ్-జూలో ప్రొవిన్షియలు ఆఫీసులో నిలబడ్డ సివిలియను మిలీషియాకి చెందిన ఒక కార్యకర్త రాసుకున్న డైరీ

అది. 1980 మే 27 తెల్లవారు జామున అతను మరణించాడు. సున్నిత మనస్కుడు, నిశ్శబ్దంగా తనపనేదో తాను చూసుకునే ఇరవై ఏడేళ్ళ పిల్లవాడు. రాత్రి పాఠశాలలో చదువుచెప్పేవాడు. అతడు తన డైరీలో రాసుకున్న వాక్యం ఒక ప్రార్థన లాగా ఉంది. ఆ ఎంట్రీ మొదటివాక్యం ఇలా మొదలవుతుంది. 'భగవంతుడా! నా మనస్సాక్షి అనే నాలోపలి ఈ భాగమేమిటి నన్నిలా మెలిపెడు తోంది? నాకు బతకాలని ఉంది.' ఆ వాక్యం చదవగానే నేనప్పటిదాకా చదువుతూ వచ్చిన పత్రాల్లో ఏది చదవలేకపోయానో నాకు అర్థమయింది. అప్పుడు అనుకున్నాను నేను, ఈ నా నవల మానవ దౌష్ట్యంతోనూ, దుర్మార్గం తోనూ, హింసతోనూ మొదలయ్యింది, కానీ ఇది మానవగౌరవం వైపు సాగవలసి ఉంటుంది అని. అదొక్కటే దారి, ఆ దారిలో ఎంత దూరం వీలైతే అంత దూరం ముందుకు సాగవలసి ఉంటుందని.

ఈ ఒక్క సమాధానానికి ఆమెకి నోబెలు శాంతిపురస్కారం ఇవ్వవచ్చు. గాంధీ గారు జీవితమంతా చేసింది ఇదే కదా. కానీ ఇప్పుడు మన దేశంలో ఇటువంటి వాక్యాలు రాయగల రచయిత ఒక్కరు కూడా లేరు. ఎందుకంటే, ఎంతపాటి హింసగానీ, మన సోషలు మీడియాకి ఒక్కరోజు కంటే ఎక్కువ కాలక్షేపవస్తువు కాదు.

5

ఇటువంటి రచయితల మాటలు చదివినప్పుడు, ఇటువంటి రచనలు చదివినప్పుడు అనివార్యంగా నన్ను నేను ఒక ప్రశ్న వేసుకుంటాను: వాళ్లనుంచి ఒక రచయితగా నువ్వేం నేర్చుకుంటావు అని. కాని హన్‌కాంగ్ నుంచి మనిషిగా కూడా మనం నేర్చుకోవలసింది ఎంతో ఉంది. ఎందుకంటే, నిన్న, ఆమె తండ్రి, తాను కూడా గొప్ప రచయిత అట, తన కుమార్తె ఈ పురస్కారాన్ని పండగ జరుపుకునే మనఃస్థితిలో లేరని చెప్పాడట. ఒకవైపు రష్యా–యుక్రెయిను యుద్ధంలో, మరొకవైపు ఇజ్రాయేలు–పాలస్తీనా యుద్ధంలో మనుషుల పట్ల క్రూరహత్యాకాండ నడుస్తూ ఉండగా తాను ఈ పురస్కారానికి తన సంతోషాన్ని చాటుకునే మనఃస్థితిలో లేరని అన్నాడట ఆయన. జీవితానికీ, సాహిత్యానికీ మధ్య గీతలు గీసుకోని మనుషులు ఈ ప్రపంచంలో ఎక్కడో ఒకచోట కనీసం ఒక్కరేనా ఉన్నారన్నదే గొప్ప ఓదార్పు నాకు.

13-10-2024

పుస్తక ప్రేమికుల కథ

ఇంటర్నేషనలు బెస్టుసెల్లరు అన్నదానికన్నా కూడా, విజయసారథి జీడిగుంట సూచించారు కాబట్టి, Days at the Morisaki Bookshop (2023) చదవడం ఒక బాధ్యతగా చదివాను. చిన్న పుస్తకం. గట్టిగా చదివితే ఒక పూటలో చదివేయవచ్చు.

కాని ఆ చిన్నపుస్తకం మొదటిపేజీల్లోనే మనకి మన మనసు చాలా తేలికపడ్డ ఫీలింగు కలుగుతుంది.

మనకి కూడా పాపులరు సాహిత్యం ఉందికాని, ఆ పుస్తకాలు నేను చదవలేను. ఆ రచయితలకి జీవితం పట్ల ఒక దృక్పథమంటూ లేకపోవడమొక్కటే కారణం కాదు. అసలు ముందు వాళ్ళకి తమ జీవితానుభవాల పట్ల తమకే నిజాయితీ ఉండదు. వాళ్ళ రచన మొదలవుతూనే ఏదో ఒక మానసిక కృత్రిమత్వంలోకి మనల్ని లాగుతున్నారన్న భావన కలుగుతుంది. అందుకనే తెలుగులో సుప్రసిద్ధులైన పాపులరు రచయితల పుస్తకాలేవీ ఒక్కటికూడా నేను పది పదిహేను పేజీలు మించి చదవలేకపోయాను. కాబట్టే వాళ్ళ రచనలకు రీడబిలిటీ ఉంటుందనే మాట కూడా నా వరకూ నమ్మదగ్గదిగా అనిపించదు. రీడబిలిటీ కూడా స్పష్టంగా ఒక సాపేక్షపదమే.

అలాగని మన సీరియసు రచయితల రచనలు తెరిచి చూస్తే మొదటిపేజీలనుంచే మనమేదో గాలిచొరబడని గదిలో అడుగుపెట్టినట్టు ఫీలవుతాం. అక్కడ మనకి ఊపిరాడదు. ఎవరో మన గుండెమీద అదిమిపెట్టి మనల్ని ఒక గోడవైపుకు నెట్టేస్తున్నట్టు ఉంటుంది. ఒకప్పుడు చదవగలిగేనేమోగానీ, 'అసమర్థుని జీవయాత్ర', 'అల్పజీవి', 'చివరకు మిగిలేది', 'చదువు' లాంటి నవలల్ని ఇప్పుడు ఏ మాత్రం చదవలేనని నాకు తెలుస్తూనే ఉంటుంది. 'వేయి పడగలై'తే ఇప్పటిదాకా నేను పూర్తిగా చదవలేకపోయిన రచన అని చెప్పుకోడానికి నాకేమీ సంకోచం లేదు. 'నారాయణరావు', 'రాజశేఖర చరిత్రము' మాత్రమే కాదు,

ఇటీవల తెలుగు సాహిత్యంలో చాలా ప్రశస్తికెక్కి ఇంటా బయటా పురస్కారాలు సంపాదించుకున్న నవలల్ని తెరవడానిక్కూడా నా మనసు సంసిద్ధంగా ఉండదు.

కానీ కొన్ని నవలలుంటాయి. ఒక 'జమీల్యా', ఒక 'సంసార సుఖం', ఒక 'బీళ్ళు దున్నేరు', ఒక 'బనగర్ వాడి', ఒక 'కవి', ఒక 'పాతుమ్మా మేక', ఒక 'చిన్ననాటి చెలి' లాంటివి, అనువాదాలే, కాని తెలుగులో వచ్చిన ప్రశస్తమైన నవలలు. వాటిని ఎప్పుడు తెరవడానికేనా నా మనసు ఉత్సాహపడుతూనే ఉంటుంది.

ఇక విస్పష్టమైన దృక్పథాన్ని చూపిస్తూనే పాఠకుణ్ణి చేయి పట్టుకుని వదలకుండా నడిపించగలిగే 'మాలపల్లి', 'అగ్నిధార', 'ముక్తి', 'అమృత సంతానం' ల గురించి ప్రత్యేకంగా ఏమని చెప్పేది! బైరాగి 'పాప పోయింది' కూడా.

ఇప్పుడు ఇదుగో ఈ Days at the Morisaki Bookshop కూడా అటువంటి నవల. ఇది జపనీస్ లో సీరియసు ఫిక్షనో లేదా పాపులరు నవలనో నాకు తెలియదుగాని, ఈ పుస్తకం నన్ను చదివించింది. అయితే మరోసారి చదవాలని అనిపించిందని చెప్పలేను. కాని ఇలాంటి నవల ఒకటి రాస్తే బాగుంటుంది కదా అనిపించింది. మురియెలు స్పార్కు రాసిన The Prime of Miss Jean Brodie (1961) చదివినప్పుడు కూడా నాకిలానే అనిపించింది. అంటే ఈ నవలలు నా మనసులో ఏదో ఒక ప్రాంతాన్ని నేరుగా చేరుకో–గలిగేయన్నమాట.

Days at the Morisaki Bookshop లో ఇతివృత్తమూ, కథా ఏమంత చెప్పుకో–దగ్గవి కావు. కాని ఆ సెట్టింగు ఉందే, అది నీ జీవితంలో నువ్వంతగా గుర్తుపెట్టుకోని ఎన్నో వీథుల్ని, ఎన్నో స్థలాల్ని, ఎన్నో ఉల్లాసభరితక్షణాల్ని నీకు గుర్తు తెస్తుంది. నీ బాల్యం దాటి నవయవ్వనంలో అడుగుపెట్టినప్పుడు నువ్వు ఒక వ్యక్తిగా రూపొందే క్షణాల్లో నీకు తెలీకుండానే నీ మానసిక పార్శ్వాల్ని తీర్చిదిద్దిన గ్రంథాలయాలూ, కళాశాలలూ, మిత్రబృందాలూ గుర్తొస్తారు. ఒకప్పుడు నిన్నెంతో ఉత్తేజితుల్ని చేసి ఇప్పుడు నువ్వు మర్చిపోయిన ఎన్నో పుస్తకాలు నీకిప్పుడు గుర్తురావడం మొదలుపెడతాయి.

ఉదాహరణకి ఇందాకా 'అసమర్థుని జీవయాత్ర' గురించి ప్రస్తావించేను కదా. ఇప్పుడు నన్ను ఆ పుస్తకం కదిలించలేకపోవచ్చు. కానీ నా ఇంటర్మీడియేటు రోజుల్లో ఒక రోజు గుంటూరు బస్టాండ్లో ఆ పుస్తకం కొనుక్కుని సాగరు బస్సెక్కి ఆ ప్రయాణం ముగిసే లోపు ఆ పుస్తకం పూర్తిచేసిన అనుభవం మర్చిపోలేనిది. ఆ పుస్తకానికి రాసిన ముందుమాట చదివే నేను ఆర్.ఎస్.సుదర్శనంగారికి శిష్యుడిగా మారిపోయేను. అలానే ఆ ఇంటర్మీడియేటు

దినాల్లోనే కాకినాడ నుంచి గుంటూరు దాకా చేసిన ఒక పాసెంజరు రైలు ప్రయాణంలోనే నేను 'శ్రీకాంత్' నవల చదవడం పూర్తి చెయ్యడం నాకు గుర్తొస్తోంది. ఒక మధ్యాహ్నవేళ రాజమండ్రి నుంచి మా ఊరు వెళ్తో ఆ బస్సు ప్రయాణంలో 'గోదాన్' చదవడం ముగించి-నప్పటికి ఆ అడవి దారుల్లోంచి బస్సులోకి ప్రసరిస్తోన్న ఆ సాయంకాలపు నారింజ సూర్యకాంతిని నేనెప్పటికీ మరవలేను.

అవును కదా, నేను కూడా ఇలాంటి ఒక పుస్తకం రాసి ఉండవచ్చు కదా. ఎందరో రచయితలు వారి పుస్తకాలతో నా జీవితంలోకి ఎలా అడుగుపెట్టారో, ఆ రోజుల్లో చుట్టూ మసిలిన మనుషుల కన్నా ఆ రచయితలే నాకెందుకంత ముఖ్యమనిపించేవారో ఆ ఆత్మీయ గాథని రాసుకోవచ్చు కదా. చిన్నప్పుడు మా వీథరుగు, రాజమండ్రిలో గోదావరి గట్టు, సమాచారం పత్రికాఫీసు, తాడికొండలో మా స్కూలు వెనక పత్తిచేలు, హైదరాబాదులో సివికృష్ణారావుగారు 'నెలనెలా వెన్నెల' సమావేశాలు జరిపే అంజయ్య ఆడిటోరియం పక్కనుండే ఇంపాలా టీషాపు- ఇటువంటి అరుగులు, అడ్డాలు, వీథులు- ప్రతి ఒక్క సాహిత్యాభిమాని జీవితంలోనూ ఉంటాయి. కాని వాటిని సెలబ్రేటు చేసుకోవచ్చని మనకెందుకు ఇప్పటిదాకా తట్టలేదు?

ఈ పుస్తకం చదివేక నాకు తేటతెల్లమయింది. మన చుట్టూ రెండు రకాల రచయిత-లున్నారు. ఒకరు, దృక్పథంలేని రచయితలు. మరొకరు, దృక్పథాల బరువుకింద నలిగిపోతున్న రచయితలు. కాని ఇప్పటి యువతరానికి కావలసింది, మూడో రకం రచయితలు. అంటే వారికొక దృక్పథం ఉండాలి. కాని తమ రచనల్లో ఆ బరువు పాఠకుడి నెత్తిన పడేయ కూడదు. అందుకుబదులు, తమ రచనలోకి అడుగుపెట్టగానే, పాఠకుడి చుట్టూ కిటికీలు తెరిచినట్టుగా ఉండాలి. గాంధీగారు చెప్పారే, 'నా ఇంటి కిటికీలు తెరిచిపెట్టు-కుంటాను, కానీ ఆ గాలి నన్ను కిందపడేయకుండా చూసుకుంటాను' అని. అదిగో, అలాంటి రచనలు కావాలిప్పుడు.

కాళిందీ చరణ పాణిగ్రాహి 'మట్టిమనుషులు' అటువంటి నవల, శరత్ 'దేవదాసు' అటువంటి నవల. తకళి శివశంకర పిళ్ళై 'చెమ్మీన్' అటువంటి నవల. విభూతి భూషణుడి 'పథేర్ పాంచాలి' అటువంటి నవల. కేశవరెడ్డి 'సిటీ బ్యూటిఫుల్' అటువంటి నవల. మధురాంతకం మహేంద్ర రాసిన 'స్వర్ణ సీమకు స్వాగతం' అటువంటి రచన.

సరే, మళ్ళా ఈ నవల విషయానికి వస్తే, ముందుగా ఒక ప్రశ్న. రెండు తెలుగు రాష్ట్రాల జనాభా, జపాన్ జనాభా, దాదాపుగా ఒక్కటే. కాని జపానుకి బయట జపనీయ

సాహిత్యానికి ఎంతమంది పాఠకులున్నారు? తెలుగు రాష్ట్రాల ఆవల ప్రవాసాంధ్రులు కాకుండా ఎంతమంది తెలుగు సాహిత్యం చదువుతున్నారు?

ఇరవై యేళ్ళ కిందట నాకు ఎం.ఆర్.బుక్‌స్టాల్లో A Reader%µ%s Guide to Japanese Literature (1988) అనే పుస్తకం దొరికింది. అందులో రచయిత జపనీయ సాహిత్యానికి చెందిన ఇరవై ప్రాచీనగ్రంథాల్ని, ముప్ఫై ఆధునిక గ్రంథాల్ని పరిచయం చేసాడు. నేను ఆ పుస్తకం కొనుక్కుని కుతూహలంగా పేజీలు తెరిచి ఆ ఇండెక్సులో నేనప్పటికే ఎన్ని పుస్తకాలు చది ఉన్నానా అని చూస్తే, ప్రాచీన సాహిత్యంలో పదమూడు దాకా, ఆధునిక సాహిత్యంలో ఏడుదాకా లెక్కతేలాయి. అంటే యాభైకి, ఇరవై. నలభై శాతం మార్కులు. జపనీయ సాహిత్యంలో పరీక్ష పెడితే, నేనా రోజుకే పాసై పోయానని చెప్పవచ్చు.

ఇప్పుడు ఈ మొరిసకి బుక్ షాపులో ప్రధానంగా ఆధునిక సాహిత్యంలో స్పెషలైజు చేసిన షాపు అని చెప్తూ, రచయిత తన కథానాయిక తకకొ ద్వారా కఫూ నగయి, జునిచిరో తనిజకి, సోసెకి నత్సుమె, హరువొ సటో, ర్యూనుసుకె అకుతగవ, కోజి ఉనొ, నవొయ షిగ, ఓగయి మొరి, సకునొసుకె ఒద, తరుహొ ఇనగకి వంటి రచయితల్నీ, ఒసము దజయి రాసిన Schoolgirl, సైసెయి మురో Until the Death of the Girl, మొతొజిరొ కజియి Landscapes of the Heart, నవొయె కినొషిత Confessions of a Husband, సనెయిత్సు ముషనకోజి Friendship పుస్తకాల్నీ, దొప్పొ కునికిద ఆసిన Musashino అనే కథనీ పేర్కొన్నాడు.

ఈ రచయితల్లో అకుతగవ కథలు నేను చదవడమే కాదు, అతడు రాసిన సుప్రసిద్ధ కథ 'రొషోమొన్' ను అనువాదం చేసాను కూడా. సొసెకి నత్సుమె రాసిన 'కొకొరొ' ను రాజమండ్రి రోజుల్లోనే చదివాను. (దాన్నెప్పుడో యాభై ఏళ్ళ కిందటే దక్షిణ భారత పుస్తక సంస్థవారు తెలుగులోకి అనువదింపచేసారంటే, ఈ యాభై ఏళ్ళల్లో మనం ఎంత వెనకపడ్డామో తెలుస్తూనే ఉంది కదా!) ఈ రచయితల్లో అయిదుగురు A Readers%µ%Guide లో కూడా ఉన్నారు. అంటే నేను ఆ పుస్తకం కొనుక్కున్నప్పుడే ఆధునిక జపనీయ సాహిత్యం కూడా చదవడం మొదలుపెట్టి ఉంటే, ఈ పాటికి కనీసం ఈ అయిదుగుర్నయినా చదివి ఉండేవాణ్ణి కదా అనిపించింది. కాని ఒకటి మాత్రం ఆశ్చర్యం కలిగించింది. జపనీయ సాహిత్యానికి మొదటి నోబెలు సంపాదించిన యసునరి కవబత పేరు రచయిత ఈ నవలలో ఒక్కసారి కూడా ప్రస్తావించలేదు. కారణం ఏమై ఉంటుందో? కాని కవబత రాసిన Snow Country మాత్రం నన్ను నిరుత్సాహపరిచిందనే

చెప్పాలి. అలానే కెంజొబురొ ఓయె, హరుకి మురకమిల పేర్లు కూడా ప్రస్తావనకు రాక పోవడం గమనించదగ్గది.

విజయసారథి ఈ పుస్తకం నాకు సూచిస్తూ 'మీరు ఇటువంటి ఒక పుస్తకం ఒకటి తెలుగులోకి తేగలరని నాకనిపించింది. అందుకనే ఈ పుస్తకం మీరు చదవాలనుకున్నాను' అని అన్నారు. అవును, పట్టుమని రెండు వందల పేజీలు కూడా లేని ఈ పుస్తకం చదువుతున్నప్పుడే పుస్తకప్రేమికుల గురించిన రెండు వందల పేజీల నవల ఒకటి నా మనసులో అల్లుకుంటూనే ఉంది!

23-12-2024

స్త్రీ దుఃఖమూ శిశుదుఃఖమూ

మరి దీనికి మందులేదా అక్కా? ఎందుకుండదు? తప్పకుండా ఉంది. కాని చదువుకున్నవాళ్ళు స్త్రీలకి ఉన్న హక్కుల గురించి ఎందుకు మాటాడరు? ఎందుకంటే వాళ్ళ దృష్టి ఎంతసేపూ వాళ్ళని అణచిపెట్టి ఉంచడం మీదనే. తక్కిన ప్రపంచమంతా స్త్రీలకోసం, పిల్లలకోసం ఏదో ఒకటి చేయాలని మాట్లాడుతూంది. కాని ఇక్కడ వీళ్ళు మాత్రం ఖురానునీ, హడితునీ తమ చేతుల్లోకి తీసేసుకున్నారు. వాళ్ళు కనీసం ఆ గ్రంథాలప్రకారం నడుచుకున్నా బాగుండేది! ముందు వాళ్ళ బాలికలల్ని విద్యావంతుల్ని చెయ్యమనండి. కేవలం మదరసా చదువు కాదు, స్కూళ్ళల్లోనూ కాలేజీల్లోనూ కూడా చదివించమనండి. తాము కోరుకున్నవాళ్ళనే పెళ్ళి చేసుకోనివ్వమనండి. ముందు అదిమ్మనమండి వాళ్ళని. ఈ కొజ్జాలు, ముందు తమ పిల్లలకి పెళ్ళిచేయడంతో పాటు ఆ పిల్లలకి స్త్రీధనం కూడా అందేలా చూడమనండి. తమకి వచ్చే కట్నకానుకలకోసం అంగలార్చవద్దని చెప్పండి. ఆడపిల్ల పుట్టింటివాళ్ళని తమ బిడ్డలకి ఆస్తిలో వాటా కల్పించమని చెప్పండి. స్త్రీపురుషుల మధ్య సఖ్యత కుదరకపోతే ఒక స్త్రీ తన భర్తకు విడాకులివ్వగల ఆమె హక్కుని గౌరవించమని చెప్పండి. ఒకవేళ ఆమె అలా విడిపోతే ఎవరో ఒకరు ఆమెను మళ్ళీ పెళ్ళి చేసుకోడానికి ముందు కొచ్చేలా చూడమనండి. ఆమె భర్తలేని స్త్రీ అయితే ఆమెతో జీవితం పంచుకోడానికి ఆమెకొక సహచరుడు దొరికేలా చూడమనండి.

బానూ ముష్తాక్, Black Cobras కథలో, పే. 71

ఈ ఏడాది బుకరు పురస్కారం పొందిన కన్నడ రచయిత్రి బానూ ముష్తాక్ కథలు Heart Lamp, Selected Stories (2025) స్త్రీల, శిశువుల దుఃఖం గురించిన కథలు. మరీ ముఖ్యంగా బాలికల దుఃఖం గురించిన కథలు. పురుష ప్రపంచం, పితృప్రపంచం,

విద్యాధిక ప్రపంచం, బలవంతుల ప్రపంచం తమని ఎడతెగని దుఃఖసాగరంలో వదిలిపెట్టేస్తే నిస్సహాయంగా మిగిలిపోతున్న స్త్రీ ప్రపంచంలో ఒక స్త్రీకి మరొక స్త్రీ మాత్రమే ఆసరాగా నిలబడుతున్న వ్యథార్తదృశ్యాల యథార్థ కథలు.

నిజానికి ఈ పుస్తకం తెరిచాక, మొదట యాభైపేజీల దాకా నేను కొంత అనిశ్చయం తోటే చదివాను. ఎందుకంటే, ఒకప్పుడు విశ్వనాథ సత్యనారాయణ, గురజాడ చేసిందల్లా బ్రాహ్మణసమాజంలో ఎందుకూ పనికిరానివార్ని చిత్రించడమే, అని విమర్శించాడు. బహుశా ఆయన కన్యాశుల్కం మొదటి కూర్పు చదివి ఉండడు. చదివి ఉంటే ఇంకా ఏమని ఉండేవాడో! కన్యాశుల్కం మొదటి కూర్పు చదివి చలంగారు ఆ రచనని 'జీవం లేని ఘోరం' అన్నాడు. అక్కణ్ణుంచి రెండో కన్యాశుల్కానికి వచ్చేకగానీ, మనుషులు ఊపిరి పీల్చుకోదగ్గ తావులు గురజాడ చూపించలేకపోయాడు. మధురవాణి, సౌజన్యారావుపంతులు, కొంతమేరకు కరటకశాస్త్రీ లేకపోయుంటే, ఆ నాటకంలో చిత్రించిన జీవితం మనల్నెప్పటికీ ఊపిరాడనిచ్చేది కాదు.

ఇప్పుడు ఈ రచయిత్రి కూడా ముస్లిం సమాజంలో ఎందుకూ పనికిరాని మనుషుల్ని మాత్రమే చూసి, వాళ్ళని చూపించడం మీదనే దృష్టిపెడుతున్నారా అని భయం కలిగింది. ఆమె ముస్లిం మతానికి చెందిన రచయిత్రి అయినంత మాత్రాన నేను ఆమెకి ఎటువంటి మినహాయింపులూ ఇవ్వడానికి సిద్ధంగా లేనని నాకు తెలుసు. కానీ, ఇదుగో, సంకలనంలో, మూడో కథ Black Cobras లో, ముస్లిం న్యాయవాదీ, స్త్రీల హక్కుల ఉద్యమకారిణీ జులేఖా బేగం మాట్లాడిన పై మాటలు విన్నాక, నాకు గొప్ప రిలీఫు కలిగింది. రచయిత్రి పట్ల గౌరవం కలిగింది.

ఎందుకంటే, మానవసమాజం మంచిచెడులు రెండింటితోనూ నిర్మాణమై ఉంది. అందులో చెడు పాలు తొంభైతొమ్మిది శాతమూ, మంచితనం ఒక్కపాలే ఉందనుకున్నా, ఆ ఒక్క పాలు మంచిదనాన్నీ చూడకపోతే, మనకి చూపకపోతే, ఏ రచయితనీ నేను గౌరవించలేను.

నిజానికి పై వాక్యాల కన్నా ముందే , ఇదుగో, ఈ సంభాషణ దగ్గరికి వచ్చేటప్పటికే, నా చేతుల్లో ఉన్నదొక విలువైన పుస్తకం అని నాకు అర్థమయింది. న్యాయవాది జులేఖా తన ముందు గోడువెళ్ళబోసుకుంటున్న అష్రాఫ్‌తో ఇలా అంటున్నది:

> నీకు తెలుసా అష్రాఫ్? ఒక ఆడపిల్ల పుట్టినట్టయితే, సాక్షాత్తూ ప్రవక్త మహమ్మద్‌నే ఆ ఇంటి ముందు ప్రణామాలు చెల్లించినట్టు అని?

అదంతా పక్కన పెట్టు అక్కా. అలా అయితే ప్రవక్త మహమ్మద్ నాలాంటి బీదవాళ్ళ ఇంటిముందు ఎన్ని సార్లు సాష్టాంగ ప్రణామాలు చెయ్యవలసి ఉంటుందో.

పిచ్చిమాటలు మాట్లాడకు. ప్రవక్తకున్నది కేవలం ఆడబిడ్డలే. ఒక మగపిల్ల వాడు పుట్టాడుగాని, శిశువుగా ఉండగానే మరణించాడు. ప్రవక్త తన బిడ్డల్ని ఎంతలా ప్రేమించేడో తెలుసునా? అసలా విషయం తెలుసా నీకు? బీబీ ఫాతిమా ఆయన జీవనసర్వస్వం. ఒక తండ్రికీ, అతడి కూతురికీ మధ్య వర్ధిల్లగల అనుబంధానికి వారిద్దరూ ఒక సజీవ తార్కాణ.

–అని నాకైతే తెలియదు. మన చుట్టూ ఉన్న మీడియాలో, సోషలు మీడియాలో ఎంతసేపూ ముస్లిం మతాన్ని ఈసడించుకునే రాతలే టన్నుల కొద్దీ చదువుతుంటాం గాని, ఇటువంటి వాక్యం ఒక్కటేనా చదివి ఉండం. మా మెహిదీపట్నం సెంటరులో ఒక మసీదు దగ్గర పెద్ద బోర్డుమీద ఇలా రాసి ఉంటుంది. 'స్వర్గం తల్లిపాదాల కింద ఉన్నది' అని. అటువంటి వాక్యం ఏ మతం నుంచి వచ్చిందో ఆ మతానికి నేను సాష్టాంగ ప్రణామం చెయ్యకుండా ఎలా ఉండగలను? ఇప్పుడు ఇదుగో, ఈ వాక్యం if a daughter is born, it is as if the Prophet has saluted the house అనే వాక్యం చదవగానే ఇస్లాం పట్లా, ప్రవక్త పట్లా నా మనసులో చెప్పలేని గౌరవం ఉప్పొంగకుండా ఎలా ఉంటుంది!

నిజానికి మతాల్ని కించపరుస్తూ రాయడం ఒక modern fashion, అది హిందూ మతంకానీ, క్రైస్తవంగానీ, ఇస్లాంగానీ. తామొక సెక్యులరు సమాజాన్ని కోరుకుంటున్నామని చెప్పుకోవడం ఇప్పటి విద్యాధికులకి ఒక passion. కానీ మన సెక్యులరు సంస్థలు– స్కూళ్ళు, కాలేజీలు, యూనివెర్సిటీలు , లెజిస్లేచర్లు, కోర్టులు, సినిమాలు, వార్తాపత్రికలు, టెలివిజను సీరియళ్ళు, మన సంస్థలు, మన కార్యాలయాలు, మన చర్చలు, మన వాద వివాదాలు– వీటిని ఎంతో దగ్గరగా చూసిన నాకు, ఆచరణలో వీటికీ మధ్యయుగాల మతోన్మాదులకీ ఏమీ పెద్దగా తేడా లేదనే సత్యం పదేపదే అనుభవంలోకి వచ్చిన నాకు– ఆ ఫాషన్నీ, పాషన్నీ చూసి జాలేస్తుంది. అందులోనూ ముస్లింమతాన్నీ, ముస్లిం మతాచారాల్నీ విమర్శించడంలో మొత్తం పాశ్చాత్య ప్రపంచానికీ, చీనాకీ ఇప్పుడు భారతదేశం కూడా తోడయ్యింది. అసలు ఆ గ్రంథాల్లో ఏముందో తెలుసుకోకుండానే, పవిత్ర కొరాను ఒక్కసారేనా చదవకుండానే, ముస్లిం మతాన్ని విమర్శించే హిందువులు హిందువులు కారు, క్రైస్తవులు క్రైస్తవులు కారు, సెక్యులరిస్టులు సెక్యులరిస్టులు కాలేరు.

బానూ ముష్తాక్ కథలు మొత్తం చదివేక నాకు అర్థమయిందేమంటే, ఆమెకి ఇస్లాం గురించి క్షుణ్ణంగా తెలుసు. ప్రవక్త ఆశయాల గురించి తెలుసు, జీవితకాలపు ఆచరణ గురించి తెలుసు, ఆ అచరణ గురించి ప్రజాస్మృతిలో నిలబడిపోయిన హడితు గురించి తెలుసు. ఆ 'ఆశయోదయ సదయశోభల్ని' ఆమె మన కాలపు పితృస్వామ్య, పురుషస్వామ్య, ముతావలీస్వామ్య ఆచరణతో పోల్చి చూస్తూ ఉన్నారు కాబట్టే, పట్టలేనంత ఆవేదనకు లోనవుతూ, ఆ ఆవేదనలోంచీ, ఆ ఆగ్రహంలోంచీ ఈ కథలు రాసారని మనకి తెలుస్తూంది.

ఈ కథలు చదివి కేవలం ముస్లిం సమాజాల్లో మాత్రమే స్త్రీలు ఇలా బాధపడు-తున్నారని మనం నిర్ధారించుకుంటే అది అర్థసత్యం మాత్రమే. నిజానికి ఈ కథలు చదువుతున్నంతసేపూ నాకు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్నకథలు గుర్తొస్తూనే ఉన్నాయి. శతాబ్దం కిందట గోదావరిప్రాంతంలో బ్రాహ్మణకుటుంబాల్లో స్త్రీల దుఃఖం ఎలా ఉన్నదో చిత్రించిన కథలవి. ఆ జీవితానికీ, ఇప్పుడు దక్షిణ-మధ్య కర్ణాటకలోని హాసన్ ప్రాంతంలోని ముస్లింస్త్రీల దుఃఖానికీ ప్రాయికంగా ఏమీ తేడా లేదు. ఆ బ్రాహ్మణ స్త్రీల దుఃఖానికి వేదాల్నీ, ఉపనిషత్తుల్నీ ఎలా తప్పుపట్టలేనో, ఈ ముస్లింస్త్రీల దుఃఖానికి కొరానునీ, హడితునీ కూడా అలానే తప్పుపట్టలేము. స్వార్థంలో, లోభంలో, వంచనలో, కలిసి పంచుకోవలసిన జీవితామృతం మొత్తం తానే నిస్సిగ్గుగా గుటకెయ్యడంలో పురుషుడు ప్రపంచమంతటా కూడా మతాతీతంగా ఉన్నాడని ఈ కథలు చదివితే మనకి అర్థమవు-తుంది.

అందుకని, ఇవి, పురుషస్వామ్యాన్నీ , పితృస్వామ్యాన్నీ ధిక్కరించవలసిన అవసరం కలిగిన ముస్లింస్త్రీల కథలు తప్ప కేవలం ముస్లిం స్త్రీల కథలు కావు. పాఠకుడికి అంతరాత్మ ఉంటే, ఇటువంటి మోసాలే, ఇటువంటి వంచననే తాను కూడా తన జీవితంలోనూ, తన సమాజంలోనూ స్త్రీలపట్లా, పిల్లలపట్లా కనపరుస్తూనే ఉన్నాడని తెలుస్తూనే ఉంటుంది. మరీ ముఖ్యంగా పిల్లల పట్ల. పిల్లలపట్ల మనుషులు కనపరిచే క్రూరత్వమే ప్రధాన ఇతివృత్తంగా డాస్టొవిస్కీ 'బ్రదర్స్ కరమజోవ్' నవల రాసాడు. అలాగని క్రైస్తవాన్ని విమర్శించడానికి ఆయన ఆ నవల రాసాడనగలమా? ఆ నవల ద్వారా ఆయన సూక్ష్మంగా చెప్తున్నదేమంటే, ఏ సమాజం తన పిల్లలపట్ల క్రూరంగా వ్యవహరిస్తుందో, ఆ పిల్లలు పెద్దయ్యాక పితృహంతకులుగా మారే ప్రమాదముంది, చూసుకోండనే.

బానూ ముష్తాక్ కథల్లో, అందుకనే నాకు అన్నిటికన్నా ముందు, హిందూ స్త్రీలూ, హిందూశిశువులూ; క్రైస్తవ స్త్రీలూ, క్రైస్తవ శిశువులూ; ప్రపంచమంతటా అపారమైన దుఃఖాన్ని అనుభవిస్తున్న నిరుపేద స్త్రీలూ, నిరుపేద శిశువులూ కనిపిస్తున్నారు. మరీ

ముఖ్యంగా నా చిన్నప్పణ్ణుంచీ చూస్తూ వస్తున్న ఎందరో గిరిజన స్త్రీలు కనిపిస్తున్నారు. ఈ కథాసంపుటం ఉద్దేశించిన యథార్థ సాహిత్యప్రయోజనం కూడా అదేననుకుంటాను.

ఈ వాక్యం చూడండి: 'ఇస్లామిక్ సంప్రదాయం ప్రకారం బంగారమూ, పట్టువస్త్రాలూ పురుషులకి నిషిద్ధం.'(పే.76). ప్రపంచానికి తెలుసునా ఈ విషయం? బ్రాహ్మణుణ్ణి ఉంఛవృత్తి మీద జీవించమని చెప్పింది వేదం. ఉంఛవృత్తి అంటే పొలాల్లో పంట కోసుకు పోయేక మిగిలే పరిగె. దాన్ని తెచ్చుకుని ఆ గింజల్తో ఇంత గంజి కాచుకుని దాంతో మాత్రమే బతకడం బ్రాహ్మణ జీవితాదర్శం వేదం దృష్టిలో. కాని ఉంఛవృత్తి అంటే ఏమిటో తెలియని బ్రాహ్మణులూ, పట్టువస్త్రాలు మాత్రమే ధరించే ముస్లిములూ ఎక్కణ్ణుంచి వచ్చారు? ఏ శక్తులు వాళ్ళనట్లా తీర్చిదిద్దేయి? మనుషులు బాగుపడాలని కోరుకునేవాళ్ళు మతాల్ని నిందించడం కాదు చెయ్యవలసింది, మతాలకు అతీతంగా, ప్రపంచమంతటా మనిషిలో కనిపిస్తున్న రాక్షసమూలాల్ని వెతికి పట్టుకోడం, లోకమంతా చూసేలా ఎత్తిచూపడం, ఖండించడం.

ఈ దృష్టి బానూ ముష్తాక్ సాహిత్యానికి ప్రాతిపదిక.

ఈ వాక్యాలు చూడండి (పే.157)

> వస్తుసామగ్రి అమూల్యమైందిగానూ, మనుషులు విలువలేనివాళ్ళుగానూ కనిపిస్తున్నారు. ఆ వస్తుసంచయం వెనక మనుషుల భావోద్వేగాలు అమ్మకాని కొస్తున్నాయి. పొట్టిమనుషులకి పెద్ద నీడల్తో సంబంధబాంధవ్యాల్ని వస్తువులు నిర్దేశిస్తున్నాయి. నేడు ఒక రిఫ్రిజేటరుకి ఒక నవవధువు జీవితాన్ని మార్చేయగల శక్తి ఉంది. ఆ రిఫ్రిజిరేటరు ఆమె మనసులో హెూలీ రంగుల్ని వెదజల్ల-గలదు. అలాంటి వస్తువుల్ని సమకూర్చుకోవడం ఆ ఇంట్లోనే కాదు, ఆమె జీవితనిర్ణయాల్లో కూడా ముఖ్యమైన చోటు సంపాదించుకుంది. మనుషులు పరుగులు పెడుతున్నారు. వాళ్ళ స్వీయగౌరవాన్నీ, అనుబంధాల్నీ పాచికలాగా గాల్లోకి ఎగరేస్తున్నారు. అలసిపోతూ, వేసటలో కుప్పకూలిపోతూ, చెమటలు కక్కుతూ, అయినా పరుగెడుతూనే ఉన్నారు. ఆహా! వాళ్ళు పరుగెత్తే కొద్దీ ఆ బంగారు లేడి కూడా మరింత ముందుకి పరుగెడుతోంది. అది ప్రతి ఒక్కరినీ పిచ్చివాళ్ళని చేస్తోంది. ప్రతి ఒక్కరి మీదా మత్తుమందు చల్లుతోంది. అయినా అది ఏ ఒక్కరికీ చేజిక్కడమే లేదు. ఈ అయస్కాంత శక్తి తాలూకు మహాకథనం –ఇదే మన నాగరికతని మనం గుర్తుపట్టడానికి గొప్ప ఆనవాలు!

మొత్తం పన్నెండుకథలు. ప్రతి ఒక్క కథా మన సమకాలిక జీవితాన్ని, మన పరుగునీ, మన సభ్యతనీ, మన సంస్కృతినీ ముసుగు తీసి చూపించే ఆనవాలు. నిజానికి మూడు వందల పేజీల ఈ పుస్తకం నాకైతే రెండుమూడు గంటల్లో పూర్తయ్యే పఠనం. కాని ఏ ఒక్క కథా చదివినవెంటనే మరొక కథ తెరిచే ధైర్యం చేయలేకపోయాను. కనీసం రెండు రోజులు పట్టింది ఈ పన్నెండు కథలూ చదవడానికి!

పుస్తకం చదవడం ముగించేక, ఆ స్త్రీలూ, ఆ పురుషులూ, ఆ మతాచార్యులూ, ఆ వివాహాలూ, ఆ విచ్ఛేదాలూ- ఇవన్నీ పక్కకు పోయి, ఆ స్త్రీలకు పుట్టిన కూతుళ్ళు నా కళ్ళముందు కనిపిస్తూ ఉన్నారు. తన తల్లి చనిపోయి రెండునెలలు కూడా ముగియకుండానే రెండో పెళ్ళి చేసుకున్న తన తండ్రి సంతోషాన్ని డిస్టర్బు చేయకుండా ఉండటానికి పిల్లల్ని దూరంగా తీసుకెళ్ళి ఆడిస్తున్న అసిఫా (Stoneslabs for Shaista Mahal, పే.15) నా కళ్ళముందు కనిపిస్తున్నది. ప్రసవం తర్వాత కోలుకోకుండానే మరణించిన ఆమె తల్లి షైస్తా కథకురాలు జీనత్‌తో చెప్పినమాటలు She is not my daughter, she is my mother. .. నా చెవుల్లో గింగురుమంటున్నాయి. అలానే ఈ కథల్లో గృహ తిరస్కృతులూ, సంఘతిరస్కృతులూ అయిన స్త్రీలకి తోడుగా నిలబడుతున్న వాళ్ళ పెద్ద కూతుళ్ళు నా చుట్టూ చేరి నిశ్శబ్దవదనాలతో నన్ను ప్రశ్నిస్తున్నారు. 'చెప్పు, పాఠకుడా! నువ్వు మా కోసం ఏం చెయ్యగలవు?' అని నిలదీస్తున్నారు.

అందరికన్నా కూడా నన్ను మరింత కలవరపరిచింది High-Heeled Shoe కథలో అరిఫాకు తోడుగా నిలబడ్డ ఆమె గర్భస్థశిశువు. ఈ సంపుటానికి Heart Lamp కథని శీర్షికగా పెట్టారుగాని, నిజానికి, High-Heeled Shoe కథని శీర్షికగా పెట్టి ఉండవలసింది. ఈ సంపుటంలోని కథలన్నిటిలో అది అత్యంత శక్తిమంతమైన కథ. కన్నీటి కావ్యం. ఏ కథకుడైనా తన జీవితకాలంలో ఇటువంటి ఒక్క కథ రాయగలిగితే చాలు. నేను ఇందాక పైన ఉల్లేఖించానే, బంగారు లేడి మనుషుల మీద చల్లుతున్న మత్తుమందు గురించిన మాటలు- అవి ఈ కథలోవే. అదే ఈ కథకి ఇతివృత్తం.

సాధారణంగా భారతీయులెవరికేనా అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తే విధిగా వాళ్ళని అభినందించే ప్రధానమంత్రి ఈమెని ఇప్పటిదాకా అభినందించలేదని విన్నాను. ఆయన కార్యాలయంలో ఈ పుస్తకం చదివినవాళ్ళెవరోగాని వాళ్ళు సరిగ్గా చదవలేదని చెప్పగలను. ఈమె చిత్రించిన జీవితం మతాల సరిహద్దులు చెరిగిపోయిన తావు. కాబట్టే, ఈ కథల్లో కూడా అన్నదమ్ముల అన్యోన్యత గురించి చెప్పడానికి రామలక్ష్మణులే ఉదాహరణగా నిలబడ్డారు. తన చుట్టూ ఉన్న మనుషుల్ని గుర్తుపట్టే క్రమంలో ఈ రచయిత్రికి కూడా ఒక మారీచుడు, ఒక మంథర, ఒక మాయలేడి, ఒక శకుని గుర్తొస్తూ ఉన్నారు.

మొత్తం మీద ఈ పుస్తకం గురించి నాకేదన్నా ఫిర్యాదు ఉందంటే ఇదొకటే. సాధారణ ప్రగతిశీల, ఉదారవాద సాహిత్యంలో కనవచ్చే బలహీనతనే ఈ కథనంలో కూడా కనబడు–తున్నది. అదేమంటే, కథకురాలు లేదా కథకుడు తానొక్కరే పవిత్ర, పరిశుభ్రస్థలంలో ఉన్నట్టూ, అన్ని వైరుధ్యాల్నీ జయించినట్టూ, తన చుట్టూ ఉన్న మనుషులు మాత్రం సకల దౌర్బల్యాలకీ, దుర్మార్గాలకీ ఆలవాలమన్నట్టూ రాసే పద్ధతి. ఈ విషయంలో వీళ్ళకీ సంప్రదాయవాదులకీ ఏమీ తేడా లేదు. అందుకని, కథకుడు ఒక్కసారేనా తనలోకి చూపు సారించి తన దైనందినజీవితంలో తాను కూడా ఎంతవరకూ తన తోటిమనుషుల్లానే జీవిస్తున్నాడో తనకై తాను పరిశీలించుకుంటే, ఆ స్వీయవిమర్శతో కథలు చెప్తే, అప్పుడు ఆ కథలు మరింత విలువైనవిగా కనిపిస్తాయి, కనీసం నా వరకూ. ఈ పన్నెండు కథల్లోనూ, ఒక్క The Arabic Teacher and Gobi Manchuri కథలో తప్ప మరే కథలోనూ ఈ లోచూపు కనిపించదు.

అలాగని ఈ ఆవేదనలోని నిజాయితీని శంకించలేను. తోటిమనిషి దుఃఖం తన దుఃఖంగా మారితే తప్ప ఇదుగో, ఇటువంటి వాక్యాలు రావు. చూడండి (పే. 252):

> ఎవరేనా నొప్పిని తినగలరా దాదీమా?
>
> అమ్మమ్మ మాట్లాడటం క్షణం పాటు ఆపి నాకేసి తేరిపారచూసింది. అప్పుడు ఎవరికో చెప్తున్నట్టుగా 'అవును కదా, నిజమే కదా! ఎవరేనా సరే తాము నొప్పి తినాలి, తక్కినవాళ్ళకి సంతోషాన్నివ్వాలి' అంది.

మామూలు మాటలుకావు. ఒక టోనీ మారిసన్ మాత్రమే రాయగల మాటలు.

చివరగా ఒక మాట. కథాశిల్పంలోగాని, వస్తునైశిత్యంలోగాని ఈ రచయిత్రికి సమానంగా నిలబడగలవారూ, కొండొకచో ఆమెకన్నా శక్తిమంతంగా కథలు చెప్తున్నవాళ్ళూ మన సమకాలిక తెలుగు కథకులు చాలామందే ఉన్నారు. ముస్లిం జీవితాల చిత్రణనే తీసుకున్నా, ఒక స్కైబాబ వంటి కథకుడు చెప్పిన కథలు, ఈ కథలకన్నా ఎంతో ముందుకి చూడగలుగుతున్నాయి. కాని మనకి లేనిదల్లా ఒక దీపా భస్తి లాంటి అనువాదకురాలు. ఇటాలిక్సుని పక్కన పెట్టేయగల సాహసికురాలైన అనువాదకురాలు. కుశలురాలైన అనువాదకురాలు. తెలుగు సాహిత్యం ముందు అటువైపు దృష్టి పెట్టడం చాలా అవసరం.

28-5-2025

విషవృక్షం

విషవృక్షం. బంకింబాబు నవల. నా చిన్నప్పుడు, అంటే మరీ చిన్నప్పుడు, పదేళ్ళ కన్నా చిన్నప్పుడు, నేను పదే పదే చదివిన పుస్తకాల్లో అది కూడా ఉంది. అప్పట్లో పంచాయితీ సమితి వారు కూడా గ్రంథాలయ పుస్తకాలు కొనుగోలు చేసేవారు. అలా కొని ఊళ్ళల్లో సర్కులేటు చేసిన పుస్తకాల్లో కొడవటిగంటి 'పానకంలో పీచు', 'అహింసా ప్రయోగం' కథల సంపుటాలతో పాటు 'విషవృక్షం' కూడా నా చేతుల్లో పడింది. ఆ పుస్తకం ఎన్ని సార్లు చదివానో చెప్పలేను. కాని గడిచిన యాభై ఏళ్ళల్లో మళ్ళా ఆ పుస్తకం నా కంట పడలేదు.

మొన్నామధ్య అనిల్ బత్తుల ఇన్బాలో తన దగ్గరున్న పుస్తకాల కవరు పేజీలు పెడుతున్నప్పుడు ఈ పుస్తకం కవరు పేజీ కూడా చూసాను. అది నా చిన్నప్పుడు చదివిన తెలుగు అనువాదంలానే అనిపించింది. ఆ పుస్తకం ఒక్కసారి ఇవ్వగలరా చదివి ఇచ్చేస్తానని అడిగాను.

విషవృక్షం చదవాలనుకుంటే ఎక్కడ దొరకదని? The Poison Tree ఇంగ్లిషు అనువాదం ఇంటర్నెట్టు ఆర్కైవులో ఉంటుందని తెలుసు. కానీ ఆ నా చిన్నప్పటి పుస్తకం చదవాలన్న కోరిక. అప్పట్లో అన్నిసార్లు చదివిన ఆ పుస్తకంలో నిజంగా నాకేమి గుర్తుందో చూసుకుందామని ఒక కుతూహలం.

అనిల్ చాలా ఉదారుడు. నేనడగ్గానే తనే ఆ పుస్తకం స్వయంగా మా ఇంటికి తీసుకొచ్చి మరీ అందచేసాడు. అవును. అదే పుస్తకం. అది దండమూడి మహీధర్ చేసిన అనువాదమని ఇప్పుడు తెలిసింది. ఆ మొదటిపేరా చదవగానే నా చిన్నప్పుడు చదివిన పుస్తకం అదేనని గుర్తుపట్టాను. ఆవురావురుమంటూ ఆ పుస్తకం వెంటనే చదివేసానుగాని, అందులో నాకు ఇప్పటికీ గుర్తున్నవి 'కుంద', "హీర' మాత్రమేనని అర్థమయింది. మరీ ముఖ్యంగా ఆ నవల చివర్లో హీరా దేవేంద్రబాబుని భయపెడుతూ 'స్మరగరళ ఖండనం మమ శిరసి మండనం దేహి పదపల్లవముదారమ్' అని పాడిన గీతగోవిందవాక్యాలు.

నవల్లోని ఆ చివరిదృశ్యం ఏదో భయానక బీభత్స వాతావరణాన్ని గుర్తుచేస్తున్నదిగానే ఇన్నేళ్ళపాటూ కూడా నా జ్ఞాపకంలో మిగిలిపోయింది. ఆ దృశ్యంతో పాటు కుందనందినికి కలలో ఆమె తల్లి కనిపించి తనదగ్గరికి వచ్చెయ్యమని చెప్పిన దృశ్యాలు కూడా ఆ వివరాలతో గుర్తులేవుగాని, ఏదో మార్మిక, అలౌకిక విషయంగా గుర్తుండిపోయిందని గుర్తుపట్టాను. ఇవి తప్ప నవల్లో మరేవీ గుర్తులేవు. ఆ కథ అస్సలు గుర్తులేదు. అన్నిటికన్నా ఆశ్చర్యం, కథానాయకుడు నగేంద్రబాబుగాని, అతడి భార్య సూర్యముఖిగాని, వాళ్ళ ఇంట్లో పెరిగిన ఆ విషవృక్షంగాని నాకేమీ గుర్తులేవు. అంటే ఇన్నేళ్ళ తరువాత వెనక్కి తిరిగి చూసుకుంటే, ఆ నవల్లో ఒక అభాగినిగా కుంద ఒక్కతే నా హృదయాన్ని అంటిపెట్టుకుని ఉండిపోయిందంటే, ఆ నా పసిమనసుని సంతోషంకన్నా దుఃఖమే ఎక్కువ ఆకట్టుకున్నదని అర్థమయింది.

2

ఇప్పుడు ఇన్నేళ్ళ తరువాత మళ్ళీ చదివినప్పుడు ఈ నవలని ఇదే మొదటిసారి చదవడం అని చెప్పవచ్చు. 'విషవృక్షం' (1872-73) బంకించంద్ర ఛటోపాధ్యాయ (1838-94) రాసిన మొదటి సాంఘిక నవలల్లో ఒకటి మాత్రమే కాదు, భారతీయ సాహిత్యంలోనే తొలి సాంఘిక నవల్లో ఒకటి కూడా. ఆ తర్వాత ఆరేళ్ళకుగానీ వీరేశలింగంగారి 'రాజశేఖర చరిత్ర' (1878) వెలువడలేదు. చందుమీనను మళయాళంలో రాసిన 'ఇందులేఖ' (1889) హరినారాయణ ఆప్టే మరాఠీ నవల 'మధలీ స్థితి' (1885) వంటివన్నీ ఆ తర్వాత వచ్చినవే. అలా చూసినప్పుడు ఒక సాంఘికనవలగా తన సమకాలిక బెంగాలీ జీవితాన్ని చిత్రించడంలో బంకిం పూర్తిగా సఫలుడు కావడమేకాకుండా, ఇన్నేళ్ళ తరువాత కూడా ఆ నవలని తన పాఠకుల్తో చదివించగలిగే శిల్పసౌష్టవాన్ని సాధించేడని కూడా చెప్పవచ్చు.

స్థూలంగా ఆ కథ ఇది: నగేంద్రబాబు గోవిందపూరు జమీందారు. చాలా ఉన్నత వ్యక్తిత్వం, సంస్కారం కలిగినవాడు. సూర్యముఖి అతడి భార్య. వారికి పిల్లల్లేరు. నగేంద్రుడి చెల్లెలు కమల, ఆమె భర్త శ్రీశబాబు కలకత్తాలో ఉంటారు. శ్రీశబాబు అక్కడ ఒక ఆఫీసులో గుమస్తాగా పనిచేస్తుంటాడు. దేవేంద్రబాబుది కూడా గోవిందపూరే. అతడు కూడా చదువుకున్నాడు. గాయకుడు. రసికుడు. కాని స్త్రీలోలుడు. మద్యపానలోలుడు. హీర నగేంద్రుడి ఇంట్లో పరిచారిక. ఆమె తనని మనస్ఫూర్తిగా ప్రేమించే మనిషి కోసం వెతుక్కుంటూ ఉంటుంది. కథాప్రారంభంలో నగేంద్రుడు గోవిందపూరునుంచి తన జమీకి సంబంధించిన పనులు చూసుకోడానికి పడవమీద బయల్దేరతాడు. కాని ప్రయాణ మధ్యంలో పెద్ద తుపాను కమ్ముకుంటుంది. అతడు తన పడవని ఏదో ఒక ఒడ్డుకి చేర్చి

ఆ వానలో ఆ దగ్గరలో ఏదేనా గ్రామం ఉందేమోనని వెతుక్కుంటూ వెళ్తాడు. అలా అతడు వెళ్ళి అడుగుపెట్టిన మొదటి ఇంట్లోనే ఒక రోగిష్టి వృద్ధుడూ, నవయవ్వనవతి అయిన అతడి కూతురూ కనిపిస్తారు. నగేంద్రుడు ఆ ఇంటి గుమ్మం దగ్గరకు చేరుకున్నప్పుడే ఆ వృద్ధుడు కూడా కన్నుమూస్తాడు. ఆ పిల్ల వంటరిదైపోయిందని నగేంద్రుడికి అర్థమవు-తుంది. ఆ మర్నాడు అతడు ఆ వృద్ధుడికి అంత్యక్రియలు చేయించి, ఆ పిల్ల భారం తనమీద వేసుకుని, ఆమెను కలకత్తా తీసుకువెళ్ళి తన చెల్లెలికి అప్పగిస్తాడు. ఆమె గురించి తన భార్యకి కూడా తెలియచేస్తాడు. అతడి భార్య సూర్యముఖి ఆమెని తమ ఇంటికి తీసుకువచ్చెయ్యమనీ, తమ దూరపుబంధువు తారాచరణ్ కిచ్చి పెళ్ళి చేయవచ్చనీ చెప్తుంది. నగేంద్రుడు కుందను గోవిందపూరు తీసుకొస్తాడు. ఆమెని తారాచరణ్ కి ఇచ్చి పెళ్ళి చేస్తారు. కాని రెండుమూడేళ్ళకే అతడు మలేరియాతో చనిపోతాడు. కుంద వితంతు-వవుతుంది.

వితంతువులకి పునర్వివాహం శాస్త్రసమ్మతమే అని బెంగాల్లో ఈశ్వరచంద్ర విద్యాసాగరుడు వాదిస్తూ ఉన్న రోజులు. కాబట్టి కుంద పునర్వివాహానికి అర్హురాలేనని గోవిదపూరు సమాజం కూడా నమ్మడం మొదలుపెట్టింది. ఆ నవయవ్వన వతి అయిన స్త్రీ నెమ్మదిగా నగేంద్రుడి మనసుని కలవరపరచడం అతడి భార్య సూర్యముఖి గుర్తుపట్టింది. కొన్నాళ్ళు సంక్షోభంలోనూ, పైకి చెప్పుకోలేని కలవరంలోనూ గడిపేక, చివరికి నగేంద్రుడు కుందని పెళ్ళి చేసుకుంటాడు. ఆ వెంటనే సూర్యముఖి ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోతుంది. నగేంద్రుడు కూడా ఆమెని వెతుక్కుంటూ తను కూడా ఇల్లు విడిచిపెట్టేస్తాడు. ఈలోపు దేవేంద్రబాబు కుందమీద కన్నేస్తాడు. అందుకు సాయపడమని ఆ ఇంటిపరిచారిక హీరాని అడుగుతాడు. హీరాకి దేవేంద్రుడిమీద ఇష్టముందిగాని కుందమీద అతడి దృష్టి పడటం ఇష్టంలేదు. ఒకరోజు దేవేంద్రుడు ఆ ఇంటికొచ్చి కుందతో ఎలాగేనా మాట్లాడించే ఏర్పాటు చెయ్యమని అడిగితే, హీరా నలుగురినీ పిలిచి గొడవచేస్తుంది. అవమానంతో దేవేంద్రబాబు పారిపోతాడు. కాని అందుకు ఎలాగేనా హీరా మీద ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటాడు. చివరికి ఒకరోజు ఆమెకి మద్యమిచ్చి ఆ మత్తులో ఆమెని చెరుస్తాడు. ఆమె తెలివిలోకి వచ్చేటప్పటికి ఆమెని తన్ని తరిమేస్తాడు. హీర తాను మోసపోయాననీ చావు తప్ప మరో దారిలేదనీ అనుకుని విషం తెచ్చుకుంటుంది.

ఈలోపు ఎలాగో మొత్తానికి నగేంద్రుడు, సూర్యముఖీ ఇద్దరూ గోవిందపూరు చేరుకుంటారు. ఆ ఇంట్లోనూ, ఆ ఊళ్ళోనూ కూడా పండగ వాతావరణం నెలకొంటుంది. నగేంద్రుడు తనని వచ్చి పలకరిస్తాడని కుంద ఎదురుచూస్తూ ఉంటుంది. కానీ అతడు

సూర్యముఖి బతికి తిరిగివచ్చిందన్న సంతోషంలో కుందని మర్చిపోతాడు. ఆ సమయంలో హీర కుందదగ్గరికొస్తుంది. తనతో పాటు విషం కూడా తెచ్చుకుంటుంది. ఆమెకి తెలియ-కుండా కుంద కొంత విషం సంగ్రహించి తాను ఆత్మహత్య చేసుకుంటుంది. హీర అక్కణ్ణుంచి పారిపోతుంది.

చివరికి హీర పిచ్చిదవుతుంది. ఒకరోజు ఆమె దేవేంద్రబాబు ఇంటికొచ్చి అతణ్ణి భయపెడుతుంది. గతంలో అతడు తన మీద మోజుపడి తనని ఆకట్టుకోడానికి పాడిన అష్టపదినే వికటాట్టహాసంతో పాడుతుంది. దేవేంద్రుడికి భయంతో గుండె ఆగిపోతుంది. ఆ తర్వాత కూడా చాలాకాలం పాటు అక్కడ 'స్మరగరళ ఖండనం మమ శిరసి మండనం, దేహి పదపల్లవముదారం' (మన్మథుడనే విషానికి విరుగుడులాగా ఉన్న మొగ్గల్లాంటి నీ పాదాలతో నా శిరసుని అలంకరించు) అనే గీతం వినిపిస్తూ ఉండేదని రచయిత నవల ముగిస్తాడు.

నవల మొదట్లోనే తన తండ్రి మరణించినప్పుడు కుంద నిద్రలో ఉంటుంది. అప్పుడు ఆమెకి కలలో ఆమె తల్లి కనిపిస్తుంది. ఆమెని కూడా తనతో వచ్చెయ్యమంటుంది. కుంద అందుకు మానసికంగా సిద్ధం కాదు. అప్పుడామె తల్లి ఇద్దరు వ్యక్తుల్ని చూపిస్తుంది. వీళ్ళిద్దరూ నీ బరువు బాధ్యతలు తీసుకుంటారుగాని వీళ్ళకు దూరంగా ఉండు అని చెప్తుంది. ఆ తర్వాత జరిగిన సంఘటనల్లో ఆ ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు నగేంద్రుడూ, మరొకరు హీర అని కుంద పోల్చుకుంటుంది. జరగబోయే కథని ఇలా సూచించి చెప్పినప్పటికీ, రచయిత తన నవల్లోని ఉత్కంఠ ఏ మాత్రం చెదరకుండా మనల్ని తన వెంటబెట్టుకుపోగలగడం చాలా ఆశ్చర్యమనిపిస్తుంది.

ఈ మాట శిల్పం గురించి చెప్తున్నాను. ఇక నవల చెప్తున్న సందేశమేమిటి? 29 వ అధ్యాయం ఇలా మొదలుపెడుతున్నాడు:

> నేను విషవృక్షం గురించి వివరంగా చెప్పడానికి ఉద్యమించాను. ఒకరకంగా చెప్పాలంటే ప్రతి గృహంలోనూ ఈ విషవృక్షానికి చెందిన సూక్ష్మబీజాలు వుంటూనే వుంటాయి. కామ, క్రోధ, మద, మాత్సర్యాలు లేని మనిషి అంటూ వుంటాడని నేననుకోను. మహామహా జ్ఞాన సంపన్నులే వీటికి దాసులైపోవడం కద్దు. మనస్సు చలిస్తుంది. జ్ఞానులకు, అజ్ఞానులకు మధ్య భేదమేటంటే- జ్ఞానులు తమ చిత్తవృత్తులను అదుపులో వుంచుకోగలుగుతారు. సాధారణ మానవులు వాటిని అదుపులో వుంచుకోలేరు.అటువంటి వ్యక్తులకు యీ

విషవృక్షం అంకురించి, పెరిగి, పెద్దదై, పుష్పించి, ఫలితాలను అందిస్తుంది. మనస్సును జయించలేని స్థితిలో ఈ వృక్షం మరింత అభివృద్ధి చెందుతుంది. యిది అంత తొందరగా చనిపోయే వృక్షం కాదు. చూడడానికి యిది చాలా అందంగా వుంటుంది. కాని దీని ఫలాలు విషంతో నిండి వుంటాయి. వీటిని రుచి చూస్తే ఆ విషయం బోధపడుతుంది. (పే.131-132)

ఈ మాటల్ని బట్టి చూస్తే నగేంద్రుడి మనసులో కుంద పట్ల కలిగిన సంచలనాన్నే రచయిత విషవృక్షానికి బీజంగా చెప్తున్నాడని అనిపిస్తుంది. కాని అదే సమయంలో దేవేంద్రబాబు, హీరలాంటి వాళ్ళ మనసుల్లో కూడా విషవృక్షం పెరిగి పెద్దదవుతుండటం నవల్లో కనిపిస్తుంది. నిజానికి ఈ నవల్లో రచయిత ఏ ఒక్కరి పట్లా మొగ్గు చూపలేదు. ఎవరినీ ఉత్తములుగానో లేదా అధములుగానో చిత్రించలేదు. కాని, ఈ నవలకి 1884 లో వెలువడ్డ ఇంగ్లిషు అనువాదానికి ముందుమాట రాస్తూ సర్ ఎడ్విన్ ఆర్నాల్డు, that which appears to me most striking and valuable in the book is the faithful view it gives of the gentleness and devotion of the average Hindu wife అని రాసాడు. అలాగని సూర్యముఖి ద్వారా ఒక హిందూసతి సౌశీల్యాన్ని ఉగ్గడించడమే రచయిత ఉద్దేశ్యమై ఉంటే, అతడు దీనికి 'కల్పవృక్షం' అని పేరుపెట్టి ఉండేవాడు. అంత సౌశీల్యవతి అయిన భార్య, ఆమె మాట జవదాటని భర్త ఉన్న గృహంలో కూడా విషవృక్షం చిగురించడానికి కారణం కుందవంటి స్త్రీకి ఆశ్రయమివ్వడమని రచయిత అంటున్నాడా? లేక వితంతువులకి వివాహం శాస్త్రసమ్మతమేనని ఈశ్వరచంద్రుడు వాదిస్తూ ఉండటం ఇటువంటి దుష్ఫలితాలకు దారి తీస్తుందని చెప్తున్నాడా? ఆర్నాల్డు ఈ మాట కూడా రాసాడు: In Debendra the eBabu paints successfully the 'young Bengalee' of the present day, corrupted rather than elevated by his educational enlightenment. ఒక వితంతువు ఎదట ఒక విద్యావంతుడైన బెంగాలీ యువకుడి ఈ ప్రవర్తన చూడగానే మనకు గిరీశం గుర్తురాకుండా ఉండదు. కాని చివరికి దేవేంద్రబాబు పట్ల కూడా రచయిత మనలో ద్వేషాన్నీ, అసహ్యాన్నీ రేకెత్తించడు. మరి ఈ కథద్వారా రచయిత అంతిమంగా చెప్పదలచుకున్నదేమిటి?

1690 లో కలకత్తాతో పాటు మరొక మూడు గ్రామాల్ని కొనుక్కుని ఈస్టిండియా కంపెనీ వ్యాపారకార్యకలాపం మొదలుపెట్టాక, నెమ్మదిగా, స్థానిక రాజకీయాల్లో జోక్యం చేసుకుని, 1757 నాటికి బెంగాలుమీద రాజకీయ అధికారాన్ని సుస్థిరం చేసుకుంది. 1858 నాటికి బెంగాలుతో సహా కంపెనీ పాలనలోని భారతభూభాగం బ్రిటిషు పాలనలోకి వచ్చేటప్పటికి, బెంగాల్లో ఒక నవ్యసమాజం పూర్తిగా బలపడింది. ఈస్టిండియా కంపెనీ

వల్ల తలెత్తిన జమీందారుల నవ్యపూ్యడలిజంతో పాటు, కంపెనీ ఏజెంట్లూ, ఉద్యోగులూ, టోకు, చిల్లర వ్యాపారులూ, సివిలు సర్వీసు అధికారుల్తో కూడిన ఒక సరికొత్త బెంగాలు రూపొందడమేకాక కొత్తగా లభించిన సంపదను రెండుచేతులా అనుభవిస్తూ ఉంది. దాన్నే 'భద్రలోక్' అని పిలిచేవారు. వారు కాక తక్కిన బెంగాలంతా 'ఛోటాలోక్'. ఈ కొత్త భద్రలోకంలో ఆధునిక విద్య, సామాజిక సంస్కరణలూ, మత సంస్కరణల్తో పాటు ఒక సాంస్కృతిక పునరుజ్జీవనం కూడా సంభవిస్తూ ఉంది. కాని నూట యాభై ఏళ్ళకు పైగా (1690-1858) నడిచిన ఈ పరిణామంలో స్త్రీలకి తగిన స్థానం దక్కనేలేదు. పందొమ్మిదో శతాబ్దం మొదలైనప్పణ్ణుంచీ ఈ ప్రశ్న బెంగాలీ విద్యావంతుల్ని కలవరపరుస్తూనే ఉంది. స్త్రీలు 'అంతఃపురాల్ని' దాటి బయటి సామాజిక జీవితంలోకి రావాలనీ, చురుకైన పాత్ర పోషించాలనీ విద్యావంతులు వాదిస్తూ ఉన్నారు.

కాని వారిలో అందరు విద్యావంతులూ ఒక్కలానే లేరనీ, కొందరి మాటలకీ, చేతలకీ మధ్య పొంతన లేదనీ బంకింబాబు భావిస్తూ ఉండవచ్చును. అటువంటివారికి ప్రతినిధిగా ఈ నవల్లో దేవేంద్రబాబు కనిపిస్తాడు. అతడు కూడా జమీందారుల కుటుంబానికి చెందినవాడే. కాని, ఎప్పుడో, నగేంద్రబాబు పూర్వీకుడి చేతిలో దేవేంద్రబాబు పూర్వీకుడు కోర్టుకేసుల్లో తన ఆస్తి మొత్తం పోగొట్టుకున్నాడు. పోయిన సంపద మరో రూపంలో రాబట్టుకోడానికి దేవేంద్రబాబు తండ్రి హరిపురం జమీందారు ఏకైక కుమార్తె తో దేవేంద్రుడికి పెళ్ళి చేసాడు. కాని ఆ వివాహంవల్ల దేవేంద్రుడికి సంతోషం లేకుండా పోయింది. అతడి గురించి రచయిత ఇలా రాస్తున్నాడు:

> దేవేంద్రుడు కలకత్తాలో కులాసాలు, విలాసాలు అలవాటు చేసుకుని వాటిలోనే నిమగ్నమైపోయాడు. పాపం చేస్తున్నాననే భావాన్ని దూరం చేసుకుని మద్యాన్ని సేవించడం అలవాటు చేసుకున్నాడు. మానసిక బాధల్ని మర్చిపోవడానికి అదొక మంచి సాధమనిపించింది. ఆ అభ్యాసం పెరిగింది. అనుతాప భావన అతనిలో అంతరించింది. కలకత్తానుంచి తిరిగి వచ్చి తోటలో ప్రత్యేకంగా నిర్మించుకున్న భవనంలో ఒంటరిగా వుంటూ తన కోర్కెల్ను తీర్చుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు. బ్రహ్మసమాజాన్ని స్థాపించాడు. వితంతువివాహం, స్త్రీ స్వాతంత్ర్యం మొదలైన విషయాల్లో మాత్రం తారాచరణ్, దేవేంద్రబాబు అభిప్రాయాలు ఒకటిగానే వుండేవి. దేవేంద్రబాబు స్త్రీ స్వాతంత్ర్యం కావాలని అంటున్నాడంటే– ఇందులో అతనికి స్వార్థం లేకపోలేదు. (పే.45)

తన కాలంలో సంఘసంస్కరణ గురించి మాట్లాడే వాళ్ళ పట్ల బంకింబాబుకి ఉన్న సందేహాల్ని ఈ పాత్ర ద్వారా చాలా స్పష్టంగా ప్రకటించాడని చెప్పవచ్చు. తర్వాత రోజుల్లో తన 'ఘరే–బైరే' (1916) లో సందీప్ పాత్ర ద్వారా జాతీయోద్యమ ఆదర్శాలు మాట్లాడే వాళ్ల పట్ల టాగోరు ఇటువంటి సందేహాన్నే చూపించాడని అనుకోవచ్చు. 'కన్యాశుల్కం' (1892-1906) లో గిరీశం పాత్ర ద్వారా గురజాడా, 'సుశీల' (1922) కథలో సులేమాన్ పాత్ర ద్వారా చలంగారూ కూడా తమ సమకాలిక సంస్కరణల గురించి మాట్లాడే వాళ్ళపట్లా, జాతీయోద్యమ ఆదర్శాలు మాట్లాడే వాళ్ళ పట్లా ఇటువంటి సందేహాన్నే వ్యక్తపరచడం కూడా మనం గమనించవచ్చు.

దేవేంద్రబాబుకి భార్య అనుకూలవతి కాకపోవడం వల్ల అతడు మద్యపానం ద్వారా చెడ్డదారి తొక్కాడు. మరి అత్యంత అనుకూలవతి అయిన భార్య ఉన్నప్పటికీ నగేంద్రబాబు ఎందుకని రెండో పెళ్ళికి సిద్ధపడ్డాడు? వితంతువులకి మళ్ళీ పెళ్ళికి హక్కు ఉందని ఈశ్వరచంద్రుడు చేస్తున్న పోరాటాన్ని తనకి అనుకూలంగా ఎందుకు మలుచుకున్నాడు? మొదట్లో చేసినట్టుగానే కుందకి మళ్ళా మరొక వరుణ్ణి చూసి వివాహం చేసి ఉండవచ్చునే! తన కుటుంబాన్ని, తన జమీందారీనీ కూడా సంక్షోభంలోకి నెట్టిన ఈ నిర్ణయానికి నగేంద్రుడు ఎవరిని బాధ్యుల్ని చేయగలడు?

నాకనిపిస్తుంది, నగేంద్రుడు కూడా దేవేంద్రబాబులాగా, ఆస్తిపోగొట్టుకుని ఉండి ఉంటే కుందని పెళ్ళి చేసుకోడానికి సాహసించి ఉండేవాడుకాడని. బహుశా ఏ మద్య–పానానికో బానిసై ఉండేవాడు. మానసికంగా పతితుడై, తన చెడు తలపులు తీర్చుకోడానికి రహస్యంగా ఏవో పాట్లు పడుతుండేవాడు. కాని నగేంద్రుడి సంపద అతడికి తన ప్రలోభాన్ని బాహాటంగా ప్రకటించుకునే అవకాశాన్నిచ్చింది. సంఘసంస్కరణోద్యమం దానికి మతపరంగా ఎదురుకాగల చిక్కుల్ని పక్కకు నెట్టింది. తన భార్య సౌశీల్యం తనకి అడ్డుపడక పోగా, తన దారిని మరింత సుగమం చేసింది.

కాబట్టి రచయిత స్పష్టంగా చెప్పకపోయినా, ఆయన మనసులో సంభవిస్తున్న కలవరమేమిటో నేను అర్థం చేసుకోగలిగాను. అతడేమంటున్నాడంటే, విషవృక్షానికి బీజాలు ప్రతి ఇంట్లోనూ ఉన్నాయి. కోరికల్ని అదుపు చేసుకోడం సాధారణమానవులకి సాధ్యం కాదు. అయినా ఏదోలాగా తమని తాము సంభాళించుకుంటూ జీవితాన్ని నెట్టుకొస్తూ ఉంటారు. కాని సంపద ఉందే, అది, ఆ విషవృక్షానికి నీరుపోసి పెంచిపెద్దచేస్తుంది. సంపద నీడలో మనిషి తానే ఒక విషవృక్షంగా మారిపోగలడు. దాదాపు నూట యాభై ఏళ్ళ పాటు ఈస్టిండియా కంపెనీ ద్వారా బెంగాలుకు ఒనగూడతున్న నడమంత్రపు సిరి

బెంగాలు సామాజిక జీవితాన్నీ, గృహస్థ జీవితాన్నీ కూడా అతలాకుతలం చేస్తున్నదని బంకింబాబు గుర్తుపట్టాడు. అందుకు అతడు ఏ ఒక్కరినీ, విడివిడిగా తప్పుపట్టలేదు, కానీ అంతిమంగా సంభవించవలసిన తుపాను సంభవించడం కళ్ళారా చూసాడు.

3

సిద్ధహస్తుడైన రచయిత తన రచన ప్రారంభంలోనే తన రచనాసందేశాన్ని ఇమిడ్చిపెడతాడు. విషవృక్షం నవల్లోని మొదటి పేరా చూడండి:

> నగేంద్రుడు పడవమీద వెళ్ళడానికి నిర్ణయించుకున్నాడు. జ్యేష్టమాసపు రోజులవి! ఏ నిమిషంలోనైనా మేఘాలు ఆవరించి వర్షం కురవడానికి, తుఫాను చెలరేగడానికి అవకాశాలు లేకపోలేదు. అందుకే అతని భార్య సూర్యముఖి, బయలుదేరడానికి ముందు తన మీద ఒట్టు వేయించుకుని–పడవను జాగ్రత్తగా తీసుకువెళ్ళవలసిందని, తుఫాను– వర్షం వచ్చే సూచనలు కనిపించడంతోనే పడవను ఒడ్డుకు మళ్ళించుకుపోవలసినదని, ఏ పరిస్థితిలోనూ పడవలో వుండవద్దని–ప్రాధేయపడింది. నగేంద్రుడు సూర్యముఖి చెప్పిన విధంగానే ఆచరించుకుంటానని మాటిచ్చి పడవలోకి ఎక్కాడు.. (పే .5)

అన్నట్టే తుపాను వచ్చింది. తన భార్య సలహా ప్రకారం అతడు పడవలో ఉండకుండా ఊళ్ళోకి అడుగుపెట్టాడు, అక్కడే కుందని చూసాడు. దాంతో అతడి జీవితంలోకి తుపాను ప్రవేశించింది. ఇది కథపరంగా. కాని కావ్యధ్వని ఇందుకు భిన్నంగా ఉంది. అతడి సంసారమనే పడవ తుపానులో చిక్కుకున్నప్పుడు అతడు ఆ పడవలో ఉండకుండా, ఆ పడవను ఒడ్డుకు చేర్చి ఉంటే, ఆ తుపానునుంచి బయటపడి ఉండేవాడు. కానీ అతడలా చేయలేకపోయాడు. దాంతో ఆ తుపాను అతడి సంసారాన్ని అల్లకల్లోలం చేసేసింది.

నిజంగానే విషవృక్షం ఎన్నదగ్గ నవల. మరొక రచయిత ఎవరేనా అయి ఉంటే, తాను రాస్తున్న సాంఘిక నవలని నీతికథగా మార్చేసి ఉండేవాడు. కాని పైకి నీతికథలాగా కనిపిస్తున్న ఈ నవల నిజానికి సాంఘిక నవల కాదు, ఆర్థిక నవల. సమాజంలో సంపద పోగుపడే ప్రతి యుగమూ ఒక తుఫానులాంటిదే అనుకుంటే, నేటి కాలానికి ఈ నవల్లో కనిపిస్తున్న ప్రాసంగికత సామాన్యమైనది కాదు.

17-6-2025

మసిబారిన బుద్ధుడు

నేను ఉద్యోగంలో చేరినప్పుడు ఇన్స్టిట్యూటు ఆఫ్ అడ్మినిస్ట్రేషనులో ఫౌండేషను ట్రైనింగుకి హాజరయ్యాను. అందులో భాగంగా, ఎవరో ఒక ఫాకల్టీ ఏదో విషయం మీద ప్రసంగిస్తూ, ఒక కథ చెప్పాడు.

ఆ కథలో ఒకాయన సత్యం తెలుసుకోవడం కోసం ఒక గురువు దగ్గరికి వెళ్తాడు. వెళ్ళినప్పణ్ణుంచీ తాను అంతదాకా ఎవరెవరు గురువుల్ని కలిసిందీ, ఏమి నేర్చుకున్నదీ, ఏమి నేర్చుకోకుండా ఉండిపోయిందీ అన్నీ ఏకరువు పెడుతుంటాడు. ఆ గురువు ఇతడి మాటల్ని పట్టించుకోకుండా టీ కాచుకుని, ఆ తర్వాత ఆ టీ తీసుకొచ్చి, తన ఎదురుగా బల్లమీద ఉన్న కప్పులో పోయడం మొదలుపెడతాడు. ఆ వచ్చినాయన ఆ గురువునే చూస్తూ తాను చదివిన పుస్తకాలూ, తనకి తెలిసినవీ చెప్తూనే ఉన్నాడు. ఆ గురువు కప్పులో టీ పోస్తూనే ఉన్నాడు. కప్పు నిండిపోయింది. అయినా ఆ గురువు ఇంకా ఆ కప్పులో టీ పోస్తూనే ఉన్నాడు.

'అయ్యా, గురువు గారూ, మీరు చూసుకోటం లేదు, కప్పు నిండిపోయింది ఇంక అందులో మీరేమీ పొయ్యలేరు' అని అన్నాడు వచ్చినాయన.

'అలాగా' అన్నాడు గురువు, స్థిమితంగా. 'మరి నీ మనసు కూడా చాలావాటితో పూర్తిగా నిండిపోయి ఉంది కదా! ఇప్పుడు నీకేమి చెప్పినా అది కూడా పొంగిపోయి కిందకి ఒలికిపోతుంది కదా!' అని అన్నాడు గురువు.

ఆ రోజు ఆయన చెప్పింది ఒక జెన్ కథ అనీ, అటువంటి మరొక వంద జెన్ కథల్ని సేకరించి పాల్ రెప్స్ అనే ఆయన Zen Bones Zen Flesh (1957) అని ఇంగ్లిషులో ఒక పుస్తకంగా తీసుకొచ్చేడనీ, ఆ తర్వాత ఎన్నో ఏళ్ళకుగానీ తెలియలేదు.

పాల్ రెప్స్ ఒక అమెరికను. జెన్ స్ఫూర్తినీ, హైకూనీ అమెరికాకి పరిచయం చేసిన తొలితరం రచయితల్లో, కళాకారుల్లో ఒకడు. రింజాయి బౌద్ధ శాఖకి చెందిన న్యోజెను సెంజకి అనే ఆయన సేకరించిన జెన్ కథల్ని ఆయనతో కలిసి పాల్ రెప్స్ తొలిసారిగా అమెరికాకి పరిచయం చేసాడు. వాటితో పాటు, పదమూడో శతాబ్దానికి చెందిన జెన్ సూక్తుల సంకలనం నుంచి కూడా కొన్ని సుభాషితాల్ని ఎంపికచేసి ఆ పుస్తకంలో Pre-Zen Writings పేరిట అనువదించాడు.

ఇప్పుడు ఆ 101 కథల్లోంచి 52 కథల్ని ఎంపిక చేసి దీవి సుబ్బారావు గారు 'మసిబారిన బుద్ధుడు' (2025) పేరిట తెలుగులోకి తీసుకొచ్చారు. రెండు వారాల కిందట నాకు ఫోను చేసి తానిట్లా పుస్తకం తీసుకొచ్చానని చెప్పి నాకు పంపించారు. అది ఆయన కరుణ, నా పట్ల వాత్సల్యం.

సుబ్బారావుగారు భారతీయసాహిత్యం నుండీ, ప్రపంచసాహిత్యం నుండీ తనకు నచ్చిన మణిపూసల్నీ అప్పుడూ అప్పుడూ ఇలా తెలుగు పాఠకలోకానికి కానుక చేస్తూనే ఉన్నారు. వీరశైవ వచనకవుల కవిత్వానికి 'మాటన్నది జ్యోతిర్లింగం' పేరిట ఆయన చేసిన అనువాదానికి సాహిత్యఅకాదెమీ పురస్కారం కూడా లభించింది. ఈ మధ్య కాలంలో ఆయన చైనా కవిత్వాన్నీ, ఆఫ్రికను కవిత్వాన్నీ కూడా తెలుగు చేసారు. ఇప్పుడు సరికొత్తగా జెన్ కథలు.

సుబ్బారావుగారి వాక్యంలో ఒక వింత సొగసు ఉంటుంది. అది అచ్చు ఆయన మాట్లాడినట్టే ఉంటుంది. సూటిగా, తేటగా, నిరలంకారంగా, కానీ ఎంతో సానునయంగా, ప్రేమగా. మనకు తెలిసిన కథలే, కాని ఆయన వాక్యాల్లో చదివినప్పుడు, మళ్ళా కొత్తగా కనిపిస్తాయి. ఈ జెన్ కథలు చదువుతున్నప్పుడు కూడా అదే అనుభూతి నాకు. ఆ రుచి ఎలా ఉంటుందో చూపించకుండా ఉండలేను కదా! అందుకని ఒక ఉదాహరణ:

సూత్ర ప్రచురణ

జెన్ బౌద్ధంలో విశ్వాసం ఉన్న టెట్సుజెన్ అనే ఆయన చీనీ భాషలో ఉన్న బౌద్ధ సూత్రాల్ని జపాన్ భాషలోకి అనువాదం చేసి ప్రచురించేందుకు నిర్ణయం తీసుకున్నాడు. ఆ కాలంలో చెక్కపలకలతో గ్రంథప్రచురణ చేయవలసి వచ్చేది. అలా ఏడువేల ప్రతులు ముద్రించడం అంటే మాటలు కాదు. అదొక బృహత్కార్యం.

ఇందు కొరకు టెట్సుజెన్ వూళ్ళూ వూళ్ళూ తిరిగి, చందాలు వసూలు చేయడం మొదలుపెట్టాడు. అర్థం చేసుకున్న కొందరు సానుభూతిపరులు నూరు బంగారు నాణేల వరకు ఇచ్చేవారుగానీ ఎక్కువ మంది నుండి చిల్లరకాసులు మాత్రమే జమ అయ్యేవి. ఎవరు ఎంత ఇచ్చినా అందరికీ సమానంగా కృతజ్ఞతలు చెప్పేవాడు. తను అనుకున్న పని మొదలుపెట్టడానికి పదేళ్ళు పట్టింది.

అలాంటప్పుడు ఉజి నదికి వరదలు వచ్చాయి. కరువు తాండవించింది. గ్రంథ ముద్రణ కొరకు వసూలు చేసిన డబ్బు యావత్తు ప్రజల్ని కరువు కోరల్నుండి రక్షించడానికి ఖర్చుచేశాడు. అప్పుడు మళ్ళీ నిధులు సేకరించడం మొదలుపెట్టాడు.

చాలా ఏళ్ళు గడిచాక వింత అంటువ్యాధి ఒకటి దేశంలో ప్రబలి ప్రజల్ని కలిచి వేసింది. తన ప్రజల్ని కాపాడేటందుకు టెట్సుజెన్ తను కూడబెట్టిన డబ్బు వినియోగించాడు.

మూడోసారి మళ్ళీ తన పని మొదలుపెట్టాడు. 20 ఏళ్ళ తర్వాత అతని కోరిక నెరవేరింది. సూత్రగ్రంథాల ముద్రణకు వాడిన చెక్క పలకలను ఇవాల్టికి కూడా క్యోటోలో ఉన్న ఒబకు బౌద్ధ విహారంలో చూడవచ్చు.

జపాను దేశస్థులు తమ పిల్లలకు చెప్తుంటారు.. టెట్సుజెన్ సూత్రగ్రంథాలను మూడు విడతలుగా ముద్రించాడనీ, అదృశ్యంగా ఉన్న మొదటి రెండు ముద్రణల ప్రతులు, చివరిదైన మూడవముద్రణ ప్రతుల కన్నా ఎన్నో రెట్లు విలువైనవనీ.

16-7-2025

వాడ్రేవు చినవీరభద్రుడు

కొత్తయుగం రచయిత్రి

మరికొన్ని సాహిత్యవ్యాసాలు

◎

ప్రపంచ ప్రసిద్ధ నవలాకారులగురించీ, కథకుల గురించీ గత పదేళ్ళుగా వాడ్రేవు చినవీరభద్రుడు రాస్తూ వచ్చిన 31 వ్యాసాల సంపుటి ఇది. ఇందులో టాల్‌స్టాయి, బోర్హెసు, అలేహో కార్పెంటియరు, నికోస్ కజంజకిసు, మురియలు స్పార్కు, క్లారిసు లిస్పెక్టరు, హరూకి మురకామి వంటి ప్రపంచ రచయితలతో పాటు బంకింబాబు, టాగోరు, గోపీనాథ మొహంతి వంటి భారతీయ రచయితల రచనల గురించిన పరిశీలనలు ఉన్నాయి. ముఖ్యంగా నోబెలు పురస్కార స్వీకర్తలైన ఫ్రెంచి రచయితలు పాట్రిక్ మోడియానో, అన్నీ ఎర్నోతో పాటు దక్షిణ కొరియా రచయిత్రి హన్‌కాంగ్ నవలలపైన విశ్లేషణలు ఉన్నాయి. వాటితో పాటు బుకరు బహుమతి పొందిన గీతాంజలిశ్రీ, బానూ ముష్తాక్‌ల రచనలపైన కూడా స్పందనలు ఉన్నాయి. ఈ సంపుటిని తెలుగుపాఠకులు ఆదరిస్తారని నమ్మిక.